# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-08-2024 సంపుటి -2 కృష్ణాష్టమి (ఆగష్టు ) సంచిక-6 రూ.25/-









# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)

## తెలుగు సాహితీ జగత్తులో

## అనతి కాలంలోనే ధ్రువతారగా సుమతి ని నిలిపినందుకు

## ధన్యవాదాలు తెలుపుతూ

సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

- ఎడిటోరియల్ బోర్డ్

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన

సుమతి సకుటంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి

కవర్ పేజి కలర్ :రూ.5000/-

కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/-

లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /-


లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /-

ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు

మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది.

ఇప్పుడు సుమతి పత్రికను ఆన్లైన్లో కూడా చదవ వచ్చు





# సుమతి పరివారం




## సుమతి
మాసపత్రిక

సంపుటి :2 సంచిక:6

ఆగష్టు 2024

సంపాదకురాలు
అవుతు శ్రీవిద్య

సహ సంపాదకురాలు
జి .జ్ఞానిక

ముఖచిత్రం

గ్రాఫిక్స్
మోక్ష

చందా వివరాలు

సంవత్సర చందా రూ 250

ఐదేళ్ళ చందా రూ 1200

ప్రకటనలు , చందాలకు మరియు

రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

SUMATHI.POTILU@GMAIL.COM

ప్రచురణ
సుమతి పబ్లికేషన్స్
(RC NO.:5387/2006)

హౌస్ నం :26 –46 –79

వేణుగోపాల నగర్ ,గుంటూరు

ఆంధ్రప్రదేశ్


# సంపాదకీయం

మనందరిలో దేశ భక్తి డీఫాల్టుగా ఉంటుంది. అది మన బ్లడ్ లో భాగంలా ఉంటుంది. అందుకే మనం జాతీయ జెండాను చూసినా, సమరయోధుల విగ్రహాల్ని చూసినా.. తెలియని భావోద్వేగానికి లోనవుతాం. ఇప్పుడు తెల్లారితే మనకు ఎన్నో పనులు. కానీ స్వాతంత్ర్య ఉద్యమ రోజుల్లో తెల్లారితే అందరికీ ఒకటే ధ్యేయం. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా శాంతియుతంగా పోరాడటం. ఆ రోజుల్లో మనం ఉండి ఉంటే.. ప్రశాంతంగా ఉండగలమా? హింసకు పాల్పడకుండా శాంతియుతంగా పోరాడేందుకు మనల్ని మనం కంట్రోల్ చేసుకోగలమా? చాలా కష్టమైన విషయం ఇది. దేశం కోసం ఏం చెయ్యడానికైనా రెడీ అయిపోయేవాళ్లమే కదా. కానీ.. మనకు స్వాతంత్ర్యం శాంతి మార్గం ద్వారానే వచ్చింది. దాదాపు 200 ఏళ్లపాటూ పోరాడితే.. చివరకు 1947 ఆగస్ట్ 15న బ్రిటిషర్లు స్వాతంత్ర్యం ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇలా సమరయోధులు తమ బాధ్యతను పూర్తి చేశారు. దేశాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను నెక్ట్స్ తరాలపై ఉంచారు. 75 ఏళ్లుగా ఇండియా అనుకున్నంత అభివృద్ధి సాధించకపోయినా... ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా.. అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. 130 కోట్ల మంది జనాభా ఉన్న దేశం సంపన్న దేశంగా మారాలంటే టైమ్ పడుతుంది.ఆ టైం కోసం అందరం వేచి చూద్దాం .

సుమతి

## సుమతి – సుభాషితాలు

కంచం లో ఉన్న మెతుకుల మీదే మన పేరు రాసి ఉంటుంది

అంతేకాని ఇనపెట్టెలలో దాచిన నోట్ల కట్టల మీద కాదు

లోపలి పేజీలలో....

# ఈ నెల సాహితి సుమాలు...

## 36 ఫీచర్స్ అందరి కోసం


5 ముఖచిత్ర కథ
8 ఈ నెల కవిత
9 నడుస్తున్న చరిత్ర
14 అంతర్నేత్రం
16 ఈ శీర్షిక మీదే
27 మేర భారత్ మహాన్
33 సరదాకి
71 జీవన చిత్రాలు
75 వైరల్
76 నాలుగో కోతి
80 సెటైర్
84 కార్టూన్స్ పేజి
85 యాత్ర
88 విహారి
91 అంపశయ్య
110 నమ్మకాలూ –నిజాలు
112 కరెంట్ అఫైర్స్
115 వైరల్
116 ఫోటోగ్రఫి పాఠాలు
120 యువతా తెలుసుకో
122 భేతాళ భారతం
124 మన కథానాయకులు
126 కార్టూన్స్ పేజి
127 వార్తల్లో వ్యక్తి
140 చదవాల్సిన పుస్తకం
143 చూడాల్సిన సినిమా
145 వినాల్సిన పాట
147 క్రాస్ రోడ్స్ కబుర్లు
177 సాహితి సుమాలు
178 మన పురాణాలు
182 సప్తపది
197 ధర్మసందేహాలు
198 సృజన
199 పిల్లలు పిడుగులు
200 రాశి ఫలాలు


## 8 సీరియల్స్


17 పంచవటి( కామెడి సీరియల్ )
39 మమతల తరంగాలు (ఫ్యామిలీ సీరియల్ )
51 యమపాశం (క్రైం సీరియల్ )
59 రెప్పచాటు స్వప్నం (ఫ్యామిలీ సీరియల్ )
65 రాణ ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్ )
72 గర్భ శ్లోకం (క్రైం సీరియల్)
130 డెత్ మెసేజ్ (క్రైం సీరియల్ )
186 పన్నీటి జల్లు (సీరియల్ )


## 11 కథలు


22 ఎటర్నల్
38 ఒక్క అడుగు
34 గరగ
93 అమ్మ మరణం
104 ఎద లోపల
150 మూగ ప్రేమ
156 నైతిక విలువలు
163 లక్షిం పిన్ని
171 అహం బ్రహ్మస్మి
175 పత్తినవ్వింది
192 అరతి


## 8 కవితలు


21 పరుస వేది
70 తామరాకు పై నీటి బొట్టు ..
79 గీతోపదేశం
90 షో బిజినెస్
162 కాలం
165 పజిల్
170 తమస్సు
181 గతం లో స్మృతులు


★★★

# కృష్ణాష్టమి

సృష్టి స్థితి కారుడైన శ్రీకృష్ణుడి జన్మ దినాన్ని ''కృష్ణాష్టమి''గా వేడుక చేసుకుంటాం. శ్రావణ బహుళ అష్టమి రాత్రి రోహిణీ నక్షత్రంలో శ్రీకృష్ణుడు జన్మించాడు. కృష్ణాష్టమిని "గోకులాష్టమి", "అష్టమి రోహిణి", "శ్రీకృష్ణ జన్మాష్టమి", "శ్రీకృష్ణ జయంతి", "శ్రీ జయంతి", "సాతం ఆతం", "జన్మాష్టమి" – ఇలా రకరకాలుగా వ్యవహరిస్తారు. హిందూ సంప్రదాయంలో కృష్ణుని ప్రత్యేకతే వేరు. తల్లులకు బాలకృష్ణునిగా, చిన్నవారికి చిలిపి కృష్ణునిగా, స్త్రీలకు గోపికా వల్లభునిగా, పెద్దలకు గీతాకారునిగా... ఇలా ప్రతి ఒక్కరి మదిలో ఏదో ఒక రూపాన కొలువై ఉంటాడు. అందుకే కృష్ణుని జన్మదినం అంటే, మన ఇంట్లో మనిషి పుట్టినరోజు అన్నంత ఘనంగా నిర్వహించుకుంటాం.

శ్రావణబహుళ అష్టమి రోజున, రోహిణి నక్షత్రంలో కృష్ణుడు జన్మించాడు. ఈ కృష్ణాష్టమి రోజు ఉదయాన్నే నిద్రలేచి అభ్యంగన స్నానం చేయాలి. గుమ్మానికి తోరణాలు, గడపకు పసుపుకుంకుమలు, పూజగదిలో ముగ్గులు అద్ది పూజకు సిద్ధం కావాలి. ఆ బాలకృష్ణుని ఇంటికి ఆహ్వానిస్తూ, ఇంటి బయట నుంచి లోపలివరకు కృష్ణుని పాదాలను ముగ్గుతో వేయాలి. ఇతర పూజలకు భిన్నంగా కృష్ణాష్టమి పూజను మధ్యాహ్నం 12 గంటలకు ఆరంభించడం ఆనవాయితీ. వీలైతే ఆ సమయానికే పూజ సాగేలా చూసకోవాలి.



## ముఖచిత్ర కథ



కృష్ణునికి తులసి అంటే చాలా ఇష్టం. అందుకని పూజలో ఆచమనం చేసే నీటిలో తులసి ఆకులు వేసుకుంటే మంచిదని చెబుతారు. ఆయన ప్రతిమను కూడా తులసిమాలతో అలంకరించమని సూచిస్తారు. కృష్ణునికి పొన్నచెట్టుతోనూ అనుబంధం ఉంది. వీలైతే ఆ పొన్న పూలతో ఆయనను పూజిస్తే మంచిది. ఆయనకు ఇష్టమైన తెలుపు లేదా పసుపు రంగు పూలతో పూజించినా శుభమే! కృష్ణాష్టకమ్, కృష్ణ అష్టోత్తరం వంటి స్తోత్రాలను చదువుతూ, పరిమళభరితమైన పుష్పాలతో ఆయనను అర్చించాలి.


కృష్ణాష్టమి రోజున ఉపవాసం, జాగరణ చేసే ఆచారం ఉంది. కాబట్టి కృష్ణునికి కూడా సాత్వికమైన ఆహారాన్నే నివేదిస్తారు. వడపప్పు, పానకం, పళ్లు వంటి నివేదనలు సాధారణం. వీటితో పాటు ఆయనకు ఇష్టమైన పాలు, వెన్న, మీగడను కూడా ప్రసాదంగా సమర్పించవచ్చు. మరికొందరు... బాలింతలకు పెట్టే మినపపిండి, పంచదార కలిపి పెడతారు. కృష్ణుడు అప్పుడే జన్మించాడు కాబట్టి, ఆయన తల్లిని బాలింతరాలుగా భావిస్తూ ఈ ఆచారం మొదలై ఉండవచ్చు. చలికాలానికి శరీరాన్ని సిద్ధం చేయడం కూడా ఈ ప్రసాదం వెనుక పరమార్థంగా కనిపిస్తుంది.

కృష్ణాష్టమి రోజు పూజతో పాటుగా ఆయన స్మరణ కూడా ముఖ్యమే! ఆ గోపాలుని వైభవాన్ని తెలియచేసే భాగవతం, భగవద్గీతలను ఈ రోజు ఎంతో కొంత పఠించాలి.

అలా కృష్ణుని తలుస్తూ, కొలుస్తూ, భజిస్తూ కృష్ణాష్టమి రాత్రిని గడపాలి. కృష్ణుడు అర్ధరాత్రి జన్మించాడు కాబట్టి, కొందరు రాత్రివేళ్లే కృష్ణపూజ చేస్తారు. అలా కృష్ణుని పూజించాలనుకునే ప్రదేశంలో బియ్యం పోసి.... దాని మీద ఒక కుండని పెడతారు. ఆ కుండ మీద కృష్ణుని ప్రతిమను ఉంచి, పూజని నిర్వహిస్తారు. అర్ధరాత్రి వేళ శంఖంలో నీటిని తీసుకుని చంద్రునికి, కృష్ణునికి అర్ఘ్యమిస్తారు. మర్నాడు ఉదయాన్నే దగ్గరలోని వైష్ణవాలయాన్ని దర్శించి ఉపవాసాన్ని విరమిస్తారు.

ఇక కృష్ణాష్టమి రోజు రాత్రి జరిగే ఉట్టి కార్యక్రమం గురించి తెలిసిందే. బాలకృష్ణుని చిలిపి చేష్టలను తల్చుకుంటూ... పాలు, పెరుగు, వెన్న, అటుకులు, పళ్లులాంటి పదార్థాలు ఉంచిన ఈ ఉట్టిని కొడతారు. మరికొందరు హోళీ తరహాలో గులాల్ చల్లుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తారు. ఇంకొందరు చిన్న బాలకృష్ణుని ప్రతిమను మనసారా అలంకరించిచి, ఊయలలో ఉంచి









## సాహితి భోజులకు... మహారాజ పోషకులకు ఇదే మా ఆహ్వానం . మీరు తెలుగు భాషా ప్రేమికులా..?సాహితీ ప్రియులా ..? తెలుగు సాహిత్యాన్ని బతికించుకోవాలని మీలో బలమైన కోరిక ఉందా ..?ఐతే సుమతికి అండగా నిలవండి

మహామహులు సాహితీ పత్రికలు నడపడం మావల్ల కాదు అని చేతులెత్తేసిన నేపథ్యంలో పురుడు పోసుకున్న సుమతి సకుటుంబ మాస పత్రికకు మీరు అందించే తోడ్పాటు కొండంత బలాన్ని ఇస్తుంది. మానసిక ఉల్లాసంతో పాటు, ఆలోచన రేకెత్తించే కథలు, కవితలు సీరియల్స్ అదే విధంగా నాలుగో కోతి , సెటైర్ ,కబుర్లు , భేతాళ భారతం,కార్టూన్లు ,అంతర్నేత్రం వంటి ఎన్నో ఫీచర్స్ తో పాఠక లోకాన్ని అలరిస్తున్న విషయం మీకు విదితమే. కేవలం చందాల తో పత్రిక నడపడం అంటే సాధ్యమయ్యే పని కాదు .తెలుగు భాషను బ్రతికిన్చుకోవాలి అనే ఒకే ఒక్క మహా సంకల్పంతో సుమతి పత్రికను సుమతి ఫౌండేషన్ ద్వారా ప్రారంబించటం జరిగింది .

ఈ సంకల్పానికి మీ సహకారం తోడైతే నిర్విఘ్నంగా ఈ మహా ప్రస్థానం సాగుతుంది. ఇందుకు గాను సుమతి అకౌంట్ కు గానీ మేము ఇచ్చే ఫోన్ పే / గూగుల్ పే నంబరు 10/- రూ నుండి మీ అవకాశాన్ని. బట్టి ఎంతైనా డోనేషన్ ఇవ్వవచ్చు. మీ చందా / డొనేషన్ ఆన అయిన అదే రోజు వాట్సాప్ లేదా పోస్ట్ ద్వారా రసీదు అందుతుంది. మన తెలుగు భాష పరివ్యాప్తి చెందడానికి సాహిత్య సంపద సృష్టించడం తప్ప మరొక మార్గం లేదు. ఇప్పటికే వివిధ పోటిల ద్వారా రచయతలను ప్రోత్సహిస్తూ వస్తున్నాము . ప్రతి నెల రచయతలకు ఎంతో కొంత బహుమతి రూపం లో సహాయం చేస్తూ వస్తున్నాము . ఈ ఏడాది ఉగాది రోజున 50 మంది కరచయతల్ను సన్మానించాము . సుమతి ఫౌండేషన్ ఇప్పటికే అనేక సేవ కార్యక్రామాలలో సమాజానికి ఇతోధిక సేవలందిస్తోంది .మనవ సేవే మాధవ సేవ అని నమ్మి ఎన్నో అనాధ , వృద్ధ ఆశ్రమాలకు సహాయం చేస్తూ వస్తోంది .భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా దిగువ కార్యక్రమాలు చెయ్యాలనే సంకల్పం తో ఉన్నాము

1. ప్రతి పాఠశాలలో తెలుగ భాష పై పోటీలు నిర్వహించి చిన్నారులలో సాహిత్యం పట్ల అభిమానం పెంపొందించేటట్లు చూడటం
2. సాహిత్య రంగంలో కృషి చేసే వారికి ఆరోగ్య భీమా /అవసరమయ్యే మందులకైన ఇతోధిక సహాయం
3. ఔత్సాహిక పేద రచయితల పుస్తకాలు ముద్రించటం
4. పేద వృద్ధ రచయతలకు ఎంతోకొంత ఆర్ధిక సహాయం

దీనికి మీ తోడ్పాటు అనివార్యం.
ఎంత చిన్న సహాయం చేసినా , మీ పేర్లు ఫోటో తో సహా సుమతి పత్రికలో ప్రచురింప బడును . పోషకులకు పత్రిక ఉచితంగా పంపబడును. సుమతి నిర్వహించే అన్ని కార్యక్రమాలలో మీకు ఉచిత ప్రవేశం కల్పించబడును
వివరాలకు సంప్రదించాల్సిన నంబర్: 7893111985
సుమతి అకౌంట్ నంబర్ :150810100022726
IFS CODE :UBIN0815080
Phone Pay No;7893111985



## ఈ నెల కవిత

# గుప్పెడు మెతుకులు

ఎం .కారుణ్య కుమార్




ఇంకా ఏ మూలనో వినిపిస్తున్నాయి కర్కశంగా నులిమేస్తున్న
ఆ ఆకలికి నిస్సత్తువ తో విలపిస్తున్న కేకలు!
స్వాతంత్ర కపోతం రెక్కలు విదిల్చి ఎగిరి ఇన్నేళ్లైనా,
వలస సామ్రాజ్య విష మరకలు ఇంకా ఏ మూలనో బలంగా
ఇమిడిపోయున్నాయి!, దేశం అష్ట దిక్కులా ఆ మూలనో ఏ
మూలనో
ఇంకా వినిపిస్తున్నాయి గుప్పెడు మెతుకులు కోసం
ఆర్తనాదాలు!.

నువ్వింత ఆహారం వ్యర్థం చేస్తున్నావని అద్దంలా అగుపించే
అధికార సూచీలు చీమ కుట్టినంతైనా ప్రభావం చూపక
చిత్తుకాగితాల్లా కనుమరుగైనవి !
భుక్తాయాసంతో బాధ్యతారహితంగా ఆరుబయట విదిల్చిన
మెతుకులు కుప్పల తెప్పలై ప్రోగులై దుర్గంధంతో నిండి ,
రోజూ నీకు అగుపిస్తూనే వున్నాయి తమ విలువ తెలుసుకో
అని!.

అవసరానికి దొరుకుతుందని అల్పంగా చూస్తే చేయి
జారిపోయిన నాడు గుండెలు బాదుకున్నా సొమ్ములు వెదజల్లినా,
దొరకని వైనం ప్రపంచ నలు మూలల్లో ఎక్కడో ఒక్కదగ్గర
ప్రతి నిత్యం దర్శనం ఇస్తూనే వుంది గమనించావా!

నీ పరుగు,నా ఉరుకు, ప్రతి జీవి పయనం
ఆ గుప్పెడు మెతుకుల కోసమే కదా!.
చక్రవర్తికైనా చతికిలపడిన జనుడుకైనా
ఆధారం ఆ గుప్పెడు మెతుకులే కదా!..
బహుశా నీకూ వినపడి వుంటాయి ఆ
ఆర్తనాదాలు విని కూడా విస్మరించకు!.
శక్తి మేర ఆర్తుని ఆకలి తీర్చు
ఆహార వ్యర్థాన్ని అరికట్టు చైతన్య బావుటా చేతపట్టు!.


# పారిస్ ఒలింపిక్స్ 2024




ఒలింపిక్ క్రీడలు తొలిసారిగా క్రీస్తుపూర్వం 776లో నాటి గ్రీకు రాజ్యంలోని ఒలింపియా నగరంలో మొదలయ్యాయి. అప్పట్లో ఒకే ఒక్క పోటీ ఉండేది. అది పరుగు పందెం. ఇందులో పాల్గొనడానికి గ్రీకు రాజ్యంలో స్వతంత్ర పౌరులుగా పుట్టిన పురుషులు మాత్రమే అర్హులు. అప్పట్లో బానిసలకు, మహిళలకు ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనే అర్హత ఉండేది కాదు. నాలుగేళ్లకు ఒకసారి ఈ క్రీడా పోటీలను నిర్వహించే పద్ధతి అప్పటి నుంచే ఉండేది. గ్రీకు రాజ్యాన్ని రోమన్లు క్రీస్తుపూర్వం 146లోస్వాధీనం చేసుకున్న తర్వాత కూడా ఒలింపిక్స్ కొనసాగినా, ప్రాధాన్యాన్ని కోల్పోయాయి. క్రీస్తుపూర్వం 86లో రోమన్నే నాని సూలా ఒలింపియాను కొల్లగొట్టాడు.అక్కడ కొల్లగొట్టిన నిధులతో జరిపిన యుద్ధంలో విజయం సాధించి,

# నడుస్తున్న చరిత్ర

క్రీస్తుపూర్వం 80లో ఒలింపిక్ క్రీడలను నిర్వహించాడు.
* రోమన్ చక్రవర్తి నీరో హయాంలో ఒలింపిక్ క్రీడలు అభాసుపాలయ్యాయి. పిచ్చిమారాజుల్లో ఒకడిగా పేరుమోసిన నీరో రథాల పందేల్లో తొండి ఆటలాడి తనను తానే విజేతగా ప్రకటించుకునేవాడు. తనను తాను మహా సంగీత విద్వాంసుడిగా భావించే నీరో చక్రవర్తి క్రీస్తుశకం 67లో తొలిసారిగా ఒలింపిక్స్లో గాత్ర, వాద్య సంగీత పోటీలను కూడా సం ప్రవేశపెట్టాడు.
* రోమన్ చక్రవర్తి అగస్టస్ సీజర్ హయాంలో ఒలింపిక్స్కు పునర్వైభవం వచ్చింది. అగస్టస్ సీజర్ ఆంతరంగికుడైన మార్కస్ అగ్రిపా ఒలింపియాలోని జూస్ ఆలయాన్ని పునరుద్ధరించి, క్రీస్తుపూర్వం 12లో ఒలింపిక్ క్రీడలను ఘనంగా నిర్వహించాడు. క్రీస్తుశకం మూడో శతాబ్ది నుంచి ఒలింపిక్ క్రీడల వైభవం తగ్గుముఖం పట్టింది. రోమన్ చక్రవర్తి థియోడోసియస్ హయాంలో క్రీస్తుశకం 393లో చివరిసారిగా ఒలింపిక్ క్రీడలు జరిగినట్లు చరిత్రలో నమోదైంది. ప్రాచీన ఒలింపిక్ క్రీడలకు అదే పరిసమాప్తిగా భావించవచ్చు. ఆధునిక ఒలింపిక్ క్రీడల పోటీలు 1896 నుంచి మొదలయ్యాయి. ఫ్రెంచ్ ఉపాధ్యాయుడు, చరిత్రకారుడు బేరన్ పీఎయిర్ డి కూబర్టిన్ ఆధునిక ఒలింపిక్సు ప్రారంభించాడు. వ్యాయామ విద్యలకు, ప్రపంచశాంతికి



సంకేతంగా ఒలింపిక్ చిహ్నాన్ని ఆయనే వాడుకలోకి తెచ్చాడు.

క్రీడల్లో ఒలింపిక్ జ్యోతికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఒలింపిక్ ఉద్యమానికి ఇది సూచిక. ప్రాచీన గ్రీకురాజ్యంలో ఉన్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ దీనిని ఒలింపిక్స్ వరకుతీసుకొచ్చారు. ఏథెన్స్ సమీపంలోని ఒలింపియాలో సూర్యకిరణాల ద్వారా ఒలింపిక్జ్యోతిని వెలిగించడం ప్రతి ఒలింపిక్సు కొన్నినెలల ముందు జరిగే ప్రక్రియ. అక్కడ వెలిగిన జ్యోతితో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ద్వారాటార్చ్ రిలే కొనసాగుతుంది. శాంతి, స్నేహ సంబంధాల సందేశం ఇవ్వడం ఈ ఒలింపిక్టార్చ్ ప్రధాన ఉద్దేశం. 1936 బెర్లిన్ఒలింపిక్స్లో మొదటిసారి దీనిని వాడారు. తర్వాతి రోజుల్లో ఆతిథ్య దేశం ఆలోచనలు, వారిసంస్కృతికి అనుగుణంగా టార్చ్ నమూనాలను రూపొందించడం సంప్రదాయంగా మారింది.క్రీడలు జరిగినన్ని రోజులు ఒలింపిక్ జ్యోతివెలుగుతూ ఉంటుంది. మెగా ఈవెంట్ ముగిసిన తర్వాత దానిని ఆర్పేస్తారు. సాధారణంగా ఆయా దేశపు ప్రముఖ లేదా మాజీ క్రీడాకారులు ఒలింపిక్ టార్చ్ అందుకొని రిలేలో పాల్గొంటారు. పారిస్ ఒలింపిక్స్కు సంబంధించి 10 వేల మంది టార్చ్ బేరర్లతో 400 నగరాల గుండా ఈ జ్యోతి ప్రయాణించింది.


ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా సంగ్రామం జూలై 26 నుంచి పారిస్లో ప్రారంభం కానుంది. పారిస్తో పాటు ఫ్రాన్స్లోని మరో 16 నగరాల్లో ఈ క్రీడలను నిర్వహిస్తున్నారు.సుమారు 10,500 అథ్లెట్లు ఈ క్రీడలలో పాల్గొంటుండగా, 32 క్రీడలకు సంబంధించిన 329 ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. పారిస్ నగరం ఒలింపిక్సు ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1900 (రెండో ఒలింపిక్స్), 1924 (ఎనిమిదో ఒలింపిక్స్) కూడా ఇక్కడే జరిగాయి. ఒలింపిక్స్కు రెండుసార్లు నిర్వహించిన తొలి

నగరంగా పారిస్ గుర్తింపు పొందింది. 2024 క్రీడల కోసం అక్షరాలా 4.38 బిలియన్ యూరోలు (సుమారు రూ. 40 వేల కోట్లు) కేటాయించారు. ఇదంతా 100 శాతం ప్రైవేట్ ఫండింగ్ కావడం విశేషం. ఇందులో టీవీ రైట్స్, టికెట్ల అమ్మకం, హాస్పిటాలిటీ, లైసెన్సింగ్, ఇతర భాగస్వామ్యపు ఒప్పందాలు కలిసి ఉన్నాయి.



భారత్‌కు చెందిన 100 మందికి పైగా అథ్లెట్లు వివిధ క్రీడాంశాలలో పతకాల కోసం పోటీ పడనున్నారు. ప్రధానంగా జావెలిన్ త్రో, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, షూటింగ్, హాకీ, బాక్సింగ్ విభాగాల్లో భారత్ పతకాలపై ఆశలు పెట్టుకుంది. ఆసియా క్రీడలు 2022లో ప్రభుత్వం 'ఈసారి 100 పార్' ('ఈసారి 100 పతకాలు) అనే నినాదాన్ని ఇచ్చింది. ఇపుడు 2024 పారిస్ ఒలింపిక్స్ వంతు వచ్చింది. వేసవి ఒలింపిక్స్ కోసం 'ఈసారి, 10 పార్' (10 పతకాలు) అని నినాదంతో పాల్గొంటుంది. ఆసియా క్రీడలతో పోలిస్తే ఈ 10 పతకాల సంఖ్య చిన్నదే అయినా అది ఎంత కష్టమో అందరికీ తెలిసిందే.
టోక్యో ఒలింపిక్స్‌లో 7 పతకాలతో రికార్డు సృష్టించిన తర్వాత.. ఇప్పుడు భారత అథ్లెటిక్స్ లక్ష్యం 10 పతకాలు.

ఒలింపిక్స్‌లో భారత్ పెద్ద సంఖ్యలో పతకాలు సాధించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదంటూ సుదీర్ఘకాలంగా విమర్శలు వచ్చిన నేపథ్యంలో కొన్నేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చింది. వెంటనే ఫలితాలు రాకపోయినా భవిష్యత్తులో ఎక్కువ మందిని ఆటల వైపు ప్రోత్సహించేందుకు ఇది ఉపకరిస్తుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా భావించింది. ఈ క్రమంలో టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) పథకాన్ని ప్రవేశపెట్టింది. 2014లో మొదటిసారి దీనిని తీసుకొచ్చినా, స్వల్ప మార్పులతో 2018లో 'టాప్స్'ను అదనపు అంశాలు జోడించి రూపొందించారు. ప్రభుత్వం దీని కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించింది. అయితే దీనిని పూర్తి స్థాయిలో వ్యవస్థాగతంగా సౌకర్యాల కల్పన, మైదానాల ఏర్పాటువంటివాటితో చూడలేం. కానీ ఒలింపిక్స్‌కు సన్నద్ధమయ్యే ఆటగాళ్లకు వ్యక్తిగతంగా ఆర్థికంగా వెసులుబాటు ఇచ్చేందుకు ఇది పనికొస్తోంది. సన్నద్ధతలో భాగంగా ఆయా క్రీడాంశాలకు సంబంధించి స్థానికంగా శిక్షణ, అవసరమైతే విదేశాల్లో కోచింగ్, ఎక్విప్మెంట్, విదేశాల్లో పోటీలకు హాజరయ్యేందుకు అవసరమయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. గత 3 ఏళ్లలో దాదాపు ప్రతి అథ్లెట్‌పై



భారత ప్రభుత్వం లక్షలు, కోట్లు ఖర్చు చేసింది. అథ్లెటిక్స్ కోసం అత్యధికంగా రూ.96 కోట్లు ఖర్చు చేయగా, బ్యాడ్మింటన్‌కు రూ.72 కోట్లు, హాకీకి రూ.41.81 కోట్లు ఖర్చు చేశారు. ఈ నేపధ్యంలో పారిస్ ఒలింపిక్స్ కి రెడీ అవుతున్న ఐదుగురు అథ్లెట్ల శిక్షనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.

**జావెలిన్ త్రో**

2020 టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా బంగారు పతకం సాధించి చరిత్ర సృష్టించారు. టోక్యోలో నీరజ్ 87.58 మీటర్ల దూరం విసిరి ఈ పతకాన్ని సాధించారు. అథ్లెటిక్స్‌లో భారత్‌కు అదే తొలి ఒలింపిక్ పతకం. అలాగే వ్యక్తిగత ఈవెంట్లలో భారత్‌కు అది రెండో బంగారు పతకం. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రా షూటింగ్‌లో భారత్‌కు తొలి వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని అందించారు.ఈసారీ నీరజ్ చోప్రాపై ఎన్నో ఆశలు పెట్టుకుంది భారత్. ఆయనతో పాటు జెనా, అన్నూ రాణి జావెలిన్ త్రోలో పాల్గొంటున్నారు. పురుషుల జావెలిన్ త్రో క్వాలిఫైయింగ్ రౌండ్ ఆగస్టు 6న జరగనుంది.మహిళల జావెలిన్ త్రో క్వాలిఫైయింగ్ రౌండ్ ఆగస్టు 7న జరగనుంది.ఇందులో అన్నూ రాణి పాల్గొంటున్నారు. పురుషుల జావెలిన్ త్రో పోటీల ఫైనల్ ఆగస్టు 8న జరగనుండగా, మహిళల జావెలిన్ త్రో ఫైనల్ ఆగస్టు 10న జరుగుతుంది. గత 3 సంవత్సరాలలో నీరజ్ చోప్రా శిక్షణ కోసం ప్రభుత్వం చాలా ఖర్చు చేసింది. నీరజ్‌కి విదేశాల్లో శిక్షణ, విదేశీ కోచ్, ఇతర అవసరాల కోసం రూ.5.72 కోట్లను సాయి వెచ్చించింది.

**బ్యాడ్మింటన్**

బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ తరపున స్టార్




ప్లేయర్ పీవీ సింధు బరిలోకి దిగనున్నారు.సింధు 2016 రియో ఒలింపిక్స్‌లో రజత పతకాన్ని, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించారు.పురుషుల సింగిల్స్‌లో భారత్ తరపున ఎస్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ బరిలోకి దిగనున్నారు. బ్యాడ్మింటన్‌లో భారత్‌కు అతిపెద్ద ఆశాకిరణంగా నిలిచిన పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభించింది. తాజాగా బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో నంబర్–1 జోడీగా నిలిచి చరిత్ర సృష్టించిన సాత్విక్–చిరాగ్.. విదేశాల్లో శిక్షణ, టోర్నీల్లో పాల్గొనడమే కాకుండా విదేశీ కోచ్‌ల కోసం వెచ్చించిన మొత్తం రూ.5.62 కోట్లు. వరుసగా రెండు ఒలింపిక్స్‌లో రజతం, కాంస్య పతకాలు సాధించి అద్భుతాలు చేసిన స్టార్ షట్లర్ పీవీ సింధుకు ప్రభుత్వం నుంచి కూడా సాయం అందింది. వరుసగా మూడో ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అవతరించాలని భావిస్తున్న సింధు.. జర్మనీలో శిక్షణ సౌకర్యాలతో పాటు విదేశీ కోచ్, సహాయక సిబ్బందిని కూడా నియమించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.3.13 కోట్లను అందించింది

**వెయిట్ లిఫ్టింగ్**

49 కేజీల వెయిట్ లిఫ్టింగ్‌లో పతకం కోసం మీరాబాయి చాను పోటీ పడుతున్నారు.టోక్యో ఒలింపిక్స్‌లో ఆమె 201 కిలోల బరువు ఎత్తి రజత పతకాన్ని సాధించారు. గత ఒలింపిక్స్‌లో రజత పతకంతో దేశం ఒలిపిక్స్ లో పతకాల పట్టికలో ఖాతా

తెరిచిన వెటరన్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చానుపై ఈ సారి కూడా భారీ అంచనాలున్నాయి. మీరాబాయి మళ్లీ పతకం తెస్తుంది అనే ఆశలు చిగురించాయి. అందుకే మీరాబాయికి అమెరికాలో శిక్షణతోపాటు బయోమెకానికల్ పరికరాల వంటి ఖర్చుల కోసం ప్రభుత్వం రూ.2.74 కోట్ల సాయం అందించింది ఈ మ్యాచ్ ఆగస్టు 7న ఉంటుంది.

**షూటింగ్**



10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ పురుషుల విభాగంలో సందీప్ సింగ్, అర్జున్ బాబుటా, మహిళల విభాగంలో ఎలావెనిల్ వాలరివన్, రమితా జిందాల్ పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లు జులై 27, 28, 29 తేదీల్లో జరగనున్నాయి. 21 ఏళ్ల షూటర్ అనీష్ భన్వాలా కూడా గత రెండు వరుస ఒలింపిక్స్‌లో షూటింగ్ జట్టు వైఫల్యానికి ముగింపు పలకాలని భావిస్తున్నారు. ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేయనున్న అనీష్‌కు వ్యక్తిగత కోచ్‌తో జర్మనీలో శిక్షణతో పాటు మందుగుండు సామగ్రి కొనుగోలులో సహాయంగా ప్రభుత్వం నుండి రూ.2.41 కోట్ల సహాయం అందించింది. పురుషుల ట్రాప్ షూటింగ్ విభాగంలో పృధ్వీరాజ్ తొండైమాన్, మహిళల విభాగంలో రాజేశ్వరి కుమారి, శ్రేయాసి సింగ్‌లు పాల్గొననున్నారు. ఈ మ్యాచ్‌లు జులై 29, 30, 31 తేదీల్లో జరగనున్నాయి.జులై 27, 28, 29 తేదీల్లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ షూటింగ్‌లో భారత్‌కు చెందిన సరబ్‌జోత్ సింగ్, మను భాకర్, అర్జున్ సింగ్ చీమా, రిథమ్ సాంగ్వాన్ పాల్గొంటారు.భారతదేశానికి చెందిన స్వప్నిల్ కుసాలే, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ మౌద్గిల్ 50 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లు జులై 31, ఆగస్టు 1, ఆగస్టు 2 తేదీల్లో జరుగుతాయి.25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ షూటింగ్ విభాగంలో భారత్‌కు చెందిన అనీష్ భన్‌వాలా, విజయ్‌వీర్ సిద్ధూ పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లు ఆగస్టు 4, 5 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి జరగనున్నాయి.25 మీటర్ల పిస్టల్‌లో భారత్ తరఫున ఇషా సింగ్ పాల్గొననున్నారు. ఈ మ్యాచ్‌లు ఆగస్టు 2, 3 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి జరగనున్నాయి.

**బాక్సింగ్**

బాక్సింగ్ మహిళల విభాగంలో భారత్ నుంచి నిఖత్ జరీన్ (50 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), జాస్మిన్ లంబోరియా (57 కేజీలు), లవ్లీనా బోర్గోహెయిన్ (75 కేజీలు) పాల్గొననున్నారు. పురుషుల విభాగంలో నిశాంత్ దేవ్ (71 కేజీలు), అమిత్ పంఘల్ (51 కేజీలు) పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లు జులై 27 నుంచి జరుగుతాయి.

**గోల్ఫ్।**

గోల్ఫ్‌లో భారత మహిళల విభాగం నుంచి అదితి అశోక్, దీక్షా దాగర్ పాల్గొంటే, పురుషుల విభాగంలో శుభాంకర్ శర్మ, గగన్‌జీత్ భుల్లర్ పాల్గొంటారు.ఆగస్టు 1 నుంచి పురుషుల విభాగం మ్యాచ్‌లు, ఆగస్టు 7 నుంచి మహిళల విభాగం మ్యాచ్‌లు జరగనున్నాయి.ఈ ఈవెంట్‌లో అదితి అశోక్‌పై భారత్ ఆశలు పెట్టుకుంది..

★★★



# అంతర్నేత్రం



## స్థితప్రజ్ఞత సాధించాలి

మానవ జీవితం నిరంతర అన్వేషణతో మెరుగుపడుతుంటుంది. తెలుసుకోవాలన్న ఆసక్తి, అనురక్తి, జిజ్ఞాస, కుతూహలం కావాలి. ఈ లక్షణాలు లేకపోతే మనిషి పశుప్రవృత్తిలోనే జీవితాన్ని వ్యర్థంగా గడిపేస్తాడు. ఈ అన్వేషణ సత్సంకల్పంతోనే మంచి మార్గంలో జరగాలి. ఈ దశలో ఏమి వెతకాలి, ఎందుకు వెతకాలి, ఎలా వెతకాలి అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి.

చీకటిలో వున్నవారు వెలుగుకోసం, దారిద్ర్యంలో ఉన్నవారు ఐశ్వర్యం కోసం, అజ్ఞానంతో వున్నవారు జ్ఞానంకోసం వెతుకుతారు కాని వీటన్నిటికన్నా వివేకం గొప్పది. మన అన్వేషణలో వివేకానికి అగ్రస్థానం ఇవ్వాలి. వివేకం వల్ల వినయం, జ్ఞానం, విచక్షణాశక్తి పెరుగుతాయి.

# పరిణితి

అన్వేషణ మార్గంలో అనేక అవరోధాలు, ఆపదలు ఎదురౌతాయి. అజ్ఞానంతో పాటు గర్వం, స్వార్థం, అహంకారం, ఇతరులపట్ల అవహేళన లాంటివి అన్వేషణను కొనసాగనివ్వకుండా అడ్డుకుంటాయి. మనిషి జీవనసౌధం నాలుగు స్తంభాలమీద నిలబడి ఉంది. అవి అన్వేషణ, అధ్యయనం, అభ్యాసం, అంతర్దర్శనం. అవి పటిష్ఠంగా ఉన్నంత వరకు మనిషి జీవితం వెలుగు బాటే. మన జీవనం కోసం భగవంతుడు అన్ని వనరులను సమకూర్చి పెట్టాడు. అవేమిటో, అవి ఎక్కడున్నాయో, ఎలా ఉపయోగించుకోవాలో అనేది మనిషి నేర్చుకోవాలి.

మనసుకున్న శక్తి అపురూపమైనది. అది అంతుపట్టనిది. అది ఆధీనంలో ఉండకపోతే అతడు ఏ పని చేసినా అందులో నిజం ఉండదు. అయినా నిజమదేనని, నాకంతా తెలుసునని నటిస్తాడు. కానీ అతడి మనసులో ఒక మూల అంతర్గతంగా ఉన్న శక్తి ఒకటి అతణ్ణి "నీకు నిజంగా ఇక్కడ తెలిసిందేమీ లేదు. నువ్వెవరో తెలుసుకోవాలి" అని హెచ్చరికలు పంపుతూనే ఉంటుంది.

మనిషిమాత్రం మనసును ప్రభావితం చేసే అనుభూతులను, శక్తులను అసలేమి పట్టించుకోడు, అదుపులో పెట్టడు. తానెవరో తెలుసుకోవాలన్న సంకల్పం మనసులోకి ప్రవేశిస్తుంది. ఇన్నాళ్ళూ నడిపిస్తున్నది తనకన్నా అహంకారం తప్ప వేరేమీ కాదని అర్థమవుతుంది. బుద్ధిని ఉపయోగించే

మనసుకున్న శక్తి అపురూపమైనది. అది అంతుపట్టనిది. అది ఆధీనంలో ఉండకపోతే అతడు ఏ పని చేసినా అందులో నిజం ఉండదు. అయినా నిజమదేనని, నాకంతా తెలుసునని నటిస్తాడు. కానీ అతడి మనసులో ఒక మూల అంతర్గతంగా ఉన్న శక్తి ఒకటి అతణ్ణి "నీకు నిజంగా ఇక్కడ తెలిసిందేమీ లేదు. నువ్వెవరో తెలుసుకోవాలి" అని హెచ్చరికలు పంపుతూనే ఉంటుంది.

ప్రయత్నం మొదలవుతుంది. ఆత్మవిద్యాభ్యాసానికి అంకురారోపణ జరుగుతుంది. మనకు పేరుకుపోయిన స్వార్థం, సంకుచితత్వం దూరం చేసుకుంటే, ఎదుటి వాడికి మేలు చేయగల ఆలోచనలు మనలో నిరంతరం తరంగాలై ప్రవహిస్తుంటాయి. భయహీనత, నిర్భరత, ప్రేమ, సేవాతత్పరత నేర్చుకునే తొలిపాఠాలు. పూర్తయ్యేసరికి మానసిక కల్లోలానికి మూలహేతువులైన కోపం, అహంకారం, పక్షపాతవైఖరి, ప్రస్ఫుటించే మమకారం నిర్ణయాలు తీసుకోలేక పోవటం లాంటి వ్యతిరేక లక్షణాలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. అనిర్వచనీయమైన అణుకువ ప్రాప్తిస్తుంది. అణుకువ అంటే అతడు తనను తాను తక్కువ చేసుకోవటం కాదు. మరెవరో తనను తక్కువగా చూడటాన్ని పూరుకోవటమూ కాదు. బుద్ధిని ఉపయోగించి మనిషి తాను సాధించుకున్న ఒక ప్రత్యేక పరిస్థితి ఈ అణకువ. అది లభిస్తే ఆ మనిషి జోలికెవరూ రారు. ఎవరైనా పొగుడుతున్నా అతనికి వినిపించదు. నిందలు వేసినా నిరుత్సాహ పడడు. ఆకాశానికెత్తినా కూర్చునేందుకు సిద్ధపడడు. విషయం ఏదైనా నిరుపేక్షతో నిశితంగా గమనిస్తూ ఉండే ఈ అణకువనే స్థిత ప్రజ్ఞత అంటారు. స్థిత ప్రజ్ఞతతో అతని వ్యక్తిత్వం అతని సొంతమవుతుంది. మరెవ్వరూ దానిని అనుకరించలేరు. కొమ్మల్ని కొట్టేసినా, తిరిగి చిగురిస్తుంది చెట్టు, క్షణించే చంద్రుడు తిరిగి పూర్ణబింబమౌతాడు. కాలానుగుణమైన ప్రకృతిది స్థితప్రజ్ఞతే. ఈ ప్రపంచం కఠినమైనది, అడుగడుగునా సమస్యలే. వాటిని స్థితప్రజ్ఞతతో ఎదుర్కోవటంలోనే సంతోషం వుంటుంది.

★★★

## ఈ శీర్షిక మీదే

# కొంటె ప్రశ్న –చిలిపి జవాబు

కిందటి నెల ప్రశ్న
తడిగుడ్డలతో గొంతులు తెగకోస్తారు.మరి పొడి గుడ్డలతో ..?
మనుషులకు ఉరివేస్తారు
116/–రూ.బహుమతి పొందిన జవాబు:
పి .అమ్మిరెడ్డి

ఈ నెల ప్రశ్న
జవాబులు ఆగష్టు 25 లోపు పంపండి

sumathi.potilu@gmail.com

సాధారణ ప్రచురణకు ఎన్నికైన జవాబులు

తడిగుడ్డలతో గొంతులు తెగకోస్తారు.మరి పొడి గుడ్డలతో ..?
"ప్రవచనాలు బోధిస్తారు" శింగరాజు శ్రీనివాసరావు, ఒంగోలు

తడి గుడ్డల తో గొంతులు కొస్తారు.
పొడి గుడ్డల తో ..?
"ఆ గొంతు కోసిన శవాన్ని కప్పుతారు!
మోదుగ బాలసుబ్రహ్మణ్యం

తడి గుడ్డల తో గొంతులు కొస్తారు.
పొడి గుడ్డల తో ..?
పొగ పెడతారు!
మూలా వీరేస్వరరావు

తడిగుడ్డలతో గొంతులు తెగకోస్తారు.మరి పొడి గుడ్డలతో ..?
ముఖానికి ముసుగువేసి ముంచేస్తారు
పారుపల్లి అజయ్ కుమార్

తడిగుడ్డలతో గొంతులు తెగకోస్తారు.మరి పొడి గుడ్డలతో ..?
కట్లు కడతారు!
కోనే నాగ వెంకట ఆంజనేయులు
అగనంపూడి, విశాఖపట్టణం

కామెడి సీరియల్

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి



అలేఖ్య

ఆ ఇంటి చుట్టూ నాలుగు ఆకారాలు తచ్చాడుతున్నాయి , నల్లటి ముసుగులు వేసుకుని చేతిలో కర్రలతో ,ఇంట్లోకి ప్రేవేంశిచటానికి అదనుకోసం వేచి ఉన్నాయి .

ఇంట్లో ఉన్న మనుషులు మాట్లాడుకునే మాటలను గోడపక్కగా నక్కి వింటున్నాయి ఆ ఆకారాలు .

“ ఒరే, మనకి ఈ అర్ధరాత్రి జాగారాలు ఇంకా ఎన్నాళ్లురా ?”ఇంట్లో ఉన్న ఓ దున్నపోతు లాంటి ఆకారం అడిగింది ఎదురుగ ఉన్న మరో నల్ల మొద్దుని చూస్తూ .

# కామెడి సీరియల్

**జరిగిన కథ**
ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉండి ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . వర్మగారి స్నేహితుడు తాతారావు వంటపని ఇంటిపని చేస్తూ భార్య చాటు భర్తగా గడుపుతుంటాడు . కాలనీ చుట్టూ అపార్ట్మెంట్లు రావటం తో నీటి ఎద్దడి రావటంతో మినిష్టర్ని కలవల్నుకుంటారు వర్మ గారు . మునిసిపల్ కమిషనర్ ణి కలిసిన ఫలితం ఉండదు .హెడ్ కానిస్టేబులు రంగనాథం శంకరం దగ్గరకు చిన్న చిన్న కేసులు తీసుకువస్తుంటాడు .తాతారావు కొడుకు పద్మనాభం అందరిని పార్టీకి పిలుస్తాడు.పార్టీలో రియల్ ఎస్టేట్ కింగ్ హరీష్ ని అందరికి పరిచయం చేస్తా డు పద్మనాభం . కొంత మంది రౌడీలు తమ ఇల్లు ఆక్రమించారని శంకరాన్ని సంప్రదిస్తాడు ఆ ఉరి పోస్టు మాస్టర్
**ఇక చదవండి**

"ఎంతన్న, ఇంకా ఓ నాలుగు రోజులు , ఈ ఇల్లు అమ్ముడు పోగానే మనం కూడా బయట పడవచ్చు ,అప్పటి దాక కాస్త ఓపిక పట్టు "

" ఏమి ఓపికో ఏమో ? నిన్నటిదాకా సెంటర్లో చెడుగుడు ఆడుతూ ఆనందంగా గడిపినోడిని, ఇక్కడ ఇలా కుర్చోవాలంటే కాస్త కష్టంగా ఉందిరా తమ్ముడు ?

" మరి పైసలు ఊరికినే వస్తాయా చెప్పు అన్నా ?"

"ఏమి పైసలురా ? నా రోజు ఖర్చు అంత లేవు , ఎదో పెద్దాయన చెప్పదులే అని ఒప్పుకున్నా "
" సరే ఎదో ఒకటి ఒప్పుకున్నావు కదా ?.."

" సరేలే , మందు అయిపోయింది కాని , ఓ ఫుల్లు పట్టుకురా .." అంటూ ఆర్డర్ వేసింది దున్నపోతు ఆకారం .

"ఈ వేళప్పుడు కొట్లు ఉంటాయా ?" అనుమానం వెలిబుచ్చింది తుమ్మమొద్దు

" ఎందుకుండవు , నువ్వు ముందు వెళ్లి రా .."అంటూ విసుక్కుంది దున్నపోతు

చేసేది ఏమి లేక పైకి లేచింది తుమ్మ మొద్దు

వీళ్ళ సంభాషణ మొత్తం బయట నుండి వింటున్న ఆ నాలుగు ఆకారాలు , ఇంటి ముఖ ద్వారానికి రెండు వైపులా నిలబడి ,తుమ్మ మొద్దు ఎప్పుడు బయటకు వస్తుందా అని వేచి ఉన్నాయి

తుమ్మ మొద్దు బయట అడుగు పెట్టగానే , అమాంతంగా కర్రలతో వాడి మీద దాడి చేసాయి ఆ నాలుగు ఆకారాలు ,తప్పించుకోటానికి ఏ మాత్రం అవకాశము లేకుండా

ఒకే ఒక్క మూలుగుతో కింద పడి స్పృహ కోల్పాయింది తుమ్మ మొద్దు

వెంటనే ఆ నాలుగు ఆకారాలు తుమ్మమొద్దును పక్కకు లాగి తమతో తెచ్చుకున్న ఓ గోతములో వాడిని కుక్కి తాళ్ళతో కట్టి పడేశాయి .

ఓ అరగంట పాటు ఒపికగా, అక్కడే నక్కి కూర్చున్నాయి ఆ నాలుగు ఆకారాలు

ఎంతకీ తుమ్మమొద్దు మందు తీసుకుని రాకపోవటం తో , ఏమయి ఉంటుందా చూద్దాం అని , దున్నపోతు ఆకారం కుడా గుమ్మం బయటకు వచ్చింది

ఆ అవకాసం కోసమే కాచుకుని ఉన్నాయి ఆ నాలుగు ఆకారాలు

" వీదు ఎక్కడికెళ్ళాడు ,ఇంత సేపా

" అని అనుకుంటూ కాలు బయట పెట్టింది దున్నపోతు

అంతే ఒక్కసారిగా ఆ నాలుగు ఆకారాలు వాడి మీద పడి చితక బాదేశాయి

ఆ దెబ్బకు స్పృహ తప్పి పడింది తుమ్మ మొద్దు .

వాడిని కుడా గోతం లో కుక్కేసాయి ఆ నాలుగు ఆకారాలు

ఇంకా ఇంట్లో ఎవరన్నా ఉన్నారేమో నని ఓ రెండు ఆకారాలు ఇంటి లోపలకేల్లి చూసాయి

ఎవరు ఉన్న జాడ లేకపోవటం తో నిశ్శబ్దంగా బయటకు వచ్చి నిలబడ్డాయి

" ఎవరన్నా ఉన్నారా ?" అంటూ చిన్నగా గొణిగాయి బయట ఉన్న రెండు ఆకారాలు

ఎవరు లేరు అన్నట్టు తల ఉపాయి

" మరి ఈ రెండు గోతలను ఏమి చేద్దాం ?" మళ్ళి అడిగాయి బయట ఉన్న ఆకారాలు

" పదండి చెపుతాను అంటూ వాళ్ళలో ఉన్న ఆకారం ముందుకు అడుగు వేసింది , ఆ ఆకారాన్ని అనుసరించాయి మిగతావి

★★★

స్టేషన్ లోకి అడుగు పెడుతునే

# గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి కడుపుబ్బా నవ్వించే కామెడి సీరియల్

ఖైదీలను ఉంచే సెల్ దగ్గరకు నడిచాడు సి ఐ

సెల్ లో ఉన్న ఇద్దరూ వ్యక్తులను చూసి ,ఒకింత ఆశ్చర్యం , కొంత అయోమయానికి గురయ్యి ..అక్కడే ఉన్న కానిస్టేబులు తో " వీళ్ళను ఇక్కడికి ఎవరు తీసుకొచ్చారు ?" అంటూ అడిగాడు సి ఐ

" రాత్రి తాగి రోడ్డు మీద గొడవ



చేస్తుంటే నైట్ పెట్రోలింగ్ వాళ్ళుతీసుకొచ్చి లోపల వేసారు సార్ " వినయంగా బదులిచ్చాడు కానిస్టేబులు

"రోడ్డు మీద తాగి గొడవ పడ్డారా .." మళ్ళి అడిగాడు అనుమానంగా సి ఐ " అవును సార్.." అంటూ బదులిచ్చాడు అప్పుడే లోపలి వస్తూ హెడ్ కానిస్టేబులు రంగనాధం

" లోపల వేసే ముందు ఒక్క మాట నాకు చెప్పాలి కాదా ?" విసుక్కుంటూ అన్నాడు సి ఐ

" చిన్న గొడవే కదా ..మీ దాక ఎందుకని .. అయినా ఎస్ ఐ మేడం గారికి చెప్పం సార్"అంటూ జవాబిచ్చాడు రంగనాధం

"ఆవిడ గారన్నా నాకు ఫోన్ చెయ్యాలిగా "చిరాగ్గా అన్నాడు సి .ఐ

"రోజు చాల మంది తాగి రోడ్ల మీద పడి గోడవచేస్తుంటారు , డ్రంక్ అండ్ డ్రైవ్ లో చాల మందిని పట్టు కుంటాము , వాళ్ళ గురించి మీరు ఏరోజు అడగలేదు , మరి వీళ్ళ గురించి ఎందుకు సార్ అంతగా ఇదైపోతున్నారూ .." అంటూ చిన్నగా గిల్లాడు రంగనాధం

" అబ్బే ఇది లేదు అది లేదు ఒ మాట చెపితే బాగుంటుంది కదా అని అంతే , స్టేషన్ లో ఏమి జరుగుతుందో తెలిలియాలి కదా " అంటూ జవాబిచ్చాడు సి ఐ

ఇంతలో ఉమ కూడా స్టేషన్ లోకి అడుగు పెట్టటం తో ఉమా వంక చూస్తూ ,"ఏమ్మా ఏదన్న చేసే ముందు కాస్త చెపుతూ ఉండు అన్నాడు " సి ఐ

ఆ మాటల్లో అంతరార్ధం అర్ధం



# కామెడి సీరియల్



అయిన దానిలా లోలోపాలే నవ్వు కుంటూ ,"ఎస్ సార్ .."అంది ఉమ

"వీటి కేమి తక్కువ లేదు ,సరే గాని వాళ్ళను వదిలేయ్" అన్నాడు సి ఐ

" ఎలా వాదుల్తాము సార్, వాళ్ళమీద ఎఫ్ ఐ ఆర్ బుక్ చేసాము .."
ఎఫ్ ఐ ఆరా ?.. తాగి గొడవపడ్డ ప్రతి వాళ్ళ మీద ఎఫ్ ఐ ఆర్ బుక్ చేస్తే మన స్టేషన్ చాలదు వాళ్ళను సెల్ లో పెట్టటానికి .."

"కేవలం తాగి గొడవ పడితే పరవాలేదు సర్ .."

" ఇంకేమి చేసారు .."

" పెట్రోలింగ్ పోలిసుల మీద దాడి చేసారు ..."

"నిజమా ?.." అంటూ రంగనాధం వంక చూసాడు సి ఐ

"నిజమే సార్ .. వాళ్ళను రాత్రే ఆసుపత్రిలో చేర్చాము ..ఇంకా అక్కడే ఉన్నారు ..కావాలంటే ఫోన్ చెయ్యండి ' జావాబిచ్చాడు రంగనాధం

" అంతా బాగానే ప్లాన్ చేసినట్టు ఉన్నారు " అని మనసులో అనుకుంటూ .." సరేలే నేను చెప్పే దాక వీళ్ళని కోర్టులో సబ్మిట్ చెయ్యకండి " అని అక్కడి నుంచి కదిలాడు

స్టేషన్ గుమ్మం దాటాక ముందే సి ఐ కి ఎవరి నుంచో ఫోన్ కాల్ వచ్చింది
" నేను చూస్తాను సార్ మీరు కంగారు పడకండి , కొద్దిగా ప్రాబ్లం అయ్యింది ఈ వెధవలు తాగి గొడవ చేసారు ..పైగా మావల్ల మీద చెయ్యి చేసుకున్నారు "

అటువైపునుంచి ఎవరోకాని బాగా వత్తిడి చేస్తున్నట్టున్నారు

"చూస్తాను సర్ ,కొద్దిగా కంప్లికేట్ చేసారు మావాళ్ళు తెలియక , మీ లాయర్ని పంపించాది స్టేషన్ బిల్ ఏర్పాటు చేస్తాను "అంటూ అవతలి వాళ్ళని సముదాయించటానికి ప్రయత్నించాడు

సి ఐ తిప్పలు చూసి ఉమ, రంగానద్మ గార్లు నవ్వు ఆపుకోలేక లోలోపలే నవ్వుకున్నారు

సి ఐ మళ్ళి వెనక్కు వచ్చి చూడమ్మా , వీళ్ళ లాయర్ వస్తాడు బయిలిచ్చి పంపండి "

"ఒకే సర్ ..." అంటూ సెల్యూట్ చేసింది ఉమ

సి ఐ వెళ్లి పోయిన తరువాత రంగనాధం గారి వంక చూస్తూ "ఇప్పుడు ఏమి చేద్దాం అండి"అని అడిగింది ఉమ

"ఏముంది మేడం , వీళ్ళని నాలుగు గట్టిగా పీకి పంపితే ఇంక కాళ్ళు చేతులు కూడా కదపలేరు .ఇంకా మళ్ళి ఆ ఇంటి జోలికి పోరు "అంటూ కానిస్టేబుల్స్ వంక చూసాడు

రంగనాధం గారి సైగలు అర్ధమైన వాళ్ళలా సెల్ లోకి నడిచారు కానిస్టేబుల్స్

(ఇంకా ఉంది )

# పరుసవేది

ఈదర శ్రీనివాస రెడ్డి



చదువుల అంగళ్ళలో  కుప్పలు పోసి  మరీ అమ్ముతున్నారు రంగు రంగుల కలల్ని
కలలు కనటం చేతకాని అసమర్థులు నెరవేరని పాత కలలకు పాతర వేసి
అలవికాని కొత్త కలల్ని ఆకాశాన ఉట్టికి వేలాడదీసి వాటిని అందుకోమని
కడుపున పుట్టిన వాళ్ళను వత్తిడి చేస్తూ పైశాచిక  ఆనందం పొందుతున్నారు

కళ్ళ ముందున్న అవకాశాల్ని కాలదన్నుకుంటూ కనపడని గెలుపు శిఖరాలు అధిరోహించాలని
నిచ్చెనలు లేకుండా ఎదిగిపోవచ్చని కన్నవాళ్ళను నేలవిడిచి సాము చేయ్యమంటున్నారు
విజయానికి ఎన్ని మెట్లో తెలియని వాళ్ళ మాటలు నమ్మి  కాగితపు రెక్కలు తొడుక్కుని
ఒక్క మెట్టు కూడా ఎక్కలేక చివరకు పాముల నోట్లో పడి విలవిలలాడుతున్నారు

శిలనుచేక్కకుండా శిల్పంగా మారుస్తామని రాళ్ళను  రాత్నాలుగా ఏమార్చి అమ్మజుపుతున్నారు
శ్రమ పడకుండా గమ్యం చేరుస్తామని ఉహల పల్లకీలలో ఉరేగవచ్చని  నమ్మబలుకుతున్నారు
చెమట చుక్క చిందకుండా కడుపు నింపు కోవచ్చని ఉహ తెలియని వాళ్ళకు ఊదరగోడుతున్నారు
చేతిలో ఉన్న విద్యనుచేజార్చుకుని పరుసవేది  కోసం పాకులాడుతున్నారు  అభాగ్యులు

సొంత కాళ్ళ పై నిలబటం చేతకాని ఆశాజీవులు కన్నబిడ్డలను కోరికల గుర్రాల వెనుక పరుగులెత్తిస్తున్నారు
అందుకోలేరని తెలిసి ప్రాణాలను పణంగా పెడుతూ తలకు మించిన భారం మోపుతున్నారు
ఓదార్చే వాళ్ళు కనుచూపు మేర కానరాక కలవరపడుతూ కన్నవాళ్ళ కోరికలు తీర్చలేక కన్నీరు పెడుతూ
వేరే దారి తెలియక కాటికి పోవటమొక్కటే మార్గమని ఉరికొయ్యలకు వేలాడేందుకు  సిద్దమౌతున్నారు

ఈ నెల కథ

మొదటి బహుమతి పొందిన కథ

# ఎటర్నల్

మళ్ళ .కారుణ్య కుమార్

“చిన్నా!. ఆ నక్షత్రం చూసావా?..అదంతా ధూళి కారణంగానే ఏర్పడింది రా!.”అని దక్షిణామూర్తి అనడం తో...
ఆశ్చర్యంతో “అవునా నాన్న?.”అని నోరు వెళ్ళబెడుతూ ఆకాశంలో వున్న ఆ నక్షత్రాలు వైపు చూసి ఆనందిస్తూ
“ధూళి కారణంగా ఏర్పడిందా? అయితే ఇక్కడ వున్న ధూళి తో కూడా నక్షత్రాలు ఏర్పడతాయి?..”అని సందేహం వ్యక్తం చేశాడు.
“మంచి ప్రశ్న!...అయితే దానికి కొన్ని పక్రియలు వుంటాయి..నీకు తర్వాత పూర్తిగా వివరిస్తాను...
అదుగో చూడు సప్తర్షి మండలం...చూసావా ఏడు నక్షత్రాలు క్వశ్చన్ మార్క్ లా కనిపిస్తున్నాయి..”అని వాటిని చూపిస్తూ ,
“సరే నీకు నచ్చని సబ్జెక్టు ఏమిటి?...”అని అడిగాడు దక్షిణామూర్తి.
“అన్నీ బోరింగ్ నాన్న...అసలు ఏమిటో అర్ధం కావడం లేదు?..”
“అరే.. అలా అంటే ఎలా?..
చదువు ను అశ్రద్ధ చేయకూడదు...
అసలు దాని విలువ తెలుసుకుంటే నువ్వు ఇలా మాట్లాడవు...నీకు అర్ధం అయ్యేలా నేను చెప్తాను సరేనా.”

ఒక్కసారిగా ఉలిక్కి పడి చూసాడు వివేక్(చిన్నా)...

ఎదురుగా భార్య మహతి కాఫీ కప్ చేతిలో పట్టుకొని వుంది....

"ఎందుకండి అంత డిప్రెషన్ లోకి వెళ్లిపోతున్నారు?

మామయ్య గారు మనకు దూరం అవ్వడం బాధాకర విషయం. అలాగని మీ బాధ్యత మరిచిపోతే ఎలా?..మీ నాన్న గారు ఎప్పుడూ మీరు పెద్ద శాస్త్రవేత్త అవ్వాలి అని అంటుండే వారు అని మీరే అన్నారు కదా. మరి ఇలా అయితే ఎలా.?."అని కర్తవ్య బోధ చేస్తూ కాఫీ అతనికి అందించింది.

భార్య మాటలకు కాస్త ఆలోచించి ఆమె ఇచ్చిన కాఫీ తీసుకొని సిప్ చేస్తూ...

"ఎంత కాదు అనుకున్న జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూ వున్నాయి!... కొన్ని రోజులు సమయం అవసరం అవుతుంది. నేను డిప్రెషన్ నుండి బయట పడటానికి."అని అన్నాడు... ఇంతలో ఫోన్ మ్రోగడం తో,నెంబర్ చూసి వేగంగా లిఫ్ట్ చేశాడు.. "హా!. వివేక్ నేను ఒక ప్రాజెక్టు గురించి డిస్కస్ చేయడానికి నీ దగ్గరకు వస్తున్నాను."అని ఫోన్లో చెప్పాడు కుమార్.

"అలాగే సర్. రండి."అని చెప్పాడు.. "మహతి మా హెడ్ సైంటిస్ట్ వస్తున్నారు.

ఏదో ప్రాజెక్టు గురించి మాట్లాడటానికి.."అని భార్యతో చెప్తూ కాఫీ తాగడం పూర్తి చేసి. ఎక్సపెరిమెంట్ రూం వైపుకు కదిలాడు.

ఇంతలో కుమార్ వివేక్ దగ్గరకు చేరుకున్నాడు.

"రండి సర్..

మీరు వస్తున్నారు అని చెపితే ఏదో తెలియని ఆనందం.. మళ్ళీ ఇంకో ఆవిష్కరణ కు నాంది పడుతుంది అని."అని నవ్వుతూ అన్నాడు వివేక్.

"వివేక్ అప్పటికి ఇప్పటికీ నీలో చాలా తేడా కనిపించింది.. అప్పుడు చూపించినంత ఇంట్రెస్ట్ ఇప్పుడు నువ్వు చూపడం లేదు."అని కుమార్ అన్నాడు. కుమార్ మాటలకు మౌనం వహించాడు వివేక్... కుమార్ వైపు చూసి.. "ఒకే కుమార్ అసలు విషయానికి వచ్చేస్తాను... ఈ ప్రాజెక్టు మనకు చాలా ముఖ్యం. ఒకవేళ సక్సెస్ అయితే మన కంపెనీ విలువ పెరుగుతుంది....

వివేక్ ఈ రోజుల్లో పిల్లలు బాగా మొబైల్స్ కు అలవాటు పడి చదువు నిర్లక్ష్యం చేస్తున్నారు.. అయితే వాళ్లకు వాళ్ల దారిలోనే అంటే టెక్నాలజీ ఉపయోగించే చదువు మీద శ్రద్ధ కలిగేలా చేయడం. అదే విధంగా చదువు అర్ధం అయ్యే విధంగా చెయ్యడం మన ప్రాజెక్టు ముఖ్య వుద్దేశ్యం." అని చెప్పాడు కుమార్.

వివేక్ కుమార్ చెప్పిన పాయింట్స్ అన్నీ జాగ్రత్తగా రాసుకున్నాడు. "అరే...ఇదేంటి ప్రోగ్రాస్ కార్డు ఇక్కడ వుంది!..
.
మీ అబ్బాయిదా?.."అని అంటూ అక్కడే వున్న ప్రోగ్రెస్ కార్డు ను ఓపెన్ చేశాడు కుమార్. చూసి ఆశ్చర్యపోయాడు!.

"ఏంటి వివేక్ మీ అబ్బాయి చదువులో చాలా పూర్ గా వున్నాడు...నువ్వు ఇలాంటి పొజిషన్ లో వుండి. మీ అబ్బాయి ఇలా వుండడం ఏమి బాగాలేదు.. సరే మనం ఈ విషయాలు తర్వాత మాట్లాడుదాం."అని చెప్పి అక్కడ నుండి బయలుదేరాడు కుమార్.. కుమార్ వచ్చి తాను చెప్పదలుచుకున్నది పూర్తి చేయకుండానే వెళ్ళిపోవడానికి కారణం వివేక్ కు అర్ధం అయ్యింది. ఆ క్షణం కొడుకు మీద చాలా కోపం వచ్చింది...

ఒక్కసారిగా తన తండ్రి గుర్తుకు రావడంతో "చిన్నప్పుడు నేను కూడా ఈ విధంగానే వుంటే నాన్న నాపట్ల కేర్ తీసుకొని నాకు చదువు విలువ తెలియజేశారు. అర్ధం అయ్యేలా ఎలా చదవాలో చెప్పారు. బహుశా వీడి పట్ల నేను సరిగ్గా శ్రద్ధ చూపించట్లేదా?" అని ఆలోచనలో పడ్డాడు.

"అయినా కుమార్ సార్ ది

ఇంత నారో మైండ్ అని నేను అనుకోలేదు. ఆ ప్రోగ్రెస్ కార్డు చూసి నా సామర్థ్యాన్ని డిసైడ్ చేయడం ఏమిటి?. లేదు, నేను కూడా చేయగలను అని నిరూపించాలి. కుమార్ సర్ ఆలోచన తప్పు అని పరోక్షంగా అతనికి తెలియజేయాలి."అని అనుకున్నాడు వివేక్.

రెండు రోజులు చిన్న విరామాలు తీసుకుంటూ ఆ ఎక్సపెరిమెంట్ రూంలో కుస్తీ పడుతూ,బాగా శోధించి తన బుర్రకు పదును పెట్టాడు...

వచ్చిన ఆలోచనలు అన్నీ రాసుకొని కుమార్ చెప్పిన దానికి సరిపడేలా ఒక ఆలోచన చేశాడు....
ఈ ఆలోచన కార్య రూపంలో పెడితే తప్పకుండా తనకు సక్సెస్ వస్తుంది అని భావించాడు..

పూర్తిగా రెండు వారాలు శ్రమించి తాను అనుకున్న ఆలోచనలకు ఊపిరి పోస్తూ ఆర్టిఫిషియల్ ఇంటిల్లెజెన్స్ తో కూడిన ఒక రోబోను తయారు చేశాడు.
"బాబు అజిత్. ఇలా రా."
అని తన కొడుకుని తీసుకు వచ్చాడు..

"ఏంటి నాన్న?.."అని అంటూ తండ్రితో వచ్చిన అజిత్ ఆ రోబో ను చూసి ఆశ్చర్యపోతూ,
"హై. నాన్న...ఆడుకోవడానికి ఇది తయారు చేశావా?."అని అడిగాడు అజిత్.

చిన్నగా నవ్వుతూ "లేదు అజిత్.. నేను నీకు ఒక ప్రశ్న అడుగుతాను చెప్తావా?.."అని అడిగాడు వివేక్.
"ఏంటి నాన్న?.."
"నీకు నచ్చని సబ్జెక్ట్ ఏది?."
"సోషల్ సబ్జెక్టు డాడీ!.. పరమ బోరింగ్."అని అన్నాడు అజిత్..
వెంటనే తన ముందు వున్న సిస్టమ్ లో టైప్ చేశాడు."నమస్తే బాస్..."అంటూ కదిలింది రోబో...

"అజిత్. ఇలా రా" అని అజిత్ కళ్ళకు ఒక స్పెటికల్స్ పోలిన మెషీన్ అమర్చాడు.
"ఏంటి డాడీ. వీడియో గేమ్ ఆ ఇది?. బంటి గాడి దగ్గర ఇలాంటిది వుంది... అది పెట్టుకుంటే నేరుగా ఆ లోకంలోకి వెళ్ళి ఎనిమీస్ తో తలపడవచ్చు."అని ఏదో చెప్తున్నాడు.

"అలాంటిదే అజిత్.."అని అంటూ , అజిత్ చేతికి ఒక బెల్ట్ అమర్చాడు....

"బాబు అజిత్. నేను నీ పక్కనే వున్నాను...
నువ్వు భయపడకు .."అని చెప్తూ తన కంప్యూటర్లో టైప్ చేశాడు..
ఒక్కసారిగా ఆ రోబో మోడ్ అయ్యింది..
"మై డియర్ బాయ్...
లెట్స్ వెల్కమ్ అవర్ వరల్డ్.."అని అంటూ ఆ రోబో ఒక దృశ్యాన్ని ప్రదర్శించింది..
అది వలస పాలన కాలంలో ఆంగ్లేయులు భారతీయులు పై జరిగిన దౌర్జన్య కాండ.... ఎక్కడ చూసినా అణచివేత, ఆక్రమణలు...
అదంతా అజిత్ కళ్ళ ముందు జరుగుతున్న ట్లుగా వుంది...ఆ హింస చూసి అజిత్ కు భయం వేసింది. గట్టిగా అరుస్తున్నాడు..
ఆ రోబో ఆ సమయంలో వ్యక్తి లో జరిగే మార్పులు గమనిస్తుంది.
ఏదైనా సమస్య వస్తె దానంతట అదే ఆగిపోతుంది. అలాగే అతని శరీరంలో జరిగిన మార్పులు గమనించిన రోబో..
"కూల్ లిటిల్ బాయ్...
వాళ్ల నుండి నిన్ను రక్షించడానికి నేను వున్నాను."అని భరోసా కలిపిస్తూ మాట్లాడింది. కొంత సమయం పాటు అజిత్ ఆ సంఘటనలు గమనించేలా చేసిన తర్వాత వివేక్ ప్రోగ్రామ్ మోడ్ చేసి షట్ డౌన్ చేశాడు....

అజిత్ దగ్గరకు వెళ్ళి ,తన కళ్ళకు వున్న ఆ మెషిన్ తొలగించాడు..
ఒక్కసారిగా ఈ లోకం లోకి వచ్చాడు అజిత్..

"నాన్న. ఎంత భయం వేసిందో తెలుసా..

నిజంగా ఈ ఫీలింగ్ అద్భుతంగా వుంది...."

"అజిత్...ఆంగ్లేయుల చేత వాళ్ళంతా ఇబ్బంది పడటానికి కారణం ఏమిటో తెలుసా?..
వాళ్ళకి అప్పుడు సరిగ్గా చదువు లేదు...దాని కారణంగా ఆంగ్లేయుల మాయ మాటలు నమ్మి మోసపోయి ఆ విధంగా నరకం అనుభవించారు.

ఇంతకు ముందు నువ్వు అన్నావే చరిత్ర నాకు నచ్చదు అని, ఇప్పుడు చెప్పు నీ అభిప్రాయం ఏమిటి."అని అడిగాడు వివేక్.

"ఇప్పుడు తెలిసింది డాడీ, చరిత్ర తెలుసుకుంటే మనం ఎలా జీవించాలో తెలుస్తుంది అని, అలాగే చదువు కుంటే మంచి జరుగుతుంది ."అని అన్నాడు అజిత్. తన ప్రయత్నం కాస్త మంచి ఫలితం ఇచ్చింది అని సంతోషించాడు వివేక్. తర్వాత రోజు కుమార్ దగ్గరకి వెళ్ళాడు.

అప్పటికి కుమార్ మిగిలిన వాళ్ళతో మాట్లాడుతున్నాడు.

"నేను చెప్పి ఇన్ని రోజులు అయినా మీరు ఇప్పటి వరకు ఎటువంటి ఐడియా నాకు ఇవ్వలేదు."అని కాస్త అసహనం తో అన్నాడు కుమార్. ఇంతలో వివేక్ కలవడానికి అనుమతి కోరుతున్నాడు అని కుమార్ కి మెసేజ్ చేరవేశాడు రిసెప్షనిస్ట్.

"సరే అతన్ని లోపలికి పంపించు.."అని కుమార్ చెప్పడం తో, "సర్ మిమ్మల్ని లోపలికి రమ్మంటున్నారు."అని రిసెప్షనిస్ట్ చెప్పడం తో వివేక్ కుమార్ వుండే హాల్ కు వెళ్ళాడు. వివేక్ తో పాటు వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక పెద్ద బ్యాగ్ తీసుకువచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయారు..

"ఏంటి వివేక్ లగేజ్ తో వచ్చావు?.." అని ఆశ్చర్యంతో అడిగాడు కుమార్.
"అదే సర్ మీరు చెప్పారు కదా ఒక ప్రాజెక్టు గురించి...దానితోనే వచ్చాను."

"అవునా...గుడ్. గుడ్... ఇంత త్వరగా నీ నుండి రెస్పాన్స్ వస్తుంది అని నేను అనుకోలేదు?.."అని ఆశ్చర్యంతో అంటూ ఆ బ్యాగ్ వైపు చూసాడు.
వివేక్ దాన్ని ఓపెన్ చేస్తూ తాను కనిపెట్టిన రోబో ను బయటకు తీసాడు!.
"ఏంటి వివేక్!. రోబో తీసుకు వచ్చావు?..

కొంపతీసి ఇది మనకు క్లాసులు చెప్పదు కదా?.."అని ఆ రోబో ను చూసి కాస్త వ్యంగ్యంగా అన్నాడు అతని కోలిగ్...
"అలాంటిదే అంటూ..."కుమార్ దగ్గరకు చేరుకున్నాడు.

"సార్. మీతోనే ఈ ప్రయోగం మొదలు పెట్టాలి అనుకుంటున్నాను."అని వివేక్ అనడం తో,
"అలాగే వివేక్ తప్పకుండా.."అని ముందుకు వచ్చాడు కుమార్.
వివేక్ తన ప్రోగ్రాం అంతా సెట్ చేసి, కుమార్ కళ్ళకు ఆ మెషిన్ అమర్చి. అలాగే అతని చేతికి ఒక బెల్ట్ అమర్చి ప్రోగ్రాం మోడ్ చేశాడు...

అసలు చదువు అంటే గిట్టని పిల్లాడిని ఉన్నతమైన వ్యక్తిలా మార్చిన సంఘటన అది...ఆ ప్రోగ్రాం రన్ అవుతుండటం తో ప్రత్యక్షంగా అదంతా చూసిన అనుభవం కుమార్ కి కలిగింది.... కొంత సమయం అయిన తర్వాత వివేక్ ప్రోగ్రాం షట్ డౌన్ చేశాడు. కుమార్ కళ్ళకు అమర్చిన ఆ మెషిన్ తీయగానే. కుమార్ కళ్ళు నీళ్లతో వుండడం చూసి వివేక్ ఆశ్చర్యపోయాడు!.

"వివేక్ ఈరోజు నువ్వు నాకు మళ్ళీ నా గతాన్ని గుర్తు చేశావు."అని తన కళ్ళను తుడుచు కుంటు అన్నాడు కుమార్.

వివేక్ ఆశ్చర్యపోయాడు!.
"ఇది మీ గతమా?. సర్ నిజంగా ఇది నా కల్పిత సన్నివేశం."అని ఆశ్చర్యంగా అన్నాడు.
వివేక్ భుజాన్ని తడుతూ వెళ్ళి తన సీట్ లో కూర్చొని.."మై డియర్ మెంబర్స్...ఈరోజు వివేక్ ఒక అద్భుత సృష్టి చేశాడు. నిజంగా నేను చెప్పిన దానికంటే అద్భుతంగా వుంది ఈ ఆవిష్కరణ...
నేను ఇదే ఫైనల్ చేయబోతున్నాను." అని చెప్తూ ఆ మీటింగ్ ముగించాడు..
వివేక్ కు కొందరు కంగ్రాట్స్ చెప్పారు..

మరికొందరు ఈర్ష్య తో అక్కడి నుండి వెళ్ళిపోయారు. అందరూ వెళ్లిపోయిన తర్వాత..

"వివేక్!. ఆరోజు నేను కావాలనే నీతో ఏమి మాట్లాడకుండా వచ్చేసాను. ఆ సమయంలో నువ్వు నన్ను వేరేగా అర్థం చేసుకుంటావు అని నాకు తెలుసు. కానీ నేను ఆ క్షణం కావాలనే అలా చేశాను. నాకు తెలుసు వివేక్ నువ్వు చాలా

టాలెంట్ కలిగిన వ్యక్తి అని. సరిగ్గా ఆ సమయంలో మీ అబ్బాయి ప్రోగ్రాస్ కార్డు దొరికింది...అదే అదునుగా పరోక్షంగా నీలో కసి పెరిగేలా చేశాను. వివేక్ నా ప్లాన్ వర్కవుట్ అయ్యింది. అయితే వివేక్ సరిగ్గా నా జీవితంలోనే జరిగిన ఘటనే నాకు ఆ రోబో సహాయంతో చూపించావు..''అని నవ్వుతూ అన్నాడు.

ఆశ్చర్యంతో చూస్తున్నాడు వివేక్. "వివేక్ చిన్నప్పుడు నాకు సరిగ్గా చదువు వచ్చేది కాదు. ఎప్పుడూ గురువులు నన్ను తిడుతూ ఉండేవారు...నాకు కూడా అలవాటు అయిపోయింది... పూర్తిగా అక్షరం వదిలేసాను. స్కూలుకు రోజూ వచ్చినా అక్షర జ్ఞానం తెలిసేది కాదు. అయితే చీకటిలో వున్న నన్ను ఒక వెలుగు నేనేమిటో తెలుసుకునేలా చేసింది.... ఒక మాస్టారు మా పాఠశాలకు వచ్చారు. అందరూ అతన్ని దాము సార్ అనేవాళ్ళు...అందరిలానే ఈ మాస్టారు కూడా అని నేను అనుకున్నాను. ఒకరోజు అతను నా దగ్గరకు వచ్చారు. నా పరిస్థితి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నాకు ఒక అరగంట కేటాయించి ఒక పాఠం చెప్పారు. ఏదో తెలియని ఆనందం నాకు కలిగింది. చాలా సంతోషం వచ్చింది. అరే చదువు ఇంత అందంగా వుంటుందా అని అప్పుడు తెలిసింది.. ఆ రోజు నుండి నా రాతే మారిపోయింది.. అక్షరం అంటే విరక్తి కలిగిన నేను మళ్ళీ అక్షరం వైపుకు అడుగులు వేసాను.. అతను నాకు ఇచ్చిన ప్రేరణ తోనే ఈ స్థాయికి చేరుకున్నాను. నువ్వు చూపించిన ఆ దృశ్యం మళ్ళీ నా బాల్యాన్ని గుర్తు చేసింది..''అని కుమార్ అన్నాడు...

"ఆశ్చర్యం సర్...
నాకు ఆ సన్నివేశం ఎలా వచ్చింది అంటే....

మా నాన్నగారు అంటే నాకు ఇష్టం...నేను చదువు మీద సరిగ్గా శ్రద్ధ చూపకపోతే. అతని మళ్ళీ నాకు చదువు విలువ తెలియజేసి. అర్థం అయ్యేలా ప్రతి విషయం చెప్పేవారు!. కానీ అతను నాకు ఇప్పుడు దూరం అయ్యారు..''అని చెప్తూ ఏడ్చేసాడు వివేక్..
"ఓహ్ వివేక్ కూల్,కూల్.
అతను ఎక్కడ ఉన్నా ఇప్పుడు సంతోషిస్తారు... నీ ప్రతిభ ద్వారా నువ్వు మళ్ళీ చదువు అంటే భయపడే వాళ్ళకి చదువు ప్రాముఖ్యత తెలియజేస్తావు...అలాగే ఈ మిషన్ డిప్రెషన్ లో వున్న వాళ్లకు కూడా ఉపయోగ పడేలా డిజైన్ చేద్దాం....అయితే మీ నాన్నగారు గురించి నాకు ఇంతకు ముందు చెప్పలేదు...ఇంతకీ మీ నాన్నగారు పేరు ఏమిటి?..''అని అడిగాడు కుమార్....

"దక్షిణామూర్తి గారు....''అని తన మొబైల్ తీసి, తన తండ్రి ఫోటో చూపించాడు వివేక్.
ఆ ఫోటో చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు కుమార్.."దా!. దాము సార్!. ఇతనే మా గురువు. దక్షిణామూర్తి గారు....''అని అంటూ ఆ ఫోటో చూసి అన్నాడు కుమార్.....

కుమార్ మాటలకు ఆశ్చర్యపోయాడు వివేక్..."ఏంటి సార్ మీరు అంటున్నది?.
మా నాన్నగారు మీ గురువు గారా?....''అని అన్నాడు వివేక్....
"అవును వివేక్....ఇతనే మా గురువు గారు. అయితే, నాకు ఇప్పుడు కూడా నీ ద్వారా దారి చూపించింది అతనే..''అని సంతోషం తో అన్నాడు కుమార్.
వివేక్ కళ్ళలో నీరు తిరిగాయి....
"నాన్న నువ్వు ఎక్కడో లేవు. ఇక్కడే వున్నావు. మళ్ళీ డిప్రెషన్ లో వున్న నన్ను ఇంతటి ప్రాజెక్టు విజయవంతం అయ్యేలా కుమార్ గారి మాటలు ద్వారా ప్రేరేపించి మళ్ళీ నాకు దారి చూపించి గురువు అయ్యారు..''అని సంతోషంతో తనలో అనుకున్నాడు...

"వివేక్. అంతా గురువు గారు దయవలన సక్రమంగా జరిగింది. గురువు అనుగ్రహం వుంటే ఎంతటి కష్టం అయినా దాటేయ వచ్చు. అది అనుభవపూర్వకంగా నిరూపితం కూడా.నువ్వు మా గురువు గారి కుమారుడు కావడం చాలా సంతోషం. మరి ఈ రోబో కు ఏమి పేరు పెడదాం?.'' అని అడిగాడు

"ఇది ఒక అద్భుతం సర్...
గురువుగా మా నాన్న నాకు చూపించిన మార్గం కనుక. గురువు ఆశీర్వాదం ఎప్పుడూ మనకు ఉండాలి అని దీనికి 'ఎటర్నల్' అని పేరు పెడదాం..''అని అన్నాడు వివేక్..
"ఎటర్నల్ ...శాశ్వతమైన... బాగుంది వివేక్....''అని నవ్వుతూ అన్నాడు కుమార్....★★★

## మేరా భరత్ మహాన్

### ఇది మన దేశం లోనే సాధ్యమౌతుంది

ఆకలేసి ఏడ్చే బిడ్డలకు గుక్కెడు పాలు పొయ్యరు కాని, రాతి విగ్రహాలకు పాలతో అభిషేకం చేస్తారు

పుట్టలో కనపడని నాగు పాముకి పాలు పోస్తారు , అదే పాము కనబడితే కర్రతో కొట్టి చంపుతారు

బతికున్నప్పుడు తల్లిదండ్రులకు ముద్దా కుడా పెట్టారు,చచ్చాక పెద్ద ఖర్మ పేరుతో ఊళ్ళో అందరికీ విందు భోజనం వడ్డిస్తారు

గుడి బయట అడుక్కునేవాళ్ళను చులకనగా చూస్తారు,గుడిలోపల కెళ్ళి అదే పని చేస్తారు

సినిమా హీరో ,హీరోయిన్లను దేవతలుగా భావించి గుళ్ళు కట్టటం మన దేశం లోనే చూస్తాము

కార్యకర్తల చేత కాళ్ళు మొక్కించుకునే నాయకులను , కింది ఉద్యోగులతో ఇంటిపనులు చేయించుకునే అధికారులను ఇక్కడే చూస్తాము

మీరు కుడా మీ అనుభవంలోకి వచ్చిన ఇటువంటి వాస్తవాలను రాసి పంపండి ,ఉత్తమమైన వాటిని ప్రచురిస్తాము
e-mail :sumathi.potilu@gmail.com

ఈ నెల కథ

# ఒక్క అడుగు

మొదటి బహుమతి పొందిన కథ

కృష్ణమాచార్యులు

ఒక్క అడుగు. ఒకే ఒక్క అడుగు స్థలం కోసం తగాదా. అదేమీ రెండు దేశాల మధ్య సరిహద్దు దురాక్రమణ సమస్య కాదు. ఒక్క అడుగు భూమినైనా దురాక్రమణకు గురికానివ్వనని దేశ ప్రధాని ప్రకటించగా ప్రజలు దేశభక్తితో వుద్వేగం పొందడానికి. అదేమీ పెండ్లి ఎదురుకోలులో నువ్వొక్కడుగు ముందుకు వస్తేనే, నేన వస్తా ననే, వధూ వరుల మధ్య పంతమూ కాదు, బంధువులు చప్పట్లు కొట్టి ప్రోత్సహించడానికి. ఇది కేవలం పుదుచెర్రీ లోని సాయి అపార్టుమెంట్స్ ఆవరణలో, పార్కింగ్ జాగా కు సంబంధించిన కొట్లాట. ఇరుకు ప్రదేశాలలో సామాన్య జీవుల మధ్య కానవచ్చే సంఘర్షణ.

సగటు అపార్టుమెంటుల్లో, తక్కువ ప్రదేశంలో యెక్కువమంది కాపురాలు వుండడం వల్ల ఏదో ఒక విషయంలో వాగ్వాదాలు జరుగుతూంటాయి. ఎవరో ఒకరు కాస్త హద్దు మీరడం, మిగిలిన వారు ప్రతిఘటించడం, అపార్టుమెంటు నివాసితులకు సర్వ సాధారణమైన విషయం.

సిగరెట్ పీకలు క్రింద పడేస్తున్నారనో, చెత్త సరి గ్గా కుండీల్లో వేయడంలేదనో, లోపలికి వచ్చే గేటులోంచి వాహనాలు బయటికి వెడుతున్నాయనో, ఎవరో ఒకరు వాచ్ మన్ దగ్గర ఫిర్యాదు చేస్తూంటారు. అతను విన్న వన్నీ సెక్రెటరీ కి చెప్తాడు. సెక్రెటరీ శ్రద్ధగా విన్నట్లు నటిస్తాడు కానీ, సమస్యల పరిష్కార దిశలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయడు. ఎవరైనా సెక్రెటరీని నిలదీస్తే, " సమస్యలు లేకుంటే జీవితం బోరు గా వుంటుంది. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలు. వీటిని పరిష్కరిస్తే.. ఏమో, ఏదో ఒక పెద్ద సమస్య రావచ్చు. అందుకే ఇలా జరిగిపోనివ్వండి" అని తెలివిగా బదులిస్తాడు.

ప్రస్తుత సంఘటన ఎక్కువమంది దృష్టినాకర్షించడానికి కారణం అది యిద్దరు మహిళామణుల మధ్య రగిలిన రచ్చ. సాధారణంగా స్త్రీలకు సంబంధించిన విషయాలలోఆలోచనకన్నా భావోద్వేగం, ప్రధాన పాత్ర వహిస్తుంది. అందువల్ల చర్చలు, మధ్యవర్తిత్వాలు అంత తేలికగా పనిచేయవు. అది ఈ సమస్య విషయంలో నిరూపితమైంది. ఘర్షణ పెంచే వారు, రాజీ కోసం ప్రయత్నించేవారు, వినోదం చూసే వారు, యేమిటీ గోల అని విసుక్కునేవారు... యిలా రకరకాల వ్యక్తులతో ఆ ప్రదేశం హడావుడిగా, గందర గోళంగా వుంది.

వాయుదేవుడు నిశ్చలంగా వుండి ఈ తతంగాన్ని గమనిస్తూంటే, అస్తమాన సూర్యుడు ఈ హై వోల్టేజ్ యెమోషనల్ డ్రామా చూసే చాన్సు మిస్సవుతున్నానన్న బాధతో ముఖం కందగడ్డలా చేసుకుని పడమటి అంచును చేరుతున్నాడు.

అప్పుడే వచ్చాడు శ్రీనివాసు తన భార్య పద్మతో. వారిద్దరూ ఒకే ఆఫీసులో వుద్యోగం చేస్తున్నారు. ఆఫీసులో చిగురించిన ప్రేమను వారు కొంత కాలం పెంచి పోషించాక, ఆ ప్రేమకు సార్థకత కల్పిస్తూ గత నెలలో పెళ్ళి చేసుకున్నారు. ఆఫీసుకు దగ్గరని, యిక్కడే ఒక అపార్టుమెంటు అద్దెకు తీసుకుని కాపురముంటున్నారు. స్వభావరీత్యా వారిద్దరూ శాంతి కాముకులు కావడంతో, ఆ ఘర్షణను చూసి కంగారు పడ్డారు.

పద్మ అడగకుండానే ఒకామె, " విడ్డూరం కాకపోతే ఆ రాజ్యలక్ష్మి, పెద్దకారు కొనడమెందుకు? ప్రక్కనున్న కల్యాణి వాళ్ళ పార్కింగులో ఒక్క అడుగు స్థలాన్ని ఆక్రమించడమెందుకు? అసలే కల్యాణి గారి పార్కింగు స్థలం మిగిలిన వాటికన్నా చిన్నది. పెద్ద కారులున్నవాళ్ళని యిక్కడ అపార్టుమెంటు తీసుకోవద్దని బిల్డర్ ముందే చెప్పాడు. అవునా, కాదా?" అని పద్మను అడిగి, ఆమె సమాధానం చెప్పేలోపే అక్కడనుంచి వెళ్ళిపోయింది. విషయం తెలిసాక, పద్మకు అక్కడ వుండ బుద్ధి కాలేదు. ఆమె కూడా వెళ్ళిపోయింది.

శ్రీనివాసు అక్కడే వుండి, "ఏమిటీ? ఒక్కడుగు కోసమా, ఈ ఘర్షణ ?నమ్మలేక పోతున్నా" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు. ప్రక్కనున్న ఒక పెద్దాయన, " ఒక్క అడుగు. అదేమన్న తక్కువా? వామనావతారం తెలుసు కదా? ఒక్క అడుగుతో భూమిని, మరొక్క అడుగుతో పై లోకాలనాక్రమించిన మహా విష్ణువు, మిగిలిన ఒక్క అడుగు కోసం బలిని పాతాళానికి తొక్కేశాడు. ఒక్క అడుగా! అని హేళనగా మాట్లాడకు.
"అని గద్దించినట్లు చెప్పాడు. దాంతో శ్రీనివాసు చిన్న బుచ్చుకుని, భార్యకోసం వెదికాడు. ఆమె కనబడక పోయేటప్పటికి," అమ్మయ్యా! పద్మ వినలేదు. ఇంటికి పోదాం, రొమాన్సు చేద్దాం" అని, పరుగున యిల్లు చేరాడు.

బెల్ కొట్టకుండా, తన దగ్గర వున్న తాళం చెవితో, తలుపు తెరిచి పిల్లిలా లోపలికి వెళ్ళాడు. బెడ్ రూములోని, బాత్ రూమునుంచి నీళ్ళ శబ్దం వినబడింది. లక్కీ చాన్సులే! అని చప్పుడు చేయకుండా జెట్ స్పీడులో రెండో స్నానాల గదిలో తన స్నానం ముగించాడు. మెల్లగా బెడ్ రూములో దూరి, ఒక బీరువా వెనుక దాక్కున్నాడు. కొద్ది సేపు యెదురు చూసాక, పద్మ స్నానం

చేసి, తల తుడుచుకుంటూ బయటికి వచ్చింది. అతను ఒక్క వుదుటన ఆమె యెదుట నిలచి, తన చేతులలో ఆమెను బంధించబోయాడు.
పద్మ చిలిపిగా, " దూరం. దూరం. ఒక్క అడుగు ముందుకు వేస్తే వూరుకోను" అంది.
ఒక్క అడుగు అన్న మాట వినబడగానే అతనికి నవ్వు వచ్చింది. విరహానికి, పరవశానికి మధ్య దూరం ఒక్క అడుగు అనుకున్నాడు.
" వ్యామోహం తుఫాను లాంటిది. ఆగే విజ్ఞత దానికి లేదు" అంటూ ఆమెను తన చేతులతో చుట్టేశాడు.

@@@

కల్యాణి పార్కింగు ప్రదేశంలోనికి రాజ్యలక్ష్మిచొరబడిందని స్పష్టంగా తెలుస్తోంది కాబట్టి, యెవ్వరో ఒకరు, ఒక్క అడుగు ముందుకు వేసి, మధ్యవర్తిత్వం చేస్తే, బాగుండేది. కానీ యెవ్వరూ ఆపని చేయలేదు సరికదా, రెండు గ్రూపులుగా విడిపోయి కలహాన్నిపెంచిపోషించారు.
అపార్టుమెంట్ అసోసియేషన్ ప్రెసిడెంటు, లేదా సెక్రెటరీ చొరవ తీసుకోవాలని సభ్యులు ఒత్తిడి తేవడంతో, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఒక ప్రకటన చేశాడు.
"త్వరలో అపార్టుమెంటు నియమావళి రూపొందించి సభ్యులకు అందచేస్తాం."
ప్రెసిడెంటుకు ఈ సమస్యలో తలదూర్చడం యిష్టం లేదు. కారణం లంచం, మరియు రాజకీయం. రాజ్యలక్ష్మి ప్రెసిడెంట్ బలహీనత కనిబెట్టి తన దగ్గర వూరకే పడి వున్న అమెరికా విస్కీ బాటిల్, ఆయనకిచ్చి, సహాయం కోరింది. సెక్రెటరీ నీతులు, నియమాలు అంటాడు కాబట్టి అతడిని వదిలేసింది. అలా వారిద్దరి మధ్య ఒక విబేధం సృష్టించి, తన మాట చెల్లేలా చేసుకోవాలని ఆమె ప్లాన్. ఆమె కోరుకున్నట్లే జరిగింది.
రెండు రోజుల తర్వాత, పాలక మండలి సమావేశమైంది.
ప్రెసిడెంటు మాట్లాడుతూ ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య సమస్య. మనకు సంబంధం లేని విషయం. అందువల్ల, వేరే సమస్యలు చర్చిద్దాం" అన్నాడు. సెక్రటరీ వెంటనే ప్రెసిడెంటు తో విబేధిస్తూ," అలాగయితే అజెండాలో ఎందుకు పెట్టారు? ఎందుకు సమావేశం యేర్పాటు చేశారు? సభ్యులేమనుకుంటున్నారో తెలుసుకుందాం" అన్నాడు.
చేసేది లేక ప్రెసిడెంట్ సభ్యుల అభిప్రాయాలను ఆహ్వానించాడు. సభ్యులు వెలిబుచ్చిన అభిప్రాయాలలో ముఖ్యమైనవిలా వున్నాయి.
" రాజ్యలక్ష్మిగారిని మందలించి ఆమె కారును బయట పెట్టుకోమని చెప్పాలి. "
" తప్పు రాజ్యలక్ష్మి గారిదే, కాని కల్యాణి గారి తప్పు కూడా వుంది. రాజ్యలక్ష్మిగారు మాట వినడంలేదని మనకు చెప్పి వుంటే, మనం జోక్యం చేసుకునే వాళ్ళం. ఒక్క సారి కొట్లాట జరిగాక, మనం యేం చెప్పినా ఇద్దరికి నచ్చదు."
"ఇక్కడ రెండు అంశాలను గమనించాలి. ఒకటి, రాజ్యలక్ష్మి గారు యిల్లు కట్టుకుంటున్నారు. త్వరలో యిక్కడనుంచి వెళ్ళిపోతారు. రెండు, కల్యాణి గారికి కారు లేదు. అందువల్ల కల్యాణి గారు కాస్త సర్దుబాటు ధోరణి తో వుంటే బాగుంటుంది."
" ఇల్లు కట్టడం ఒక వారంలో అయ్యే పనా కల్యాణి గారిని ఒప్పించడానికి. ఒక సారి మొదలయ్యాక యెన్నాళ్ళు పడుతుందో యెవరి కెరుక."
సందర్భమైనా, కాకున్నా బిల్డరుని నిందించే సభ్యుడొకరు, " ఇది బిల్డరు తప్పు. అతను కొంత ప్రదేశం అతిధుల పార్కింగుకు వదిలి వుంటే, రాజ్యలక్ష్మిగారి కారుని అక్కడ పెట్టమని చెప్పే వాళ్ళం" అన్నాడు.
బిల్డరు మాట రాగానే కొందరు రెచ్చిపోయి యెన్నో సమస్యలకు కారణం బిల్డరేనని తేల్చారు. ఆ పైన బిల్డరు అవకతవకలపైన సుధీర్ఘ చర్చ జరిగింది.
బిల్డరుకు మద్దతు తెలిపేవారు, పాలక మండలి అసమర్ధతను దుయ్యబట్టారు. వ్యతిరేక వర్గం, వారిని ఖండించారు. కోపాలు హద్దులు దాటాయి. ఒక్క అడుగు ముందుకేసి, సభ్యులు కుర్చీలు యెత్తి కలబడబోయారు. పెద్దలు జోక్యం చేసుకుని, వారిని శాంత పరిచారు. చివరగా సర్వసభ్య సమావేశం యేర్పాటుకు తీర్మానం చేసి, సభను ముగించారు.

కొన్ని రోజుల తర్వాత, సర్వసభ్య సమావేశం జరిగింది. అ మీటింగులో మాట్లాడిన సభ్యులందరూ పార్కింగ్ గురించి మాట్లాడడం మొదలు పెట్టి, చర్చను వేరే అంశాల వైపు మళ్ళించడంతో

ఒక గందర గోళ వాతావరణం నెలకొంది. సభ్యులు పరస్పర నిందారోపణలతో సమస్యను ప్రక్క దోవ పట్టించారు. బిల్డర్ ఇంత వరకు డ్రైనేజ్ పని పూర్తి చేయలేదు. నిర్వహణ లోపం వల్ల పార్కింగు లో శుభ్రత లోపించింది. నిర్వహణ ఖర్చులను ప్రకటించడం మానేశారు. కరంటు పోయినప్పుడు జనరేటరు వేయడం ఆలశ్యం చేస్తున్నారు. ఇలా యెన్నో సమస్యలను ప్రస్తావించారు. ఇదంతా గమనించిన శ్రీనివాసుకి మతి పోయింది. అతను భార్యతో " సమస్య పరిష్కరించే ఆసక్తి ఎవ్వరికీ లేదు. ఎవరి గోల వారిది. " అని వాపోయాడు.

@@@

ఒంటినిండా నగలతో, పెద్ద కారులో షికార్లు చేయడం, షాపింగ్ మాల్ కెళ్ళి కొనుగోళ్ళు చేయడం, పెద్ద బంగళాలో నివాసముండడం వంటి విలాసాలు రాజ్యలక్ష్మికి చిరకాలంగా నెరవేరని కలలుగా వుండిపోయాయి. ఆమె భర్త సంపాదించి యిచ్చిన చిన్న కారు, చిన్న అపార్టుమెంటు ఆమెకు సంతృప్తి నివ్వలేదు. అందుకే ఆమె తన కలల సాకారానికి, కొడుకు మీద ఆధారపడింది. నాలుగేళ్ళ క్రితం, ఆమె కొడుకు ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి, అమెరికాలోని మైక్రోసాఫ్ట కంపనీలో వుద్యోగం సంపాదించుకున్నాడు. తల్లి కోరికపైన, అతడొక కోటి రూపాయలు తల్లికి పంపించాడు. ఆమె భర్త సుదర్శనానికి కొడుకు దగ్గర డబ్బుతీసుకోవడం యిష్టం లేదు.

" ముందు వాడిని అక్కడ యిల్లు కొనుక్కొని సెటిల్ అవనీ. వాడికి పెళ్ళి చేసి, సుఖంగా కాపురం చెయ్యమని చెప్పకుండా, మన కోసం డబ్బులు పంపమని అడగడం నీకు భావ్యమేనా " అని ఆయన భార్యని నిలదీశాడు. ఆమె భర్త మాటలు పట్టించుకోకుండా, కొడుకుతో మరొక్క కోటి రూపాయలు కావాలని చెప్పింది. తల్లి మీద ప్రేమతో ఆమె కొడుకు సరేనన్నాడు. తన దగ్గర వున్న డబ్బుతో ఆమె ఒక విశాలమైన స్థలం కొని, అక్కడ మూడు పడక గదులున్న ఇంటి నిర్మాణం ప్రారంభించింది. అంతటితో ఆగకుండా, నాలుగు జతల బంగారు గాజులు, ఒక డైమండ్ ముక్కు పుడక, ఒక రవ్వల నెక్లెస్, ఒక వడ్డాణం కొనుక్కుంది. చివరగా, ముచ్చటైన హోండా సిటీ కారు కొంది. కారు కొనవద్దని మొత్తుకుంటూ ఆమె భర్త, " ఇప్పుడే కారు మార్చవద్దు. పార్కింగ్ సమస్య వస్తుంది? ఒక్క యేడాది ఆగు. క్రొత్త యింటికి వెళ్ళాక అన్నీ కొందువు గాని," అని హితవు చెప్పాడు

"మీరిలాగే వెనక్కి లాగండి. నా ముచ్చట తీరకుండానే, నేను కన్ను మూస్తే, మీకు ఆనందంగా వుంటుంది" అని ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది. ఆమె మాటలకు హతాశుడై, ఆమె భర్త భారంగా నిట్టూర్చాడు.

రాజ్యలక్ష్మి తన క్రొత్త కారుకు కావలసిన అదనపు స్థలం గురించి కల్యాణికి ముందే చెప్పి ఆమె అనుమతి తీసుకుని వుంటే , ఈ సమస్య వుండేది కాదు. కల్యాణి దంపతులకు కారు లేదు. రెండు బైకులు వున్నాయి. అందువల్ల, రాజ్య లక్ష్మి కోరితే ఆమె అనుమతి యిచ్చివుండేది. కానీ నడ మంత్రపు సిరి వల్ల రాజ్యలక్షి లో అహం పెరిగిపోయింది. ఈ మధ్య కాలంలో ఆమె మాటల్లో గర్వం, ప్రవర్తనలో దర్పం కన పడుతున్నాయి. ఒకప్పుడు ఎంతో మైత్రీభావంతో మెలిగిన వారిద్దరూ యిప్పుడు శత్రువుల్లా మారిపోయారు.

రోజు కొక గిల్లి కజ్జా. నా కారుకి గీత పెట్టారు, కారుమీద చెత్త పోసారు లాంటి ఫిర్యాదులతో, కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు లాంటి మనసుకు కష్టం కలిగించే మాటలతో, రాజ్యలక్ష్మి సృష్టించే వీరంగం భరించలేక కల్యాణి, ఆమె పై పోలీసు కేసు పెట్టింది. పుదుచ్చేరి లో మంత్రులను ఎమ్మెల్యేలను కలవడం సులభం. మిగతా రాష్ట్రాలలో లాగా కాకుండా ఇక్కడ రక్షక భటుల నియంత్రణ, అధికారుల ఆంక్షలు తక్కువ. తెలిసిన వారి ద్వారా రాజ్యలక్ష్మి ఒక మంత్రిగారిని కలిసి తను ఎదుర్కొంటున్న ఇబ్బంది తెలియ

చేసింది. ఆయన మాటకు కట్టుబడి, పోలీసులు కల్యాణి పెట్టిన కేసుపై విచారణ ను వాయిదా వేసారు. రోజూ ఎడముఖం , పెడ ముఖంగా వుంటున్న కల్యాణీ రాజ్యలక్ష్మిలను చూస్తున్నశ్రీనివాసు, పద్మతో అన్నాడు,
" మీ ఆడవాళ్ళలో ఎవరైన చొరవ తీసుకుని కల్యాణి, రాజ్యలక్ష్మిల మధ్య స్నేహాన్ని పునరిద్ధరిస్తే బాగుణ్ణు. ఏ గొడవాలేకుండా ప్రశాంతంగా వుంటాం. "
" అలా జరిగితే మంచిదే. కాని ఎవరు చేస్తారు? మనమా ఈ అపార్టుమెంటుకు క్రొత్త. ఆ దేవుడే చూసుకుంటాడు" అంది పద్మ. వారికి ఒక్క అడుగు దూరంలో తిరుగుతున్న తథాస్తు దేవతలు "శుభం" అని ఆశీర్వదించారు. ఆ సంగతి వారికి అప్పుడు తెలియదు.

@@@

పది రోజుల తర్వాత, బెంగళూరులో స్నేహితురాలి పెళ్ళికి భర్తతో కలిసి హాజరైంది పద్మ. అక్కడ కల్యాణ మంట పంలో కనబడ్డ ఒక దృశ్యం వారిని ఆశ్చర్య చకితులను చేసింది. పెళ్ళికొడుకు తరపున రాజ్యలక్షి అందర్నీ ఆహ్వానిస్తుంటే, పెళ్ళికూతురు తరపున కల్యాణి అందరికి మర్యాదలు చేస్తోంది. వదినా, వదినా అనుకుంటూ వారిద్దరూ ప్రేమలొలకబోసుకుంటూ తిరుగుతున్నారు. ఇదెలా సాధ్యమైందని విచారిస్తే, కల్యాణి పెళ్ళికొడుకుకు పిన్నమ్మ అని, రాజ్యలక్ష్మి పెళ్ళికూతురుకు పెద్దమ్మ అని తెలిసింది. క్రొత్తగా యేర్పడ్డ బాంధవ్యం, వల్ల రాజ్యలక్షిలో నీ అహం స్థానంలో ప్రేమాభిమానాలు మొలకెత్తాయి. నూతన చుట్టరికాన్ని గౌరవిస్తూ, రాజ్యలక్ష్మి ఒక అడుగు ముందుకు వేసి స్నేహ హస్తాన్ని చాచింది. కల్యాణి ప్రేమతో ఆ హస్తాన్ని అందుకుంది. ఇద్దరూ కలిసి మెలిసి పెళ్ళి పెద్దలుగా వ్యవహరిస్తూ అందరి ప్రశంసలనందుకుంటున్నారు. వారినలా చూసిన శ్రీనివాసు" దేవుడి పరిష్కారం కల్యాణ ప్రదంగా వుంటుంది అనడానికి వీరి కలయికే నిదర్శనం" అని కొద్ది దూరంలో నిలబడి వున్నపద్మతో చెప్పాలని ఆమె చెంతకు చేరాడు. మంగళ వాయిద్యాల ధ్వనిలో ఆమెకు వినబడేలా చెప్పాలని, యదాలాపంగా ఆమె నడుం చుట్టూ చేయి వేసి, చెవిలో చెప్పబోయాడు. "ఏమిటిది? అందరిలో యిలా." అంటూ పద్మ మృదువుగా అతని చేయి తొలగించి, ఒక్క అడుగు ప్రక్కకు జరిగింది. అలా జరిగిన పద్మ, చుట్టూ చూసింది. అందరూ ఎవరి దోవన వారు కబుర్లు చెప్పుకుంటూ, పెళ్ళి తంతు ను గమనిస్తున్నారు. "అయ్యో! దగ్గరకు వచ్చిన వాడ్ని అనవసరంగా దూరం పెట్టానే" అని అనుకుంది. మొన్ననే ఆమె కొలీగ్ ఆమెకు ఒక హితవు బోధించింది. " తల్లి సర్శకోసం అల్లాడే పిల్లాడిలా మొగవాడు భార్య స్పర్శకోసం వెంపర లాడుతాడు. అందువల్ల నీ మొగుడిని " నాకు స్పేస్ కావాలి, కాస్త ఒక అడుగు దూరం జరుగుతారా " అంటూ గొప్పలు పోకు. అతడు దూరమైతే బాధ పడేది నువ్వే." ఆ హితవచనం గుర్తుంచుకున్న పద్మ, కొద్ది దూరంలో ఒక ప్రక్కగా కూర్చుని , అమాయకంగా దిక్కులు చూస్తున్న భర్త పక్కన కూర్చుని, అతని భుజం మీద తలవాల్చి, " సారీ! ఏ చెప్పాలనుకున్నారు?" అని ప్రేమగా అడిగింది. చంద్రకాంతికి విరిసిన కలువలా అతని ముఖం రాగ రంజితమైంది. అతడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని," నీ ప్రేమే నా ప్రాణం" అన్నాడు. పద్మ మురిసిపోతూ అతని చేయి ముద్దాడింది.

@@@

మానవ సమాజ పోకడలను చూస్తూ 'ఒక్క అడుగు' ఇలా అనుకుంది," ప్రేమ వున్న చోట నేను తరిగి, మాయమవుతాను. ద్వేషమున్న చోట పెరిగి రణక్షేత్రమవుతాను. ఇది ఈ కలికాలంలో నా పాత్ర, నా మనుగడ."

@@@@@

# న్యూటన్ కనుగొనని సూత్రాలు

సూత్రం –7: ఎంతసేపు ఎదురుచూసినా ఎక్స్‌ప్రెస్ బస్సు రాదు తీరా పల్లె వెలుగు ఎక్కాక, వెనకాల ఖాళీగాఎక్స్‌ప్రెస్ బస్సు వెక్కిరిస్తూ వెళుతుంది. –చంద్రకళ.దీకొండ,

సూత్రం –8: మనకు ఒంట్లో బాగాలేదని అనుకున్నప్పుడే పనిమనిషి కూడా సెలవు పెడుతుంది. –ద్విభాష్యం నాగలక్ష్మి

సూత్రం –9: పెళ్ళి కి ముందు పడతి కి ప్రియుని పై ప్రేమ, అతని డెబిట్ /క్రెడిట్ కార్డుల సంఖ్య కి అనులోమానుపాతం లో ఉంటుంది. –వీరేశ్వర రావు మూల

సూత్రం –10 : పరీక్షల సమయంలో నిద్ర ముంచుకొస్తుంది. సెలవుల్లో కంటిమీద కునుకు రాదు. –చంద్రకళ

సూత్రం –11:చెంపకు చేయి పరంబయి నప్పుడు , కంటికి కన్నీరు ఆదేసంబగును –అలేఖ్య

మీరు కుడా మీ అనుభవంలోకి వచ్చిన ఇటువంటి సూత్రాలను రాసి పంపండి ,ఉత్తమమైన వాటిని ప్రచురిస్తాము
e-mail :sumathi.potilu@gmail.com

ఈ నెల కథ

# ★గరగ★

**రెండవ బహుమతి పొందిన కథ**

**డాక్టర్ ఎమ్ సుగుణ రావు**

చాలా సంవత్సరాల తర్వాత ఆ ఊరు వెళుతోంది వరూధిని. అది తమ పూర్వీకుల ఊరు. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు దగ్గర ఒక పల్లెటూరు. తండ్రిగారి ఉద్యోగరీత్యా దేశంలోని చాలా ఊళ్ళు తిరిగి ఢిల్లీలో స్థిరపడ్డారు. ఆయన తన చివరి ఉద్యోగపు జీవితం ఢిల్లీలో ముగియడం, ఇంకా తనూ అన్నయ్యా ఢిల్లీయూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి పిహెచ్.డి.లో చేరడంతో తన తండ్రిగారు దేశ రాజధాని నగరంలో స్థిర నివాసం ఏర్పరచుకొన్నారు. తను ఎమ్ఏ కల్చరల్ స్టడీస్ ప్రధానాంశంగా చేసింది. ఇప్పుడు పిహెచ్.డి.లో తన రీసెర్చ్ ప్రాజెక్టు జానపద కళలు. అందులో భాగంగా కేరళ వెళ్ళింది. అక్కడ 'తెయ్యం' అనే జానపద గ్రామీణ నృత్యం ప్రత్యేకంగా పరిశీలించింది. 'తెయ్యం' నృత్యంలో దేవతామూర్తుల రూపాలతో నృత్యాలు, పూజలు చేస్తారు. రంగురంగుల భారీ కిరీటాలు, అలంకరణలతో కళాకారులు తమ గ్రామ దేవతల ముందు నర్తిస్తారు. ఆ తరువాత తను ఈ తూర్పుగోదావరి జిల్లా వచ్చేసింది. గరగ నృత్యం గురించి తెలుసుకుందామని. తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమ గరగ కళాకారులకు ప్రసిద్ధి.

ఉగాది ముందురోజు పాల్గుణ అమావాస్య నాడు ఇక్కడ అమ్మవారి జాతరలో ఈ గరగ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఆ ఊళ్ళో తమ బంధువుల ఇంట్లో తనకు వసతి దొరికింది. చాలా సంవత్సరాల తర్వాత తను ఆ ఊరు రావడంతో.. వాళ్ళు ఆనందపడ్డారు. రాజమండ్రిలో ఫ్లైటు దిగి కారులో ఆ ఊరు వచ్చింది. కారులో గంటన్నర ప్రయాణం. వరసకు బాబాయ్, పిన్ని అయిన ఆ దంపతులు తనను ఆప్యాయంగా ఇంటిలోకి ఆహ్వానించారు. బాబాయ్ పేరు రాఘవరావు, పిన్ని పేరు విశాలాక్షి. వారికి ఒక్కతే కూతురు. ఇంటర్మీడియట్ చదువుతోంది. పేరు గాయత్రి. ఆ దంపతులిద్దరూ టీచర్లు. వారు తనకో గది కేటాయించేసి, కావలసిన ఏర్పాట్లు చేసి ఆ ఇద్దరూ స్కూలుకు వెళ్ళిపోయారు. ఇక గాయత్రి మాత్రం ఇంట్లోనే ఉంది. తన ఎమ్సెట్ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. ఇంకో ఆరు నెలల్లో పరీక్షలు. ఇక తన ప్రాజెక్టులో భాగంగా.. గరగ నృత్యం గురించి తెలుసుకోవడం గురించి బయలుదేరింది వరూధిని. ఆ ఇంటికి దగ్గరలోనే అమ్మవారి కోవెల. తనతోపాటు చూడడానికి వస్తానని గాయత్రి అడిగింది. ''రామ్మా.. నాకూ తోడుగా ఉంటావు'' అంది. ''అయితే అయితే..'' అంటూ గాయత్రి సంశయపడిరది. వరూధిని ఆశ్చర్యంగా చూసింది గాయత్రి వంక. ''ఈ విషయం అమ్మానాన్నలకు చెప్పకండి.. తిడతారు'' అంది.



''ఎందుకు'' అంది వరూధిని.

''నాకు ఈ గరగ నృత్యం అంటే ఇష్టం. ప్రతి సంవత్సరం అడుగుతాను అమ్మవారి జాతరలో నేనుకూడా గరగ నృత్యం చేస్తానని. 'చదువుకునే అమ్మాయికు నీకెందుకు? నీకు చదువే ముఖ్యం' అంటారు. నీతో వచ్చానని తెలిస్తే తిడతారు'' అంది మెల్లగా.

''సరే నీకు ఇష్టం కాబట్టి నాతో రా.. నేను చెప్పనులే'' అంది వరూధిని. గాయత్రి ఆమెవెంట నడిచింది.

అమ్మవారి గుళ్ళో అప్పటికే చాలామంది మహిళలు గరగ ఆట కళాకారులు, గరగను తయారుచేసే పనిలో పడ్డారు. ఇత్తడి రేకులతో పూర్ణకుంభంలాగా తయారుచేస్తున్నారు. ఆ గరగకి రంగుల నేత చీరలను కుచ్చులుగా పోసి అలంకరిస్తున్నారు. గరగ పీట భాగంలో పసుపు రాశారు. అలాగే గరగలని పూలతో అలంకరిస్తున్నారు. అక్కడున్న ఒక మహిళను అడిగింది వరూధిని..

''ఈ గరగల చారిత్రిక నేపథ్యం గురించి నాకు కావాలి. ఎవరు చెబుతారు'' అంది.

''గుడి పక్కన గణాచారి గారు

ఉన్నారు కూర్చుని, ఆయన చాలా సంవత్సరాలుగా గరగను ఎత్తుకుంటున్నారు.

చాలామంది పిల్లలకు గరగ నృత్యం నేర్పుతున్నారు. ఆయన్ని అడగండి చెబుతారు'' అంది ఒకామె. ఆవిడకు థాంక్స్ చెప్పి, గాయత్రితో ముందుకు కదిలింది వరూధిని. అక్కడ పొడుగ్గా, సన్నగా ఉన్న ఒక పెద్దాయన. ఆయనకి దాదాపు డెబ్బై ఏళ్ళ వయసు పైబడి ఉంటుందేమో.. వంపులు తిరిగిన మీసాలు, జుట్టు బాగా తెల్లబడిరది. సన్నగా గీసిన గెడ్డం. నుదుటిమీద పొడుగ్గా గీసిన బొట్టు.

వరూధిని ఆయనకు నమస్కారం చేసి, ''నేను గరగ నృత్యం గురించి తెలుసుకోవడానికి ఢల్లీనుండి వచ్చాను. నా పిహెచ్.డి.లో ముఖ్యాంశం జానపద నృత్యం'' అంది వరూధిని.

ఆ పెద్దాయన వారివంక నవ్వుతూ చూసి, గాయత్రి వంక తిరిగి, ''అవునా.. గరగ నృత్యం నేర్చుకోవడానికి వస్తానన్నావు గదా'' అన్నాడు.

ఆ మాటలకు గాయత్రి ఏమీ సమాధానం చెప్పకుండా ఊరుకుంది.

''సరేలే.. మీ అమ్మానాన్నలకు ఇష్టం లేనట్టుంది. మీ నాన్నమ్మ చాలా దీక్షగా చేసేది. ఈ గరగాట అనేది శక్తి పూజలో ముఖ్యమైన భాగం. దీనిలో తల్లిని కొలవడం కనిపిస్తుంది. ప్రధానంగా అమ్మవారి ప్రతీకే గరగ'' అన్నాడాయన.

ఆయన మాటలు శ్రద్ధగా వింటూ, ఆ గుడిమెట్ల మీద కూర్చుంది వరూధిని, గాయత్రిని పక్కనే కూర్చోబెట్టుకుంది.

ఆయన చెప్పడం మొదలెట్టాడు.. ''గరగ నృత్యానికి మూలం మహాభారత కాలం అంటారు. ద్రౌపదీ దేవి తన పెళ్ళి సమయంలో సంతోషంగా ఒక ఘటాన్ని ఎత్తి నాట్యం చేసిందట. అదే గరగ నృత్యంగా మారిందంటారు.

అయితే ఇంకో కథ కూడా ఉంది. మహాభారత యుద్ధం ముగిసిన తర్వాత కొంతకాలానికి పాండవుల స్వర్గారోహణ కోసం దేవలోకం నుండి రథం వచ్చిందట.

పాండవులు రథం ఎక్కిన తర్వాత చివరిగా ద్రౌపది రథం ఎక్కబోతున్న సమయంలో తిమిరాసురుడు అనే రాక్షసుడు ఆమెను వెనక్కి లాగాడు. దాంతో కోపం వచ్చిన ద్రౌపది, ఆదిశక్తిగా మారి తన దేహం నుండి వీర కుమారులను సృష్టించింది. అయితే తన శరీరం నుండి కారిన రక్తపు బొట్టుల నుండి మరో వెయ్యిమంది తిమిరాసులు పుట్టేలా ఆ రాక్షసునకు వరము ఉండడంతో, వీర కుమారులు అతన్ని ఏమీ చేయలేకపోయారు. ఆ విషయం తెలుసుకొన్ని ఆదిశక్తి రూపంలో ఉన్న ద్రౌపది తిమిరాసురుని ఒంటినుండి కారుతున్న రక్తపు చుక్కల్ని నేలమీద పడనీయకుండా తాగింది. ఆఖరుకి ఆ రాక్షసుని సంహరించింది. ఆమె తిరిగి ద్రౌపదిగా మారి రథం ఎక్కుతూ ప్రతి సంవత్సరం తొలిమాసం, తొలి పౌర్ణమి నాడు తాను తిరిగివస్తానని భక్తులకు మాటిచ్చి వెళ్ళిపోయింది. తన శక్తిని ఒక కుండలో పదిలపరిచింది. కుండని కన్నడంలో 'కరగ' అంటారు. అలా కరగ నృత్యం ప్రాచుర్యంలోకి వచ్చింది'' అంటూ ఆయన గరగ నృత్యం గురించి చెప్పడం పూర్తి చేశాడు.

వరూధిని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసి, గాయత్రితో ఇంటిదారి పట్టింది. నడుస్తున్న వరూధిని గాయత్రితో అంది..

''మీ నాన్నమ్మవైపువారు గరగ నృత్యం చేసేవారని నాకు తెలుసు. కాని మీ నాన్నమ్మ చేసారని తెలిసి ఆశ్చర్యపోయాను. నువ్వు కూడా నేర్చుకొన్నావా?'' అంది వరూధిని.

''నాకూ ఇష్టమే.. కానీ అమ్మానాన్నలకు ఇష్టం లేదు.'' అంది గాయత్రి.

''ఎందుకని'' అడిగింది.

''చదువు పాడవుతుందని, ఇంకా ఈ పల్లెటూరి నృత్యాలు ఏంటో అని మా అమ్మానాన్నలు దీనికి దూరంగా పెట్టారు''

ఆ మాటలకు వరూధిని ఆలోచనల్లో పడిరది. 'అమ్మవారిని పూజిస్తారు, జాతరలు చేస్తారు గాని, పిల్లలు

ఇలాంటివి చేయడానికి ఇష్టపడితే వారిని ఎందుకు ప్రోత్సహించరో..!' అనుకుంది వరూధిని. అలా ఆలోచిస్తూనే.. ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

తలుపులు తెరిచే ఉన్నాయి. స్కూల్ నుండి ఇంటికి వచ్చిన అమ్మానాన్నలు. వారి ముఖాలు అదోలా ఉన్నాయి. ''ఏం తల్లీ! ఆంటీతో వెళ్ళావా.. రేపు నీకు వీక్లీ టెస్ట్ ఉంది కదా'' అన్నాడు తండ్రి. ''నేనే తీసుకెళ్ళాను, నా బలవంతంమీదే వచ్చింది'' ఆ మాటలకు వాళ్ళు మౌనం వహించారు. ఆరోజు రాత్రి భోజనాలు అయిన తరువాత తన లాప్‌టాప్‌లో గరగ నృత్యం గురించి విన్న విషయాలను టైప్ చేసుకుంటోంది వరూధిని. తర్వాత బెడ్‌మీద నిద్రకు ఉపక్రమించింది. గాయిత్రి చదువుకుంటూనే ఉంది. మధ్యలో దాహం వేసి వరూధినికి మెలకువ వచ్చింది. లేచిన వరూధిని, గాయత్రిని చూసి ఆశ్చర్యపోయింది. గదిలో, తన నెత్తిమీద చిన్న స్టీలు బిందెను పెట్టుకొని చిన్నగా డాన్స్ చేస్తోంది. ఆ బిందె కింద పడకుండా చాలా చక్కగా బ్యాలెన్స్ చేసింది. చాలా ప్రాక్టీసు ఉంటేనే గాని అది సాధ్యం కాదనుకుంది. వరూధినికి అర్థమైంది, గాయత్రికి చాలా బలమైన కోరిక ఉందని. కానీ ఆమె తల్లిదండ్రులు ఎందుకు ఒప్పుకోవడం లేదు? ఏదైనా బలమైన కారణం ఉందా? అనుకుంది. ఆ విషయం మాట్లాడాని అనుకుంటూనే మంచినీళ్ళు తాగి నిద్రపోయింది.



★★★

తర్వాత రోజు ఆదివారం.. గాయత్రి అమ్మానాన్నలకు సెలవు. టిఫిన్లు అయిన తర్వాత గాయత్రి యథా ప్రకారం తన గదిలోకి వెళ్ళి చదువులో నిమగ్నమైంది. గాయత్రి అమ్మానాన్నలు ఇద్దరూ తమ క్లాసు పిల్లల పరీక్షా పత్రాలు దిద్దే పనిలో పడ్డారు.

వరూధిని ఆ దంపతులవైపు తిరిగి ''మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను ఏమీ అనుకోవద్దు'' అంది.

''చెప్పమ్మా పర్లేదు'' అంది విశాలాక్షి.

ఆ సమయంలో.. తల్లి పాలు తాగమని పిలవడంతో గాయత్రి ఆ గదిలోకి వచ్చింది.

''గాయత్రి గరగ నృత్యం నేర్చుకోవడానికి ఆ గణాచారి గారి వద్దకు వెళ్ళేదట, 'ఎందుకు మానేశావు' అని గాయిత్రిని అడుగుతున్నాడాయన. చదువు పాడవుతుందనా, లేక ఇంకేమైనా కారణం ఉందా''

ఆ మాటలకు ఆ దంపతులు ఒక్కక్షణం మౌనం వహించారు. ఆ తర్వాత గాయిత్రి తండ్రి రాఘవరావు చెప్పడం మొదలెట్టాడు.

''మా అమ్మవాళ్ళది గరగాట కళాకారుల కుటుంబం.

వంశపారపర్యంగా
పెద్దవారి నుండి పిల్లలవరూ
అమ్మవారి పండగలప్పుడు
గరగనెత్తుకునేవారు. మా అమ్మ
పూర్వీకుల కులదైవం పోలేరమ్మ.
జాతరలో వారి ఆచారం ప్రకారం
గరగ నృత్యం చేసేవారు. మా
అమ్మానాన్నలది కులాంతర
ప్రేమ వివాహం. మా నానమ్మ
వారి పెళ్ళికి ఒప్పుకోలేదు. తానూ
మంచి భక్తిపరురాలే. అయితే
ఆవిడ సాంప్రదాయం వేరు.
ఆవిడ పూజలు, వ్రతాలు వేరేగా
ఉండేవి. మా అమ్మానాన్నలకు
పెళ్ళైన చాలాకాలం వరకూ ఈ
గరగ నృత్య విషయంలో అమ్మ
నాన్నమ్మతో గొడవ పడేది.
గరగ నృత్య సంప్రదాయాన్ని
వదిలిపెట్టేయమని ఒత్తిడి చేసింది
నానమ్మ. ఇక మా అమ్మ రాజీ
పడి, తన కిష్టమైన ఆ సంప్రదాయ
నృత్యానికి, జాతర్లలో గరగ
ఎత్తే విషయానికి స్వస్తి చెప్పింది.
ఇప్పుడు అమ్మానాన్నలిద్దరూ లేరు.
ఈ గరగ విషయంలో అమ్మ పడిన
దుఃఖం బాల్యంలో నాకు మిగిలిన
చేదు జ్ఞాపకం. తిరిగి నా కూతురు
ఆ సంప్రదాయ నృత్యంవైపు ఇష్టం
పెంచుకోవడం కష్టమనిపించింది.
తనను డాక్టర్ చేయాలని మా
కోరిక. నేటి సమాజంలో ఆధునిక
పోకడలు, రేపు ఈమెను పెళ్ళి
చేసుకోబోయే అబ్బాయికి ఇవన్నీ
ఇష్టం లేకపోతే ఇబ్బంది కదా.
అంత్య నిష్ఠూరం కంటే ఆది
నిష్ఠూరం మేలు. అందుకే నా
కూతురికి ఇష్టమైన ఈ గరగ
నృత్యాన్ని వద్దనుకున్నాం'' అన్నాడు
గాయత్రి తండ్రి.

ఆ మాటలకు వరూధిని ''అయ్యో''
అంటూ నిట్టూర్చింది.
వారి వంక పరిశీలనగా చూసి
చెప్పడం మొదలెట్టింది.

అయితే ఆదరణ లేక,
అవకాశాలు రాక.. తమకు పెట్టిన
ఆంక్షలు, పరిమితుల్లో నుండి
బయటపడలేక ఎంతోమంది
ఆడపిల్లలు తమ కళల్ని, కోరికల్ని
అణచుకొంటున్నారు. అలాగే
గాయత్రి నానమ్మ కూడా. ఇప్పుడు
గాయిత్రి బాగా చదువుకొంటోంది.
డాక్టర్ అవుతుంది. తనకు
చదువు వల్ల వచ్చే స్ట్రెస్‌ని దూరం
చేసుకోవడానికి నానమ్మ
వదిలేసిన గరగ నృత్యాన్ని
నేర్చుకోవాలనుకుంటోంది.
ఇదేమీ తప్పుకాదు. అది మీకూ
తెలుసు. భవిష్యత్తు గురించిన
అనవసరమైన ఆందోళనతో
ఆమె కోరిన చిన్న కోర్కెను మీరు
నిరాకరించడం బాగోలేదు.
రాత్రి నేను ఈ అమ్మాయి దీక్షగా
చేసిన గరగ నృత్యం స్వయంగా
చూశాను. తనలో ఉన్న ఈ
బలీయమైన కోర్కెను, మొగ్గలోనే
తుంచేయకండి. ఆడపిల్ల
అభీష్టాన్ని నెరవేర్చండి'' చెప్పడం
ముగించింది వరూధిని.
ఆ మాటలకు ఆ దంపతులిద్దరూ
తమ కూతురు గాయత్రి తలను
ప్రేమగా నిమిరారు. ''సరే
మంచిరోజు చూసుకుని, గణాచారి
గారి దగ్గరకు నిన్ను పంపిస్తాను''
చెప్పాడు గాయత్రి తండ్రి.
గాయత్రి మెల్లగా అడుగులు
వేసుకుంటూ ఆ గదిలోంచి
ముందుకు కదిలింది. ఆ
సమయంలో వరూధినికి
గరగనెత్తుకొని ముందుకు
కదులుతున్న అమ్మవారిలా
అనిపించింది ఆమె.

★★★

సీరియల్



# మమతల తరంగాలు



పాండ్రంకిసుబ్రమణి

ఆ రోజు ఉదయమే కమీషనర్ గారు పెర్ఫార్మెన్సు రివ్యూ మీటింగ్ పెట్టారు.ఐ టీ కేసులు యెన్ని పెండింగులో ఉన్నా యి–యెన్ని కేసులు అసెస్ చేసారు–యెంత మంది ఐటీ కట్టాల్సిన వాళ్ళు మిగిలి ఉన్నారు–వాళ్ళలో యెంతమంది ప్రభుత్వ సెక్టార్–ఎంతమంది ప్రైవేటు సెక్టార్–ఇంకా వాళ్ళనుండి రావలసిన అసెస్డ్ డ్యూస్ రాబట్టుకోవడానికి యేవిధమైన చర్యలు తీసుకున్నారు–ఇకపైన యెప్పుడెలా తీసుకోబోతున్నారు–ఇవన్నీ కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు కమీషనర్ గారు. రివ్యూ మీటింగు చివరన హాజరయిన వాళ్ళందరికీ పెండింగ్ లిస్టు అందచేసి స్నేక్సూ కాఫీలు యిచ్చారు.ఎదుర్కుంటూన్న వర్కులోడ్ ని సబాళించడం కంటే ఈ రివ్యూమీటింగునుండి బయటపడటమే ప్రీతికి బరువుగా తోచింది.రివ్యూ ప్రొసీడింగ్సుని నెమరు వేసుకుంటూ తన గదికి చేరుకున్న తరవాత పర్సనల్ ప్యూను వచ్చి చెప్పాడు ఆమె కోసం యెవరో వెయిటింగ్ రూములో కూర్చున్నారని.



# ఫ్యామిలీ సీరియల్



**జరిగిన కథ**

శారద ,పూర్ణ చందర్ దంపతులు. శారదకు నాలుగు కాన్పుల్లో కుడా ఆడపిల్లలే పుట్టటం తో అత్త బద్రమ్మ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెడుతూ ఉంటుంది . శారద తల్లి చంద్రావతి మనుమరాళ్ళను చూడటానికి వస్తే ఆమెను కూడా నానా రకాల మాటలతో ఇబ్బంది పెడుతుంది . శారద సహనం కలది కాబట్టి ఏ గొడవలు లేకుండా కాపురం నెట్టుకొస్తోంది .చాల రోజుల తరువాత శారద అన్నయ్య ఫోన్ చెయ్యటం తో శారద ఆనందానికి అవధులేకుండా పోతాయి .పూర్ణ చందర్ ఫాక్టరీలో స్ట్రైక్ చేయించాడని ఉద్యోగంలో నుండి తీసివేస్తారు .శారద అన్న వివేక్ ,శారద ఇద్దరు కూతుళ్ళను తన దగ్గర చదివించటానికి తీసుకువేళతాడు .వివేక్ స్నేహితుడు గణేష్ అతని భార్య చనిపోవటం తో అతని కూతురు ప్రశాంతిని ఇంటికి తీసుకువస్తాడు

**ఇక చదవండి**

అప్పుడు ప్రీతి అడిగింది రిసెప్షన్ కౌంటర్ వాళ్ళిచ్చిన స్లిప్పేదని. “అతను ఐటీ పనిపైన వచ్చినట్లు లేదు మేడమ్!మీ బంధువులా ఉన్నారు”ప్యూను బదులు విని అలాగా అన్నట్టు తలూపుతూ అతణ్ణి వెంటనే తన వద్దకు పంపించమంది. మరి కాసేపట్లో“మే ఐ కమిన్ మేడమ్!”అంటూ రాఘవేంద్రరావు నవ్వుతూ నిల్చున్నాడు.ప్రితి ఆశ్చర్యపోతూ చూసి అంది–“నువ్ వాబావా!నమ్మలేకపోతున్నాననుకో–వచ్చి కూర్చో!”

“నేను నీ పనికి అంతరాయం కలిగించడానికి రాలేదు.ఒక మాట చెప్పిపోవడానికి వచ్చాను” “అలాగే చెప్పువుగాని——ముందు కూర్చో!” అంటూ లేచి రాఘవ్ చేతిని అందిపుచ్చుకుని యెదురుగా కూర్చోబెట్టింది.అతడు కూర్చున్న వెంటనే చెప్పడానికి నోరు తెరవబోయాడు––“ఆగాగు!” అంటూ ప్యూను వేపు చూసిందామె. అతడు వెంటనే ఫ్లాస్కు నుండి కాఫీ పోసి ప్లేటులో బిస్కట్లు ఉంచి రాఘవ్ ముందు పెట్టాడు.అంతలో మరొక యంగ్ లేడీ ఆఫీసర్–హాయ్–అంటూ ప్రవేశించి ప్రీతిని కళ్ళతోనే అడిగింది–యెవరితనని.“అదే––అతనే!నేనొకసారి చెప్పలేదూ!“అని బదులిచ్చింది ప్రీతి.

“ఓ!అతనేనా!ఐతే——నేను మళ్ళీ వస్తాను.గుడ్ లక్”అంటూ ఆమె వచ్చిన అదే వేగంతో వెళ్ళిపోయింది. రాఘవ్ అయోమయంగా చూసాడు. అతడికేమీ బోధపడలేదు.”ఇప్పుడు దాని కోసం ఆరా తీయడం యెందుకులే!“అని మనసున తలపోస్తూ బల్లమీదు న్న బిస్కట్లూ కాఫీ తీసుకుని సంభాషణలోకి దిగాడు–“చూడు ప్రీతీ——నీకు బోలెడంత పనుంటుంది,చెప్పి వెళ్ళిపోతాను.అదే మంటే——“ అని చెప్పబోయేంతలో ఆమె మళ్ళీ ఆపింది.”అదేమిటి——అన్నాళ్ళ తరవాత కనిపిస్తున్నావు.మరదలు పిల్లను చూసి న ఫీలింగే లేనట్టు ప్రవర్తిస్తున్నావు.అంతలావు బిజినెస్ టైపులో మాట్లాడకు. బాధగా ఉంది బావా!” అతడు మళ్ళీ అయోమ యంలో పడ్డాడు.అమ్మాయిలు చిన్న చిన్న విషయాలకు ఎమోషనల్ అయిపోతుంటారని తనకి తెలుసు.మరి——తనింతకూ యేమన్నాడని ప్రీతి అంత లావు బాధ పడిపోవడానికి–– “ఓకే ఓకే!నేను సావకాశంగా మాట్లాడే వెళతాను.ఇక అసలు విషయా నికి వచ్చేదా?”ఉఁ అందామె.“నువ్వంటే——అమ్మకూ నాన్నకూ యిష్టం ప్రీతీ.––ఇది నాకు తెలుసు.నువ్వక్కడికి–అంటే మీ వాళ్ళింటికి వెళితే అత్తయ్యకూ మామయ్యకూ వత్తాసుగా ఉంటుందనే నిన్ను పంపించారు. నువ్వేదో ఊహించుకుని మనసు పాడుచేసుకోకు.వాళ్ళు యెదురు చూసిన ఎండ్ రిజల్ట్ అదే కదా!అదీ నువ్వు గుర్తు పెట్టుకోవలసిన పాయింటాఫ్ ఆర్డర్.

ఇక నేను వెళతాను"అని లేచాడు రాఘవ్.ప్రీతి కూడా చట్టున లేచి అతడి చేతికి ఐదొందల నోటు అందించ బోయింది. అతడు తెల్లబోతూ –"ఇదెందుకూ!"అని అడిగాడు."ఒక రోజు నేను కాలేజీ యెగ్జామ్ కి ఆదరా బాదరాగా వెళ్తున్నప్పుడు నాకు నువ్వు రెండువందలిచ్చావు ఆటో రిక్షాలో వెళ్ళడానికి" రాఘవ్ బిగ్గరగా నవ్వుతూ "చోడో యార్!"అంటూ కదలబోయాడు. అప్పుడు ప్రీతి "బావా!"అని పిలిచింది.అతడాగి వెనక్కితిరిగి చూసాడు."మళ్ళీ యెప్పుడొస్తావు బావా!"

"ఎందుకూ?నీ అఫీషియల్ ఫంక్షన్సకి అంతరాయం కలిగించడానికా!తాను చెడ్డ కోతి వనమంతటినీ పాడు చేసిందన్న చెడ్డ పేరు సంపాదించడానికా!" అంటూ నవ్వుతూ బైటకు వెళ్ళిపోయాడు రాఘవేంద్ర,రూపాయి నోటు తీసుకోకుండానే-- ఆరోజు మోర్నింగ్ కాఫీ తాగుతూ ప్రశాంతిని పిలిచాడు సూర్యవివేక్. అప్పుడు హాలులో కూర్చుని దిన పత్రిక చూస్తూన్న పావని తలెత్తి చూసి అడిగింది–"ఏం కావాలండీ!చెప్పండి తెచ్చిస్తాను" భార్యవేపు నవ్వుతూ చూసి "అదేమీ లేదు.ప్రశాంతితో మాట్లాడాలి" అప్పుడక్కడకు ప్రశాంతి రానే వచ్చింది–"పిలిచారా మామయ్యా!" అంటూ-- "ఔను.పిలిచాను.ఇది చెప్పు. నువ్వు చదువుతూన్న కాలేజీకి మంచి రిప్యుటేషన్ ఉంది.ఈ పాటికి పెద్ద కంపెనీలు చిన్నకంపెనీ లూ కలసి కట్టుగా క్యాంపస్ ఇంటర్వ్యూలు చేస్తుండాలి.నువ్వెందుకు అప్లయ్ చేయడం లేదు?"

"అబ్బే——రెండు మూడు కంపెనీలకు అప్లయ్ చేసి వాళ్ళు జరిపిన ఫేస్ టు ఫేస్ టు ఇంటర్వ్యూలకి హాజరయాను కూడా—— మరెందుకో వాళ్ళు నన్ను యెంపిక చేయలేదు" అతడు కళ్ళు పెద్దవి చేసుకుని తేరిపార చూస్తూండిపోయాడు."నువ్వు అబద్ధా లు కూడా ఆడతావన్నమాట!నీగురించి నేనేమో అనుకున్నాను"ఆమాటతో పావని దిగ్గున లేచి వచ్చి భర్త ప్రక్కన కూర్చుని– "ఏమైందండీ!" అని అడిగింది."ప్రశాంతి నా వద్ద అబద్ధాలాడుతుందోయ్!" "అబ్బే——ప్రశాంతి అటువంటి పిల్ల కాదండీ!ఇంతకీ యే విషయంలో బద్ధాలాడుతుందంటున్నారు?" "క్యాంపస్ ఇంటర్వ్యూలకు అప్లయ్ చేయకుండా హాజరు కాకుండానే యెంపిక కాలేదని బుకాయిస్తుంది" పావని ఆశ్చర్యంగా ప్రశాంతి వేపు చూసింది.ప్రశాంతి తల వంచుకుని నిల్చుంది నోరు మెదపకుండా-- "ఆ పిల్ల తరపున నేను చెప్తాను. నిన్న వాళ్ళ క్లాసుమేట్ సరోజినీ వాకింగ్ కి వెళ్తున్నప్పుడు కనిపించి తను క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్టయినట్టు చెప్పింది. అప్పుడడిగాను ప్రశాంతి గురించి.ప్రశాంతి బ్రిలియంట్ స్టూడెంటు.అదెలా సక్సెస్ కాకుండా ఉంటుందని అడిగాను.దానికి సరోజి నీ బాంబ్ పేల్చింది—— ప్రశాంతి ఇంతవరకూ ఒక్క క్యాంపస్ ఇంటర్వ్యూకి కూడా అప్లయ్ చేయలేదట.ఇప్పుడేమో అప్లయ్ చేసిన ట్టు–అందులో వైఫల్యం పొందినట్టు చేప్తూంది. ప్రశాంతి లేనిది ఉన్నట్టు చెప్పి నన్ను కించపరిచింది" ఆ మాట విని పావని విస్తు పోయినట్టు చూసింది ప్రశాంతి వేపు.ప్రశాంతి మాటా పలుకూ లేకుండా కన్నీరు కారుస్తూ నిల్చుంది."కారణం చెప్తేనే కదా వాస్త వం తెలుస్తుంది"పావని గొంతు హెచ్చించి అడిగింది. ఈసారి ప్రశాంతి పరుగున వచ్చి సూర్యవివేక్ ముందు మోకరిల్లింది. "క్షమించండి మామయ్యా!తప్పు చేసాను" వివేక్ అయోమయంగా చూస్తూ అడిగాడు–"అదే అడుగుతున్నాను–యెందుకు అలా చెప్పావని--" ఆమె యింకా కన్నీరు కారుస్తూనే అంది– "నాకు తెలుసు మామయ్యా——నేను క్యాంపస్ ఇంటర్వ్యూలో సక్సీడ్ ఔతానని– ఉద్యోగం దొరుకుతుందని.కాని కచ్చితంగా ఉద్యోగం మరొక ఊళ్లో దొరుకుతుంది.అప్పుడు మీకందరకూ దూరమయి ఒంటరిదానినయిపోతాను. నాకు మీరు తప్ప మరెవ్వరున్నారు చెప్పండి. నేనిదంతా బావకు చెప్పాను" అప్పుడు సూర్యవివేక్ అడ్డు వచ్చి యేబావకని

అడిగాడు."చిన్నబావ సాయికృష్ణకు. ఆరోజు కాలేజీలో నన్ను యిద్దరు రోడ్ డెవిల్స్ యాగీ చేస్తున్నారని చెప్తి మీరొచ్చి వాళ్ళను అటకాయించి బెదిరించి పంపించారు.వాళ్ళు మళ్ళీ నా దారికి రాకుండా చేసారు. ఇదే సంఘటన నాకు మరొక చోట యెదురైతే నన్నెవరు కాపాడుతారు మామయ్యా!జరిగితే నేనెవరి వద్దకు వెళ్ళి చెప్పుకోనూ--" సూర్యవివేక్ అంతా విని చిన్నగ నవ్వాడు. నవ్వుతూనే ప్రశాంతిని లేవనెత్తి ప్రక్కన కూర్చుండబెట్టాడు."ఎప్పుడో యేదో జరుగుతుందని ఊహించుకుంటూ బెంబేలు పడిపోతూ కూర్చుంటే మనుగడ యెలా సాగుతుంది ప్రశాంతీ!సమయం వస్తే నీకు నీవుగా వీటిని యెదుర్కోవడానికి సంసిద్ధురాలవాలి.ఇది రుద్రమ దేవి–ఝాన్సీరాణి పుట్టిన పుణ్యభూమని వీరభూమని మరచిపోవద్దు రేపు నీకు పెళ్ళయినా నీ ప్రక్కన నీ భర్త అనవరతం కాచుక్కూర్చుంటాడని యెదురు చూడకూడదు" ఆ చివరి మాటకు ప్రశాంతి ఠఫీమని స్పందించింది– "బావ నన్నలా ఒంటరి దానిని చేసి వెళ్ళడు మామయ్యా!"అతడు కూడా రవంత విలంబిత కాలానికి తావివ్వకుండా అడిగాడు– యే బావని--అప్పుడు పావని నవ్వుతూ కలుగచేసుకుంది– "ఇంకెవరు?వాళ్ళ చినబావ– సాయికృష్ణ." సిగ్గుతో మొగ్గలా ముడుచుకున్న ప్రశాంతిని ఆశ్చర్యంగా చూసాడు వివేక్.

"సరే--అదలా ఉంచు. మెయిన్ పాయింటుకి రా!ఇంతకీ నీ ఫ్యూచర్ ప్లానాఫ్ యాక్షన్ యేమిటి ప్రశాంతీ?సెంట్రల్ సర్వీసు లేక స్టేట్ సర్వీసు పోటీ పరీక్షలకు కూర్చుంటావా ప్రీతిలా—— నిన్ను కూడా కోచింగ్ సెంటర్ లో చేరుస్తాను.గవర్నమెంటు సర్వీసు అన్ని విధాల మంచిది—— ముఖ్యంగా స్త్రీలకు-- "ఆమె తల అడ్డంగా ఆడిస్తూ కాసేపు ఊరుకుండిపోయి బదులిచ్చింది– "నేను టీచర్ ఉద్యోగానికి అప్లయ్ చేయబోతున్నాను మామయ్యా!" "అదెలా వీలవుతుంది?బి యెడ్ ప్యాసవాలిగా!" "దానికీ మనకొక మార్గం ఉంది మామయ్యా!ఇక్కడకి ఊరి పొలిమేరన ఒక పెద్ద ప్రైవేటు హైస్కూలు ఉంది.దానికి ఊరంతటా బ్రాంచీలున్నాయి. వాళ్ళకు స్వంతంగా టీచర్ ట్రైనింగ్ అకాడమీ ఉంది.ఇంతవరకూ నేను సాధించిన ప్లస్ స్కోరు చూసి నాకు అందులో ట్రైనింగ్ యిచ్చి టీచర్ ఉద్యోగం ఇస్తామన్నారు. నేను సాధించిన గ్రేడేషన్ చూసి నాకివ్వబోయే జీతానికి స్పెషల్ ఇన్క్రిమెంటులు జోడించి చేర్చుకుంటామన్నారు మీగురించీ అత్తయ్య గురించీ చెప్తే మిమ్మల్ని ఓసారి వచ్చి వెళ్ళ మన్నారు.నాకు గార్డియన్ మా మామయ్యగారేనని, ఆయన ఒప్పుకున్న తరవాతనే చేరుతానన్నాను"

"ఇంతవరకూ-- ఓకే!మిగతాది తరవాత మాట్లాడి తేల్చుకుందాం.ఇప్పుడు నువ్వెళ్ళి మా యిద్దరికీ మంచి కాఫీ చేసి పట్రా——" ప్రశాంతి అలాగే—— అంటూ లేచి లోపలకు నడిచింది. అలా తలవంచుకుని వెళ్తూన్న ప్రశాంతిని తదేకంగా చూడసాగింది పావని. ఆమె మనోనేత్రం ముందు ఆడపడుచు శారద రూపం మెదలసాగింది.సూర్యవివేక్ యెంత సూటిగా మరెంత స్పష్టంగా చెప్పాడు చెల్లికి గోడమీది గీతలా——తమ అదుపాజ్ఞలలో లేని విషయాలపైన యేవిధమైన వాగ్దానమూ చేయలేనని—— దేవుడా! పెద్ద కూతు రు గ్రాడ్యేషన్ పూర్తిచేసి ప్రయోజకురాలై ఉన్నత హోదాలో కుదిరి ఆడపడుచు ఇంటికి హుందాగా చేరింది. అంతవరకు తనకు యేధోకా ఉండదేమో!ఇకపైన ప్రితిని పెళ్ళి చేసుకోవడానికి కంప్యూటర్ మాష్టర్లూ బిజినెస్ యెక్సగ్యూటివ్ లూ క్యూ కట్టరూ!ఇక మాన్విత సంగతే చూడాలి.నిజానికి పొరపాటంతా తనపైనే ఉంది.తనే కదా శారదకు ధీమాగా కూతుళ్ళిద్దరినీ కోడళ్ళుగా చేసుకోవడానికి శాయ శక్తులా ప్రయత్నిస్తానని మాటిచ్చింది– –తన ప్రాణ స్నేహితురాలితో వియ్యంకురాలిగా బంధుత్వం పెంచు కోవాలని తనలోనూ ఆ కోరిక నిజంగానే సహజంగానే పుష్పించిందన్నది వాస్తవం.కాని —— ఇప్పటి పోకడ చూస్తుంటే పరిస్థితులు వేరే దిశ వేపు వెళ్తు న్నట్టున్నాయి. కాదు——పరిస్థితులు తనను యెక్కడికో లాక్కుపోతున్నట్లున్నాయి.

--------

శారీరక మానసిక పరమైన కెమిస్ట్రీ ఉద్వేగ పూరిత కళారంగంలో దగ్గర దగ్గరగా

మెసలే కథానాయికా నాయకుల మధ్యే కాదు.అప్పుడప్పుడది ఒకరికి ఒకరు దూరంగా ఉంటూ-- జీవన స్రవంతిలో యెడంగా కనిపించే యువతీ యువకుల మధ్య కూడా కుదురుతుంది– ఉదయకాలాన మంచులో తడిసి మౌనంగా వికసించే మల్లెమొగ్గలా– –అది యెక్కడ నుండి యెలా ఆరంభమవుతుందో–యెక్కడి వరకూ సాగి యెప్పుడు పరిపూర్ణత్వం సంతరించుకుంటుందో చెప్పడమే కష్టం.

మొదటిసారి కామేశ్ యింటికి వచ్చి మాన్వితతో కలుపుగోలుతనంతో మాటలు కలిపి పరామర్శించినప్పుడు అదేదో స్నేహ పూర్వక తొలి తుంపరనుకున్నారిద్దరూ-- కాని,వాళ్ళిద్దరి మధ్యా ఊహల గుసగుసలు వయసు పరిమళాలు చిగురించి చిలక రించుకుంటాయని యెవరూ ఊహించి ఉండరు.మొదట చిర్నవ్వు పలకరింపు ఆ తరవాత చిక్కటి మోహనకర చిలకరింపు– అంతే కదా వయసులోని ఊసులు– ఊహల్లోని రంగుల విహంగాలు!

ఒకరోజు మాన్విత వైట్ ఫ్లవర్సు రోడ్డు ఓరమ్మట బస్సుదిగి నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు ఆమె ప్రక్కగా బెంజ్ కారు వచ్చి ఆగింది.అందులోనుంచి కామేశ్ తల చూపిస్తూ అన్నాడు–“హాయ్ మాన్వితా!గుడ్ మోర్నింగ్!” ఆమె ఆశ్చర్యంగా రెప్పలల్లార్చుతూ చూసి అంది–“వెరీ గుడ్ మోర్నింగ్!అదేమిటి ఈ రోజు ఈ దారమ్మట వెళ్తున్నారు?కారణం తెలుసుకోవచ్చా!“

“మీకు తోచినట్లు ఊహించడానికి మీకు పూర్తి హక్కులున్నా మీరనుకున్నది మాత్రం సరైనది కాదు,నేను ప్రతిరోజూ మా కంపెనీకి వెళ్ళే దారి ఇదే!అదేమి విచిత్రమోగాని మీరు ఒక్కసారి కూడా కనిపించలేదు. ఈరోజు లేచిన వేళా విశేషం అనుకుంటాను.అందుకే కమల పుష్పంలా కనుల పండువుగా కనిపించారు,రండి——వచ్చి కూర్చోండి”

“నో థేంక్స్.కాలేజీ దగ్గరే–ఇక వెళతాను”

“మరీ మొహమాట పడకండి. క్యాంపస్ లోపలకు వెళ్ళాలి కదా!నేను దిగబెట్టేసి వెళతాను”
“నాకోసం మరీ ఫీలవకండి మహానుభావా!ఆ పాటి నడక కూడా లేకపోతే ఆరోగ్యం యేం బాగుంటుంది?ఇక సెలవు” అంటూ ఆమె ఫుట్ పాత్ వేపు సాగిపోయింది.కామేశ్ తగ్గలేదు.“రేపు ఇదే సమయానికి కనిపిస్తాను.ఓకే!”

“మిమ్మల్ని కనిపించకూడదనడానికి నేనేమి గస్తీ పోలీసునా!”అంటూ ఇక వెనక్కి తిరిగి చూడకుండా కాలేజీ క్యాంపస్ వేపు వేగంగా నడిచింది మాన్విత.నడుస్తూ వెళుతూన్న మాన్వితను అలా దూరాన కారులోనుండి చూస్తూనే అనుకున్నాడతను– “సన్నటి చక్కటి నడుము. ఊయలలా ఊగే వయ్యారపు నడుము,తనువెల్లా ఒంపు సొంపుల్ని వెల్లి విరిసే యవ్వనపు వడ్డాణం వంటి నడుము–మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే నడుము!” ఏమిటో మరి——లేత వయసు అమ్మాయిల్ని చూస్తే కవిత్వం తాను గా పొంగి పొర్లుతుంది సుమా!మరి--ఇంత వరకూ తనకెప్పుడూ యెక్కడా ఇంతటి భావోద్వేగం పొంగలేదుగా! మాన్వితలో యేదో ఉంది.అదేదో తనకు అంతు తెలియకుండా ఉన్నది.ఏది యేమైనా దాని లోతు తెలుసుకోవాలి.

మరునాడు కామేశ్ అదే టైముకి అక్కడకు వచ్చాడు. కాని కారులో రాలేదు.రొటీన్ గా మాన్విత దిగే బస్టాపు వద్ద నిల్చు న్నాడు.అతణ్ణి అక్కడ చూసి విస్తుపోయింది.అప్పుడక్కడామె యేమీ అనలేదు.మాటలు కలపలేదు.కాసేపు అతడితో కాస్తంత దూరం నడచి అంది– “ఏమిటిది కామేశ్!మనమిలా కలసి నడవడం చూస్తే లెక్చరర్లు యేమనుకుంటారు?ముఖ్యంగా మా మామయ్యగాని అత్తయ్యగాని చూస్తే యేమనుకుంటారు?”
“ఏమనుకుంటారో——నాకు తెలీదు.నువ్వే చెప్పాలి”
ఆ మాటకామె తీక్ష్ణంగా చూసింది.“ఏమిటీ ధిక్కార స్వరం.అతి తెలివితేటలు చూపిస్తున్నారా!”కామేశ్ పెదవుల్ని



# ఫ్యామిలీ సీరియల్



బిగుంచుకుంటూనే ఆకాశంలోకి చూపులు నిలిపి అన్నాడు– “ఒకసారి నీ మనోనేత్రాన్ని విప్పి చూస్తే తెలుస్తుంది నేను చూపించేది తెలివితేటలు కాదని—— తెరిచి చూపిస్తున్నది హృదయ కవాటాలేనని——“

“ఎంతటి మగాడివైనా మనిషికి కాస్తంత హద్దుండాలి. మీనాన్న మామయ్యకు ఫ్రెండని గుర్తుంచుకోవాలి.ఇంతకీ మీ కారేది?”

“తేలేదు.నీలా బస్సులోనే వచ్చాను. కారులో వస్తే మాటలు కలపకుండా పెడముఖంతో రివ్వు రివ్వున వెళ్ళిపోతున్నావుగా!”

“అంటే——నేను నీతో మాటలు పెంచకుండా ఉంటే నాలాగే ప్రతిరోజూ బస్సులో వస్తావన్న మాట!అర్ యు షుయర్?” అతడు తలూపుతూ ఆమె చేతికి చాక్లెట్ బార్ అందించాడు.ఆమె దానిని చటుక్కున అందుకుని రివ్వున మలుపు తిరిగింది కాలేజీ క్యాంపస్ లోపలకి–‘ఇదెక్కడి సభ్యత? థేంక్స్ చెప్పకుండానే వెళ్ళిపోతున్నావు!“ “సభ్యతా పరుడెవ్వడూ ఆడదానిని అర్థించి థేంక్స్ తీసుకోడు!”అలాగా– అంటూ అతను వెనుతిరిగాడు తలూపుతూ——

ఆ తరవాత కామేశ్ మూడు రోజులపాటు కాలేజీ దరిదాపున కనిపించలేదు.మాన్వితకు మొదటి రోజు యేమీ అని పించలేదు గాని,రెండవ రోజు ఆమె కళ్ళు ఆమెకు తెలియకుండానే వెతకనారంభించాయి.కళ్ళతో బాటు ఆమె మనసు కూడా వెతకనారంభించింది.ఆ మూడు రోజులూ ఆమె కలత నిద్రకు లోనైంది.ప్రణయారాధన ముందు ఆడది ఆదిలో యెంతటి బిగువు చూపించినా చివరన తీవెలా నచ్చిన వాడిని చుట్టుకు పోవలసిందేగా! ఇదేగా ప్రణయరాగంలోని మృదు మధుర భావస్రవంతి!

నాల్గవరోజు ఆకాశంలోనుంచి ఊడిపడ్డట్టు కామేశ్ కారుతో మాన్విత ముందు ప్రత్యక్షమయాడు.ఎదురొస్తూనే తనకు తాను సంజాయిషీ చెప్పుకున్నాడు–“మూడురోజులు నాన్నాగారితో ముంబాయి బిజినెస్ మీట్ కి వెళ్ళాను.నీకు ఫోను చేయా లంటే నా వద్ద నీ ఫోను నెంబర్ లేదు.ఆరోజు మీ యింట్లో యధాలాపంగా అడిగాను కూడా——నువ్వివ్వలేదు.పద!” ఆమె బిత్తర పోయి చూస్తూ అడిగింది–యెక్కడికని.“చెప్తాను. ముందు కారెక్కు–“ఆమె అయోమయంగా చూస్తూ అంది “నాకు క్లాసుంది–” “తెలుసు.కాలేజీలో క్లాసు కాకపోతే మరేముంటుంది? పది నిమిషాలలో నిన్ను కాలేజీ వద్ద దిగబెడ్తాను.నన్ను నమ్ము–“అంటూ చేయి పట్టుకుని కారు ఫ్రంట్ సీటు వేపు నడిపించాడు.ఆ తరవాత డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళి కాఫీ–డే షాప్ ముందు కారు నిలబెట్టాడు. చేతిలోని నోట్ పుస్తకాలను కుదురుగా సర్దుకుంటూ అతడితో బాటు నడచి షాపు ఓరన సీట్లో కూర్చుంది మాన్విత.అప్పుడతను రెండు కాఫీకప్పులకు ఆర్డరిచ్చి జేబులో నుంచి చాక్లెట్ బార్ తీసి అందించాడు.ఆమె తెల్లబోతూ చూసి అంది–“మరొకటా!” “ఔను.కారణం ఉంది.నాన్నగారు నన్ను తన మాతృమూర్తి మైనింగ్ కంపెనీలో డైరక్టర్ చేయబోతున్నారు.అందుకని యిది——“ “కంగ్రాట్స్ అండ్ థేంక్స్!”

”అంతేనా!చేతులు కలపవా!“ ఆమె వెంటనే స్పందించలేదు. ఓపారి అతడి కళ్లల్లోకి తదేకంగా చూసి సీట్లోనుండి లేచి చేతులు కలిపింది.“థేంక్స్–మెనీ థేంక్స్——త్వరగా కాఫీ తాగు. నిన్ను కాలేజీ వద్ద దిగబెట్టి బ్యాంకు హెడ్ క్వార్టర్సుకి వెళ్ళాలి.అమ్మ యెదరు చూస్తుంటుంది”ఆమె అర్థరహితంగా చూసి–“అమ్మ వద్దకా!ఎందుకు?”అని అడిగింది. “ఓ!నీకు తెలియదు కదూ!అమ్మా మావయ్యా కలసి సౌజన్య బ్యాంకుని నడుపుతున్నారు.అదిప్పుడు లైమ్ లైట్ లోకి వచ్చిన ప్రైవేటు బ్యాంకు.అమ్మకు వత్తాసుగా ఆ బ్యాంకు వ్యవహారాలు కూడా చూసుకోవాలి.అమ్మకు కచ్చితనం యెక్కువ. నా కోసం యెదురు చూస్తుంటుంది “మాన్విత ఆశ్చర్యంగా చూసింది.ఈ చిన్న వయసులో ఇతనంతటి బిజీ బిజినెస్ మ్యానా!ఆమె నమ్మలేనట్టు చూసి కాఫీ తాగడం పూర్తి చేసింది.అతడు కూడా కాఫీ తాగడం పూర్తి చేసి

బిల్లు చెల్లించి కారు వేపు నడుస్తూ అన్నాడు–"కాఫీ బాగుంది కదూ!"
"ఔను.నిజంగా బాగుంది కామేశ్!"
" ఇప్పటిలాగే-- రానున్న రోజుల్లో చిక్కటి మన స్నేహంలా—— " ఆమె యేదో అనాలని ఆపుకుని చిన్నగ నవ్వి కారులో కూర్చుంది. తను గాని యేదైనా అంటే,దానిని నెగటివ్ గా తీసుకుని మరొక మూడురోజులు కనిపించకుండా పోతాడేమో! ఆమెకి బాగా స్పష్టమైంది;తన మనసిప్పుడు తన వద్ద లేదని——నిలకడగా నిలవడం లేదని--

--------------

ఉదయం పదవుతూంది. చేంబర్ నలుమూలలా ఉంచిన ఇంటీరియర్ పూలమొక్కలు సన్నిటి పల్చటి సువాసనల్ని వెద జల్లుతున్నాయి. కామేశ్ తండ్రి ముందు కూర్చుని కొత్తగా లీజుకి తీసుకోబోయే మైనింగ్ ప్రోజెక్టు ఆనుపానుల గురించి చర్చిస్తు న్నాడు.అనురాధ కూడా వాళ్ళ ప్రక్కన కూర్చుని వింటూ ముఖ్యమైనవి మిస్ అవనివ్వకుండా నోట్ చేసుకుంటూంది.ముగ్గురి ముందూ కాఫీ కప్పులున్నాయి.కాని యెవరూ వాటిని ముట్టుకోకుండా చర్చల్లో నిమగ్నమై ఉన్నారు. అప్పుడు భరద్వాజ్ బల్ల మీదున్న ల్యాండ్ లైన్ మ్రోగింది.హల్లో– అంటూ అందుకున్నాడతను. కాసేపు మాట్లాడిన తరవాత అతడు సీట్లోనుండి లేచి నిల్చున్నాడు. కామేశ్ ఆశ్చర్యంగా చూసాడు. మాతృమూర్తి కంపెనీ తీసుకోబోయే మైనింగ్ లీజ్ ప్రోజెక్టు మిక్కిలి ముఖ్యమైనది. డీల్ ని కొలిక్కి తేవడానికి ఇంకా ముడు రోజులే ఉన్నాయి.కంగారు పడుతూ అతడు అసంకల్పితంగా లేచి నిల్చున్నాడు;తండ్రి వేపు అదోలా చూస్తూ--అప్పుడు భరద్వాజ్ స్పందించాడు–"డిస్టర్బ్ అవకు. అనురాధతో కలసి కాబోయ్ లీజ్ అగ్రిమెంటు పేపర్లు పరిశీలించు.పేర్కొన్న షరతుల్ని మరింత జాగ్రత్తగా పరిశీలించు. అవసరమైనప్పుడల్లా మన సీనియర్ ఫంక్షనరీతో చర్చించు. మళ్ళీ వస్తాను"
అడక్కూడదనుకుంటూనే కామేశ్ అడిగాడు–
"ఫోను యెక్కణ్ణించి నాన్నగారూ!సచివాలయం నుంచా"
"కాదు.మీ అమ్మదగ్గర్నుంచి. నన్ను చూడాలంటుంది"ఈసారి కామేశ్ ఉగ్గబెట్టలేకపోయాడు."నేను కూడా వచ్చేదా నాన్నా!"
వద్దంటూ తల అడ్డంగా ఆడిస్తూ గది తలుపు తోసుకుంటూ వెళ్ళిపోయాడు భరద్వాజ్.పెద్దమ్మనుండి అంత అర్జంటు కాల్ యెందుకో——అనుకుంటూ కనురెప్పలల్లార్చుతూ కూర్చుంది అనురాధ. యెందుకో దేనికో పొగ రాజుకోబోతుందా!

అటువంటి టెన్ష్ సమయాలలో భరద్వాజ్ కారు స్టీరింగు ముందు కూర్చోడు. డ్రైవర్ ఉనికి తప్పనిసరి– –అతడు కారు విండో తీసి లోపలకు వస్తుండగా పార్వతి తలంటు పోసుకున్న జుత్తుని ఆరబెట్టుకుంటూ వదులుగా విడిచి చేతిలో పూజా సామగ్రితో యెదురుగా వచ్చింది–రండి– అంటూ--అతను తెల్లబోయి చూస్తూ అడిగాడు"ఎక్కడికి?అని. గుడికని బదులిచ్చిందామె. అతడు ఉన్నపళంగా ముఖం చిట్లించాడు,"పూజా పునస్కారాలు చేసే సమయం ఇదా!నాలా మీ అన్నయ్యలా నువ్వు కూడా బిజినెస్ వుమన్ వే కదా!ఈ మోర్నింగ్ సమయం యెంత ముఖ్యమైనదో ఎంతటి నిర్మాణాత్మకమైనదో నీకు తెలియదూ!"

"అంతా తెలుసు.ముందు కారెక్కి కూర్చోండి!"అంటూ కారులో వెళ్ళి కూర్చుంది. దీనికింకా ఒకప్పటి డామినేటింగ్ హుందాత నం యేమాత్రమూ తగ్గలేదన్నమాట--అనుకుంటూ పార్వతి ప్రక్కన అదోలా ముఖం పెట్టి కూర్చున్నాడు.డ్రైవర్ ని కారుని పోనివ్వమన్నాడు. మరో పావుగంటలో కారు చాముండీశ్వరీ దేవి ఆలయం ముందు ఆగింది. పార్వతి దిగి తిన్నగా అమ్మవారి గర్భ గుడి ముందు నిల్చుని పూజారితో మాట్లాడి అర్చన చేయించి పూజారి అందించిన హారతి పళ్ళెం అందుకుంది. అప్పుడు చూసాడత ను అందులో పుస్తెలతాడు ఉండటం.దానిని రెప్పవాల్చకుండా చూస్తూ యేదో అనబోయేంతలో పార్వతి అతడికి యెదురుగా నిల్చుని"రండి.పుణ్య ఘడియ దాటబోతూంది"అతడు బిర్రబిగుసుకుపోయినట్టు చూస్తూ అన్నాడు–
?ఆటలాడుతున్నావా!మరొకసారి పెళ్ళికూతురవాలని

పడుతున్నావా!ఇకచాలు——ఈ మైండ్ గేముని కట్టిపెట్టు!" దానికామె రియాక్ట్ అయింది."చూడు బాబూ!విదేశాలకు వెళ్ళి తమరు మన వంశాచారాలను మరచిపోయినట్టు న్నారు.కొన్ని తిథులప్పుడు,అమృత ఘడియ ఆసన్నమైనప్పుడు పుస్తెతాడు మార్చడం సంప్రదాయం. అర్థమైందా?"ఆ మాట విని అతడు కస్సుమన్నాడు–"ఇన్నాళ్ళూ ఇదే అమృఘడియప్పుడు పుస్తెలతాడు యెలా మార్చుకున్నావు?నేను లేకుండానే నీకు నీవుగానే కదా మార్చుకునేదానివి!అప్పుడు లేని వంశాచారం ఇప్పుడెలా పుట్టకొచ్చిందీ——"

"అప్పుడు మీరు నా ప్రక్కన లేరు గనుక——"

"ఇప్పుడు కూడా అలాగే అనుకుంటూ తతంగాన్ని పూర్తిచేసుకో!"అంటూ అక్కణ్ణించి కదలబోయాడు భరద్వాజ్.ఆమె క్షణ విలంబిత కాలంలో అతడి చేయి అంది పుచ్చుకుంది,"ఆగండి!మరీ ఆవేశంతో ఊగిసలాడిపోతూ అమృతఘడియను దాటి పోని వ్వకండి.నేను మీకు ఆఫర్ చేసిన డీల్ ఇంకా అలాగే ఉందన్నది మరచిపోకండి.మీరడిగిన డైవోర్సు మీకు అందుతుంది అబ్బా యితో మీరొకసారి మాట్లాడిన తరవాత. మీరు గాని ఇప్పుడు నా మెడన పుస్తలతాడు కట్టకపోతే నేను చేసిన ఆఫర్ ని వెనక్కి తీసుకుంటాను. చాయిస్ ఈజ్ యువర్స్——"

"నువ్వు యెమోషల్ బెదిరింపులకు పాల్పడుతున్నావన్నమాట!నాకు యెప్పుడెలా అబ్బాయిని కన్విన్స్ చేయాలో తెలుసు, ఇప్పటి సామాజిక ఆనవాయితీల ప్రకారం,అమలులో ఉన్నచట్టాల ప్రకారం ఒక మగాడికి ఇద్దరు భార్యలుండటం యెంతటి ప్రమాదకరమో వాడికి మాత్రం తెలియదా?యు షల్ వెయిట్ ఫర్ దట్ రెడ్ లెటర్ డే!"అంటూ అతడు పార్వతి మెడన కొత్త పుస్తల తాడు కట్టి వేగంగా కదిలాడు."ఆగండి మహాశయా!ఏమిటా లేడి పరుగు?"అంటూ ఆమె వంగి భరద్వాజ్ పాదాలను తాకింది. ఈసారి అతడు రియాక్ట్ కాలేదు.అక్కణ్ణించి దూకుడుగా కదల్లేదు,రెప్పవాల్చకుండా ఆమెనే చూస్తూ నిల్చున్నాడు.

"ఏమిటా దుర్వాసుడి చూపు!పెళ్ళాన్ని కోపంతో భస్మం చేయాలని తీర్మానించారా!".


"నేను కోపంగా చూడటం లేదు. విస్మయంగా చూస్తున్నాను" ఆమె నిలకడగా నవ్వుతూంది ఊడిపోయిన అతడి షర్టు గుండీని బిగిస్తూ–భరద్వాజ్ ఊరుకోలేదు– "కుటుంబాన్ని దాదాపు విచ్ఛిన్నం చేసిన దానివి. మమ్మల్ని నగుబాటుకి లోనుచేసిన దానివి.ఐనా——మా అమ్మ నిన్ను శాపనార్థం పెట్టే మాట అటుంచి కనీసం ఒక్కసారి కూడా నిందించలేదు.దానికి మారుగా నీకు నగల పెట్టెను అందివ్వమని చెప్పి చచ్చిపోయింది.ఇప్పుడు దాచకుండా చెప్తావా మీ యిద్దరి మధ్యా విలసిల్లిన ఆ రహస్య బంధమేమిటో!" పార్వతి వెంటనే స్పందించలేదు,కొన్ని క్షణాల తరవాత చెమ్మగిల్లిన కళ్ళతో అంది–"నేనెప్పుడూ మీ అమ్మను అత్తయ్యలా చూడలేదండీ!నన్ను కన్న అమ్మలాగే చూసుకున్నాను,దేనికైనా యెక్కడైనా తల్లి కూతుర్నిశపిస్తుందా——"

"అంటే——నువ్వేమీ తప్పు చేయలేదంటావు——అంతే కదూ!

"చేసాను——ఒకే ఒక తప్పు చేసాను.తొందరపడ్డాను. వెనుకాముందూ చూడకుండా ఒక దుష్టుడి కపట నాటకానికి బోల్తాపడి కట్టుకున్న వాణ్ణి శంకించాను. అప్పుడు బోర్లా పడ్డ దానిని ఇంతవరకూ ఊబినుండి బయట పడలేదు"

"ఒక వేళ నేను నిజంగానే ఆ ప్లింటూ గాడు దండోరా వేసినట్టు ఆ దౌర్భాగ్యపు కార్యం చేసానే అనుకో——నా గురించి నేను చెప్పుకోవడానికి నాకొక అవకాశం ఇవ్వవా!నా బిడ్డ నీ కడుపులో ఉన్నాడన్న యింగితం కూడా లేకుండా తిన్నాగా ఫారిన్ లోనున్న మీ అన్నయ్య వద్దకు వెళ్ళిపోతావా!అమ్మతో పోల్చిన అత్తకు ఓ మాట చెప్పకుండా వెళ్ళిపోతావా?"

"మీరడిగిన ప్రశ్నలకు నా వద్ద యిప్పుడు జవాబులు లేవు– ఒక్కటి తప్ప--"అతడాగి ఆమె కళ్ళల్లోకి చూసాడు– అదేమిటన్నట్టు."నేనెంతగా మిమ్మల్ని ప్రేమించానో మీకు తెలియదు"



# ఫ్యామిలీ సీరియల్



"నీకు ప్రేమ గురించి తెలియదు.నన్ను యెమోషనల్ చేయడానికి నువ్విలా మాట్లాడుతున్నట్టున్నావు,నిజంగా ప్రేమ భావం ఉన్నవాళ్ళు నమ్మినవాణ్ణి నట్టేట ముంచి వెళ్ళరు"అదే ఆఖరిమాటగా అతడిక అక్కడ నిల్చోలేదు. గుడి వెలుపలి ద్వారం వేపు నిదానంగా నడిచాడు.గుడి గంటలు అతడి గుండె కవాటాలను తాకుతున్నాయి. ప్రొద్దుటే తన చేత కొత్త పుస్తెల తాడు కట్టించుకున్న మంగళ రూపం మనసున మెదల్తూంది.ఎన్నాళ్లు! యెంతవరకు సాగుతుందీ జీవన పోరాటం!జగన్నాటం!

ఆరోజు మధ్యాహ్న వేళ రాఘవేంద్ర రావు తోటి మిత్రులతో కలసి పాడుపడ్డ హంటర్స్ క్వార్టర్స్ ప్రక్కనున్న బంకు వద్ద నిల్చుని యేక బిగిన చర్చలు జరుపుతున్నాడు. ఆ చర్చల్లో ఒక్కొక్కరూ ఉద్యోగ ప్రయత్నాలలో యెదురైన తమ తమ అనుభ వాలను ఆరబోసుకుంటున్నారు.వాళ్ళకున్న ముఖ్యమైన పిర్యాదు;దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో స్పోర్ట్సుకి కరువవు తూన్న ఆదరణ గురించి.కొన్ని ప్రసిద్ధ వ్యాపార సంస్థల్లో స్పోర్ట్సుకీ చేయబోయే ఉద్యోగానికీ లంకె ఉందన్నది వాళ్ళందరికీ సువిదితమే–రాఘవ్ లాగే ఒకటికి రెండు క్రీడా రంగాలలో వాళ్ళకు ప్రవేశం ఉంది.కొందరికి ఫుట్ బాల్ ప్లస్ హాకీ–మరికొందరికి క్రికెట్ ప్లస్ కబడ్డీ–ఇంకా కొందరికి బ్యాడ్ మింటన్ ప్లస్ పరుగు పందెం–ఇలా వాళ్ళందరికీ ప్రవేశం ఉంది. కాని యెవరికీ యెక్కడా ప్లేస్మెంట్ ఫిక్స్ కావడం లేదు. వాళ్ళలో కొందరు డిస్ట్రిక్టు లెవల్ ఆడగాళ్ళు ఉన్నారు. గ్రహప్రభావమో నరదోషమో లేక లోకల్ పోలిటిక్స్ ప్రమేయమో–– వాళ్ళను ముందడుగు వేయనివ్వడం లేదు. వాళ్ళలా చర్చోపచర్చలు జరుపుకుంటూ ఎదురుగా ఉన్న టీ–బంకు నుండి పేపర్ కప్పుల్లో టీ తెచ్చుకుని తాగనారంభించారు. అప్పుడు అప్పటి రాఘవ్ కాలేజీ మేట్ విశాల్ అడిగాడు–"అన్నట్టు మీ నాన్నగారికి యెవరో బిజినెస్ మ్యాగ్నెట్ ఫ్రెండు ఉన్నాడన్నావుగా––మీ నాన్నగారి ద్వారా ఆయనను ఓసారి మూవ్ చేయకూడదూ!"రాఘవ్ నవ్వి పేపర్ కప్పుని దూరాన ఉన్న చెత్త కుండీలో పడవేసి వచ్చాడు–"చెప్తాను,వినే ఓర్పు ఉందా!" ఉందన్నట్టు తలూపాడు విశాల్."మొదటిది–ఆయన మైనింగ్ కంపెనీలో స్పోర్ట్సు టీము యేదీ లేదు. రెండవది. మా నాన్నగారికున్న ఆలోచనలు ఆయనకున్నవి.అవి యిప్పటి మన తరం వాళ్ళకు అంత సులభంగా అందవు.అర్థం కావు. వాగుని చూస్తూ ఓరన ఒదిగి నిల్చోవడం ఆయనకు యిష్టం ఉండదు.మొదట వాగులోకి దిగమంటాడు. క్రిందా మీదా పడి ఈత నేర్చుకోమంటాడు.కనీసం నీటి వాలుకి యెదురొడ్డి వెళ్ళడానికి ప్రయత్నించమంటాడు.లోతు తెలుసుకోమంటాడు. ఇక విషయా నికి వస్తాను.నో–డౌట్——ఆయన యేదో ఒకరోజు సమయం చూసి సహాయం చేస్తాడు.కన్నకొడుకు కష్టపడుతూ ఉంటే చూస్తూ ఊరు కుంటాడా! ఎప్పుడన్నది మాత్రం నాకు తెలియదు.ఇంకేమైనా అడగాలా?" అని నవ్వుతూ విశాల్ జబ్బ తట్టి కదిలే లోపల యెవరో వెనుక నుండి వచ్చి అతడి భుజం తట్టి "మీరేదో సంభాషణలో నిమగ్నమైపోయినట్టున్నారు. అటు చూడండి–మిమ్మల్నెవరో కారులోనుంచి పిలుస్తున్నట్టున్నారు" అని చెప్పి ళ్ళిపోయాడు. "నన్నా––"అంటూ కారు వద్దకు వెళ్ళాడు రాఘవ్. స్టీరింగ్ ముందు కూర్చున్న ప్రీతిని చూసి నమ్మలేనట్టు కళ్ళు పెద్దవి చేసుకుని చూసాడు–"నువ్వా!"అని విస్తుపోతూ–– "ఔను నేనే! ప్రీతిని——మీ మేనత్తగారి పెద్ద కూతుర్ని"

"సరేలే——మహ బాగానే గ్రహించాం.ఇప్పుడు నువ్వెందుకిక్కడకు వచ్చావు?"

"ఏం?ఇకడికెవ్వరూ రాకూడదా!ఏమైనా నిషేధాజ్ఞలేమైనా ఉన్నాయా!"

"అతి తెలివి చూపించకు.ఆఫీసర్ దాంబికం ఇక్కడ చూపించకు. ఇంతకీ యెందుకొచ్చావిక్కడికి?"

"అబ్బబ్బ!ఒకటే రొద––మొట్టికాయ పెట్టినట్టు చెప్తాను. విను.నీకోసం––" అతడు అదోలా ముఖంపెట్టి అన్నాడు–"సమయం దొరికితే వస్తానన్నానుగా! ముందు



# ఫ్యామిలీ సీరియల్



నువ్విక్కణ్ణించి కదులు”
“అన్నావు——కాని రాలేదుగా!”
“ఏమిటి?యెగతాళిగా ఉందా!మీ ఆఫీసు మా యింటి ంందనుకుంటున్నావా!చూడు—— అందరూ యెలా గుడ్లగూబల్లా కళ్ళింతలు చేసుకుని చూస్తున్నారో!”
“నాకదంతా తెలీదు.తిన్నగా వచ్చి నా ప్రక్కన కూర్చో!”

“ఏమిటీ నీ వైఖరి——శాసిస్తున్నట్టు మాట్లాడుతున్నావు! ఎక్కడికి?”
“చెప్పను.నా కొంగు పట్టుకుని రావాలి––అంతే!” అతను తీక్ష్ణంగా చూస్తూ ప్రశ్నించాడు“రాకపోతే?”
“ఇక్కణ్ణించి కారు కదలదు. అర్ధరాత్రయినా సరే–ఇక్కడే ఇలాగే ఉంటాను.అంతే కాదు,నువ్వు వయసులో ఉన్న ఆడపిల్లను చూసి జడుసుకుంటున్నావని దండోరా వేయిస్తాను” అతడిక మాట్లాడకుండా వెళ్ళి ఫ్రెండ్సుతో యేదో చెప్పి వచ్చి ప్రీతి ప్రక్కన కూర్చున్నాడు.“నీ ఫ్రెండ్సుతో యేమి చెప్పావు బావా!” కారు స్టార్టు చేస్తూ అడిగిందామె.

“అంతా నీకు చెప్పాలేమిటి?ఓ అరగంటలోపల వచ్చేస్తానని చెప్పి వచ్చాను.”

“పగటి కల కనకు.రాత్రి తొమ్మిదవుతుంది”ఎందుకూ–అని అతడు పొలికేక పెట్టినంత జోరుగా అరిచాడు.వెంటనే అతడామెను అదుపు చేసింది– “ఉష్!అలా అరవకు బావా!ఎవరైనా వింటే–– కారులో యేదో జరుగుతుందనుకునేరు. నీకు తెలుసు కదా–అత్తయ్య నన్ను హైస్కూలులో కూచిపూడి భరత నాట్యం క్లాసుల్లో చేర్పించిందని “ఉ( అని తలూపాడతను.“ఈరోజు హరిహర భవన్ లో నా ప్రోగ్రాముంది.ప్రోగ్రాము పూర్తయేంత వరకూ నువ్వే నాకు పర్సనల్ గార్డువి” ఆ మాట విన్నంతనే రాఘవ్ ముబైల్ తీసాడు. “ ఎందుకూ!ఇంటికి చెప్పడానికేనా?అవసరం లేదు,మామయ్యా అత్తయ్యలిద్దరికీ చెప్పే వస్తున్నాను”అతడు ప్రీతి వేపు నివ్వెర పాటుతో చూసాడు. అబ్బో!అత్త కూతురు జాణకాదు–నెరజాణే!

రసిక జనంతో హాలు బాగానే సందడిస్తూంది.ప్రీతి గ్రీన్ రూములోకి వెళ్ళి క్లాసికల్ సంప్రదాయ దుస్తుల్లోకి మారడానికి అరగంట పైనే పట్టింది.అంతా ప్రసిద్ధ కళాకారిణి రామేశ్వరి గారి ఆధ్వర్యంలోనే జరిగింది,మొదట ముగ్గురి బృందనాట్యం.అందు లో ప్రీతి కూడా ఉంది.మొదట నట్టువాంగం ఒనర్చే గురు ప్రణామంతో వాద్య కళాకారుల వందనంతో ఆరంభమయి విఘ్నేశ్వ రుడి స్తోత్రంతో–– బృంద నాట్యం కళకట్టింది. రసికులను ఆకట్టుకుంది.పిదప రానున్న శివరాత్రి పండగ పురస్కరించి కూచిపూడిలో శివనీరాజం సమర్పించారు.ప్రీతితో కలసి ఆడిన ఇద్దరు యువ కళాకారిణుల పేరు మానస,మృదుల. ముగ్గురూ బాగానే శ్రమపడి అభ్యాసం చేసినట్టున్నారు.అందుకే బృంద నాట్యం పసందుగా రక్తి కట్టింది. జనం మధ్య ముందు వరసలో కూర్చున్న రాఘవ్ ప్రేక్షకుల ముఖభావాలు చూస్తూ అల్లనల్లన సన్నగా వినిపించే వ్యాఖ్యానాలు వింటూనే ఉన్నాడతను. చివరన కార్యక్రమం పూర్తయి మేకప్ చెరపి దుస్తులు మార్చుకుని బైటకు వస్తున్నప్పుడు నట్టువాంగం గురువు రామేశ్వరిగారు ఉన్నపాటున అడిగారు–“ఈ అబ్బాయి ఆదినుండీ నీకు కూల్ డ్రింకులూ కాఫీలూ అందిస్తూ నిన్నే అంటిపెట్టుకొని ఉన్నాడు, ఎవరితను?“ ప్రీతి ఠఫీమని బదులిచ్చింది–“మా బావ”ఆ మాట విని రామేశ్వరి దీర్ఘంగా చూస్తూ అడిగింది“బావంటే––బావేనా!”
ఆ ప్రశ్నకు ప్రీతి పక్కున నవ్వుతూ–
“మొన్నటి వరకూ నేను వీళ్ళింట్లోనే ఉండి చదువుకున్నాను,ఉద్యోగంలో చేరిన తరవాత మా యింటికి వెళ్ళిపోయాను.కొన్నాళ్ళ తరవాత మళ్ళీ వీళ్ళింటికి వస్తాను. ఇప్పటికింకా పెద్దల నిర్ణయం యేదీ చేయలేదు” ప్రీతి వేపు రామేశ్వరిగారు విస్మయంగా చూసారు–“మరి——మొన్నొకసారి అలా అటు వెళ్తూ ఆగినప్పుడు మీ యింట్లో వాళ్ళు మరొక విధంగా చెప్పినట్టున్నారు” ఏమిటన్నట్టు కళ్ళు పెద్దవి చేసుకుని చూసింది ప్రీతి.“ ఒక ఐ ఏ యస్ నుండి ఒక ఐపీయస్ నుండి సంబంధాలు వచ్చినట్టు——వాటికి మీ బామ్మగారు నాన్నగారూ సానుకూలంగానే స్పందిస్తున్నట్లు––ఏం?ఇది నీకు తెలియదా!”
ఆమె విస్మయంగా బదులిచ్చింది–
“పూర్తిగా తెలియదు.ఏది యేమైనా చివరన నిర్ణయం

తీసుకోవలసింది నేనే కదా మేడమ్!" అంటూ నమస్కరించి నిదానంగా నడవసాగింది.నడుస్తూ ఆలోచించసాగింది. అంటే——తన వెనుక తన పొజిషన్ కి తగ్గట్టు చాలానే జరుగుతున్నాయన్న మాట!అలా ఆలోచించుకుంటూ తలెత్తి చూసేటప్పటికి రాఘవేంద్ర రావు తన దారిన తను నడుస్తూ అందుకోలేనంత దూరంగా వెళ్ళిపోయాడు.ఆమె వేగంగా వెళ్ళి అందుకుంది;ఇద్దరు ముగ్గురు యెదురొచ్చి ఆమెకు కంగ్రాట్సు చేప్పడానికి సమీపిస్తే వాళ్ళను సజావుగా దాటుకుంటూ–– "ఏమిటా ఆజానుబావు రాక్షస నడక!నడిరోడ్డున నన్ను విడిచి వెళ్ళిపోవాలని తీర్మానించేసావన్న మాట!"

"నోనో!నేనలా చేస్తానా? ఇప్పటికే ఆలస్యమైపోయిందిగా——రాత్రయి పోయింది నువ్వు యింటికి వెళ్ళిపోవాలిగా! అందుకని ఆటోరిక్షా కోసం చూస్తున్నాను నేనిటు వేపు సాగిపోవడానికి——" "సరే——నువ్వు చెప్పడం పూర్తయిందా!ఇంకా చెప్పాల్సింది ఇంకేమైనా ఉందా?" "నేనేమిటి కథా చెప్తున్నాను!హస్త పాద కదలికలతో అలసిపోయున్నావు.రేపు నువ్వు డ్యూటీకి వెళ్ళాలి.నువ్వు కారు తీసుకుని బయల్దేరు,అసలు నువ్వు నాతో గిల్లి కయ్యం పెట్టుకోవడానికి కాకపోతే——నువ్వు అత్తయ్యనో హరిప్రియనో నీకు తోడుగా తీసుకురావల్సింది.ఎనీ హౌ–గుడ్ పెర్ఫార్మెన్స్——కంగ్రాట్సు!"అంటూ హాలు గేటు దాటి మలుపు తిరగబోయాడు రాఘవ్. అప్పుడామె–"ఆగు బావా!" అంటూ విసురుగా వచ్చింది. "బాగావిను.చూపులక్కడ కాదు. ఇక్కడ పెట్టి విను. నేనెక్కడ కి వెళ్ళాలి–యెందుకెళ్ళాలి–యెప్పుడు వెళ్ళాలి–అన్నది నువ్వు చెప్తే వినే వయసు కాదు నాది! ముందు నాతో వచ్చి కారులో కూర్చో——నన్ను రెచ్చగొట్టి సీన్ క్రియేటయేలా చేయకు——" "ఏమైంది నీకు?తిక్కపట్ట లేదు కదా!ఇంతరాత్రి పూట నువ్వు నన్ను దిగబెట్టి వచ్చేటప్పటికి యెంత టైమవుతుందో తెలుసా?"

"నీకెవరు చెప్పారు నేను నిన్ను దిగబెట్టి తిరిగొస్తునని?ఈరోజు రాత్రి మీ యింట్లో–కాదు మా మామయ్యగారి యింట్లోనే పడు కుంటాను–ఇంకేమైనా అడగాలా!"అతడేమీ అనలేదు,నిదానంగా వెళ్ళి ప్రీతి అన్ లోక్ చేసిన కారులో వెళ్ళి కూర్చున్నాడు.

కారు యింటి ముంగిట ఆగడం చూసిన మాన్విత వేగంగా వచ్చి అక్కయ్యను పెనవేసుకుంటూ "ప్రోగ్రాము బాగా జరిగిందా!మీ గురువు రామేశ్వరిగారు అప్రిసియేట్ చేసారా?" అని అడిగింది. "అందరూ చేసారు——ఒక్కరు తప్ప——" అని రాఘవ్ వేపు చూపు సారించింది."హేయ్!అబద్ధం ఆడకు.నేనుకంగ్రాట్సు చెప్పలేదూ!"

"చెప్పావు––యెలాగని?ముఖం అంతరిక్షంలోకి యెత్తిపెట్టుకుని——" అంతలో అక్కడకి పావని వచ్చింది ఆశ్చర్యంగా చూస్తూ––"నేను నీకు చెప్పే పంపించాగా——నువ్వటునుంచి అటు వెళ్ళిపొమ్మని——మీ బావ బస్సులోనో రిక్షాలోనో యింటికి వచ్చేస్తాడని. ఇంత రాత్రి పూట మళ్ళీ యెలా వెళ్తావు? రేపు డ్యూటికి వెళ్లవద్దూ!"

"నేనిదే మాట అన్నానమ్మా!దానికి మీ ముద్దుల మేనగోడలు యేమందో తెలుసా––మా మామయ్యగారి యింటికి వెళ్ళడానికి నాకెవ్వరి అనుమతీ అవసరం లేదని నన్ను కూడా కారులో కి యెక్కించుకుని సర్రు సర్రున వచ్చేసింది.ఆదినుంచీ ఒకటే మంకుతనం––"ఔనా– అన్నట్టు నవ్వు ముఖంతో చూసింది పావని. "ఔనత్తయ్యా!నాకు యింటికి వెళ్ళాలనిపించలేదు. మిమ్మల్నందరినీ చూడాలనిపించింది.మీతో ఉండాలనిపించింది.రేపు నేనిక్క ణ్ణించే డ్యూటీకి వెళతాను.రేపు ఉదయం నన్ను మీ పెద్దబ్బాయిని మా ఆఫీసుకి దిగబెట్టమను" "ఇదెక్కడి వితండవాదమే!నిన్ను దిగబెట్టి మళ్ళీ వాడెలా వస్తాడు?కారు నీది.డ్రైవ్ చేసేది నువ్వు.మళ్ళీ వాడెందుకు మధ్య——" "అదంతే అత్తయ్యా!మీ ముద్దుల కొడుకు కారు తోలగలడు కదా!ఇదే కారులో వచ్చి నన్ను దిగబట్టి ఇదే కారులో మళ్ళీ వచ్చే

యమను,ఇన్నాళ్ళూ నేను కారులోనే తిరిగానేమిటి?ఇంటికీ ఆఫీసుకీ తిరగడానికి నావరకు యేర్పాట్లు చేసుకోగలను.అంతగా నా పైన అక్కర ఉంటే మా యింటి కొచ్చి ఉండమను.ఆడపిల్లను——నేను మీయింట్లో అన్నిసంవత్సరాలు లేనూ! ఇప్పటికీ మాచెల్లి మీతో లేదూ!మీ పెద్దబ్బాయి మా యింట్లో కొన్నాళ్ళుంటే యేమీ తరిగిపోదు,ఎనీహౌ–చాయిస్ ఈజ్ యువర్స్——సరేనా!"అప్పుడు గుమ్మం వద్ద గట్టిగా నవ్వడం విని పించి అందరూ అటు తలలెత్తి చూసారు.సూర్యవివేక్ నవ్వుతూ నిల్చున్నాడు."నీకింకా అర్థం కాలేదా పావనీ!బావ మరదలు మధ్య యేదో జిరిగుంటుంది. వీడేదో దురుసుగా అని ఉంటాడు, అది హర్ట్ అయుంటుంది. దానికి ప్రీతి ఇప్పుడు రియాక్ట్ అవుతుంది. ఇదంతా ముసుగులో గుద్దులాట. ముందు ఇద్దర్నీ లోపలకు తీసుకెళ్ళి అన్నాలు వడ్డించు.ఈ ఒక్కసారీ దాని కోరిక మన్నించు.అది చెప్పినట్టే జరగనియ్యి" అంటే–అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది పావని.

" రెండు రోజులు రాఘవ్ ని వాళ్ల మేనత్తతో ఉండనియ్యి.మూడవ రోజు వస్తాడులే——వాడికిక్కడేవో జాబ్ మేళాకి సంబంధించిన ఇంటర్వ్యూలున్నాయటగా–"మామయ్య నోట ఆ మాట విన్నంతనే ప్రీతి రాఘవ్ వేపు చురుగ్గా చూసింది; ఇప్పు డేమంటావ్ అన్న సంకేతం యిస్తూ.. ప్రీతి మోకింగ్ గా యిచ్చిన సంకేతం గమనించిన మాన్విత ప్రశాంతి పక్కున నవ్వేసారు. వస్తూన్న నవ్వు తెరల్ని ఆపుకుంటూనే అనుకోకుండా అటు చూపులు సారించింది ప్రీతి. గుమ్మానికి పూసి ఉన్న పసుపు కుంకుమల్ని ప్రేలాడు తూన్న మాంవిడి తోరణాలనీ ఆనందంగా ఆత్మీయంగా చూస్తూ అడిగింది–" ఇప్పుడు ప్రతి ఉదయమూ ముగ్గులు రంగవల్లికలూ నువ్వేకదూ వేస్తున్నావత్తయ్యా!"పావని యెత్తి పొడుపుగా నవ్వుతూ అంది "ఏం?నువ్వు లేకపోతే మరెవ్వరూ లేరనుకున్నావా!ఇప్పుడు మాన్వీతా ప్రశాంతీ కలసే యింటి ముంగిట ఇవన్నీ చేయడమే కాదు–నేను లేచి స్నానం చేసి వచ్చేటప్పటికి పూలమాల గుచ్చి పూజాగదిలో సిద్ధంగా ఉంచుతున్నారు" నిజంగానా–అన్నట్టు యిద్దరి వేపూ ఆత్మీయంగా చూసిందామె. ఆత్మీయత ఉట్టిపడే చూపులతో యింటిని కలయచూస్తూ నిల్చుంది.

ప్రీతి తనకు తాను రచించుకున్న వ్యూహం ప్రకారమే అలా దూకుడు చూపిస్తుందని భార్యాభర్తలిద్దరూ గ్రహించారు. మరి ఆ అమ్మాయిని వెతుక్కుంటూ వాళ్ళ యింటి గుమ్మాన నిల్చున్న రెండు పెద్దింటి సంబంధాలూ నీటి మీద గీతలుగానే మారడం తథ్యమేనని తెలుస్తూనే ఉందిగా! పెద్ద మేనగోడలిని ఆప్యాయంగా చూస్తూ అనుకున్నాడు——"బోల్డ్ అండ్ బ్యూటిఫుల్"

(ఇంకా ఉంది )

సీరియల్



# యమపాశం



జి .నరసింహ మూర్తి;

“యువ పారిశ్రామికవేత్త వరుణ్ ప్రసాద్ భార్య అనూష దారుణ హత్య”... ఆ రోజు ఉదయాన్నే అన్ని టీవీ ఛానళ్ళలో బ్రేకింగ్ న్యూస్ మొదలైంది...

కొన్ని ఛానళ్ళైతే వరుణ్ ఇంటినీ, అక్కడ బంధువుల రాకపోకలూ,... వాటన్నిటిని చూపించ సాగాయి...

ఉదయాన్నే ఐదున్నరకి లేచి మార్నింగ్ వాక్ చేస్తున్న డీయస్పీ రఘువీర్ కి ఆ సమయంలో ఫోన్ వచ్చింది... సీఐ అనంతరావు ఆ హత్య గురించి చెప్పడంతో అతను వాకింగ్ ని మధ్యలో ముగించి స్టేషన్ కు బయలుదేరాడు...

పోలీస్ స్టేషన్ అప్పటికే కోలాహలంగా ఉంది... ఏం జరిగిందో తెలుసుకుందామనీ కొందరు, హత్య జరిగిన విషయాన్ని ఫిర్యాదు చేద్దామని మరికొందరు అక్కడ కొచ్చారు.

# క్రైం సీరియల్

స్టేషన్ ముందు రఘువీర్ జీపు ఆగగానే "డీయస్పీ గారు వచ్చారు" అంటూ జనం బయటకు వచ్చారు... రఘువీర్ జీపు దిగి జనాల మధ్య నుంచి తన ఛాంబర్లోకి వెళ్ళాడు... అతని కోసమే ఎదురు చూస్తున్న సీఐ అనంతరావు లోపలికి వెళ్ళి విష్ చేసాడు...

"చెప్పండి... ఏం జరిగింది" అని అడిగాడు రఘువీర్,

"సార్! వరుణ్ ప్రసాద్ ఇంటికి వెళదాం... మన వాళ్ళు అందరూ అక్కడే వున్నారు " అన్నాడు అనంతరావు బయటకు నడుస్తూ... రఘువీర్ కూడా అతని వెనకే బయలుదేరాడు.

"ఏం జరిగింది?" జీపు కదిలిన తరువాత అడిగాడు రఘువీర్ "వరుణ్ ప్రసాద్ తన భార్య హత్యకు గురైందనీ స్వయంగా అతనే మన స్టేషన్ కి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే మన ఎస్సై ప్రకాష్, కానిస్టేబుళ్ళు అతనింటికి వెళ్ళారు" అన్నాడు అనంతరావు.

"వరుణ్ ప్రసాద్ అంటే పారిశ్రామికవేత్త కదూ..." "యస్ సార్... ఈ పట్నం లోనే కాక మన జిల్లాలో పెద్ద పారిశ్రామికవేత్త... అతని మామగారు గోపాలరావుకి సిమెంట్, ఫార్మసూటికల్స్, రీ రోలింగ్ మిల్స్, పవర్ ప్లాంట్స్ ఇలా ఎన్నో ఫేక్టరీలున్నాయి. వరుణ్ ప్రసాద్ భార్య గోపాలరావు గారి ఏకైక కుమార్తె అనూష... నాలుగేళ్ళ క్రితం వాళ్ళిద్దరికీ పెళ్ళైంది. ఆరు నెలల క్రితమే గోపాలరావు కారు ప్రమాదంలో చనిపోయాడు. అప్పట్నుంచీ అతని అన్ని ఫ్యాక్టరీలకు రఘువీర్ ఎమ్.డీ.గా ఉంటున్నాడు. ఈరోజు అతని భార్య హత్యకు గురైందన్న వార్త నిజంగా ఆశ్చర్య కలిగిస్తోంది..." అన్నాడు అనంతరావు.

పావు గంట తరువాత గోపాలరావు ఇంటి ముందు జీపు ఆగింది. గ్రీన్ హిల్ సొసైటీ ; ఆ పట్నంలో అది పోష్ లోకాలిటీ... అది హైదరాబాద్ లో జూబ్లీ హిల్స్ లాగ చాలా ఖరీదైన ప్రాంతం. అక్కడక్కడ విసిరేసినట్లు పెద్ద పెద్ద ఇళ్ళు. విశాలమైన రోడ్లు.. రోడ్లన్నీ పరిశుభ్రంగా అందంగా కనిపిస్తున్నాయి; ఏ ఇల్లూ 1000 గజాలకు తక్కువ లేదు. ఇంటి ముందర పెద్ద పెద్ద గేట్లు... గూర్ఖాల షెడ్లు...

పోలీస్ జీపు ఆగగానే గుర్ఖా పరుగున వచ్చి నమస్కారం పెట్టాడు. ఆ తరువాత గేటు తెరుచుకుంది. ముందు పెద్ద హాలు... ఎదురుగా మెట్లు... హాలు నిండా మనుషులు... ఫోటోలు, వీడియోలు తీస్తున్న ఛానెళ్ళ విలేఖర్లు...

రఘువీర్ ,అనంతరావు లిద్దరినీ చూడగానే కానిస్టేబుల్ శేఖరం వచ్చాడు.

"రండి సార్... మీద బెడ్రూంలో జరిగింది" అంటూ వాళ్ళని మేడ మీదకు తీసికెళ్ళాడు.

బెడ్రూమ్ చాలా విశాలంగా ఉంది. మధ్యలో పెద్ద మంచం... దానిమీద అనూష శవం... అక్కడ ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు శవాన్ని పరీక్షిస్తున్నారు... ఇంకో పక్క వేలిముద్రల నిపుణులు వేలిముద్రలను సేకరిస్తున్న దృశ్యాలు...

అదే రూములో మంచం పక్కన కుర్చీలో ఒక వ్యక్తి విచారంగా కూర్చుని ఉన్నాడు. తెల్లటి ముఖం, నల్లటి గెడ్డం... మనిషి సన్నగా, పొడవుగా ఉన్నాడు... "నా పేరు వరుణ్ ప్రసాద్, అనూష హజ్బండ్ ని " అనీ అతను లేచి వాళ్ళ దగ్గరకు వచ్చి పరిచయం చేసుకున్నాడు...

"ఎన్ని గంటలకు ఈ హత్య జరిగింది?" అడిగాడు రఘువీర్. "నేను నిన్న రాత్రి ఊళ్ళో లేను... జిల్లా హెడ్ క్వార్టర్స్ కి ఒక సెమినార్ కోసం వెళ్ళాను. ఉదయాన్నే అనూష హత్య జరిగిందనీ ఫోన్ వచ్చింది. నేను వెంటనే బయలుదేరి వచ్చి మా ఫామిలీ డాక్టర్ గారిని పిలిచాను. అతను వచ్చి రెండు గంటల క్రితమే చనిపోయిందనీ చెప్పాడు" అనే జరిగింది వివరంగా చెప్పాడు వరుణ్...

"సార్! సంవత్సరం క్రితం అనుకుంటాను ఇదే ప్రాంతంలో ఒక మర్డర్ అటెంప్ట్ జరిగింది... ఆమెది కూడా ఈవిడ వయస్సే. ఆవిడని కూడా ఇలాగే ఇదే రకం తాడుతో హంతకుడు ఉరివేసి చంపబోయాడు కానీ అదృష్టవశాత్తూ ఆ సమయంలో

వాచ్మెన్ మేల్కొనడంతో ఆమె తప్పించుకుంది…" అన్నాడు ప్రకాష్ ;

"ఐసీ… అంటే రెండే ఒకేలా జరిగాయన్నమాట" అన్నాడు రఘువీర్ .

"యస్సార్… బలంగా కొట్టి , ఆ తరువాత పేనుకి ఉరివెయ్యడం… రెండూ ఒకేలా జరిగాయి… అదృష్టవశాత్తూ మొదటావిడ తప్పించుకుంది… ఈవిడ తప్పించుకోలేక పోయింది" అన్నాడు ప్రకాష్…

"అనంత్! ఈ వరుణ్ ప్రసాద్ ఎలాంటివాడో కనుక్కున్నారా?" రఘువీర్ అనంతరావుని మెల్లగా అడిగాడు…

"ఇతని గురించి చాలా కథలు విన్నాము… మామగార్ని కారు ప్రమాదంలో చంపించాడనీ, అతని కూతురు అనూషని కేవలం ఆస్తుల కోసమే పెళ్ళి చేసుకున్నాడనీ అందరూ చెప్పుకుంటూ ఉంటారు… బహుశా ఆ ఆస్తి కోసమే ఇప్పుడామెను చంపేసి ఉంటాడు" అన్నాడు అనంతరావు;

"ఒకే! ఇది హై ప్రొఫైల్ ఈ కేసు ; దీన్ని చాలా జాగ్రత్తగా డీల్ చెయ్యాలి… ఏ చిన్న సాక్ష్యాన్నీ వదలకూడదు. నిజంగానే వాడు ఆమెని హత్య చేసి ఉంటే వాడిని ఉరికంబం ఎక్కించాలి… ఎట్టి పరిస్థితుల్లోనూ నేరస్తుడు తప్పించుకో కూడదు… అలాగనీ నిర్దోషైతే వాడు శిక్షింపబడ కూడదు… ఇదే మన చట్టం చెబుతోంది… నేరస్తుణ్ణి పట్టుకోవడం మన పని… ఇప్పట్నుంచే పని మొదలు పెట్టండి. వేలిముద్రల్ని, రక్తం మరకల్ని, వెంట్రుకల్ని… ఇలా వేటినీ వదలొద్దు" అన్నాడు రఘువీర్…

రఘువీర్ కి జిల్లాలో చాలా స్ట్రిక్ట్ పోలీసాఫీసరనీ పేరుంది. అతను ఏ కేసుని చేపట్టినా నిజం బయటకొచ్చే దాకా నిద్రపోడనీ పోలీసు శాఖలో అందరూ చెప్పుకుంటూ వుంటారు .
ఆ సాయంత్రం అనంతరావు రఘువీర్ దగ్గరికి వెళ్ళాడు… రఘువీర్ తన చాంబర్లో ఫైల్స్ ని క్లియర్ చేస్తున్నాడు.
"సార్! వాచ్మెన్ రాముని అదుపులోకి తీసుకుని ప్రశ్నించాము. రెండు రోజుల నుంచి వాడికి ఫేక్టరీలో డ్యూటీ వేసారట… వాడికేం తెలియదనీ చెబుతునాడు… ఇంక రిపోర్టులు వస్తే గానీ మనం ఏమీ చెయ్యలేము…" అన్నాడు అనంత రావు .

"వరుణ్ ప్రసాద్ ని అదుపులోకి తీసుకొని ప్రశ్నించండి. అతన్ని అరెస్ట్ చేస్తున్నట్లు ప్రెస్ కి చెప్పండి. అప్పుడే హంతకుడిని పట్టుకోలేదని, భర్తని అరెస్ట్ చెయ్యలేదనీ టీవీల్లోనూ, సోషల్ మీడియా లోనూ వార్తలొస్తున్నాయి… డోంట్ గివ్ ఎనీ రూమ్? ఎవ్వరికీ ఏ చిన్న అవకాశం ఇవ్వొద్దు… వాడిని అరెస్ట్ చేసి ప్రశ్నిస్తే అన్ని వివరాలు తెలుస్తాయి… హత్య గావింపబడినది ఓ పారిశ్రామికవేత్త భార్య…ఇంకో పెద్ద పారిశ్రామికవేత్త కూతురు; కాబట్టి కేసుని చాలా జాగ్రత్తగా డీల్ చెయ్యాలి… వాళ్ళకి పెద్ద పెద్ద లాయర్లుంటారు… వాళ్ళని తట్టుకోవాలంటే మనం సరియైన సాక్ష్యాలను సేకరించాలి…" అనీ చెప్పాడు రఘువీర్…ఆ తరువాత అనంతరావు వెళ్ళిపోయాడు;

★★★

అది రెండవ పట్టణ పోలీస్ స్టేషన్… వరుణ్ ని అరెస్ట్ చెయ్యడంతో జిల్లా అంతా ఆ వార్త దావానలం లా వ్యాపించింది… లాయర్ సమక్షంలో అతని ఇంటరాగేషన్ మొదలైంది… రఘువీర్ సమక్షంలో అనంతరావు అతన్ని ప్రశ్నిస్తున్నాడు…

వాళ్ళకి ఎదురుగుండా లాయర్ పరాంకుశం, అతని పక్కనే వరుణ్ కూర్చొన్నారు…

"మీకు అనూషతో ఎప్పుడు పెళ్ళైంది?" అనంతరావు ప్రశ్నించడం మొదలు పెట్టాడు;
"నాలుగేళ్ళైంది…"

"మీకు మీ భార్యకూ ఏమైనా గొడవలున్నాయా?"

"అస్సలు లేవు… మేం ఇద్దరం ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్ళం…" అన్నాడు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.



# క్రైం సీరియల్



"మీరు మీ మామగారి ఆస్తుల కోసమే అనూషను పెళ్ళాడారనీ చాలామంది అనుకుంటున్నారు?.. దీని గురించి ఏమంటారు?"

"శుద్ధ అబద్ధమంటాను... నాకు డబ్బంటే వ్యామోహం లేదు... నాకు మనుషులంటే ప్రేమ... అనూషని ఎంతో ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాను..." గట్టిగా ధైర్యంగా చెప్పాడు వరుణ్...

"ఆస్తి కోసం మీరే అనూషని హత్య చేసారనీ పేపర్లు, ఛానెళ్ళలో వార్తలు వొస్తున్నాయి. ఏమంటారు?" అనంతరావు ఆ ప్రశ్న అడగ్గానే పక్కనే ఉన్న లాయర్ పరాంకుశం "సార్... పేపర్లు, ఛానెళ్ళ వార్తల ఆధారంగా ప్రశ్నలడగటం కరెక్ట్ కాదు. ఈ ప్రశ్నకు నా క్లయింట్ సమాధానం ఇవ్వడు. దీన్ని నేను వ్యతిరేకిస్తున్నాను" అన్నాడు కుర్చీలోంచి లేస్తూ...

"మిస్టర్ పరాంకుశం! ఏ ప్రశ్నలడగాలి, ఏ విధంగా అడగాలనీ చెప్పే హక్కు మీకు లేదు. మేము పోలీసులం... ఏ చిన్న అనుమానం కలిగినా ప్రశ్నిస్తాం... వాటికి సరియైన సమాధానం చెప్పవలసిన బాధ్యత అనుమానితుడిది " అన్నాడు అనంతరావు అసహనంగా...

"ప్రశ్నించడానికి కూడా ఓ హద్దుంటుంది... ఏదైనా ప్రశ్నించేముందు దానికి సరియైన ఆధారం ఉండాలి... అనంతరావు గారు! ఓ విషయం మరిచిపోవద్దు. ఇటువంటి హత్యకేసుల్లో నేరాలను ఋజువు చెయ్యవలసిన బాధ్యత పోలీసులది... ముద్దాయిలది కాదు... కాబట్టి ప్రశ్నించే ముందు సరియైన పరిశోధన చేసి ఏవైనా అనుమానాలొస్తే ప్రశ్నించాలి... అంతేగాని ఏవో చీకట్లో రాయివేసినట్లు ఉండకూడదు" అన్నాడు పరాంకుశం కోపంగా....

"ఇందులో ఆధారాలు లేకపోవడమేమిటి? చాలా ఉన్నాయి. ముద్దాయి వరుణ్ తన భార్య అనూష ని చంపాలనే ఆ రోజు రాత్రి వాచ్ మెన్ ని బయటకు పంపేసాడు. ఆ తరువాత ఎలిబీ కోసం బయట ఊరుకెళ్ళినట్లు నటించి అర్ధరాత్రి ఇంటికి వచ్చి ఆమెని దారుణంగా కొట్టి ఆ తరువాత ఫ్యానుకి తాడుతో ఉరివేసి చంపి , దాన్ని ఆత్మహత్యగా చిత్రించే ప్రయత్నం చేసాడు. పోస్ట్ మార్టెమ్, వేలిముద్రల రిపోర్టులు వస్తే అతనే హంతకుడనీ తేలిపోతుంది... " అన్నాడు అనంతరావు అసహనంగా...

"సర్కిల్ సార్! మీరు తొందరపడి చాలా పెద్ద తప్పు చేసారు . మీరు అరెస్ట్ చేసింది ఈ జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త నన్న విషయం మరిచి పోవద్దు... ఏ విధమైన ఆధారాలు లేకుండా అతన్ని అరెస్ట్ చేసి అతని పరువుని, కంపెనీల పరువుని తీసే ప్రయత్నం చేసారు; దీనివల్ల ఆ కంపెనీల షేరు విలువలు బాగా పడిపోయి కొన్ని వందల కోట్లు నష్టం వస్తుంది... దాని వల్ల వేల మంది ఉద్యోగాలు కోల్పోతారు. దీని ప్రభావం పాలిస్తున్న ప్రభుత్వాల మీద కూడా పడే ప్రమాదం ఉంది... కాబట్టి అరెస్ట్ చేసే ముందు ఒక క్షణం ఆలోచించండి... దాని వల్ల ఎదురయ్యే విపత్కర పరిణామాలు ఎంత భయంకరంగా ఉంటాయో ఊహించుకోండి..." అన్నాడు పరాంకుశం.

"పరాంకుశం గారూ! మీరు లాయర్... చట్టాలను ఔపాసన పట్టినవారు. వరుణ్ని అనుమానితుడిగా అరెస్ట్ చేస్తున్నాం... ఒకవేళ ఆధారాలు దొరక్కపోతే బెయిల్ మీద విడుదల అవుతాడు... హత్య నిన్న రాత్రి జరిగింది... జరిగి పది గంటలే అయింది... జరిగిన వెంటనే సాక్ష్యాలను సేకరించి కోర్టులో ఛార్జీషీటు వెయ్యడానికి మేము దేవుళ్ళం కాదు. దానికి మాకు కొంత సమయం కావాలి. అందుకు ముద్దాయిని ప్రశ్నించాలి. ఆధారాలు సేకరించాలి... ఈ సమయంలో ముద్దాయిని బయటకు వదిలేస్తే ఆధారాలను మాయం చేసే అవకాశాలున్నాయి. మీకు ఈ అరెస్ట్ మీద అభ్యంతరాలుంటే రేపు కోర్టులో బెయిల్ పిటిషన్ వేస్కోండి" అనీ అన్నాడు అనంతరావు...

అరగంట తరువాత అన్ని టీవీ ఛానళ్ళలో బ్రేకింగ్ న్యూస్ మొదలైంది.

భార్య హత్యకేసులో పారిశ్రామికవేత్త వరుణ్ ప్రసాద్ అరెస్ట్... రేపు కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం...

★★★

ఆ రోజు వరుణ్ ప్రసాద్ కేసు సెషన్స్ కొచ్చింది. తనకి ఎలాగైనా బెయిల్

రావాలనీ హైదరాబాదు నుంచి ప్రముఖ హైకోర్టు లాయర్ అశ్వనీ సక్సేనాని రప్పించాడు వరుణ్ ప్రసాద్.

ఐదురోజుల క్రితం వరుణ్ని అరెస్ట్ చేసిన తరువాత అతన్ని కోర్టు లో హాజరు పరిస్తే జడ్జి గారు అతనికి పదిరోజుల రిమాండు విధించారు;అప్పటి నుంచి రఘువీర్ నేతృత్వంలోని పోలీసుల బృందం రాత్రి, పగలు కష్టపడి వరుణ్ కి వ్యతిరేకంగా చాలా ఆధారాలు సేకరించారు.

అనూష, వరుణ్ దాంపత్య సంబంధాలు, వాళ్ళ మధ్య జరిగిన అంతః కలహాలు, గోపాలరావు కారు ఏక్సిడెంట్ వెనక వరుణ్ హస్తం ఉన్న విషయాన్ని తెలిపే సాక్ష్యాలు... ఇలా కోర్టులో వరుణ్ణి హంతకుడిగా నిరూపించేందుకు పోలీసు వాళ్ళు చాలా ఆధారాలు సేకరించిన విషయాన్ని వరుణ్ లాయర్లు హైదరాబాదు నుంచి వచ్చిన సక్సేనా చెవిన వేసారు...

ఉదయం పదిగంటల సమయంలో అనంతరావు, ప్రకాష్ కోర్టుకి వెళ్తున్న సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ వచ్చాడు...

"ప్రతాప్! మేం సంపాదించిన సాక్ష్యాలన్నీ బాగా స్టడీ చెయ్యి... కోర్టులో ఎక్కడా మనం తడబడ కూడదు. మన ప్రత్యర్థి డిఫెన్స్ లాయర్ సుప్రీంకోర్టు లాయరన్న ఆలోచన రానీయకుండా మనం జాగ్రత్త పడాలి. ఒకసారి శత్రువు బలవంతుడనీ అతని దగ్గర శక్తివంతమైన ఆయుధాలున్నాయనీ తెలిస్తే మనం యుద్ధం చెయలేము... ఈ విషయం గుర్తు పెట్టుకొనీ వాదించాలి. నీకేం సందేహాలొచ్చినా మేమిద్దరం పక్కనే ఉంటాము..." అనీ చెప్పాడు అనంతరావు...

"అనంత్! హత్య జరిగి నెలరోజులవుతునాది. ఈలోగా అతన్నుంచి చాలా విషయాలు సేకరించాము. ఇంకా అతన్ని జైల్లో ఉంచాలనుకోవడం తప్పనీ నా భావన. మనం ముద్దాయి బయట ఉంటే సాక్ష్యాలు తారుమారు చేస్తాడనీ, సాక్షులను ప్రభావితం చేస్తాడనీ చెప్పినా కోర్టు మన వాదనలతో ఏకీభవించదు. ఎందుకంటే నెలరోజుల సమయం చాలా ఎక్కువ. అదీ కాక అందరి సాక్ష్యాలూ, స్టేట్మెంట్లు తీసుకున్నాము. అన్ని పరీక్షలు పూర్తయ్యాయి. ఇంకేం తారుమారు చేస్తాడు. ఇంకా అతన్ని జైల్లో ఉంచడం వల్ల ఏమిటి లాభం?" అన్నాడు ప్రతాప్.

"అంటే నీ ఉద్దేశం ఏమిటి? అతనికి బెయిల్ ఇవ్వాలని మనమే కోర్టుని కోరదామంటావా?"

"కేసు ఇప్పుడే మొదలైంది. మొన్ననే కదా ఛార్జీషీట్ ఫైల్ చేసాము. ముద్దాయిని బంధించి అతని నేరాన్ని రుజువు చెయ్యాలనుకోవడాన్ని కోర్టు ఒప్పుకోక పోవచ్చు. అయినా ఇంత త్వరగా మనం ఈ కేసులో వాదనలు వినిపించడంవల్ల సరియైన సాక్ష్యాలను ప్రవేశపెట్టి అతన్ని దోషిగా తేల్చే అవకాశాలు మనకి తగ్గిపోవచ్చు..." ప్రతాప్ చెప్పాడు.

"అంటే ఇప్పుడు మనం ఏమి చెయ్యాలి?"

అనంతరావులో అసహనం మొదలైంది.

"ప్రస్తుతానికి అతని బెయిల్ని వ్యతిరేకించవద్దు. అతన్ని వదిలేద్దాం... ఆ తరువాత మనకి బోలెడు సమయం దొరుకుతుంది. అప్పుడు మనం సరియైన సాక్ష్యాలని సేకరించి పకడ్బందీగా మన వాదనల్ని కోర్టుకి వినిపించవచ్చు. అప్పుడు ఈ కేసుని గెలిచే అవకాశాలు పెరుగుతాయి." అన్నాడు.

"అంటే ఈ సాక్ష్యాలు సరిపోవా?"
"సరిపోవు అనంత్! ఇది కోల్డ్ బ్లడెడ్ మర్డర్ కేసు. ముద్దాయి ఓ యువ పారిశ్రామికవేత్త... క్రిమినల్ స్వభావం ఉన్నవాడు. పెద్ద లాయర్ల బలగం కలిగినవాడు. అవసరం అయితే ఈ దేశపు ప్రఖ్యాత లాయర్లను ఛార్టెర్డ్ విమానాల్లో తీసుకురాగల శక్తి ఉన్నవాడు. అటువంటి వాడిని ఉరికంబం ఎక్కించాలంటే తొందరపడకూడదు... సింహంలా కొద్దిగా వెనకడుగు వేసి అదును చూసి ముందుకు వురకాలి... అప్పుడే అది చావుదెబ్బవుతుంది..."

సుదీర్ఘంగా వివరించాడు ప్రతాప్.
"అయితే ఈరోజు మనం కోర్టులో ఏం చెప్పాలి?"

"ఏం వద్దు... వాళ్ళు బెయిల్ అడిగితే వ్యతిరేకించవద్దు. వాళ్ళకి కొద్దిగా రిలాక్సేషన్ ఇవ్వు... పోలీసులు సరిగ్గా కేసుని పరిశోధించటం లేదు అనే ఆలోచన కలిగించుదాం... ఆ తరువాత మన అస్త్రాలను తీద్దాం... ప్రస్తుతానికి వాడిని వదిలేయ్... తరువాత చూద్దాం" అన్నాడు ప్రతాప్.
ప్రతాప్ మాటలు అనంత్ కి రుచించక పోయినా తప్పక ఒప్పుకున్నాడు.. కొద్ది సేపటి తరువాత అతనికి ప్రతాప్ మాటలు నిజమేననిపించాయి.

పదకొండు గంటలకు కోర్టులో వాదనలు మొదలయ్యాయి. ప్రభుత్వం తరఫున సిఐ అనంతరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్, డిఫెన్స్ తరఫున లాయర్ సక్సేనా హాజరయ్యారు.

ముందుగా ప్రతాప్ లేచి "యువరానర్ నాలుగు రోజుల క్రితం అనూష అనే ముప్పై ఏళ్ళ స్త్రీ హత్య చేయబడిింది... ఆమె తండ్రి గోపాలరావు ఒకప్పుడు ఈ జిల్లాలోనే ప్రముఖ పారిశ్రామికవేత్త... ఎన్నో పరిశ్రమలను పెట్టి చాలామంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన మంచి వ్యక్తి. ఈ జిల్లా అంటే ఎంతో ఇష్టం అతనికి. అతను ప్రస్తుత ముద్దాయి అయిన వరుణ్ ప్రసాద్ కి తన కంపెనీలో మంచి ఉద్యోగం ఇచ్చి తరువాత తన ఏకైక కుమార్తె అనూష నిచ్చి పెళ్ళి చేసాడు. అతని మీద నమ్మకంతో తన కంపెనీ వ్యవహారాలన్నీ అప్పచెప్పాడు. దురదృష్టవశాత్తు ఆరు నెలల క్రితం అతను ఓ కారు ప్రమాదంలో చనిపోయాడు. ఆ తరువాత కంపెనీల మీద పెత్తనం వరుణ్ ప్రసాద్ తీసుకున్నాడు. అధికారులందరినీ మార్చివేశాడు. తన వారి నందరినీ ఉన్నత స్థానాల్లో కూర్చోపెట్టాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలొచ్చాయి. దాంతో అనుష్క ఆర్థిక విషయాల్లో కఠినంగా వ్యవహరించడం మొదలు పెట్టింది. అతనికి చెక్ పవర్ని రద్దు చేసింది. ఆస్తుల మీద అతనికి హక్కులు లేకుండా చర్యలు తీసుకుంది...

వరుణ్ ప్రసాద్ రాను రాను చెడు అలవాట్లకు లోనయ్యాడు. మద్యానికి అలవాటు పడ్డాడు... ఎప్పుడైతే భార్య తనని డబ్బుకి, అధికారానికి దూరం పెట్టిందో అప్పట్నుంచీ అతను ఆమె మీద కక్ష పెంచుకన్నాడు. ఒకరోజు రాత్రి నౌకర్లను తెలివిగా బయటకు పంపించి భార్యను గొంతు నులిమి తరువాత ఉరివేసి చంపేసాడు. దిసీజ్ బ్రూటల్ కోల్డ్ బ్లడెడ్ మర్డర్... దారుణ హత్య... కేవలం డబ్బు కోసం చేసిన పైశాచిక హత్య... ఇతనే ఆ హత్య చేసాడనడానికి ఎన్నో సాక్ష్యాలు దొరికాయి. అన్నీ స్టేట్మెంట్ ల రూపంలో ఛార్జీషీట్ లో పొందు పరిచాము. అయినా ఇంకా చాలా విషయాలు ముద్దాయి నుంచి సేకరించాల్సివుంది; కాబట్టి నిందితుణ్ణి 5 రోజుల పాటు పోలీస్ కస్టడీకివ్వవలసిందిగా కోరుచున్నాము" అనీ చెప్పి కూర్చున్నాడు ప్రతాప్.

ఎదురుగుండా సర్కిల్ ఇన్స్పెక్టర్ అనంతరావు, బోనులో వరుణ్, పక్కనే డిఫెన్స్ లాయర్ అశ్వనీ సక్సేనా... అందరూ అతని వాదనలను ఆసక్తిగా విన్నారు.
"డిఫెన్స్ వారి వాదన ఏమైనా ఉందా?" అని అడిగారు జడ్జి...
వెంటనే సక్సేనా లేచి తన వాదనల్ని మొదలు పెట్టాడు.

"పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారు అతి తెలివిగా జరగనిది జరిగినట్లు, చెయ్యనిది చేసినట్లు కోర్టుని నమ్మించ డానికి చేసిన ప్రయత్నాన్ని నేను అభినందించకుండా ఉండలేకపోతున్నాను... పేపర్లు, ఛానెళ్ళ వార్తల ఆధారంగా వండి వార్చిన కథ ఈ ఛార్జిషీట్... నా క్లయింట్ ని ముద్దాయిగా పేర్కొన్న పోలీసులు సరియైన ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయారు. భార్యాభర్తల మధ్య చాలా రోజుల నుంచి స్పర్థ లున్నాయి అన్న వాదనకు సరియైన ఆధారం ఒక్కటైనా చూపించగలిగేరా? పోలీసులు హడావుడిగా సరియైన పరిశోధన చెయ్యకుండా నా క్లయింట్ మీద ఆధారాలు లేని ఆరోపణలు చేసారు... ఏదైనా సరే ఈ ఆరోపణలకి మేం సరియైన వాదనలు వినిపిస్తాము... ఛార్జిషీటిని మేము పూర్తిగా పరిశీలించాలి. అందుకు సమయం కావాలి. పోలీసులు తమ ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి ఛార్జిషీట్ రూపొందించారు కాబట్టి నా క్లయింట్ ని జుడీషియల్

కస్టడీలో ఉంచడం అనవసరమనీ నా అభిప్రాయం. నా క్లయింటికి పోలీసులు ఛార్జిషీట్లో పేర్కొన్న ఆరోపణలతో ఏ విధమైన సంబంధం లేదు... ఆ హత్య జరిగిన రోజు రాత్రి నా క్లయింట్ ఆ ఊళ్ళోనే లేడు. ఈ ఒక్క ఆధారం చాలు అతను నిర్దోషనీ చెప్పడానికి. కాబట్టి వెంటనే నా క్లయింట్ కి బెయిల్ ఇప్పించవలసిందిగా కోరుచున్నాను" అంటూ తన వాదనని ముగించాడు సక్సేనా; జడ్జిగారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైపు తిరిగి "అతనికి బెయిలిస్తే మీకేమైనా అభ్యంతరమా?" అని అడిగాడు.

వెంటనే ప్రతాప్ లేచి "మాకభ్యంతరం లేదు. మళ్ళీ హియరింగ్ నాడు మరిన్ని ఆధారాలతో వస్తాము" అన్నాడు... వెంటనే జడ్జిగారు "ముద్దాయికి బెయిల్ మంజూరు చేస్తూ ఈ కేసుని మళ్ళీ నెల 15కి వాయిదా వేస్తున్నాను" అంటూ వెళ్ళిపోయారు.

వెంటనే అనంతరావు ప్రతాప్ దగ్గరకు వచ్చి "వాడి బెయిల్ను వ్యతిరేకించకుండా ఒప్పేసుకోవడం నాకు నచ్చలేదు ప్రతాప్... ఇంకో నెలరోజులు వాడు జైల్లో ఉంటే తెలిసేది వాడికి పోలీసులంటే ఏమిటో?" అన్నాడు కోపంగా... ప్రతాప్ ఫైలును పట్టుకొని లేస్తూ "ఇప్పుడు వాడి మీద కక్ష పెట్టుకుంటే లాభం లేదు... ముందు ఆధారాల మీద మనసు పెట్టు... మనకున్నది ఇంకో నెల రోజులే... సరియైన ఆధారాలు లేకపోతే కేసు వీగి పోయే ప్రమాదం ఉంది. క్రిమినల్ కేసులలో పోలీసుల విజయ శాతం అతి తక్కువన్న సంగతి నీకూ తెలుసు..." అన్నాడు ప్రతాప్ అనంతరావుని కవ్విస్తూ...

"భార్యని పాశవికంగా చంపిన వాడినొదిలే ప్రశ్నేలేదు ప్రతాప్! ఈ కేసు నా పోలీసు వృత్తికే ఛాలెంజ్... వాడిని ఉరికంబం ఎక్కిస్తే గానీ ఊరుకోను" అన్నాడు అనంతరావు.

వాళ్ళిద్దరూ కోర్టు వరండాలో నడుస్తూ మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో వాళ్ళ కెదురుగా వరుణ్, అతని లాయర్ సక్సేనా వస్తూ కనిపించారు.

వరుణ్ ఇనస్పెక్టరు అనంతరావుని క్రీగంట చూసి, ఓ నవ్వు నవ్వాడు. ఆ నవ్వులో "నువ్వు నన్నేం చెయ్యలేవు అన్న వ్యంగ్యం వినిపించింది అనంతరావు కి; దాంతో అనంతరావు కోపం నషాళానికి అంటింది...

"నేరస్తుడు ఒకసారి తప్పించుకున్నంత మాత్రాన వాడు నేరస్తుడు కాకపోడు... నిన్ను ఎట్టి పరిస్థితుల్లో వదలను" అన్నాడు అనంత్ వరుణ్ వైపు చూస్తూ;
" ఇన్స్పెక్టర్ !నేనే హత్య చేసానని నువ్వనుకుంటున్నావు కదూ... దమ్ముంటే నిరూపించు " అన్నాడు వరుణ్;

"కోర్టులో నిన్ను దోషిగా నిలబెట్టే దాకా నిద్రపోను... నీ భవిష్యత్తు జైల్లోనా లేక బయటా అన్నది కొన్ని రోజుల్లో తేలబోతోంది. దానికి సిద్ధంగా ఉండు" అన్నాడు అనంత్. ఆ తరువాత వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

★★★

కారు స్పీడుగా పోతోంది... వెనక సీట్లో వరుణ్ ప్రసాద్, అతని లాయర్ సక్సేనా కూర్చుని ఉన్నారు. గంట క్రితమే కోర్టు వరుణ్ కి బెయిల్ ఇచ్చిన తరువాత వాళ్ళిద్దరూ కారులో ఇంటికి బయలుదేరారు.

"వరుణ్! నీ కేసుని పోలీసులు ఛాలెంజ్ గా తీసుకున్నారని పిస్తోంది... వాళ్ళు నిన్ను అంత సులభంగా వదిలిపెట్టేటట్లు లేరు... నువ్వే హత్య చేసావనీ వాళ్ళు పూర్తిగా నమ్ముతున్నట్లు అనిపిస్తోంది... నెలరోజుల తరువాత ఈ కేసు మళ్ళీ సెషన్స్ కి వస్తుంది... అప్పటికి మరిన్ని సాక్షాలు సంపాదిస్తారు వాళ్ళు. ఇటువంటి వాతావరణంలో ఈ కేసుని వాదించటం అంత సులభం కాదనిపిస్తోంది... మీరు పెద్ద క్రిమినల్ లాయర్ని తెచ్చుకుంటే మంచిది. వాళ్ళే ఇటువంటి క్రిమినల్ కేసుల్ని వాదించగలరు" అన్నాడు సక్సేనా...

అతని మాటలు వరుణ్ కి బాగా కోపాన్ని తెప్పించాయి. "సక్సేనా గారూ... ఢిల్లీ నుంచి పెద్ద పెద్ద







లాయర్లని తెచ్చి ఈ కేసుకి లేని ప్రాధాన్యత కల్పించదల్చుకోలేదు. ఈ కేసుని మీరే వాదించండి”అన్నాడు వరుణ్...

“నిజానికి నువ్వు రిక్వెస్ట్ చేసావనీ వచ్చాను కానీ మేము సివిల్ దావాలు ఎక్కువగా వాదిస్తుంటాము. క్రిమినల్ కేసుల్ని వాదించే అవకాశం మాకు రాలేదెప్పుడూ. క్రిమినల్ కేసులు వాదించాలంటే చాలా తెలివితేటలు, మాటకారితనం, స్పాంటేనిటి, సి.ఆర్.పి.సి.ని ఔపాసన... ఇవన్నీ ఉన్నవాళ్లు అవసరం... అటువంటి వాళ్ళు మీ లీగల్ సర్వీసెస్ లో లేరు...” అన్నాడు సక్సేనా.

“సక్సేనా... దీన్ని మీరు అనవసరంగా పెద్ద కేసుగా ప్రొజెక్ట్ చేస్తున్నారు... ఇది చాలా సింపుల్ కేసు. నేను హత్య జరిగిన రోజు ఇక్కడ లేను. అది చాలదా నేను నిర్దోషిని అనీ నిరూపించటానికి... నేను ఓ పెద్ద పారిశ్రామికవేత్తననీ, బాగా డబ్బున్నవాడిననీ, అందువల్ల ఎంత డబ్బైనా ఖర్చు చేసి పెద్ద పెద్ద క్రిమినల్ లాయర్లనీ పెట్టుకోగలననీ దీన్ని ఓ టిపికల్ కేసుగా మార్చొద్దు... ఈ కేసుకి పెద్ద లాయర్లు అవసరం లేదు. మీరన్నట్లు ఏ పెద్ద లాయర్నో ఢిల్లీ నుంచి తెస్తే కేసుకి అనవసరపు ప్రాధాన్యత పెరిగి నాకు, మా కంపెనీలకు చెడ్డపేరు వస్తుంది. ఏం మీ కంపెనీలో ఈ చిన్న క్రిమినల్ కేసుని వాదించటానికి క్రిమినల్ లాయర్లు ఎవ్వరూ లేరా?” అసహనంగా అడిగాడు వరుణ్...

“అహా... లేరనీ కాదు... ఒకతను ఉన్నాడు. అతను కూడా ఈ మధ్యన డబ్బున్న వాళ్ళ కేసులేవీ వాదించటం లేదు... అయినా అతనితో మీరు పడలేరు” అన్నాడు సక్సేనా.
“ఏం... అతను అంత గొప్పవాడా? లేక వాదించటం ఇష్టం లేదా?”
“కాదు... చాలా తెలివైనవాడు. కేసు టేకప్ చేస్తే తిరుగుండదు... కానీ టేకప్ చెయ్యాలంటే చాలా కండీషన్లు పెడతాడు... ముందు అతను పూర్తిగా నమ్మితేనే కేసుని వాదిస్తాడు. కానీ బ్రిలియంట్ క్రిమినల్ లాయర్” అన్నాడు సక్సేనా.

★★★

“ఎవరతను?” ఉత్సుకతతో ప్రశ్నించాడు వరుణ్.

“లాయర్ భరద్వాజ్...”

“నేనతనితో మాట్లాడవచ్చా? లేకపోతే మీ లీగల్ సిండికేట్ ద్వారా మాట్లాడాలా?” వరుణ్ అడిగాడు.

“;మీరే మాట్లాడొచ్చు... ఎప్పుడైనా సోమవారం నుంచీ శుక్రవారం దాకా... వీకెండ్స్ దొరకడు” అన్నాడు సక్సేనా...

కారు వరుణ్ ఇంటి ముందర ఆగింది...

వరుణ్ లాయర్ పేరుని “భరద్వాజ్”... అనీ గుర్తుపెట్టుకోసాగాడు.

(ఇంకా ఉంది )

సీరియల్



# రెప్పచాటు స్వప్నం

నామాని సుజనాదేవి

దేవుడి దగ్గర పెట్టడానికి తోటలోకి వచ్చి, పచ్చని ఆ చెట్లను చూసి మైమరచి, "ఎంత సుందరమైనదీ భగవానుడోసగిన బహుమతి..." అంటూ పాడుతున్న ఉమ నీళ్ళు పోయడానికి పైప్ తో వచ్చిన మహేష్ ను చూసి మౌనం దాల్చింది.

"అందమైన తోటలోకి పాట ఒకటి వచ్చింది. కన్నుల్లో నీరు తుడిచి కమ్మని కల .." పాట గుర్తొచ్చింది అతనికి.

"ఎందుకు ఆపేశారు? ఇంత అద్భుతమైన కంఠం ఉన్నా మీ టాలెంట్ ను ఎప్పుడూ బయటకు పెట్టరు. ఎప్పుడూ ముభావంగా ఉంటారు. ఎందుకు మీకు మా మగజాతి మీద అంత కోపం. మీరు నన్ను మీ ఆత్మీయులు అని భావిస్తే చెప్పండి..." అన్నాడు సూటిగా.

అనుకోని ఈ పరిణామానికి ఆమె నివ్వెరపోయింది. కానీ ఆమె గతాన్ని తెల్సుకుంటే అతనికి కూడా మొత్తం మగజాతిపై అసహ్యం కలుగుతుందని ఆ క్షణాన అతనికి తెలియదు.

★★★

## సీరియల్

మహేష్ ని చూడగానే ఎందుకో తన మనసు పురి విప్పిన నెమలిలా ఆడుతుంది. దారీ తెన్నూ లేక దిక్కూ గమ్యం లేక ప్రయాణిస్తున్న నావకు ఆసరా దొరికితే కలిగినంత ఆనందం కలుగుతుంది. ఇదంతా ఎందుకో ఆమెకు అర్థం కావడం లేదు. కానీ మగవారిని చూస్తేనే కోపంతో, భయంతో వణికిపోయే ఉమకు అతని సన్నిధి పెన్నిదిలా ఎందుకు అనిపిస్తుందో అర్థం కావడం లేదు.

'ఎవరదీ! ఎవరదీ... ఇంతగా నను వెంటాడేదేవరదీ...
దిక్కులేని పేద యింట దీపము వెలిగించేది...
మోడుకు గిలిగింత పెట్టి మొగ్గలు తొడిగించేది...' అనే బోయి భీమన్న గారి గేయం గుర్తొస్తుంది ఉమకి.

"మా చెల్లెలి పరిస్థితి కి నేనెంత కదిలిపోతున్నానో, ఆడవారి పట్ల నాకెంత గౌరవమో తెలిసి కూడా మీరు చెప్పడం లేదంటే, మీకింకా నాపై నమ్మకం కుదరడం లేదనే కదా! ఈవేళ అలా అన్నీ బయటకు చెప్పిన వెన్నెల ఆరోగ్యం ఎంతలా కుదుట పడుతుందో చూసారు కదా! ఈ రోజు చూడండి ఎంతో సంతోషంగా మీ తమ్ముడితో క్యాన్సర్ గురించి మరొకరికి మనోధైర్యం చెప్పడానికి వెళ్ళింది. ఇప్పుడే చెబుతున్నా వినండి. ఇక్కడున్న ఈ పంచ భూతాల సాక్షిగా చెబుతున్నాను. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు లేకుండా ఉండలేను. మీరు వద్దన్నా నేను ఆజన్మాంతం బ్రహ్మచారిగానే మిలిగిపోతాను. ఇప్పుడు చెప్పండి, మీకు చెప్పబుద్ది అవుతే... "

" వద్దు. వద్దూ... నేను మీకు అర్హమైన దానిని కాదు. ఈ జన్మకు నేను ఇంతే! నాలో ఏ స్పందనలు ఉండవు. నేను బతుకుతున్న జీవచ్ఛవాన్ని"

"ఎవరన్నారు? నేను మీ జీవితంలో వసంతం కురిపిస్తాను. దయచేసి చెప్పండి. జైల్లో ఎవరున్నారు? మీకు మగవారంటే ఎందుకు కోపం? ఇప్పుడు చెప్పకపోతే ఇక ఎప్పుడూ నేను మీ వంక చూడను. మాట్లాడను. ఈ జీవితంలో మీకు నా మొహం చూపను..."

"అయ్యో! అయ్యో! ఆ ఘోరాన్ని ఈ నోటితో ఎలా చెప్పాలి? కంచే చేనుమేస్తే ఆ చేనుకు కాపలా ఎవరు? ఎవరు?... ఎవరు?" అంటూ స్పృహ కోల్పోయింది ఉమ.

అనవసరంగా ఆమెను బాధ పెట్టాను అనుకున్న మహేష్, ఆమెను చూసి పాలేరును కారు తలుపు తీయమని చెప్పి, అమాంతం స్పృహలో లేని ఆమెను ఎత్తుకుని కారు వెనక సీట్లో పడుకో బెట్టాడు. వెన్నెల కౌండిన్య బయటకు వెళ్ళి ఉండడం తో ఇంట్లో అమ్మతో హాస్పిటల్ కి అని చెప్పి బయల్దేరాడు.
వెళ్ళగానే ఫ్రెండ్ అయిన డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆయన పరీక్షించి, విషయం విని ఎందుకైనా మంచిదని సైకియాట్రిస్ట్ డాక్టర్ దగ్గరకు పంపించాడు. ఆయన, " ఆమె మనసులో దేనికో తీవ్ర సంఘర్షణ పడుతున్నది. అది పూర్తిగా బయటకు వస్తే ఆమె మనసు భారం దిగి మామూలు మనిషి కావడానికి అవకాశం ఉంది." అంటూ ఆమెను అలాగే ట్రాన్స్ లోకి తీసుకెళ్ళి, ప్రశ్నలను అడగడం మొదలుపెట్టాడు.

"నీ పేరేంటి?"

"ఉ..ఉమా...ఉమా మహేశ్వరి"

"మీ అమ్మ పేరు?"

" కా.. కాత్యాయని"

"నాన్న పేరు?"

"ఛీ...నాన్న కాదు..వాడు పశువు..."

"ఎందుకు నీకు మీ నాన్న అంటే కోపం?"

"వాడు...వాడు...అమ్మను ,, అమ్మను కొట్టేవాడు...తాగుతాడు... తాగి.. నన్ను..." అంటూ ఏడుస్తూ మళ్ళీ ఫిట్స్ లాగా వచ్చేసరికి మళ్ళీ కాస్సేపు గాప్ ఇచ్చారు. ఇలా చాలా అతి ప్రయత్నం మీద అసలు విషయం తెలుసుకోగలిగారు.

"అల్లారుముద్దుగా పెంచాల్సిన తండ్రే కాలనాగై కాటేస్తే, కీచకుడిలా ప్రవర్తిస్తే, కాలయముడై కాలరాస్తే నోటితో చెప్పలేని, చెప్పుకోలేని ఆ ఘోరాన్ని ఎలా చెప్పగలను?" ఏడుస్తూ పీలగా భయం భయంగా వస్తుంది ఆమె కంఠం.

"ఏంటి మీరంటున్నది?

# సీరియల్

**జరిగిన కథ**
మహేశ్వరీ కాలేజి హాస్టల్ లో ఉంది చదువుకుంటూ ఉంటుంది .వెన్నల తన రూం మెట్ .శ్రీరామనవమికి మహేశ్వరీ వెన్నల వాళ్ళ ఉరు వెళుతుంది .అక్కడ వెన్నల అన్నయ్య మహేష్ పరిచయమౌతాడు .
**ఇక చదవండి**

ఇలాంటి వారు కూడా ఉంటారా? అసలేమైంది, దాచకుండా చెప్పండి. మీకు నేను దారి చూపుతాను. దయచేసి ఏడవకుండా చెప్పండి"డాక్టర్ అంటుంటే, అతికష్టం పై వణుకుతూ ఏడుస్తున్న ఆమె చేయి పట్టుకుని నెమ్మదిగా నిమురుతూ ఉన్నాడు మహేష్. ఆ చేయిలో ఆమెకు భరోసా దొరికింది. ఇన్ని రోజులు ఎవరూ ఇవ్వలేని ధైర్యం దొరికింది. నెమ్మది నెమ్మదిగా సాంత్వన పొందిన మనసు కలలోలా గతాన్ని అతని ముందు పరిచింది.

"మా నాన్నకు నేను, తమ్ముడు ఇద్దరం. నాన్న బాగా తాగుడుకు అలవాటు పడ్డాడు. అమ్మ ఎంత చెప్పినా వినకుండా తాగేవాడు. ఒక్కోసారి అమ్మను కొట్టేవాడు. అమ్మ ఆ మానసిక వ్యాధి వల్లనో ఏమో కాని బాగా అనారోగ్యంతో ఉండేది. అయినా మమ్మల్ని చాలా మంచిగా చూసుకునేది. ప్రతిరోజూ కింద చాప వేసుకుని పడుకునే అమ్మప్రక్కన నేను పడుకునే దాన్ని. మద్యం మత్తులో అప్పుడప్పుడు వెకిలిగా నాతొ ప్రవర్తిస్తున్న నాన్న గురించి, ఎవరికీ చెప్పుకోలేక గొడవ పెట్టుకునేది అమ్మ. మద్యం మత్తులో ఒకరోజు రాత్రి విచక్షణ కోల్పోయిన నాన్న ... ఆ పశువు నా పక్కన పడుకుని.... నన్ను ...నన్ను..."

"ఇంకేం చెప్పొద్దు... రిలాక్స్.... మర్చిపో... ఒక్కసారి గుండెలో ఉన్నది బయటకు చెప్పితే గుండెలోని బాధ తీరిపోయి తేలికవుతుంది. మరోసారి అంత బాధ ఉండదు. రిలాక్స్... నీవిప్పుడు సురక్షితంగా ఉన్నావు. నిన్ను ఎవ్వరూ చేరలేరు. మొత్తం చెప్పేయి"

"ఆ రోజు రాత్రి వాడు నా పక్కన పడుకుని నన్ను ఎక్కడెక్కడో తాకుతుంటే, భయంతో గట్టిగా అరిచాను. ఆ అరుపుకు అమ్మ లేచింది. వాడు నా నోరు మూస్తున్నాడు. అమ్మ అపర కాళిక అయ్యింది. ప్రక్కనే ఉన్న చెంబుతో కొట్టింది. లేచి అమ్మను కొట్టబోతుంటే, పరుగెత్తి లోపలి నుండి కత్తిపీట తెచ్చి... కత్తిపీట తెచ్చి నా దగ్గరకు రాబోతున్న వాడి మేడపై వేసింది. అంతే వాడు వాడు చచ్చిపోయాడు. పీడా విరగడయ్యిందని నన్ను హత్తుకుని గట్టిగా పట్టుకుని ఏడ్చింది. పోలీసులు నన్ను నెట్టి, అమ్మను తీసుకుని పోయారు. మా అమ్మ... మా అమ్మ దేవత. ఏ తప్పూ చేయలేదు. చేయలేదు." అడగగా అడగగా టూకీగా చెప్పిన విశేషాలు విని ఇద్దరూ నిశ్చేష్టు లయ్యారు. చిన్న వయసులో ఆమె అనుభవించిన నరకానికి నివ్వెరపోయారు. ట్రాన్స్ లో ఉన్న ఆమెను అలాగే సిస్టర్ దగర ఉండనిచ్చి ఇద్దరూ బయటకు వెళ్ళారు. డాక్టర్ ఛాంబర్ లో కూర్చున్నాక, "ఇంత ఘోరం కూడా ఉంటుందా డాక్టర్!" షాక్ కి గురయిన మహేష్ అన్నాడు.

"మీకు ఇవి కొత్త కావచ్చు కాని మా ప్రొఫెషన్ లో ఇంతకు మించిన ఘోరాలు కూడా చూస్తూంటాం. అయినా మొన్న మీరు వార్తల్లో చూసే ఉంటారు. ప్రముఖ సినీ నటి కుష్బూ, మరొక ప్రముఖ క్రీడాకారిణి కూడా కన్న తండ్రి దాష్టీకానికి బలయినామని చెప్పడం. ఇంతకాలం ఇవి బయటకు చెప్పుకోలేక పోవడం వల్ల బయటకు రాలేదు. ఇప్పటికీ బయటకు రానివి ఎన్నో? ఇంతకు మించి కూడా కూడా వేరే దేశాలల్లో ఎన్నో ఉన్నాయి."

"నిజంగా చాలా ఉన్నాయంటారా? నాకు నమ్మబుద్ధి కావడం లేదు."

"అత్యాచారాలు లైంగిక వేధింపుల వల్ల ఒక్క 2021 లోనే 3300 మంది మహిళలు గర్భం దాల్చారు. తాజాగా తీసుకొస్తున్న బిల్లుతో ఇంగ్లాండ్, వేల్స్ లలో ఇలా అత్యాచారాల వల్ల పుట్టే పిల్లను నేరాలకు బాధితులు గా గుర్తిస్తామని బ్రిటన్ ప్రభుత్వం చెబుతోంది. 27 ఏళ్ల 'నీల్' తన తల్లిని కనిపెట్టేందుకు ఒక ప్రైవేట్ డిటెక్టివ్ ని నియమించి అతనిచ్చిన సీల్డ్ కవర్ ద్వారా తన తల్లితండ్రుల వివరాలు తెలుస్తాయని ఆశిస్తే గుండె పగిలే విషయాలు తెలిసాయి. అతన గుండెను కత్తితో ముక్కలు ముక్కలుగా చేసినట్లనిపించిందని, తల్లిని పార్కో గుర్తు తెలియని వ్యక్తి చేసిన అత్యాచారం వల్ల అతను పుట్టాడని. చాలా మానసిక వేదన అనుభవించాక తల్లిని కలుసుకుందామని వెళ్ళాడు. తనను చూడడం ద్వారా ఆమెకు తన గతం గుర్తొచ్చి ఆ అపరిచిత వ్యక్తి గుర్తొచ్చి ఆమె మనసు బాధపడితే, ఇప్పుడే వెళ్ళిపోతాను అని తల్లి తో చెబుతాడు. కాని ఆమె అందులో నీ తప్పు లేదు కదా అంటూ ఆత్మీయంగా అనడంతో నీల్ గుండె భారం దిగింది. నీల్ కి సంబంధించినంత వరకు అతనికి తల్లి మాత్రమె ఉన్నారు. అది చాలు అతనికి.

ఇక ' మాండీ ' ది ఇంకా ఘోరమైన అనుభవం. నాకు బిడ్డ ఒక మృగం వల్ల పుట్టాడు. అయినా నేను వాడిని ప్రేమిస్తాను. ఎందుకంటే ఇందులో వాడు చేసిన తప్పు ఏమీ లేదు. అంటుంది.

పదకొండేళ్ళ వయసులో ఉన్నప్పుడే మాండీ, గౌరవప్రదమైన వృత్తి అయిన కానిస్టేబుల్ గా ఉన్న స్వంత తండ్రి నుండే లైంగిక వేధింపులను ఎదుర్కొంది. రోజూ ఆమె బెడ్ రూమ్ లోకి వచ్చేవాడు. భయంతో ఎవరికీ చెప్పుకోవాలో తెలియక మాండీ ఎవరికీ చెప్పుకునేది కాదు. గర్భం దాల్చి ఆమె బిడ్డకు జన్మనిచ్చినప్పుడు హాస్పిటల్ లో తొలిసారి బిడ్డను అతని చేతులకే సిబ్బంది అందించి నపుడు అతనికి ఇవ్వద్దు అని గట్టిగా అరవాలని ఉన్నా అరవలేక పోయాను. అంటుంది ఆమె. తనకు, తన బిడ్డకు కూడా ఆ మృగమే తండ్రి అని ఎలా చెప్పాలి అని, సొంత తండ్రే శరీరంలోకి విషాన్ని ఎక్కించాడని ఎలా చెప్పేది అని ఎంత కుంగుబాటు కు లోనయ్యిందో చెబుతుంది. ఇలా ఎన్నో కేసులు ఉన్నాయి"

"రియల్లీ అన్బిలీవబుల్... వాళ్ళు అసలు మనుషులేనా?" కోపంతో బాధతో ఊగిపోయాడు మహేష్.

"రిలాక్స్ మహేష్! ప్రపంచం చాలా పెద్దది. మనకు తెలిసింది చాలా తక్కువ"

"ఇంతకీ ఉమ మామూలు మనిషి కావాలంటే ఏం చేయాలి?"

"కౌన్సిలింగ్ దాదాపు కనీసం పది సిట్టింగ్స్ అయినా తీసుకుంటే ఆమెను ఈ మానసిక కుంగుబాటు నుండి బయటకు తీసుకురావచ్చు. ఇంతకు మించి ఆ సంఘటన గుర్తు వచ్చినా బాధ పడకుండా ఆమెకు మానసిక ధైర్యం ఇవ్వాలి. అనంతమైన ప్రేమను, ప్రతిఫలాపేక్ష లేని ప్రేమను అందివ్వాలి. ఆమె ఆ ప్రేమలో తడిచి నమ్మకం కలగాలి. అప్పుడే ఆమె పూర్తిగా ఇందులో నుండి బయట పడుతుంది. ఇప్పుడు మనం ట్రాన్స్ లోకి తీసుకెళ్ళి నపుడు తనకు ఇష్టమైనవారు చెప్పమంటే అమ్మ, తమ్ముడు, వెన్నెల అంటూ మీ పేరు కూడా చెప్పింది. ఇందులో మీరు చెప్పిన దాని ప్రకారం వాళ్ళ అమ్మ దగ్గర ఉండి ధైర్యం ఇవ్వలేని పరిస్థితుల్లో ఉంది. ఇక తమ్ముడు మళ్ళీ ఉద్యోగానికి వెళ్ళాలి. వెన్నెలకు ఆరోగ్యం బాలేదు. ఆమెకే ఒకరి సహాయం అవసరం ఉంది. ఇక మిగిలింది మీరే! అంటే మీరు గట్టిగా ప్రయత్నిస్తే తప్పక త్వరలోనే ఆమె కోలుకుంటుంది"

"తప్పకుండా డాక్టర్ గారూ! ఆమె మనసులో నా పట్ల ద్వేషం లేదన్న నిజం నాకు అపరిమిత ఆనందాన్ని , ధైర్యాన్ని ఇస్తుంది.థాంక్ యు సో మచ్" అంటూ ఉమ కోలుకోగానే ఇంటికి తీసుకుని వచ్చేసాడు.

కౌండిన్య, వెన్నెల ఆరోజు రాత్రి తిరిగి వచ్చాక, కౌండిన్య ఉమా మహేష్ లను కల్సి, మీ ఇద్దరితో ప్రత్యేకంగా మాట్లాడాల్సిన పని ఉంది, అంటూ ఇద్దరినీ తోటలోకి తీసుకుని వెళ్ళాడు. ఇద్దరూ ఆశ్చర్య పోయారు.

ఉపోద్ఘాతం లేకుండా,"సర్! నేను వెన్నెలకు లివర్ ను డొనేట్ చేయాలని అనుకుంటున్నాను. మా టూర్ లో ఒక పెద్ద క్యాన్సర్ స్పెషలిస్ట్ ను కలిసాము. ఆయన చెప్పారు. నా లివర్ లోని కొంచెం పార్ట్ ఇచ్చినా మళ్ళీ త్వరలోనే నాలో

ఆ పార్ట్ పెరుగుతుందని. అలాగే అది వెన్నెలకు మంచి ప్లస్ పాయింట్ అవుతుందని. ఆమె ఆరోగ్యం తప్పక మెరుగవుతుందని. నాది తనకు సూట్ అవుతుందాని కూడా టెస్ట్ చేయించాను. డాక్టర్ అవుతుందని అన్నారు. కాబట్టి వీలయినంత త్వరగా ఈ పని చేయిస్తే మంచిది. ఎందుకయినా మంచిది ఈ విషయం వెన్నెలకు తెలియక పోవడమే మంచిది"

కౌండిన్య వి ఈ మాటలు పూర్తి కాలేదు. మహేష్ అతని రెండు చేతులు అందుకుని కళ్ళ కద్దుకున్నాడు.

"నిజంగా మాకు ఏ జన్మలో చేసుకున్న అదృష్టమో మీరు కలవడం. మీ మేలు మేము జన్మ జన్మలకు మర్చిపోలేము. నన్ను సర్ అనకండి. మనందరి మధ్యలో పరాయివాళ్ళ లా అవి వద్దు. పేరు పెట్టి పిలవండి" అంటూ కన్నీళ్ళతో ఆత్మీయంగా హత్తుకున్నాడు.

అయితే వీరంతా ఎక్కడికి వెళ్ళారో నని వెదుక్కుంటూ వచ్చిన వెన్నెల ఈ మాటలు వినవే విన్నది. ఆమెను అతి బలవంతంగా ఒప్పించారు.

వెంటనే ఏర్పాట్లు జరిగిపోయాయి. హాస్పిటల్ లో ఇద్దరికీ అమర్చాక డిశ్చార్జ్ చేయించుకుని ఇంటికి తీసుకుని వచ్చారు. కొన్ని రోజుల విశ్రాంతి తర్వాత కౌండిన్య మళ్ళీ టూర్ కి వెళ్ళాల్సి వచ్చింది.

ఆ కాంప్ లు ఇచ్చిన ఉత్సాహంతో వెన్నెల చాలా చలాకీగా తయారు కావడంతో కౌండిన్య తో పాటు ఆ కాంప్ లకు కూడా వెళతానని వెన్నెల పట్టుబట్టింది. ఆమె ఆరోగ్యానికన్నా ఇంకా ఎక్కువ ఏదీ కోరని తల్లి దండ్రులు, మహేష్ జాగ్రత్తలు చెబుతూ అంగీకారం తెలిపారు.

అందరికీ భరోసా ఇస్తూ రకరకాల రోగుల ద్వారా, మరి కొందరి ద్వారా తెలిసిన డాక్టర్ లు ఇచ్చిన ఆయుర్వేదిక మందులు, వారు చెప్పిన వ్యాయామాలు, పోషక పదార్థాలతో కూడిన ఆహారం లాంటివి అన్నీ శ్రద్ధగా కౌండిన్య అధ్వర్యంలో పాటిస్తూ రెగ్యులర్ చెకప్ చేయించుకుంటూ ఆమె ఆరోగ్యం రోజు రోజుకూ ఎలా మెరుగవుతుంది ప్రతిరోజూ ఇంట్లో వాళ్ళతో మాట్లాడుతూ ఉండేది వెన్నెల. నిజంగా కౌండిన్య పరిచయం ఆమెలో ఎనలేని మార్పు ఆత్మ విశ్వాసాన్ని తెచ్చినందుకు అందరూ వారు తమకు దేవుడు చూపించిన రూపాలు అనుకుని సంతోషపడ్డారు.

కౌండిన్య వారి సంస్థ ద్వారా సేవలు మాత్రమె కాదు, అతను సైకాలజీలో డాక్టరేట్ కూడా చేయడం వల్ల మంచి వ్యక్తిత్వ వికాస తరగతులు కూడా (పర్సనాలిటీ డెవలప్ మెంట్ ) ఇచ్చేవాడు. అతని వాగ్ధాటికి ముగ్దురాలయి పోయేది వెన్నెల.

★★★

క్రమక్రమంగా ఉమకు అర్థమయ్యింది తను మొత్తం విషయాలు చెప్పానని. తను అతనికి ఏమైతానని అతను తన గురించి అంత డబ్బు ఖర్చు చేస్తూ శ్రమ తీసుకుంటున్నాడు? అని ఆలోచించి సిగ్గుపడేది.

"తమ్ముడు వచ్చాక నా దగ్గరకు వస్తాడు. వాడి కోసం చూస్తూ ఇలా ఉండడం నాకు నచ్చలేదు. నేను వెళ్ళిపోతాను" అంది ఒకరోజు మహేష్ తో.

"మీ కోసం పది సిట్టింగ్స్ బుక్ చేసాను. ఇప్పటికి కేవలం ఆరు మాత్రమె అయ్యాయి. పైగా ఇప్పుడు మీకు అక్కడ యూనివర్సిటీ కి సెలవులే కదా! అక్కడికి వెళ్లి ఏం చేస్తారు? మీ ఆరోగ్యం ఇప్పుడిప్పుడే కుదుటపడుతుంది. ఈ కోర్స్ పూర్తిగా కానీండి" అన్నాడు మహేష్. అతను వారికున్న ఫాక్టరీ కి, వ్యవసాయ పొలాల దగ్గరకు తీసుకెళ్ళి అన్నీ చూపించాడు. అతని బిజీ చూసి పరిశ్రమ పనులలో , వ్యవసాయ లెక్కలు చూడడం లాంటి పనులన్నీ చేసేది ఉమ. ప్రతీ రోజు ఒక గంట పిల్లలకు, వయోజనులకు విద్య నేర్పించడం చూసి తానూ అందులో భాగం పంచుకుని అతని బాధ్యత తను తీసుకుంది.

"నేనెవరని నాకోసం ఇంత శ్రమ తీసుకుంటున్నారు. ఇంత ఖర్చు పెడుతున్నారు? నన్నింకా ఋణగ్రస్తురాలిని చేయకండి. మరేమీ అనుకోకుండా మీరు పెట్టిన డబ్బులన్నీ నాకు చెప్పండి. నేను మీకు ఫోన్ పే లో కొడతాను" అంది ఒకరోజు.

## సీరియల్

“నేనేం ఊరుకోను. వడ్డీతో సహా తీసుకుంటాను. కొంచెం పూర్తిగా నయం కానీయండి. ఈ సిట్టింగ్స్ అయ్యేంత వరకు మరోసారి వెళతానని మాత్రం మరోసారి నా దగ్గర అనొద్దు. ఇదేంటి ఇంత గట్టిగా చెబుతున్నాడు ? అనుకోకండి. మీరు ఆజ్ఞ అనుకోండి , వేడుకోలు అనుకోండి, వినతి అనుకోండి. మీరే పేరు పెట్టుకున్నా నాకు ఫర్వాలేదు ” అన్నాడు మహేష్. ఇద్దరికీ ఒకరి సాంగత్యం మరొకరికి బాగా నచ్చడంతో రోజులు క్షణాల్లా పరుగెడుతున్నాయి.

ఆ రోజు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి నపుడు, “హార్టీ కంగ్రాట్స్ ! రియల్లీ గుడ్ ప్రోగ్రెస్ ఇన్ హర్ హెల్త్. ఆమెకు ఇంకా మరేం సిట్టింగ్స్ అవసరం లేదు. పూర్తిగా మామూలు మనిషి అయిపోయింది” అన్నాడు.
ఇక ఆరోజు వచ్చాక, కౌండిన్య వాళ్ళు కూడా రావడంతో , “మేము వెళ్లిపోతాము” అంటూ ఇద్దరూ బ్యాగులు సర్దుకున్నారు. రెండు జంటలకి ఒకర్ని విడిచి ఒకరు ఉండడం అంటే దుర్భరంగా నే ఉంది. కాని ఇలా ఎంత కాలం? అనుకుని ఎవరికీ వారే మౌనంగా ఉండి పోయారు. చివరిసారిగా ఆ వూరి కోవెలలో దేవుడి దర్శనం చేసుకుని బయల్దేరడానికి బాగ్ లతో సహా గుడికి వెళ్ళారు.

కొత్త గా గుడిలో చేరిన పూజారి వారిరువురి జంటలను కొత్త జంటలు అనుకుని ఇరు జంటలకి ,”అన్యోన్య దాంపత్య ప్రాప్తి రస్తు. సత్ సంతాన ప్రాప్తి రస్తు… తథాస్తు” అని శటగోపం పెడుతూ దీవించడం. ఆ సమయంలోనే ఎవరో జేగంటలు వాయించడం చూసి అందరూ విస్తుపోయారు.
వారితో వచ్చి దూరంగా ఉన్న మహేష్ తల్లితండ్రులు వచ్చి, “ మంచి దీవెన ఇచ్చారు స్వామీ! మా మనసులోని మాట దేవుడి సమక్షంలో దేవుడే పలికించాడు.

మీకేవ్వరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉంటె చెప్పండి. లేదంటే ఒక్కో జంట జంటగా ఆ జేగంట మోగించండి” అన్నారు. కాస్సేపు మౌనంగా ఉన్నా ఉమా చేయి పట్టుకుని కదులుతున్న మహేష్ వెంట వెళ్ళి గంట కొట్టింది ఉమా. అలాగే కౌండిన్య వెన్నెల చేయి పట్టుకుని తీసుకెళ్ళడంతో ఆనంద భాష్పాలతో ఆ చేయి గట్టిగా పట్టుకునిగంట కొట్టింది.

“శుభం” అన్నాడు పూజారి. ఉమా ఫోన్ లో తల్లి విడుదల అవుతున్నట్లు ఫోన్ వచ్చింది. కౌండిన్య కి , క్యాన్సర్ జయించి అందరికీ మనోధైర్యం నింపుతూ చేసిన కాంప్ ల వల్ల వారి సంస్థ తరఫున వారిరువురికీ కలెక్టర్”స్ఫూర్తి అవార్డ్ లు మర్నాటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అందించ బోతున్నట్లు ఫోన్ వచ్చింది. ఆ శుభవార్తలతో అందరూ ఆనందించి ఆ దేవుడికి భక్తితో ప్రణమిల్లారు.

★★★★(శుభం-అయిపోయింది)

సీరియల్

# రాణాప్రతాప్





డా. పులిచెర్ల సాంబశివరావు

"మహారాణా ప్రతాపసింహులవారికి అభివాదములు!"

"ఎవరు మీరు?"

"నన్ను శీతలభట్టు అంటారు. కవిని!"

"కవీంద్రులా! నమస్కారం! రండి కూర్చోండి!"

శీతలభట్టు చుట్టూ కలయచూశాడు. కూర్చోవడానికి రాతిబండలు తప్ప ఏమీలేవు.

"మన్నించండి! ఈ మహారాణా నేడు దరిద్రుడు! ఈ నిరుపేదపై దయవుంచి ఆ శిలపై ఉపవిష్టులుకండి!"

శీతలభట్టు ఒక్క నిట్టూర్పు వదలి రాణా సమీపంలోని రాతి బండమీద కూర్చున్నాడు.







**జరిగిన కథ** అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు! ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా చిత్తోడ్ వదిలి నేను చుపించాచోట కోట నిర్మంచమని చెపుతాడు . దానికి ఉదయసింహుడి మంత్రులు అది పిచ్చి ఆలోచన అంటారు .కాని ఉదయ సింహుడి కొడుకు మాత్రం తండ్రి ఆజ్ఞ పాటించలంటాడు. అక్బర్ అనుమతితో బైరాంఖాన్ తన కరకు కరవాలంతో హేమూ శిరమును ఒక దెబ్బతో తెగనరికాడు .చిత్తోడ్ అక్బర్ వశంఅయ్యింది . అగ్ర కోటకి ఇరు వైపులా జయమల్, పత్తా విగ్రహాలను నిలిపాడు అక్బర్ .చిత్తోడ్ మొత్తం శ్మశానంలా మారిపోయింది.దానితో దిగులుతో మంచం ఎక్కాడు ఉదయ సింహుడు .చిన్నరాణి తనకొడుకు జగమ్మల్లుడికి పట్టాభిషేకం చెయ్యమంటుంది .మాట ఇచ్చి మరణిస్తాడు ఉదయ సింహుడు. కాని అక్కడి సర్దారులు అందుకు ఒప్పుకోరు . రాణాప్రతపుడికే పట్టం కడతారు .దానితో జగమల్లుడు పగ బడతాడు .రాజ మాన్సింగ్ షోలాపూర్ జయిస్తాడు .మాన్సింగ్ను రాణాప్రత్జాప్ అవమానిస్తాడు . తగిన గుణ పాఠం చెప్పాలని అక్బర్ అనుకుంటాడు .మాన్ సింగ్ ను సర్వ సైన్యా ధ్యక్షుడిగా నియమించి రణ ప్రతాప్ మీదకు యుద్దానికి పంపుతాడు అక్బర్ .రాజా రాం తన కొడుకు శాలివాహన్ తో యూద్దనికి వస్తాడు .రాజా జగన్నాధ్ వెన్నుపోటుతో దాందాస్ మరణిస్తాడు రాణాప్రతాప్ రామ్ప్రసాద్ అనే ఏనుగు ను మొఘులుల మీదకు పంపిస్తాడు. దాన్ని వాళ్ళు స్వాధీనం చేసుకుంటారు . ప్రతాప్ మాన్సిష్న తో తల పడతాడు . మొఘులుల సైన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతాప్ కు గాయాలవుతాయి.ఝులా ప్రతాప్ సుర్యద్వాజం తీసుకుని పారిపోతాడు .ప్రతాప్ పరిపోతున్నాడని అతని వెంటపడి అతన్ని హతమారుస్తారు మొఘులులు.గాయపడ్డ ప్రతాప్ ణి అతన్ని గుర్రం చేతక్ దూరంగా రహస్య ప్రదేశానికి తీసుకు వెళుతుంది

**ఇక చదవండి**

్రక్కన ఉన్న చెట్టుకొమ్మకు గుడ్డఊయల వ్రేలాడుతోంది. సమీపంలో గుహముందు మహారాణి పాతవస్త్రాలకు మాసికలు కుడుతోంది! ప్రక్కనే మహారాణా పుత్రిక చంపావతి చెల్లితో ఆడుకుంటోంది.

శీతలభట్టు మహారాణా కుటుంబ పరిస్థితిని గమనించి కరిగిపోయాడు. "మహాకవీ! ఈ పేద ప్రభువును చూడటానికి అడవులూ, కొండలూ దాటి వచ్చారా? రాణా అన్నాడు.

"ప్రతాపసింహా! నేడు మీదగ్గర ధనం లేకపోవచ్చు! రాజ్యం తరిగిపోవచ్చు. కానీ హిందూ మహాజనులందరికీ మీరే నిజమైన ఏడుగడ! మీ త్యాగం నిరుపమానం! మీ దేశభక్తి సర్వ భారతీయులకు ఆదర్శప్రాయం! మీ దర్శనభాగ్యంతో నా జీవితం సార్థకమైంది!" అని భావావేశాన్ని పట్టలేక లేచి ప్రతాపుని పాదములకు వంగి నమస్కరించి కన్నులకు అద్దుకున్నాడు.

"మహాకవీ! మీవంటి జాతీయవాదులైన కవీంద్రుల రచనలే మావంటివారికి స్ఫూర్తిదాయకాలు! దేశభక్తి ప్రబోధాత్మకములైన కవుల రచనలు జనులను జాగరూకు లను గావిస్తాయి! దేశ స్వాతంత్ర్యాన్ని సంరక్షిస్తాయి!"ఈ దేశంలో కవులకూ, కావ్యాలకూ కొరతలేదు మహారాణా! వేల సంవత్సరాల నుండి లక్షలమంది కవులు పుట్టుకొచ్చారు! కానీ, ఏరీ? మీవంటి దేశభక్తాగ్రగణ్యులు ఏరీ? కోటికొక్కడు రాణాప్రతాపుడున్నా ఇప్పుడు ఈ భారతావనికి ఇట్టి దుస్థితి పట్టుతుందా?

హిందూజాతి ఇట్టి దురవస్థలో పడుతుందా? మహారాణా! పారతంత్ర్యాంధకారంలోపడి మగ్గుతున్న హైందవ సంఘానికి వెలుగు ప్రసాదించడానికి వచ్చిన సూర్యభగవానుడిలా మిమ్ము సంభావిస్తున్నాను. మీరు హిందూ సూర్యులు!" "మీ అభిమానానికి కృతజ్ఞుడను కవీ! రాజులు కవులను ఆదరించి పోషించాలి!నేను నిర్ధనుడను! మీవంటి కవులను సన్మానింపలేని ఈ దీనుణ్ణి మన్నించండి!" అని రాణాకు ఏదో గుర్తుకువచ్చి మరలా అన్నాడు.

"మహాకవీ! అన్యథా భావింపక ఈ చిరుకానుక స్వీకరించండి!" అని తన తలపై ఉన్న వస్త్రాన్ని తీసి శీతలభట్టుకు అందించాడు రాణా! శీతలభట్టు ఈ హఠాత్సంఘటనకు నిర్విణ్ణుడైపోయాడు. కొంతసేపటికి తేరుకుని,రాణా ప్రసాదించిన వస్త్రాన్ని కన్నులకద్దుకుని, తన తలకు చుట్టుకున్నాడు. "మహారాణా! ఏ మహారాజూ ఏ మహాకవికీ చెయ్యని సన్మానం మీరు నాకు చేశారు. ఇందుకు నేను జీవితాంతం మీకు ఋణపడివుంటాను! నేను వెళ్ళివస్తాను!

నాకు సెలవు దయచేయండి!""మహాకవీ! మా ఆతిథ్యం స్వీకరించి వెళ్ళండి!" అంటూ మహారాణా మహారాణి వైపు చూశాడు.పాటేశ్వరీదేవికి ఈ మాటలు వినపడుతూనే ఉన్నాయి! నాథుడు కవికి ఆతిథ్యం ఇస్తానంటున్నాడు! తనదగ్గర ఏమీలేని సంగతి ఆయన విస్మరించి నట్లున్నాడు!ద్దకూతురు చంప తల్లి మనోభావాన్ని గ్రహించింది. లేచి గుహలోకిపోయి, ఒక ఆకులో గడ్డిరొట్టెను పెట్టుకొని తెచ్చి, కవికి ఇచ్చి, నమస్కరించింది!

శీతలభట్టు "చిరంజీవ చిరంజీవ! సుఖీభవ సుఖీభవ!!" అంటూ ఆ రొట్టెను అందుకున్నాడు. ఎన్నాళ్ళనుండి ఈ అడవుల్లోపడి నడుస్తూ వచ్చాడో ఏమో! తెగ ఆకలితో ఉన్నట్లున్నాడు. ఆత్రంగా ఆ గడ్డిరొట్టెను నోటపెట్టుకున్నాడు.

ఆకలి రుచి ఎరుగదు! ప్రతాపుడు ఆశ్చర్యంతో చూస్తున్నాడు. ఆయనకు తన పొరపాటు అర్థమయింది! ఆ రోజు తినడానికి ఏమీలేక తన కుటుంబమంతా పస్తున్నది. అలవాటు చొప్పున అతిథిని తాను భోజనానికి ఆహ్వానించాడు! ఆ క్షణాన తన పుత్రిక రొట్టె ఇవ్వకపోతే

ఇంకేమైనా ఉన్నదా? ఇంతకీ చంపావతికి ఆ రొట్టె ఎక్కడినుండి వచ్చింది? రాణాకుఅర్థం కాలేదు. శీతలభట్టు రొట్టెను ఆసాంతం నమిలి మ్రింగి, మట్టిలోటాతో నీళ్ళు తాగి బ్రేవ్ మని త్రేన్చాడు.

"మహారాణా! మీరు పెట్టిన ఈ రొట్టె అమృతతుల్యంగా ఉంది! ఇంత కమ్మటి రొట్టెను ఇంతవరకూ తిని ఎరుగను! దేనితో చేశారు దీన్ని?"

"అది... గడ్డిరొట్టె!" రాణా చెప్పలేక చెప్పాడు. కవి నిర్ఘాంతపోయాడు! తెలియకుండానే అతడి కళ్ళవెంట బాష్పబిందువులు జలజలా ప్రవహించాయి.

"మహారాణా! మీ ఔన్నత్యానికి ఈ గడ్డిరొట్టె పరమోదాహరణ! మీరు ప్రసాదించిన ఈ గడ్డిరొట్టె నా కవిత్వానికి ప్రాణం! ప్రణవం!! అన్నదాతా! భగవంతుడు త్వరలో మీకు సర్వసుఖాలను ప్రసాదించుగాక!" చివరి మాటను గద్గదస్వరంతో అంటూ కవి రాణాను దీవించి వెడలిపోయాడు!

"అమ్మా చంపా! ఆ రొట్టె నీకు ఎక్కడిది తల్లీ!" మహారాణా కుమార్తెను ప్రశ్నించాడు. "నాన్నగారూ! నిన్న అమ్మ ఇచ్చిన రొట్టె...!""నిన్న నీవు తినలేదా?"లేదు నాన్నగారూ! చెల్లి ఆకలి ఆకలి అని అమ్మను వేధిస్తుంటుంది! అందుకని..." "అందుకని... మూడురోజులనుండి నాకు అమ్మ ఇచ్చే రొట్టెలను దాచి చెల్లికి ఇస్తున్నాను...!" చంప నీరసంగా సమాధానమిచ్చింది.

దూరంగా కూర్చుని కూతురు మాటలు వింటున్న తల్లి పాటేశ్వరీదేవి దుఃఖాన్ని ఆపుకోలేక పరుగునవచ్చి, కుమార్తెను కౌగలించుకొని "మా తల్లి బంగారుతల్లి!" అన్నది. ఆమె కుమార్తెను స్పృశించినప్పుడు ఏదో అనుమానం వచ్చి, తనచేతిని ఆ పిల్ల నుదుటిమీద, పొట్టమీద ఉంచి చూచింది. వెచ్చగా తగిలింది. రాణి ఉలిక్కిపడింది.

"ప్రభూ! చంపావతికి జ్వరం

వచ్చినట్లుంది!" ప్రతాప్ కుమార్తెను తన ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. శరీరం పట్టి చూశాడు. నిజమే! ఆమెకు జ్వరం వచ్చింది!

"చంపా! అమ్మ నీకు ఇచ్చిన రొట్టెను నీవు తినకుండా ఇతరులకు ఎందుకమ్మా ఇచ్చావు?" రాణా లాలనగా అడిగాడు. "మీరేగదా చెప్పారు! ఇతరులు కష్టపడుతూ ఉండగా మనం సుఖపడగూడదని?

ఈ శరీరం పరులకు ఉపకారం చేయడానికే కదా నాన్నగారూ ఉన్నది! చెల్లి ఆకలితో ఏడుస్తుంటే నేను తినగలనా? అతిథి దేవుడితో సమానమని మీరు చెప్పారుకదా! అందుకే నా రొట్టెను ఇందాక వచ్చిన కవికి ఇచ్చాను!" కుమార్తె నీరసంతో చెబుతోంది.రాజా తన కుమార్తెను రెండు చేతులతో ఎత్తుకొనిపోయి గుహలో గడ్డిమీద పరుండబెట్టాడు.చంపావతి జ్వరం నిమిష నిమిషానికీ ఎక్కువవుతోంది.

పాటేశ్వరీదేవి పుట్టెడు దుఃఖంతో నోట్లో చెంగుపెట్టుకుని కుమిలిపోతోంది.

రాణా కుమార్తె శిరస్సును స్పృశిస్తూ, "పాపా! ఇంక ఎన్నాళ్ళో మనకు ఈకష్టాలుండవు తల్లీ! మనకు మంచిరోజులు వస్తాయమ్మా!" అన్నాడు. "అంటే... ఈసారి యుద్ధంలో అక్బర్ని మీరు చంపుతారా నాన్నగారూ!" రాణా మాట్లాడలేదు.

చంపకు అనుమానం వచ్చింది.



"ఈసారి యుద్ధంలో మీరు అక్బర్ని చంపి, మళ్ళా మమ్మల్ని ఉదయపూర్ తీసుకు వెళతారా?"

రాణా బదులు పలుకలేదు.

"నాన్నగారూ! మనకు ఇక కష్టాలుండవన్నారు! అక్బర్ను మీరు జయిస్తారు గదూ! అప్పుడే మనకు కష్టాలు తొలగిపోతాయి కదూ...!" చంపావతి తండ్రి మెడను కౌగిలించుకుని అంటోంది.

"అవునమ్మా! త్వరలో మనకు ఈ కష్టాలు తప్పిపోతాయి! నువ్వు అవేమీ కుండా పడుకో తల్లీ!" ఆలోచించ చంపావతి కళ్ళు మూసుకుంది.

రాజా మాటిమాటికీ కుమార్తె నుదురు పట్టుకుని చూచి జ్వరం అధికమవుతూ ఉండటంతో ఆందోళనా చేతస్కుడయ్యాడు.

చంపావతి కళ్ళుతెరచి తండ్రి కళ్ళల్లోకి చూస్తూ అన్నది.

"నాన్నగారూ! మీరు మాకోసం ఎన్నో కష్టాలు పడుతున్నారు గదూ!" రాణా మాట్లాడలేదు!

"మేము లేకపోతే... మీరు అక్బర్తో ఇంకా బాగా యుద్ధం చేసేవారు గదూ!" "మా కోసం... మా సుఖంకోసం... యుద్ధం మానుకుంటారా?"

రాణా నోటివెంట మాట రాలేదు.

తాను అక్బరి, ఉత్తరం వ్రాసిన సంగతి ఇక్కడ ఎవరికీ తెలియదు! మరి చంప ఇలా మాట్లాడుతున్నదేమిటి?

పసిపిల్లలు భగవత్స్వరూపాలు! వారి నోటివెంట సత్యమే వస్తుంది!!

"ఏమిటి నాన్నగారు మాట్లాడరు...! మాకోసం అక్బర్తో యుద్ధం మానుకుంటారా? మా సుఖంకోసం దేశస్వాతంత్ర్యాన్ని బలిపెడతారా?"చూడటానికి చిన్నపిల్ల! ఎంత పెద్ద మాటలు!!

రాణా ఆశ్చర్యంతో ఆ పిల్లవైపే

చూస్తున్నాడు. చంప అలా మాట్లాడుతూనే మైకంలోకి జారుకుంది. మధ్యలో కలవరిస్తోంది. రాణాప్రతాపుడు భార్యవైపు చూశాడు. ఆమె కుమిలి కుమిలి ఏడుస్తోంది.

"నాన్నారూ!"

"అమ్మా చంపా! చంపా!!" ప్రతాపుడు కుమార్తెను పిలిచాడు. చంప కళ్ళు కొద్దిగా తెరిచింది.

"నాన్నారూ! నాకోసం... ఓ ప్రతిజ్ఞ చెయ్యరు?"

"తప్పక చేస్తానమ్మా! ఏమిటది?"

"మీరు అక్బరికి ఎన్నడూ తలవంచరాదు!"

"అలాగేనమ్మా!"

"నాన్నారూ! నా ప్రాణాలు... పోయేముందుగా... ప్రతిజ్ఞ చేయండి. నా చేతిలో చెయ్యివేసి... ప్రమాణం చేయండి!... అక్బర్కి తలవంచను... ఎన్నటికీ తలవంచ.!" మహారాణా ప్రతాపుడు చెక్కిళ్ళమీదుగా కారే కన్నీటిని తుడుచుకుంటూ, తన చేతిని కూతురు చేతిలోవేసి, గద్గదస్వరంతో ప్రమాణం గావించాడు.

"నీ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను తల్లీ! నా ప్రాణం పోయినా అక్బర్కి తలవంచను!" చంపావతి పెదవులపై చిరునవ్వు మెరిసింది. ఆమె కన్నుల్లో ఆనందం

తాండవించింది. పరమ సంతోషంతో అన్నది. "ఇప్పుడు నాకు తృప్తిగా ఉన్నది నాన్నగారూ! మీరు అక్బరికి లొంగరు!... నాన్నగారూ... నమస్కారం! అమ్మా... నమ...!"కలిసిపోయాయి.

ఆపై మాట ఆమె నోట వెలువడలేదు! ఆ పసిదాని ప్రాణాలు అనంతాకాశంలో "పాపా! పాపా!!" అంటూ రాణా తన పుత్రిక భౌతికదేహాన్ని హృదయానికి హత్తుకొని విలపించాడు.

(ఇంకా ఉంది )







# తామరాకు పై నీటి బొట్టు ...

### మొదటి బహుమతి పొందిన కవిత

ఎన్ .లహరి

కాలగమనంలో జారిపోతున్న
జీవిత క్షణాల గుర్తులవి
చినుకుల్లా రాలి స్మృతులతో వెంటాడి
దృశ్యాలుగా రూపుకడుతున్నాయి!
నిర్మలమైన ప్రేమతో నిశ్చలమైన మనసుతో
తహతహలాడే జీవన ప్రతిబింబాలవి
తరుల విరులతో
మేలి ముసుగుల రంగులోలే మారి
చిట్లిన బిందువులుగా
రూపాంతరం చెందుతున్నాయి!
నిన్న నేడు రేపు తేడాలేని ప్రయాణంలో
యాంత్రికత లోంచి
వర్తమానంలోకి వేసే అడుగులు
మనసు...మాటకీ మౌనానికి మధ్య
బతుకు దూరాన్ని కొలుస్తోంది!
సంభాషణలోంచి తడిమే ప్రతి దృశ్యం
రెప్పపాటులో ఒలికిపోయే కాలాన్నే ప్రశ్నిస్తోంది
కొత్త సందర్భం చిక్కుముడిని పరిచిన ప్రతిసారీ
వెంటాడి వేటాడి తరిమేది ఈ జీవితాన్నే!
అలా తడిమినప్పుడల్లా ఎన్నెన్ని
మలుపుల కుదుపులో!?
ప్రయాణంలోంచి ప్రవాహంలోకి
ఆనకట్ట కట్టిచూడు
కాల వేగం కొత్త పరిచయాల్ని చేసుకుంటుంది
చివరాఖరికి వాటి ఉనికి
తామరాకుపై నీటిబొట్ల చందమే!
జీవితాన్ని ఒక్కసారి తడిమి చూస్తే
అలుపెరగని వెంటాడే క్షణాలు కోకొల్లలు!
ధవళమై దగ్ధమై
రేపటి సూర్యోదయం కోసం
సరికొత్త కలల్ని నెమరేస్తూ
ఎదురు చూస్తుంటుంది





# విశ్వ క్రీడల్లో ఎం ఎల్ ఏ

బీహార్ 2020 ఎన్నికల్లో జముయ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన శ్రేయాసీ సింగ్.. భారత షూటింగ్ విభాగంలో పారిస్ ఒలింపిక్స్‌కు ఎన్నికయ్యారు. పారిస్ ఒలింపిక్స్ కోసం వెళ్లిన 117 మంది భారతీయ క్రీడాకారుల్లో శ్రేయాసీ సింగ్ కూడా ఒకరు కావడం గమనార్హం. షూటింగ్ ఆటలో ఇప్పటివరకు శ్రేయాసీ సింగ్ పలు పతకాలను గెలుచుకున్నారు. 2014లో గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో డబుల్ ట్రాప్ విభాగంలో శ్రేయాసీ సింగ్ రజత పతకం దక్కించుకుంది. అంతేకాకుండా 2018లో గోల్డ్‌కోస్ట్‌లో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకాన్ని ఆమె అందుకుంది. ఈ క్రమంలోనే షూటింగ్ ఆటలో శ్రేయాసీ సింగ్ సాధించిన పతకాలకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం.. ఆమెకు అర్జున అవార్డును ప్రకటించింది. ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో ఆమె అక్కడికి వెళ్లారు.

ఆమె తొలిసారి ఒలింపిక్స్ గేమ్స్‌కు ఎంపిక కావడం గమనార్హం. యాసీ సింగ్ ఫరీదాబాద్‌లోని మానవ్‌రచనా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. 2020 లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె జముయ్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించారు. శ్రేయాసీ సింగ్ కుటుంబం మొత్తం రాజకీయాలకు సంబంధం ఉన్న కుటుంబం. ఈ క్రమంలోనే ఆమె రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది. శ్రేయాసీ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న జముయ్ నియోజకవర్గంలో షాట్‌గన్ రేంజ్ అందుబాటులో లేకపోవడంతో.. ఆమె ఢిల్లీకి వెళ్లి ప్రాక్టీస్ చేసింది.

బీహార్ దివంగత మాజీ మంత్రి దిగ్విజయ్ సింగ్ కుమార్తెనే ఈ శ్రేయాసీ సింగ్. ఒలింపిక్స్‌లో తాను ఆడాలి అనేదే తన తండ్రి దిగ్విజయ్ సింగ్ కోరిక అని.. ఆమె గతంలో మీడియాకు వెల్లడించింది. ఇప్పుడు ఆయన కల నెరవేరిందని.. ఒలింపిక్స్‌లో దేశానికి షూటింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేసింది. ఈ నెల 30, 31 వ తేదీల్లో జరిగే పోటీల్లో దేశానికి బంగారు పతకం సాధించేలా ప్రార్థించాలని ప్రజలకు శ్రేయాసీ సింగ్ ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. దీంతో తమ ఎమ్మెల్యే ఒలింపిక్స్‌లో దేశానికి పతకం సాధించాలని జముయ్ నియోజకవర్గంతోపాటు బీహార్ ప్రజలు కోరుకుంటున్నారు. ఆమె కనుక పతకం సాధిస్తే క్రీడల లోనే కాదు రాజకీయాల్లో కుడా ఒక అరుదైన రికార్డు నెలకొల్పినట్లే . రాజకీయాల్లోకి రావాలనుకునే యువ క్రీడాకారులకు శ్రేయాసీ సింగ్.స్ఫూర్తిగా నిలుస్తుంది అనటం లో ఏ సందేహం లేదు .

★★★

సీరియల్





# గర్భశ్లోకం

ఈదర శ్రీనివాస రెడ్డి

సుస్మిత తల్లి మరణించిన దగ్గర నుండి ఇండస్ట్రిలో  సీనియర్ హీరో నవీన్ ఆమె ఆస్థి మీద కన్నేసి ఆమెకు అండగా నిలబడ్డట్టు నాటించ సాగాడు .సమాజం కోసం సుస్మిత కుడా తప్పక హీరో నవీన్ ని పెళ్లి చేసుకుంది, కాని అంతకు ముందేఅసిస్టంట్ డైరెక్టర్  వేనుని ప్రేమించి గుళ్ళో పెళ్లి చేసుకుంది .ఈ విషయం ఎవ్వరికి తెలియదు ఒక్క సుస్మిత మేకప్ విమెన్ ఉషకు  తప్ప ..

“అవును ఇదంతా మాకు తెలుసు , ఆ ఉష కోసం గాలిస్తున్నాము  కాని దొరకట్లేదు “ మధ్యలో వివేక్ చెప్పుకొచ్చాడు .

“మీకు ఉష అంత  తేలికగా దొరికితే కథ  ఎప్పుడో ముగిసేది. సుస్మిత ఆస్థి మీద కన్నేసిన ఉషే ఈ కథ అంతటికి సూత్రధారి , నేను , డైరెక్టర్ అనిల్  అందరం పాత్రధారులం మాత్రమే ..”



# క్రైం సీరియల్

## జరిగిన కథ

ఓ గుర్తు తెలియని మహిళ , పోలీసులు వెంబడిస్తుంటే తన బిడ్డతో సహా కృష్ణా నదిలోకి దూకుతుంది .ప్రముఖ హీరోయిన్ సుస్మిత హత్యకు గురవుతుంది .డి సి పి శ్రీనివాస రావు కేసు టేక్ అప్ చేస్తాడు .సుస్మితను పెళ్లి చేసుకోమని హీరో నవీన్ బ్లాక్మెయిల్ చేస్తుంటాడు .జూనియర్ ఆర్టిస్ట్ కాంతం తన కూతురు సుస్మితని ఇండస్ట్రీలో పెద్ద స్టార్ని చెయ్యాలని ప్రయత్నిస్తుంది.డి . సి పి మళ్ళీ ఒకసారి హత్యా జరిగిన ఇంట్లో వాళ్ళందిరిని ప్రశ్నిస్తాడు . ఊరి శివార్లలో ఎవరిదో శవం ఉన్నాదని తెలిసి అక్కడకు వెళతాడు డి .సి .పి.అక్కడ శవం పక్కన పోలీసులు పెట్టుకునే స్టార్ పడి ఉంటుంది. సుస్మితను పెళ్లి చేసుకోవటానికి నవీన్ ఇష్టపడకపోతే సి .ఐ. అంబుజం ఒప్పిస్తాడు. ఎంత ప్రయత్నించినా ఒక్క సాక్ష్యం కుడా సేకరించలేక పోవటంతో సుస్మిత నటించిన సినిమాల్లో పనిచేసిన వాళ్ళను ఇంటరాగేట్చెయ్యాలని నిర్ణయించుకుంటారు. తీరా వాహిని స్టూడియో కి వివేక్ వెళ్లేసరికి డైరెక్టర్ అనిల్ కుమార్ తన కారవాన్ లో చచ్చిపడి ఉంటాడు . డి.సి. పి తన బృందం తో అక్కడి కెళ్ళి దర్యాప్తు చేస్తే అనిల్ ని చంపింది కుడా ఒక ఆడదే అని తెలుస్తుంది.ఉష మీద అనుమానం తో ఆమె ఫోటో తో పోల్చి చూస్తాడు వివేక్ .సుస్మిత వేణు అవుట్ డోర్ షూటింగ్ కి వెళతారు .వాళ్ళతో పాటు రౌడి శంకర్ కుడా వాళ్ళను అనుసరిస్తాడు .సుస్మిత వేణు గుడిలో ఎవ్వరికి తెలియకుండ పెళ్లి చేసుకుంటారు . సరగోసి ద్వారా బిడ్డని కనాలని నిర్ణయించుకుంటారు. సుస్మిత వేణు దగ్గరవుతున్నాడని అతనికి వేరే పెళ్లి చెయ్యాలని ఆలోచిస్తాడు అనిల్ . విషయం తెలిసిన వేణు వేరొక అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు . రౌడి షీటర్ శంకర్ కుడా హత్యకు గురౌతాడు .దానితో భయపడిన సి ఐ అంబుజం నిజాన్ని పోలిసులముందు ఒప్పుకుంటూ జరిగింది చెబుతాడు

ఇక **చదవండి**

" అసలు నువ్వెందుకు ఈ నాటకం లో చేరావు ?ప్రశ్నించాడు వివేక్

" సుస్మిత నా అభిమాన తార సర్ , ఆవిడా మీద ఉన్న ప్రేమతో కక్కుర్తి పడ్డాను సార్ .డైరెక్టర్ అనిల్ కుడా అంతే . నవీన్ కి సుస్మిత ఆస్థి కావలి , మాకు సుస్మిత కావాలి . కాని సుస్మిత మమ్మల్ని ఏనాడు దగ్గరకు రానివ్వలేదు .అందుకనే ఉస్మితకు మందు అలవాటు చేసాం ."

"ఒకే , మరి అసలు హంతకురాలు ఎవరు ?"

" పిల్లల్ని కంటే ఎక్కడ అవకాశాలు పోతాయోనని , వేణుకి దూరంగా జరగటం మొదలు పెట్టింది సుస్మిత , దానితో వేణు వేరే ఒక పేదింటి అమ్మాయి భార్గవి ని పెళ్లి చేసుకున్నాడు .ఆ అమ్మాయి మీద మొదట సుస్మిత కక్ష గట్టి చంపాలని చూసింది . . అప్పటికే ఆ అమ్మాయి ఒక మగపిల్లవాడిని కన్నది . ఆ అమ్మాయిని , పిల్లాడిని చంపితే ఎక్కువ మొత్తం ఇస్తానని సుస్మిత ఆశ పెట్టింది . అందుకని ఉష , అనిల్ , నేను ఈ హత్యకు సహకరించాము "

"మరి వేణుని ఎందుకు చంపారు .."

" వేణుని చంపక పోతే , భార్గవిని చంపటం అసాధ్యం అని తేలి పోయింది .అందుకనే ఇద్దరినీ చంపటానికి ప్లాన్ వేసాము "

" ఉరి బయటకు తీసుకెళ్ళి చమినట్టున్నారు "

అవును సార్, ఉరుబయటకు

తీసుకెళ్ళి వేణుని తుదముట్టిన్చాము కాని భార్గవి తప్పించుకుంది . భార్గవిని వెంబడిస్తే , బారేజ్ పైనుండి దూకింది . తరువాత గాలిమ్పులో తల్లి బిడ్డలు ఇద్దరు చనిపోయారనుకున్నాము "

"చనిపోయింది ఒక్క చంటి పిల్లాడే, భార్గవి బతికి బయట పడింది "

" అవును సార్ తరువాత అర్ధం అయ్యింది , కాని ఇన్ని హత్యలు చేస్తుంది అనుకోలేదు "

" ఆవిడ భర్తను చంపారు , చివరకు పసిబిడ్డను చంపారు , గర్భ శోకం తో ఉన్న ఏ ఆడది అయినా అది పరాశక్తి గా మారుతుంది .ఇప్పుడు అదే జరిగి ఇన్ని హత్యలకు కారణం అయ్యింది ..సరే నీ దగ్గర భార్గవి ఫోటో ఏమన్నా ఉందా "

"ఉంది సార్ .." అంటూ తన సెల్ ఫోన్లో ఉన్న భార్గవి ఫోటో చూపించాడు అంబుజం

" ఆ ఫోటో చూసి ఆశ్చర్య పోయాడు ఎస్ ఐ వివేక్ , చూస్తుంటే ఎంతో అందంగా చాల చిన్న పిల్లలా ఉంది . ఈ అమ్మాయి ఇన్ని హత్యలు చేసిందంటే ఎవరు నమ్మరు , కాని అదే నిజం అనుకుంటూ వెంటనే ఆ ఫోటో ను డి సి పి కి పంపాడు వాట్స్ప్లో .

భారవి ఫోటో ను అన్ని పోలీస్ స్టేషన్ లకు పంపి తీవ్రంగా గాలింపు చెయ్యటం మొదలు పెట్టమని ది సి పి వివేక్ ణి పురమాయించాడు .

అమ్బుజం ఇంటి చుట్టూ పోలీసులను కాపలా పెట్టారు .ఇద్దరు మగ పోలిసుల్ని మరో ఇద్దరు ఆడ పోలిసుల్ని కాపలాగా ఉంచాడు వివేక్ . అదే వివేక్ చేసిన పెద్ద తప్పు .

★★★

రెండు రోజులు గడిచి పోయాయి , భార్గవి ఆచుకు మాత్రం తెలియరాలేదు .

మూడో రోజు పొద్దున్నే , అంబుజం చచ్చిపడి ఉన్నాడని కబురు రావటంతో హుటాహుటిన బయలు దేరాడు డి సి పి , ఎస్ ఐ వివేక్ తో కలసి

అంబుజం ఇంటికి చేరుకుంటే టప్పటికి అక్కడ జనం బాగా పోగయి ఉన్నారు

డిసి పి ణి చూడగానే అక్కడ ఉన్న పోలీసులు జననాన్ని చెదర గొట్టి దారి ఇచ్చారు .

ఇంటి లోప,ల హాల్లో ని సోఫాలో అంబుజం చచ్చిపడి ఉన్నాడు .

డికి పి వివేక్ వంక చూస్తూ "ఇదేనా నువ్వు తీసుకున్న జాగ్రత్త , నేను చెపుతూనే ఉన్న కదా నెక్స్ట్ టార్గెట్ అమ్బుజమే అని "విసుగ్గా అన్నాడు

"సార్ మీరు చెప్పినట్టే నలుగుర్ని కాపలా పెట్టాను "వివేక్ తన తప్పు లేదన్నట్టు సంజాయషి ఇచ్చాడు

" వాళ్ళని పిలువ్ ..

" అంటూ ఇంట్లో వస్తువుల్ని పరిశీలించ సాగాడు డి సి పి .

డైనింగ్ టేబుల్ మీద బిర్యాని తిన్న ఆనవాళ్ళు , మందు గ్లాసు కనపడ్డాయి

ఇంతలో వివేక్ అమ్బుజానికి కాపలా ఉన్న కానిస్టేబుల్స్ ణి తీసుకొచ్చి డి సి పి ముందు నిలబెట్టాడు

" మిమ్మల్ని నమ్మి కాపలా పెడితే ఇదేనా మీరు చేసే నిర్వాకం .."కోపం తో ఉగిపోయాడు డిసి పి

మారు మాట్లాడకుండా మిన్నకుండి పోయారు వాళ్ళు

"ఏం మాట్లాడారు , ఏమి జరిగంది సార్ కి చెప్పండి .."అంటూ గదమాయించాడు వివేక్

" సార్ మా తప్పు ఏమిలేదు సర్ ,ఎవరో ఓ లేడీ కాన్స్టేబుల్ వచ్చి స్టేషన్ లో పార్టీ చేసుకుంటున్నారు , మీకుకుడా బిర్యాని పంపించారు అని అందరికి బిర్యాని పాకెట్లు ఇచ్చి వెళ్ళింది

(ఇంకా ఉంది )

# రైతుకు అవమానం....





ధోతీ అనేది మన భారతదేశ సంప్రదాయ దుస్తుల్లో ఒకటి. అయితే ఇప్పుడంటే ట్రెండ్, జనరేషన్ అని.. ఎవరూ ధోతీలు కట్టుకోవట్లేదు కానీ.. మన తాతలు, ఊర్లలో ఉండే కొందరు ఇప్పటికీ ధోతీలు ధరిస్తూనే ఉంటారు. ఎప్పుడైనా పండగల సమయంలో ధోతీలు, ధోతీల లాంటి ప్యాంట్లు వేసుకోవడం చూస్తూనే ఉన్నాం. ఇక పొలం పనులు చేసుకునే రైతులు మాత్రం చాలా మంది ఈ ధోతీలను కట్టుకుంటూ ఉంటారు. అయితే ఓ రైతు ధోతీ కట్టుకుని షాపింగ్ మాల్‌కు వెళ్లగా.. లోపలికి వెళ్లకుండా అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అదేంటని అడగ్గా.. ధోతీలు ఉన్న వారిని షాపింగ్ మాల్ లోకి అనుమతించమని తేల్చి చెప్పారు. దీంతో ఆ రైతును, అతని కుమారుడిని గేటు వద్దే ఆపేశారు. ఈ ఘటనతో తీవ్ర అవమానంగా భావించిన ఆ రైతు, అతని కొడుకు.. మీడియా ముందు తమ ఆవేదనను వెళ్లగక్కారు. ఈ సంఘటన కర్ణాటక రాజధాని బెంగళూరులో చోటు చేసుకుంది.


బెంగళూరు నగరంలో ఉన్న జీటీ మాల్‌కు ఓ రైతు, అతని కుమారుడితో కలిసి వెళ్లాడు. ఆ జీటీ మాల్‌లో సినిమా చూసేందుకు వెళ్లిన ఆ అన్నదాతను, వెంట వచ్చిన అతని కుమారుడిని మాల్ సిబ్బంది అడ్డుకున్నారు. ధోతీ ధరించి మాల్ లోపలికి వెళ్లడం కుదరదని తేల్చి చెప్పారు. ధోతీ కట్టుకుని వచ్చినవారిని లోపలికి పంపించవద్దని మాల్ యాజమాన్యం తమకు ఆదేశాలు జారీ చేసినట్లు సిబ్బంది వెల్లడించారు. కేవలం ప్యాంట్లు ధరించిన వారిని మాత్రమే అనుమతించాలని తమకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. దీంతో వారిద్దరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఈ ఘటనతో తీవ్ర అవమానంగా భావించిన వారిద్దరూ బయటికి వచ్చి మీడియాతో మాట్లాడారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

ఈ వ్యవహారం కాస్తా తీవ్ర దుమారానికి దారి తీయడంతో వారిని అడ్డుకున్న మాల్ సెక్యూరిటీ సిబ్బంది తర్వాత ఆ రైతుకు క్షమాపణలు తెలిపారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక రైతు ధోతీ కట్టుకుని మాల్‌కు వస్తే తప్పేంటి అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అవమానానికి గురి చేసిన ఆ జీటీ మాల్ అధికారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇక రైతుకు జరిగిన అన్యాయంపై స్పందించకపోతే వేలాది మంది రైతులతో నిరసనకు దిగుతామని.. రైతు సంఘం నాయకుడు . ఇలా దిక్కుమాలిన రూల్స్ పెట్టిన జీటీ మాల్ మేనేజ్‌మెంట్‌పై సోషల్ మీడియాలో నెటిజన్లు ఘాటుగా స్పందిస్తూ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అయితే గతంలో బెంగళూరులోనే రైతును అవమానించిన ఘటనను నెటిజన్లు గుర్తు చేసుకుంటున్నారు. కొన్ని నెలల క్రితం నెత్తిన ఓ సంచి పెట్టుకుని.. బెంగళూరులోని రాజాజీనగర్ మెట్రో స్టేషన్‌కు వెళ్లిన ఓ రైతును చూసిన అక్కడి సిబ్బంది.. ఆ రైతు దుస్తులు మురికిగా ఉన్నాయని మెట్రో రైలు ఎక్కేందుకు అనుమతించలేదు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో బెంగళూరు మెట్రోపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఎట్టకేలకు అధికారులు క్షమాపణలు తెలిపారు. కురుబురు శాంతకుమార్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

# నాలుగో కోతి


**XXX**






డా. మణికంఠ M.D

ముప్పయ్యేళ్ల క్రిందటి మాట ఇది.. అప్పుడప్పుడే వెండి తెరకు ప్రత్యామ్నాయంగా టీవీకెక్కువ, సినిమాకు తక్కువ అన్నట్లు అక్కడక్కడ 'వీడియో పార్లర్లు' వెలుస్తున్న కాలం. ఒక మహానగరంలో అటువంటి వీడియో పార్లర్లు ఓ డజను నడిచేవి. ఓ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త, వీడియో పార్లర్లు చూసుకోవటానికి చౌకగా వస్తారని పల్లెటూళ్ల నుంచి అమాయకులైన ఓ నలుగురు కుర్రాళ్లను తీసుకువచ్చి, వాటిని ఎలా నడపాలో నేర్పించి ఒక్కో దానికి ఒక్కొక్కరిని నియమించారు. వీడియో పార్లర్లలో జరిగే తంతు వేరే చెప్పక్కర్లేదనుకుంటా. ప్రేక్షకుల్ని ఆకట్టుకోవటానికి అసలు సినిమా మధ్యలో కొసరు సీన్లు చూపేవారు. వాటిని చూడటానికి రాత్రి వేళల ఆటలకు మగ, ఆడ అనే భేదం లేకుండా రహస్యంగా వచ్చేవారు. నిజ జీవితంలో రహస్యంగా జరగాల్సిన పనులను ఇలా బహిరంగంగా చూసి ఆనందపడే వీరి మనస్తత్వాలను చూసి ఆ కుర్రాళ్లు ఆశ్చర్యపోయారు.



# నాలుగో కోతి








కేవలం డబ్బు కోసం ఉచ్ఛం నీచం మరచిపోయి, కెమేరా ముందు నగ్నంగా నటించే సిగ్గులేని నాగరిక నగర ప్రజల్ని చూసి విస్మయం చెందారు. రాజకీయ నేతగా చెప్పుకునే తమ యజమాని ఇటువంటి వ్యాపారం చెయ్యటం ఎంత వరకు సమంజసం అని మల్లగుల్లాలు పడేవారు. ఒక రోజు తమ యజమానే తన స్నేహితులతో ఆ బూతు చిత్రాలను చూడటానికి రావటంతో దిగ్భ్రాంతి చెందటం వారి వంతయ్యింది. ఈ ఘోరాల్ని చూడలేక, ఇద్దరి మనుషుల మధ్య నడిచే సృష్టి రహస్యాన్ని బహిరంగంగా చూపే ఆ జుగుప్సను జీర్ణించుకోలేక వాళ్లు వీడియో పార్లర్లలోని టీవీలను ధ్వంసం చేశారు. ఇంకేముంది యజమాని ఊరికొచ్చారన్న మాటే గాని పిచ్చి పిచ్చిగా ప్రవర్తించే వారు. వారి పిచ్చి ప్రవర్తన చూసి ఇంట్లో వాళ్లు మానసిక వైద్యుల దగ్గరకు తీసుకెళ్లడంతో మళ్లీ మన లోకంలో కొచ్చి పడ్డారు. పదేళ్ల తరువాత నలుగురు కుర్రాళ్లు కలిసి తమ ఊళ్లోనే ఒక వీడియో పార్లర్ నడపటం మొదలు పెట్టటం ఈ కథలో కొసమెరుపు. అమాయకులైన ఆ యువకులు అలా మారిపోవటానికి మన సంస్కృతి, సంప్రదాయాల్లో వస్తున్న క్రమబద్ధమైన మార్పులా? సంస్కారాన్ని మర్చి పోయి కేవలం సుఖాలకే ప్రాధాన్యతనిస్తున్న జీవన విధానమా?

మారుతున్న కాలంతో పాటు ప్రజల జీవన ప్రాముఖ్యతలు కూడా మారుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో సంపాదన, సుఖభోగాలదే పైచేయి కాగా, విలువలు, నైతికత, వ్యక్తి గౌరవం వంటివి అట్టడుగు పొరల్లోకి కూరుకుపోతున్నాయి. వాటి గురించి ఆలోచించే విచక్షణా జ్ఞానం ఉన్నా, సమయం, అవసరం రాకపోవటంతో సమాజం నిస్సిగ్గుగా తయారవు తోంది. దీనికి ఉదాహరణే ఇటీవల విశాఖ నగరంలో జరిగిన ఘోర ఉదంతం. నడి రోడ్డుపై అసహాయ స్థితిలో ఉన్న మహిళను ఒక మానవ మృగం పైశాచికంగా అనుభవిస్తుంటే చోద్యం చూస్తూ వెళ్లే వారే కాని ఇదేమిటని ప్రశ్నించిన వాళ్లు లేరు. పైగా ఓ ప్రబుద్ధుడు ఆ సంఘటనను చరవాణిలో చిత్రీకరించి అంతర్జాలంలో జొప్పించటానికి ప్రయత్నించటం ఎంత జుగుప్సాకరం. ఇటువంటి హేయమైనవి చిత్రీకరించడానికి మనసెలా వచ్చిందని ఆశ్చర్య పోనక్కర్లేదు. ఎందుకంటే తెల్లారి లెగిస్తే ఇటువంటి చిత్రాలు, వీడియోలు చరవాణిలోని ఫేస్ బుక్కు, యూ ట్యూబ్లో కోకొల్లలు. వాటిని చూసి చూసి మెదడు మొద్దుబారి, రోడ్డు మీద జరిగిన సంఘటన పెద్దగా కదిలించి ఉండకపోవచ్చు. కొన్నాళ్లకు ఈ సిగ్గులేని సమాజంలో మనిషనేవాడు మాయమై కేవలం మృగాలే మిగులుతాయేమోననిపిస్తోంది. వెలకట్ట లేని మన యువతరం తమ శక్తియుక్తులన్నీ శృంగార పిశాచికి ధారపోస్తున్నారనిపిస్తోంది. నాలుగు గోడల మధ్య నడిచే అందమైన, సున్నితమైన శృంగారం రతిరాక్షసిగా ఈ సమాజంపై విరుచుకుపడుతోందనిపిస్తోంది. దీనివల్ల నేటి యువతకు ప్రేమకు, కామానికి మధ్య వ్యత్యాసం తెలియకుండా ప్రవర్తిస్తున్నారు. దీనికి నిదర్శనమే ఇటీవల ముగ్గురు యువకులు ఒక యువతిని

# నాలుగో కోతి

అత్యాచారం చేయబోయి, ఆమె ప్రతిఘటించడంతో సంఘటన మొత్తాన్ని చరవాణిలో చిత్రీకరించి అంతర్జాలంలో చొప్పించటం. ఈ ముగ్గురిలో ఆ అక్కడున్న వారిలో ఏ ఒక్కరికి ఇది తప్పు, దీనివల్ల ఒక అభాగ్యురాలి జీవితం నాశనమవటమే కాక తమ భవిష్యత్తు కూడా పాడవుతుందనే స్పృహ లేకుండా, కేవలం కొన్ని క్షణాల సుఖానికి తమ జీవితాల్ని బలి పెట్టడానికి సిద్ధపడ్డారంటే కారణమేమై ఉంటుందో అందరం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. కొన్నాళ్ల క్రితం స్టాన్ఫోర్డు విశ్వవిద్యాలయానికి చెందిన డా. గెరాల్డ్ క్యాబ్లో రూపొందించిన "జన్యు శాస్త్రంలోని కొత్త పోకడలు", అనే నివేదికలో రాను రాను మానవాళి మేధోపరమైన విశ్లేషణాత్మకమైన, భావోద్రేకాలను అదుపులో పెట్టుకోగల శక్తి కోల్పోతుందని వివరించారు. దీనికి కొనసాగింపుగా బ్రస్సెల్స్లోని శ్రీ విశ్వవిద్యాలయానికి చెందిన మైఖేల్ నిర్వహిస్తున్న పరిశోధనల్లో భవిష్యత్ తరాలలో తెలివితేటలు, మేధోపరమైన జన్యువుల పెరుగుదల చాలా తక్కువగా ఉంటుందని తద్వారా విచక్షణాహీనులుగా వీరు ఎదుగుతారని నిరూపించారు. ఇదే కనుక నిజమైతే ఈ పరిణామ సిద్ధాంతాల వెనుక నిగూఢమైన రహస్యాలు, ఉద్దేశ్యాలు ఉండి ఉండాలి. కొన్నాళ్లకు మానవులు భవిష్యత్తు శిలాజాలుగా మిగలనున్నారని నిరూపించటం లేదా మానవ మేధను ఇంకేదో ఉన్నతమైన శక్తి ఆక్రమించనుందని సిద్ధాంతీకరించటమే వీటి వెనకున్న రహస్యాలు. ఏదన్నా దుస్సంఘటన గాని, ప్రమాదం గాని జరిగి గాయపడిన వారికి సహాయం చేసే దిక్కు మొక్కు లేక నిస్సహాయంగా ఆర్తనాదాలు చేస్తుంటే, నిర్జీవంగా వారి పక్కగా నడిచి వెళ్లే ఈ సజీవ శవాల సమూహాల దైన్య స్థితికి కారణం ఎవరు? ధన సంపాదనే. చేయకూడని వ్యాపారాలు కూడా చేస్తూ మానం అభిమానం మరచిపోతున్న సమాజంలోని పెద్దలదా, దేశపోళ్ళకు లేని దురద మనకెందుకని స్వార్థంతో గడప దాటుతున్న సామాన్యులదా, మితిమీరిన హింసను ప్రేరేపిస్తూ యువతను పెడదారులు పట్టిస్తున్న మీడియాదా, 'యునైటెడ్ హెల్త్ గ్రూప్' అనే పరిశోధనా సంస్థ నిర్వహించిన పరిశోధనల్లో "మానవ మేధస్సు ఏ విధంగా అయితే శిక్షణ పొందుతుందో ఆ విధంగానే స్పందిస్తుందని" నిరూపించబడింది. మెదడు పంపించే సంజ్ఞలకు మన అంతరాత్మ యాదృచ్ఛికంగా స్పందిస్తుంది. అటువంటి స్పందనల నుండి మనల్ని మనం పునఃసమీక్షించుకోవటానికి మనలోని అంత శక్తులన్నింటినీ కేంద్రీకరించాలి. కొలంబియా విశ్వవిద్యాలయ మానసిక రుగ్మతల పరిశోధనా కేంద్రం నివేదిక ఈనాడు సమాజంలో వివిధ మాధ్యమాల ద్వారా విచ్చలవిడిగా విశృంఖలంగా ప్రదర్శింపబడుతున్న హింసాత్మక సంఘటనల వల్లే మానవత్వపు తడి పొడి బారిపోతోందని పేర్కొంది.

★★★







మొదటి బహుమతి పొందిన కవిత

# గీతోపదేశం

కె .విజయ కుమార్



బానిసబతుకుల్ని మేల్కొల్పిన
ఓంకారనాదం వందేమాతరం
నైరాశ్యపు నిశీధినుంచి
బైటకు లాగిన చైతన్యకిరణం వందేమాతరం
జాతిని ఏకంచేసి
తెల్లవాడి గుండెల్లో పేల్చిన శతఘ్ని వందేమాతరం
కులమతాల అడ్డుగోడల్ని కూల్చిన
మరఫిరంగి వందేమాతరం
తెల్లవాడి పెత్తనాన్ని
నిలువునా కాల్చేసిన కార్చిచ్చు వందేమాతరం
రవి అస్తమించని రాజ్యపతనానికి
మోగించిన రణభేరి వందేమాతరం
భరతజాతిలో
స్వతంత్రకాంక్ష , స్వరాజ్యదీక్ష
రగిలించిన బడబాగ్ని వందేమాతరం
దేశాన్ని దాస్యవిముక్తం చేసిన
విజయభేరి వందేమాతరం
భరతజాతికి చేసిన గీతోపదేశం
ఈ వందేమాతరం.

ఇది నాడు మరి నేడో?
వందేమాతరం కాదు ,వందకే వందనం
అనే తరం మన యువతరం
నేటి చదువులు ఆర్థిక మంత్రాలు
జనమంతా ఆర్జనాయంత్రాలు
చెల్లుతున్నాయి స్వార్థపరుల కుతంత్రాలు

ఎంతెత్తు ఎదిగినా ,ఏ స్థాయికి చేరినా
దానికి మూలకారణమైన మాతృభూమిని మరువకు
విలువలను కొండచిలువలా చుట్టేసిన
అవినీతిపరులూ , దేశద్రోహులు
భరతమాత గర్భాన పుట్టిన కేన్సర్ కణితులు
మనం ఐక్యంగా ఆ కణితులను పెకిలిద్దాం
దైవభక్తి లేకున్నా దేశభక్తి ఉండేతీరాలి

మన స్వాతంత్ర్యవీరుల కలల్ని
సాకారం చేసేందుకు
మనజాతి పునర్నిర్మాణం కోసం
అందరం ఒకతాటి పైకి చేరి
మరో వందేమాతర ఉద్యమం సాగించాలి
ఆ చైతన్యం మనలో వస్తేనే
మనదేశం అజేయమైన శక్తిగా మారేది
ఇదే మన స్వాతంత్ర్యవీరులకు
మనం ఇచ్చే నిజమైన నివాళి .

★★★



నెట్టింటి రామాయణం

# "ఎంకి పెళ్లి ..సుబ్బి చావు "



ఈ. సాయి అలేఖ్య

“ అంబాని గారు వాళ్ళ అబ్బాయి పెళ్ళికి మనల్ని పిలవలేదేమిటండి ?”ఆఫీసు నుండి ఇంట్లోకి అడుగుపెట్టగానే మా ఆవిడా అడిగింది

ఆ ప్రశ్న అర్ధం కావటానికి కాసేపు సమయం పట్టింది ,”అంబాని మనకేమన్నా బంధువా ఏమిటి పెళ్ళికి పిలవటానికి “ అన్నాను

“అదేమిటండి మనం కూడా అంబాని కుటుంబంలో సభ్యులమేగా , కుటుంబ సభ్యులను పిలవరా ?”

“మనం అంబాని కుటుంబ సభ్యులమా ? అదెలా ..?” అదం కాక తెల్ల మొఖం వేసా

“ గత పదిసంవత్సరాలగా మనం ఇద్దరం జియో మొబైల్ ఫోను వాడుతున్నామా ?..”

# నెట్టింటి రామాయణం

“ అవును అయితే ...?

“అయితే ఏమిటండి ?..మొన్నటికి మొన్న పెంచిన రీఛార్జి చార్జీలు కూడా కిక్కురుమనకుండా కట్టమా లేదా ?”

“ఇవన్నీ సరేలే .. అసలు విషయానికి రా ?

“మరి వాళ్ళ పెళ్లి ఖర్చంతా మన బోటి వాళ్ళు కట్టిన రీచార్జి డబ్బు తోనే కదా ? అంటే మనం పెళ్ళికి చందాలిచ్చిన వాళ్ళం అన్నమాట .ఏ సంబంధం లేని వాళ్ళందరిని పెళ్ళికి పిలిచి మనబోటి పెళ్లి పెద్దల్ని పిలవక పోవటం ఏమి న్యాయం చెప్పండి ?”



మా ఆవిడ లాజిక్ నాకు ఎందుకో కరక్టే అనిపించింది .ఇది మా ఆవిడ ఒక్కతి అభిప్రాయం కాదు ,దేశంలోని చాల మంది సామాన్యుల ఆలోచన

సరే మా ఆవిడా విషయం పక్కన పెడితే

ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చింది అనేది పాత సామెత , అంబానీ పెళ్లి నేటిజెన్ల చావుకొచ్చింది కొత్త సామెత“. 5000 కోట్ల రూపాయలు పెట్టి ప్రపంచంలోనే ఎవ్వరు చెయ్యనంత ఘనంగా కొడుకు పెళ్లి చేసారు అంబాని గారు . అయితే అదే సమయంలో జియో రీఛార్జి ధరలు పెరగటం తో , నెటిజన్లు మా డబ్బుతో కొడుకు పెళ్లి చేస్తున్నాడు అంటూ సమాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు .

అంబానీగారికున్న ఆస్తి లో పెళ్ళికి ఖర్చు పెట్టింది 0.5% మాత్రమే , ఇంకొకరు ఎవరయినా ఇంతకంటే ఎక్కువే ఖర్చుపెడతారు , పది లక్షలు కుడా ఆస్థి లేని పేదవాడు సైతం లక్ష రూపాయలు పైగా ఖర్చు పెట్టి పెళ్లి చేస్తున్నారు, అంబాని గారు కాబట్టి సింపుల్ గా లాగించేసారు అని కొంత మంది అంబాని అభిమానులు అంటున్నారు . ఈ వేడుకల్లో భాగంగా పేద కుటుంబాలకు చెందిన 50 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. సామూహిక వివాహాలు జరిపించడమే కాదు పుట్టింటి బాధ్యతలను తీసుకుని పెళ్లి కూతుర్లకు సారె పంపించింది అంబానీ కుటుంబం. బంగారు మంగళసూత్రం, ఉంగరాలు, ముక్కు పుడకలు, మట్టెలు, పట్టీలు వంటివి అందించింది. అలాగే పెళ్లి కూతురికి స్త్రీ ధనం కింద రూ.1.01 లక్షల చెక్ అందించింది. వీటితో పాటు ఆ జంటలకు ఏడాదికి సరిపడా నిత్యావసర సరుకులు సైతం అందించడం గమనార్హం. పుట్టింటి వారు తన కూతురికి పెళ్లి సారె అందించినట్లుగానే గ్యాస్ స్టవ్, మిక్సీ, పరుపులు, దిండ్లు, ఫ్యాన్, వంట సామగ్రి వంటివి అందించినట్లు తెలుస్తోంది. పైపెచ్చు 40 రోజుల పాటు 9000 మంది బీద సాదలకు ఉచితంగా పిండి వంటలు వండి వడ్డించారు అంటున్నారు .

అంబానీ గారి ఇంట్లో పెళ్లికి దేశ విదేశాల నుండి పిలిచినా పిలవక పోయినా అనేక మంది ప్రముఖులు , సెలబ్రటీలు విచ్చేసి అంబాని గారి పట్ల తమ విధేయతను చాటుకున్నారు. ప్రధాని మోడీ దగ్గర నుండి , అనేక రాష్ట్రాల ముఖ్య మంత్రులు ,మంత్రులు ,బాలివుడ్ , టాలివుడ్


# నెట్టింటి రామాయణం




,కోలివుడ్ ఇతర వుడ్ లలోని తారలందరూ , ఫేస్బుక్ అధినేత జుకర్ బర్గ్ నుండి వివిధ దేశాలకు టెక్ దిగ్గజాలు ఈ పెళ్ళికి హాజరైఇన వాళ్ళలో ఉన్నారు .అంబానీ గారింట్లో పెళ్ళికి ఆహ్వానం పొందటానికి సెలబ్రిటీలు , లెజెండ్లు , మఠాధిపతులు , నాయకులే ఎదురు డబ్బులు ఇచ్చి వెళ్ళారేమో అనుకున్నా , కాని అంబాని గారే కోటి నుంచి నాలుగు కోట్ల దాక డబ్బులు ఇచ్చి వివిధ వుడ్ లకు చెందినా అనేక మంది తారలను ఆహ్వానించారని తెలిసింది.సరే అదే స్థాయిలో బహుమతులు కుడా వచ్చాయని తెలిసింది . షారుఖ్ ఖాన్ దంపతులు ఏకంగా ఫ్రాన్స్ లో 40 కోట్ల రూపాయల విలువ చేసే ఒక అపార్ట్మెంట్ అనంత్ అంబానీకి పెళ్లి కానుకగా అందించారట.అలాగే దీపిక రణవీర్ దంపతులు 20 కోట్ల రూపాయల విలువచేసే రోల్స్ రాయిస్ కారును అందజేశారట, అక్షయ్ కుమార్ 60 కోట్ల రూపాయల గోల్డెన్ పెన్, కత్రినా విక్కీ కౌశల్ 16 లక్షల విలువచేసే గోల్డ్ చైన్, సల్మాన్ ఖాన్ 15 కోట్ల విలువచేసే బైక్, అలియా రణబీర్ దంపతులు 9 కోట్ల రూపాయల విలువచేసే ఖరీదైన కారును అనంత్ అంబానీ పెళ్లి కానుకగా అందజేశారట .

మేము కూడా వివిధ సినీవుడ్ లకు చెందినా మమ్మల్ని ఎందుకు పెళ్ళికి పిలవలేదు , మేము పెళ్ళికి చందా(అదే రీఛార్జి ) ఇచ్చాం కదా అని కొంతమంది చోట మోటా సెలేబ్రటీలు కుడా సామాజిక మాధ్యమాల్లో ఆడిపోసుకుంటున్నారు . అంబానీ గారింట్లో పెళ్ళికి ఆహ్వానం రాలేదా ! అబ్బే నువ్వు యూజ్ లెస్ అని ఇంట్లో సతీమణి ఎక్కడ చీత్కరిస్తుందేమో అని చాలామంది ఎలాగోలా తమ పేర్లను పెళ్లి పిలుపుల జాబితాలో చేర్పించుకున్నారని అందరూ అనుకుంటున్నారు

మనలో చాల మంది ,ఊళ్ళో పెద్దోళ్ళ ఇంట్లో పెళ్ళికి పిలిచీ పిలవగానే అందరికన్నా ముందరే హాజరయి , వచ్చినోళ్ళందరికీ స్వాగతం పలుకుతారు ,సంగీత్ అంటూ నృత్యాలు చేస్తారు, ఇంకా ఏమయినా చేస్తారు . అదే , తమ బంధుమిత్రులలో సాధారణ వ్యక్తులు, పేద వాళ్ళు బతిమిలాడి పిలిచినా , హాజరవటానికి బద్ధకిస్తారు . ఆహ్వానించేవాళ్ళూ అంతే అనుకోండి . తమ కన్నా ఉన్నత స్థాయిలో ఉన్నవారిని ఒక రకంగా ఆహ్వానిస్తారు . తక్కువ

## సెటైర్



# నెట్టింటి రామాయణం

స్థాయిలో ఉన్న వారిని ఒక రకంగా ఆహ్వానిస్తారు .

ఈ మధ్య చాల మంది పెళ్ళికి శుభలేఖలు వేయించేటప్పుడే ,రెండు రకాల శుభలేఖలు వేయిస్తున్నారు .తమకంటే ఉన్నత స్థాయిలో ఉన్నవాళ్ళకు కొంచెం ఖరీదైనవి , తమకన్నా కింది స్థాయి వాళ్లకు కొద్దిగా తక్కువ ఖరీదువి. అంటే పెళ్లికి పిలిచేటప్పుడే మన స్థాయి= ఏమిటో వాళ్ళు మనకు తెలియచేస్తున్నారు . ఇంకొంత మంది ముఖ్యమైన వాళ్ళను ఇంటికి వెళ్లి మరి పిలిచి , మిగిలిన వాళ్లకు వాట్స్ అప్ మెసేజులు పెడుతున్నారు .

ఈ మధ్య నాకు పరిచేయం ఉన్న ఒక ప్రముఖ నటుడు ఫోన్ చేసల్లా వాళ్ళింట్లో పెళ్ళికి పిలిచాడు . ఇన్విటేషన్ , ప్రవేశ అర్హత కార్డూ , గట్రా పంపుతున్నా అని అన్నాడు . ఎంత గొప్పవాడు మావాడు , గుర్తుంచుకొనల్లా పిలిచాడు అని పాట కూడా పాడుకున్నా . ఎంచక్కా ఆ పెళ్ళికి వెళ్లి ఫోటోలు తీయించుకుని ఫేస్ బుక్కులో షేర్ చేద్దామని కలలు కన్నా . ఇంకా వెయిట్ చేస్తునే ఉన్నా పిలుపు వస్తున్దేమో నని . ఈలోపు వాళ్ళకు పిల్లలు కూడా పుట్టారని విన్నాను . ఇలా ఉంటుంది లోకం . పరుగులే పరుగులు . ఎవడి మైలేజి వాడిది . ప్రపంచమంతా మనీ సంబంధాలే . పెద్దోళ్ళ ఇంట్లో ఏం జరిగినా ఊరంతా పండగే . అంబానీ గారింట్లోది కాబట్టి దేశమంతా పండగే . ఆనందమానందమాయెనే మా అనంతుడు పెళ్ళి అయిపోయెనే .


కొసమెరుపు ఏమిటంటే ,అనంత్ అంబానీ రాధికా మర్చంట్ వివాహం కార్యక్రమానికి ఆహ్వానం లేకుండా హాజరైన ఇద్దరు యువకులను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఏపీకి చెందిన యూట్యూబర్ అల్లూరి వెంకటేష్, వ్యాపారవేత్తగా చెప్పుకునే షఫీ షేక్‌గా ముంబై పోలీసులు గుర్తించారు. వీరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసిన బాంద్రా కుర్లా కాంప్లెక్స్ పోలీసులు.. పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అనంతరం నోటీసులు ఇచ్చి పంపించివేశారు, ఇంకెంత మంది మెరిసి మెరవని తారలు ,,చోట మోట రాజకీయ నాయకులు పిలవని పెళ్ళికి తమ తలలు దుర్చారో తెలియాల్సి ఉంది .

ఏదేమైనా, ఈ వివాహం వల్ల కొన్ని వందల మంది సప్లయర్స్ కు ఆదాయం, డ్రెస్ డిజైనర్స్ కు, జ్యువలరీ స్టోర్స్ కు, హోటల్స్ కు తట్టుకోలేనంత వ్యాపారం దొరికింది. డబ్బు సంపాదించడం ఒక టాలెంట్ అయితే, దాన్ని ఖర్చు చేయడం ఒక ఆర్ట్ అనిపించారు అంబానీలు. డబ్బున్న వారందరూ ఇలా ప్రదర్శించడానికి ఇష్టపడకపోవచ్చు, కానీ ఎవరి ప్రాధాన్యత వారిది, ఎవరి ఇష్టం వారిది

★★★★

## గోపాల కృష్ణ కార్టూన్

# నవ్వండి ప్లీజ్ !

















# మనకు తెలియని మన పుణ్యక్షేత్రాలు

★ కుశపురం (సీతారాముల పెద్ద కుమారుడు కుశుడు కట్టించిన నగరం) – కుశార్, పాకిస్తాన్

★ లవపురం (సీతారాముల చిన్న కుమారుడు లవుడు కట్టించిన నగరం) – లాహోర్, పాకిస్తాన్

★ తక్షశిల (శ్రీరాముని తమ్ముడైన భరతుని పెద్దకొడుకు తక్షుడు నిర్మించిన నగరం) – తక్షశిల, పాకిస్తాన్

★ పుష్కలావతి / పురుషపురం (శ్రీరాముని తమ్ముడైన భరతుని రెండవ కొడుకు పుష్కరుడు నిర్మించిన నగరం) – పెషావర్, పాకిస్తాన్

★ మహావిష్ణువు గజేంద్రున్ని మొసలి బారి నుంచి రక్షించిన స్థలం – దేవ్ ధాం,నేపాల్

★ నృసింహస్వామి హిరణ్యకశిపుని వధించిన స్థలం – అహోబిలం,ఆంధ్రప్రదేశ్

★ జమదగ్ని మహర్షి ఆశ్రమం – జమానియా, ఉత్తర్ ప్రదేశ్

★ మహిష్మతి (కార్తవీర్యార్జునుని రాజధాని) –మహేశ్వర్,మధ్యప్రదేశ్

★ శమంతక పంచక (పరశురాముడు ఇరవైయొక్క మార్లు క్షత్రియులపై దండెత్తి వారి రక్తంతో 5 మడుగులు నెలకొల్పిన చోటు),కురుక్షేత్రం,

★ దుర్యోధనుని చంపిన చోటు–కురుక్షేత్ర, హర్యానా

★ పరశురామక్షేత్రం (పరశురాముడు తన గొడ్డలిని సముద్రంలోకి విసిరి,సముద్రజలాలను వెనక్కి పంపి తనకోసం నేలను సృష్టించుకొన్న ప్రాంతం) – కేరళ,కర్ణాటక,మహారాష్ట్ర సముద్రతీర ప్రాంతం

★ మహేంద్ర పర్వతం (పరశురాముడు తపస్సు చేసిన స్థలం) – పశ్చిమ ఒరిస్సా

★ నిషాద రాజ్యం (నల మహారాజు రాజ్యం) – గ్వాలియర్ జిల్లా,మధ్యప్రదేశ్

★ వ్యాస మహర్షి పుట్టిన స్థలం – ధమౌలి, నేపాల్

★ నైమిశారణ్యం (వ్యాస మహర్షి తన శిష్యులకు వేదాలు,పురాణాలు బోధించిన ప్రాంతం) – సీతాపూర్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్

★ వ్యాస మహర్షి చెబుతుండగా, విఘ్నేశ్వరుడు మహాభారతం వ్రాసిన చోటు – మన గ్రామం, ఉత్తరాంచల్

★ రతిష్టానపురం (పురూరవుని రాజధాని) –ఝున్సి,అలహాబాద్

★ సాళ్వ రాజ్యం(సావిత్రీ,సత్యవంతుల కథలో సత్యవంతుని రాజ్యం)–కురుక్షేత్ర దగ్గర

★ హస్తినాపురం (కౌరవుల రాజధాని) – హస్తినాపూర్, ఉత్తర్ ప్రదేశ్

★ మధుపురం / మధువనం (కంసుని రాజధాని) –మధుర, ఉత్తర్ ప్రదేశ్

★ వ్రేపల్లె / గోకులం – గోకుల్, మధుర దగ్గర

★ కుంతిపురి (పాండురాజు మొదటి భార్య కుంతిదేవి పుట్టినిల్లు) – గ్వాలియర్

★ మద్ర దేశం (పాండురాజు రెండో భార్య మాద్రి పుట్టినిల్లు) — పంజాబ్ ప్రావిన్స్, పాకిస్తాన్

★ ద్రోణనగరి (ద్రోణుడు నివసించిన ప్రాంతం)–డెహ్రాడూన్

★ గురుగ్రామం (కురుపాండవులు విద్యాభ్యాసం చేసిన చోటు) – గురుగావ్, హర్యానా

★ కర్ణుడు పరిపాలించిన అంగ రాజ్యం — కాబుల్ (ఆఫ్ఘనిస్తాన్)

★ పాండవుల లాక్షగృహ దహనం – వర్నాల్, హస్తినాపూర్

★ కాలయవనుడు ముచికుందుని కోపాగ్ని జ్వాలలకు భస్మమైన స్థలం – గిర్నార్,గుజరాత్

★ శ్రీకృష్ణ,బలరాముల ద్వారకా నగరం – ద్వారక,గుజరాత్

★ హిడింబవనం (హిడింబాసురుడిని భీముడు చంపిన చోటు) –జలాన్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్

★ విదర్భ (దమయంతి, రుక్మిణిదేవి తండ్రులు యేలిన రాజ్యం) – విదర్భ, మహారాష్ట్ర

★ కుండినపుర (రుక్మిణిదేవి జన్మస్థలం) – కుండినపుర, మహారాష్ట్ర

★ చేది రాజ్యం (శిశుపాలుడు ఏలిన రాజ్యం) — బుందేల్ ఖండ్, మధ్యప్రదేశ్

★ కారుష రాజ్యం (దంతవక్రుడు ఏలిన రాజ్యం) – దాతియ జిల్లా, మధ్యప్రదేశ్

★ ఖాండవప్రస్థం / ఇంద్రప్రస్థం (పాండవుల రాజధాని) – ఇంద్రప్రస్థ, ఢిల్లీ దగ్గర

★ కుచేలుడు నివసించిన చోటు – పోర్ బందర్, గుజరాత్

★ పాంచాల దేశం (ద్రుపద మహారాజు రాజ్యం) – ఎటాహ్,సహజహంపూర్,ఫారుఖాబాద్ ప్రాంతాలు, ఉత్తర్ ప్రదేశ్

★ కంప్లి (ద్రౌపది పుట్టినిల్లు,మత్స్యయంత్ర బేధన స్థలం) – కంపిల్, ఉత్తర్

★ జరాసంధుని భీముడు చంపిన చోటు – జరాసంధ్ కీ ఆఖరా / రణ్ భూమి, బీహార్

★ కామ్యక వనం,ద్వైత్య వనం (పాండవులు అరణ్య వాసం చేసిన ప్రాంతాలు) – పశ్చిమ హర్యానా

★ మత్స్య దేశం (విరాట మహారాజు రాజ్యం) –ఆల్వార్,గురుగావ్ నుంచి జైపూర్ వరకు వున్న ప్రాంతం,రాజస్థాన్

★ విరాటనగరం (పాండవులు అజ్ఞాత వాసం చేసిన స్థలం) – విరాట్ నగర్,రాజస్థాన్

★ శోణపురం (బాణాసురుడి రాజధాని) – సోనిత్ పూర్, అస్సాం

★ ప్రాగ్జ్యోతిష్యం (నరకాసురుని రాజధాని) – తేజ్ పూర్, అస్సాం

★ నిర్యాణానికి ముందు శ్రీకృష్ణుడు బోయవాని వేటుకి గురైన స్థలం – ప్రభాస తీర్థం, సోంనాథ్, గుజరాత్

★ జనమేజయుడు సర్పయాగం చేసిన స్థలం – పర్హాం,ఉత్తర్ ప్రదేశ్

★ కపిలవస్తు (బుద్ధుని జన్మస్థలం)–ల నేపాల్ లోని తిలార్కోట్

★ బుద్ధునికి జ్ఞానోదయం అయిన స్థలం– బోధ్ గయ, బీహార్

★ గౌతమ బుద్ధుడు పరినిర్యాణం చెందిన చోటు– కుశీనగర్, ఉత్తర్ ప్రదేశ్

# పూరిలో జగన్నాధుని
## గుండె ఇంకా కొట్టుకుంటూ ఉందా?



శ్రీకృష్ణుడు శరీరాన్ని విడిచిపెట్టినప్పుడు, దహన సంస్కారాలు జరిగాయి, ఆయన శరీరమంతా ఐదు మూలకాలలో కలుపుతారు కాని ఆయన గుండె ఒక సాధారణ మనిషిలా కొట్టుకుంటుంది. ఆయన ఖచ్చితంగా సురక్షితంగా ఉన్నాడు, ఆయన గుండె ఈ రోజు వరకూ సురక్షితంగా ఉంది, ఇది జగన్నాథుని చెక్క విగ్రహం లో ఉంది. మరియు అదే విధంగా కొట్టుకుంటుంది, చాలా కొద్ది మందికే ఇది తెలుసు.

మహాప్రభు జగన్నాథ్ (శ్రీ కృష్ణ) ను కలియుగ ప్రభువు అని కూడా అంటారు.

ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి మహాప్రభు విగ్రహం మార్చబడుతుంది, ఆ సమయంలో పూరి నగరం మొత్తం చీకటిగా మారుతుంది. అంటే మొత్తం నగరం అంతటా లైట్లు ఆపివేయబడతాయి. లైట్లు ఆపివేసిన తరువాత, crpf సైన్యం అన్ని వైపుల నుండి ఆలయ ప్రాంగణాన్ని చుట్టుముడుతుంది ... ఆ సమయంలో ఎవరూ ఆలయంలోకి ప్రవేశించలేరు ...

ఆలయం లోపల దట్టమైన చీకటి ఉంది ... పూజారి కళ్ళు కట్టుకున్నాయి ... పూజారి చేతిలో చేతి తొడుగులు ఉన్నాయి .. పాత విగ్రహం నుండి "బ్రహ్మ పదార్థం" తీసి కొత్త విగ్రహంలో ఉంచుతాడు ... ఈ బ్రహ్మ పదార్థం ఏమిటో ఇప్పటి వరకు ఎవరికీ తెలియదు ... ఈ రోజు వరకు ఎవరూ చూడలేదు. .. వేలాది సంవత్సరాలుగా ఇది ఒక విగ్రహం నుండి మరొక విగ్రహానికి బదిలీ చేయబడుతోంది ...

ఇది అతీంద్రియ పదార్థం, దానిని తాకడం ద్వారా, ఒక వ్యక్తి శరీరం యొక్క రోగాలు ఎగిరిపోతాయి .. ఈ బ్రహ్మ పదార్థం శ్రీ కృష్ణుడికి సంబంధించినది .. అయితే అది ఏమిటో, ఎవరికీ తెలియదు ... ఈ మొత్తం ప్రక్రియ ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ఆ సమయంలో భద్రత చాలా ఎక్కువగా ఉంటుంది .

కానీ ఈ రోజు వరకు మహాప్రభు జగన్నాథ్ విగ్రహంలో ఏముంది అని ఏ పూజారి కూడా చెప్పలేకపోయారు ???

కొంతమంది పూజారులు మేము అతని చేతిలో తీసుకున్నప్పుడు, అతను కుందేలు లాగా దూకుతున్నాడని ... అక్కడ కళ్ళకు కట్టినట్లు ఉంది ... చేతికి తొడుగులు ఉంటేనే మనకు ఆ అనుభూతి కలుగుతుంది అని చెప్తున్నారు. ...

ఈ రోజు కూడా, జగన్నాథ్ యాత్ర సందర్భంగా, పూరి రాజు స్వయంగా బంగారు చీపురుతో తుడుస్తాడు.



స్వామి జగన్నాథ్ ఆలయ సింహ ద్వారం నుండి లోపలికి మొదటి అడుగు వేసిన వెంటనే సముద్రపు తరంగాల శబ్దం వినబడదు, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మీరు ఆలయం నుండి ఒక అడుగు బయటకు వేసిన వెంటనే, సముద్రం యొక్క అలల హోరు వినబడుతుంది.

చాలా దేవాలయాల శిఖరంపై పక్షులు కూర్చుని ఎగురుతూ ఉండడాన్ని మీరు చూసిఉంటారు, కాని జగన్నాథ్ ఆలయం మీదుగా ఏ పక్షి కూడా ఎగరదు.

జెండా ఎల్లప్పుడూ గాలికి వ్యతిరేక దిశలో ఎగురుతుంది

స్వామి జగన్నాథ్ ఆలయం యొక్క ప్రధాన శిఖరం రోజులో ఏ సమయంలోనైనా నీడ పడదు.

స్వామి జగన్నాథ్ ఆలయం యొక్క 45 అంతస్తుల శిఖరంపై ఉన్న జెండాను ప్రతిరోజూ మార్చడం జరుగుతుంది, జెండాను ఒక రోజు కూడా మార్చకపోతే, ఈ ఆలయం 18 సంవత్సరాలు మూసివేయబడుతుంది.

అదేవిధంగా, జగన్నాథ్ ఆలయం పైభాగంలో సుదర్శన్ చక్రం కూడా ఉంది, ఇది ఏ దిశ నుండి చూసినా అది మీకు ఎదురుగా ఉంటుంది.

స్వామి జగన్నాథ్ ఆలయ వంటగదిలో, 7 మట్టి కుండలు ఒకదానికొకటి పైన ఉంచి ప్రసాదం ఉడికించాలి, ఇది ఒక చెక్క నిప్పుతో వండుతారు, ఈ సమయంలో పైన ఉంచిన కుండ యొక్క వంటకం మొదట వండుతారు.

స్వామి జగన్నాథ్ ఆలయంలో ప్రతిరోజూ చేసిన ప్రసాదం భక్తులకు ఎప్పుడూ తగ్గదు, కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆలయ తలుపులు మూసిన వెంటనే ప్రసాదం కూడా ముగుస్తుంది.

★★★

# షో ( రూమ్ ) బిజినెస్

విజయకుమార్ గడియా



ఆ షోరూం లో అందమైన
పాదరక్షలు దొరుకుతాయి.
అరుదైన.. జంతు చర్మం తో
తయారైన చెప్పులు,
ఖరీదైన షూలు..సర్వం
అక్కడ గాజు షెల్పులలో
నిగనిగలాడుతున్నాయి..!

హెల్ప్ చేయడానికి
మీ పాదాలను తాకి
తొడగడానికి..సిబ్బంది
సదా ..సిద్ధం..!

అదే..షోరూం బయట
వీధి మురుగు కాల్వపై..
ఓ పండు ముసలి చింకి
చాపపై..పరచి ' ఫ్రెష్ '
కూరగాయలు అమ్ముతోంది.

ఆకలి ..ఆ పేద ముసలిని
ఫుట్ పాత్ లో పడేసింది.

షోరూం కి వెళ్లిన వాళ్లు..
కిక్కురు మనకుండా
జీ.ఎస్.టీ తో సహా
వేలు సమర్పించి.. వచ్చి..

కూరగాయల పెద్దామెతో
బేరం..ఆడుతున్నారు.
సగానికి సగం ధరకే ఇమ్మని.

కాలికి తొడిగే జోళ్ళకు
ఉన్న విలువ.. తినే
తిండికి లేదు మరి..!

కలికాల మహిమ కదా ఇది..!

# "ఆఖరిఆలోచనలు"



సీతమ్మ గారి మరణం తరువాత, గిరిజ గారి సాంగత్యంలోకి చేరటానికి ఎక్కువ కాలం పట్టలేదు. గిరిజ గారికి పెళ్లై ఎభైఏళ్ళు అయ్యింది, బహశా ఆవిడ వయస్సు ఎనభై దాటి వుండవచ్చు. అయినా కూడా ఆవిడ అంత వయస్సు వున్న దానిలా అనిపించదు. అందరి ఆడవాళ్ళలాగానే ఆవిడ కూడా స్వతంత్రంగా తనదైన జీవితాన్ని గడపాలని కోరుకుంది. అందరి మగవాళ్ళ లాగానే ఆవిడ భర్త కూడా నిరంకుశంగా ప్రవర్తించటం వల్ల జీవితం మొత్తం బానిసలాగా బతకాల్సి వచ్చింది. జీవితం మొత్తం పిల్లల్ని, మనవళ్ళని పెంచి పెద్దవాళ్ళను చెయ్యడటం లోనే గడిచిపోయింది. 'స్వేచ్ఛ' అంటే ఏమిటి? గిరిజగారు జబ్బు పడి ఆసుపత్రిలో చేరిన తరువాత కాని ఆవిడకు తెలిసిరాలేదు. కానీ అప్పటికే ఆవిడ ఆరోగ్యం మొత్తం క్షణించిపోయింది.

అవిడ అనారోగ్యానికి ముఖ్యకారణం ఆవిడ భర్త దురలవాట్లే. అతని పొగత్రాగే అలవాటు వల్ల హవిడ ఊపిరితిత్తులు పూర్తిగా పాడై పోయాయి.


# అంపశయ్య

తన్ను కన్న కలలు ఇక ఏనాటికి నెరవేరవని ఆవిడ పడే వేదన వర్ణనాతీతం.

"నాకిష్టమైనట్లు నేనెందుకు బతకలేకపోయాను. నా భర్తకు నేనెందుకు లాంగేపోయాను అంత భయ పడుతూ ఎందుకు బతికాను' అని ఆవిడ పదే పదే మనసులో అనుకుంటూ కుమిలి పోయేది. ఈవిడ మాత్రమే కాదు, నేను సేవ చెయ్యటానికి వెళ్లిన ప్రతి ఒక్కరిని వేధించే ఏకైక ప్రశ్న, "మాదైన జీవితాన్ని మేమెందుకు జీవించలేక పోయామనే!. వీరెవ్వరూ గొప్ప ఆడంబర మైన జీవితాలు కోరుకోలేదు . వాళ్ళు కోరుకుంది కేవలం తమ ఇష్టా ఇష్టాలకు అణుగుణంగా కాస్తంత స్వేచ్ఛగా బతకాలని.
ఆసుపత్రిలో జేరిన దగ్గర నుండి, " నాజీవితంలో నేను ఎవరికి అన్యాయం చెయ్యలేదు, భగవంతుడు నా కెందుకింత అన్యాయం చేసాడని కళ్ళ నీళ్ళ పరంతం అయ్యేది . తను ఎటు తనదైన బతుకు బధకలేక పోయిందని, కనీసం నీకిష్టమైన బతుకు బతకమని నాకు చెపుతూ ఉండేది .గత పది సంవత్సరాలుగా నేను అదే పని చేస్తున్నాను అని ఆవిడకు తెలియ చెప్పాను.

చదువు పూర్తిచేసుకున్న కొన్నాళ్ళ పాటు జీవితం హాయిగా గడిచి పోయింది. కాని కుటుంబ అవసరాల కోసం ఇంకొకరి చెప్పుల్లో కాళ్ళు పెట్టక తప్పలేదు తప్పలేదు. కడుపు నింపుకోటానికి చాలా ఉద్యోగాలు చేశాను, చాలా ప్రదేశాలు మారాను. వృత్తి పరంగా విజయ సాధించినా, వ్యక్తి గతంగా ఏదో తెలియని వెలితి. నా కష్టం, సమయం అంతానేను పనిచేసే సంస్థ అభివృద్ధికే కేటాయించా కాని సంస్థ మాత్రం నాకేమి మేలు చెయ్యలేదు,అందుకని ఉద్యగం మారాను. అలా ఉద్యాగాలు మారుతూనే వున్నా , కాని నేను వెతుకుతున్న సంతృప్తి మాత్రం లభించలేదు. ఉద్యోగం మారినప్పుడల్లా మంచి ఉద్యోగం వదిలేస్తోంది, దీనికేమైనా పిచ్చా అని విమర్శించిన వాళ్ళు లేక పోలేదు.

చివరకు అందరిక దూరంగా, ఒక సముద్రపు దీవిలో గడపాలని నిర్ణయించుకున్నా. బాహ్య ప్రపంచంతో ఉన్నట్టుండి బంధం తెంచుకోవటంతో కొంత ఇబ్బందిగా వున్నా , ఎప్పటికప్పుడు మా అమ్మ నా యోగక్షేమాలు కనుక్కుంటూ ఉండటం తో పెద్దగా బాధ అనిపించ లేదు. మనస్సును ప్రశాంతంగా వుంచుకోవటానికి ధ్యానం చెయ్యటం నేర్చుకున్నాను. విపాసన ధ్యానం ద్వారా ఇతరుల పట్ల దయ, కరుణ ఎలాకలిగి వుండాలో నేర్చుకోసాగాను అనుభవంలోకి వచ్చిన తరువాతకాని తెలిసి రాలేదు, ఇతరులను లోబర్చుకోవటానికి ద్యానికి మించిన అయుధం లేదని. చాలా మంది తాము పడే బాధలు. ఇతరులు కూడా పడాలని కోరుకుంటారు. కాని ఎప్పుడైతే జీవితన్ని దయతో, కరుణతో చూడటం అలవాటు చేసు కుంటామో అప్పుడు జీవితంలో దుః ఖం అనేది వుండదు. ఇతరుల పట్ల దయ తో వుండ గలిగితే, వారికి స్వాంతన కలగటం మొదలవుతుంది. కుటుంబాలలోని బంధాలు, అనుబంధాల మధ్య ప్రతి ఒక్కరం చిక్కుకుని, ఏదోఒక సమయంలో, ఏదో ఒక బాధ అనుభవించిన వాళ్ళమే.. ఆ బాధల నుండి విముక్తి పొందాలంటే దయతో మెలగటం. ఒక్కటే మార్గం. ఇతరుల మీద ప్రేమ, కరుణ కలగక పోవటానికి కారణం సమస్యలను మనవైపును నుండే మనం చూడటం.
ఇతరుల సమస్యలు కూడా మనం వినగలిగితే, మన సమస్య. చాలా చిన్నదిగా అనిపిస్తుంది, అప్పుడు వాళ్ళ మీద ప్రేమ పుట్టుకొస్తుంది. నేను అనుభవించిన కష్టాలను గుర్తు చేసుకుంటే, ఈ ప్రపంచంపై విపరీతమైన కోపం వస్తుంది. నేను కుడా ఆ బాధలు అనుభవించాను కాబట్టి , ఎంతో ధైర్యంగా ముందడుగు వేయగలుగుతున్న. నేనింక పోగట్టుకోటానికి ఏమిలేదు. ఎదుటి వాళ్ళు మనల్ని అర్థం చేసుకోవాలని, ప్రేమించాలని, ఆదరించాలని కోరుకుంటాం. అది జరగనప్పుడే మనలో బాధమొదలవుతుంది . అడువంటి బాధ నిస్సహాయుల్లో, వయసు మీరిన వాళ్ళలో ఎక్కువగా వుంటుంది. అటువంటి వారిని దయతో . ఓపికతో దగ్గరకు తీసుకుని ఊరడించగలిగితే వారికి కంతైనా మేలు చేసిన వాళ్ళ మౌతాము.(సశేషం )





కథ

# అమ్మ మరణం

**రెండవ బహుమతి**

**పొందిన కథ**

శ్రీపతి లలిత

సీతా! సీతామహాలక్ష్మి!” తల్లి అరుపులకి, నెమ్మదిగా, ఇది నాకు అలవాటే అన్నట్టు రూంలోకి వెళ్లి “ఏమిటి?” అంది నిదానంగా 70ఏళ్ళ సీత.

“ఏడు అయ్యిందే, నా ముఖాన ఇన్ని కాఫీ నీళ్ళు పోసేది ఉందా లేదా? నాలిక పిడచ కట్టింది.”

విసుగ్గా అంది 90 ఏళ్ళ లక్ష్మమ్మ అనబడే లక్ష్మీనరసమ్మ.

“ఇస్తున్నానమ్మా! లేవడం ఆలస్యమయింది” అని వెళ్లబోతుంటే “ఇవాళ టిఫిన్ ఏమిటే” అడిగింది పెద్దావిడ.

“ఇడ్లీ” అంటూ బయటికి నడుస్తుంటే “ఇడ్లీ! రోజూ ఆ పిచ్చి ఇడ్లీ, ఓ పూరీనో, వడో, పెసరట్టో లేదు” తల్లి సణుగుడు విని నవ్వుకుంది సీత.

“నీకు ఏంతిన్నా అరుగుతుంది బీపీ లేదు, షుగర్ లేదు, నీ అదృష్టం” నిట్టూర్చింది సీత.

సీత తండ్రి నరసింహారావు గారు, పోలీస్ కమీషనర్ గా చేసారు. ఆయన నీతికి, న్యాయానికి పెట్టింది పేరు. ఆయన బయట పోలీస్ అయితే, ఇంట్లో తల్లే, పోలీసులా ఉండేది.

పిల్లల్ని విపరీతమైన క్రమశిక్షణతో పెంచింది. నలుగురు పిల్లలు, ఇద్దరు ఆడ, ఇద్దరు మగ పిల్లలు. అందరూ బాగా చదివి, మంచి ఉద్యోగాల్లో, చక్కటి కుటుంబాల్లో స్థిరపడ్డారు.

సొంత ఇల్లు, మంచి పెన్షన్, రాజాలాగా గడిచిపోతున్న నరసింహారావు గారి జీవితంలో పెద్ద కుదుపు, అమెరికాలో కార్ ఆక్సిడెంట్ లో పెద్ద కొడుకు,కోడలు, ఇద్దరు మనవలు చనిపోవటం.

పైకి గంభీరంగా ఉన్నా, లోపల కుమిలిపోయిన నరసింహారావు గారు, ఆరు నెలలు తిరక్కుండా కన్నుమూశారు.

అంతవరకూ 'నా మాటే శాసనం' అన్నట్టు ఉన్న లక్ష్మమ్మ, మూగగా అయిపోయింది.

రెండో కొడుకు కూడా అమెరికాలోనే ఉంటాడు. తల్లిని తీసుకెళ్లి కొంతకాలం ఉంచుకున్నా, అక్కడి వాతావరణం, పద్ధతుల్లో ఇమడలేక ఇండియాకి వచ్చేసింది లక్ష్మమ్మ.

తన ఇంట్లోనే, మనిషిని పెట్టుకుని ఉండేది. కూతుర్లు ఇద్దరూ, అదే ఊరు అవడంతో, వస్తూపోతూ ఉండేవారు. మనవళ్ల పెళ్లిళ్లు, పురుళ్ళు అన్నీ ఈవిడ చేతిమీదే అయ్యాయి.

రెండో కొడుకు వాళ్ళు కూడా, ప్రతి సంవత్సరం వచ్చి, తల్లి దగ్గర ఒకటి, రెండు నెలలు ఉండి వెళ్లేవారు.

అమెరికాలో ఉన్న మనవలు కూడా, ప్రతీ సంవత్సరం వచ్చి నాయనమ్మ దగ్గర ఉండి వెళ్లేవారు. అందరు మనవలు, మనవరాళ్ళకి ఈవిడ అంటే ప్రాణం.
అందరికీ, ఎవరికి ఇష్టమైన వంటలు అన్నీ, పేరుపేరునా తనే చేసేది.

రోజులు గడుస్తున్నకొద్దీ, పిల్లలు అందరు తలోదిక్కుకు వెళ్లారు. కొడుకు,కోడళ్ళకి వయసు మీదపడి ఇండియా రావడం తగ్గించారు.

పెద్దకూతురు, అల్లుడు, ఓపిక తగ్గిపోయింది చేసుకోలేకపోతున్నామని, అమెరికాలో ఉన్న వాళ్ళ పిల్లల దగ్గరికి వెళ్లిపోయారు.

చివరికి ఇక్కడ మిగిలింది సీత మాత్రమే. సీత భర్త కూడా రిటైర్ అయిపోయాడు.
సీత కూతురు, కొడుకు ఇండియాలోనే ఉండడంతో, సీతకి పెద్ద ఊరు విడిచి వెళ్లే అవసరం రాలేదు.

"నా ప్రాణం ఇక్కడే పోవాలి, నేను ఈ ఇల్లు వదిలి రాను" అని తల్లి మొండికేస్తే ఉన్న అపార్ట్మెంట్ అద్దెకిచ్చి సీత, సీత భర్త , లక్ష్మమ్మ ఇంటికి వచ్చారు.

ఇక్కడ వెనక గదిలో ఉంటున్న రాజవ్వ, దాదాపు నలభయ్ సంవత్సరాలనుంచి ఇక్కడే పనిచేస్తోంది.

లక్ష్మమ్మకి, రాజవ్వ ఇంట్లో వాళ్లతో సమానం, ఇంకా మాట్లాడాలంటే వాళ్ళకంటే ఎక్కువ. ఇంటి పని అంతా రాజవ్వ ఒంటి చేత్తో చేస్తుంది. దాదాపు లక్ష్మమ్మ కి 80 వచ్చేదాకా లక్ష్మమ్మే వంట చేసేది. వేరే ఎవరు చేసినా ఆమెకి నచ్చేది కాదు.

ముందునుంచి రకరకాలు వండటం, తినడం అలవాటు అయిన ఆవిడ, కొడుకు కుటుంబం, భర్త మరణాల వచ్చిన మానసిక కుంగుబాటు ( డిప్రెషన్) నుంచి తప్పించుకోడానికి తిండి మార్గాన్ని ఎన్నుకుంది.
మనసు బాలేకపోతే మైసూరుపాక్, కొడుకు గుర్తొస్తే బూరెలు, బొబ్బట్లు , భర్తని తలుచుకున్న రోజు గారెలు, పకోడీలు, ఇలా తిండే జీవితం లాగ వండటం, తినటం చేసేది.

ఇంక ఆవిడకి ఓపిక తగ్గడంతో, సీత వంట చెయ్యడం మొదలైంది.

తొంభయి పడిలో పడ్డా, లక్ష్మమ్మకి తిండి పుష్టి తగ్గలేదు.

కూతురి వంట హయాంలో,తనకి నచ్చినవి ఒక రోజు కాకపోతే,ఇంకో రోజన్నా చేయించుకునేది.
సీత కూడా, తల్లి తిండి సంగతి తెలుసుకనక, వీలైనంతవరకు తల్లి అడిగినవి చేసిపెట్టేది.

సీత వాళ్ళు తల్లి దగ్గరికి వచ్చి పదిహేను సంవత్సరాలు అవుతోంది. సీత భర్తకి బీపీ ఎక్కువై, రెండు కిడ్నీలు పాడయ్యాయి. కిడ్నీ మార్పిడికి ఆయనకి సరిపడా కిడ్నీ దొరకలేదు, ఆయన కూడా సర్జరీకి

ఇష్టపడలేదు.

దానితో, వారానికి రెండురోజులు డయాలిసిస్, పథ్యపు భోజనం, ఈ ఒత్తిడితో సీతకి కూడా బీపీ, షుగర్ వచ్చాయి. దానితో పాటు మోకాళ్ళ నొప్పులు.

తను కూడా డెబ్బైల్లోకి వచ్చేసరికి ఓపిక తగ్గి, అవసరమైన వంట మాత్రమే చేస్తోంది సీత.

అల్లుడికి బాలేదు, ఏ రోజు ఎలా ఉంటుందో తెలీదు.

ఇప్పటికే సీత పిల్లలు తల్లి, తండ్రిని తమ దగ్గరికి రమ్మని గొడవ చేస్తున్నారు. సీత వెళ్ళిపోతే ఎలా అనే దిగులు. వీటన్నిటిని ఎలా వ్యక్తపరచాలో తెలీని లక్ష్మమ్మ, రోజూ భోజనాల దగ్గర గొడవపెట్టుకునేది.

ఉప్పు, కారం సరిపోలేదని, నూనె లేకుండా కూరలు రుచిగా లేవు అని దెబ్బలాట.

రోజూ, ఉన్న ముగ్గురికీ, మూడు వంటలు చెయ్యలేక సీతకి ఓర్పు నశించిపోతోంది, కానీ, తల్లికి ఓపిక ఉన్నప్పుడు, ఆవిడ పిల్లలందరికీ చేసిన చాకిరీ గుర్తువస్తే, ఏమి అనలేక పోతోంది.

"తొంభయి ఏళ్ళు వచ్చాక కూడా ఈ జిహ్వా చాపల్యం ఏమిటమ్మా? పెట్టింది తిని, కృష్ణా రామా అనుకోక" అని సీత విసుక్కుంటే "నాకు అరుగుతోంది తింటాను. నాకు ఎవ్వరూ ఊరికే పెట్టడంలేదు, నా మొగుడి పెన్షన్ ఖర్చు పెడుతున్నా, నాకేమి చేసాడని దేవుడ్ని తలుచుకోవాలి? మీ నాన్న పోగానే నన్నూ తీసుకుపోవచ్చుకదా, నాకు ఇంత ఆయుర్దాయం నేను అడిగానా? అయినా నేను భీష్మ ఏకాదశి రోజు పుట్టాను, నాకు ఇచ్ఛామరణం ఉంది, నా నిష్క్రమణం నా చేతిలోనే ఉంది." అంది కూతురితో.

"గాడిదగుడ్డు కాదూ! నిజంగా ఇచ్ఛామరణం ఉంటే అడుగు, ఇప్పుడే తీసుకెళ్లమని.. ఈ చాకిరీ చెయ్యలేక నేను ఛస్తే, నీకు చేసేవాళ్ళు లేరు" విసుక్కునేది సీత.

"చూసావుటే రాజవ్వా! నా కూతురు ఇంత చాకిరీ చేయించుకుని, ఇప్పుడు నాకు వచ్చేసరికి నన్ను చావమంటోంది" అంటే రాజవ్వ "వదిలేయి పెద్దమ్మా! బిడ్డ, పాపం అటు మొగుడికి, ఇటు నీకు చేయలేక అల్లాడుతోంది" అనేది.

"అంటే, నువ్వు కూడా దాని పక్షమే. నన్ను, ఇంక చాలు, చావమంటున్నావా?" అని దెబ్బలాడేది. రోజురోజుకీ, ఆవిడ నస ఎక్కువ అవడం, సీత ఓపిక తగ్గిపోవడంతో రోజూ ఇద్దరికీ దెబ్బలాటలే.

సీత భర్త కూడా ఒకసారి "నీకు ఓపిక తగ్గింది, ఓర్పు తగ్గింది, పెద్ద ఆవిడతో రోజూ ఎందుకు గొడవలు" అన్నాడు సీతతో.

"నేను ఉన్నంతకాలం చేస్తానండి, ఆవిడకన్నా నేనే ముందు పోతే, ఆవిడ పరిస్థితి ఏమిటి? అని తలుచుకుంటేనే భయం వేస్తోంది" అంది.

"మనచేతిలో ఉందా సీతా! ఎవరు ఎప్పుడో, అనవసరమైన గొడవలవల్ల మనశ్శాంతి ఉండదు,నువ్వైనా ఊరుకో" అనేవాడు ఆయన.

పోనీలే ఆవిడతో ఎందుకు గొడవ, అని సీత అనుకుంటే, ఒక రోజు బజ్జి వేయమని, ఒక రోజు పకోడీలు అని, ఇలా 24 గంటలు తిండి గోల అయి, సీతకి విసుగు బాగా ఎక్కువ అయింది.

ఒకరోజు, భర్త తో డయాలిసిస్ కి వెళ్లితే, ఆయనకి కొంత సమస్యలు వచ్చాయి. డాక్టర్ సీతని పిలిచి "పరిస్థితి కొద్దిగా సీరియస్ అవుతోంది, డయాలిసిస్ తో ఎంతకాలం నడుస్తుందో తెలీదు, ఆరోగ్యం నెమ్మదిగా దిగజారుతోంది, ఇంక మీరు ఇంట్లో ఉంచుకోవడం కష్టం అవుతుంది. హాస్పిటల్ లో చేర్చి చూడాల్సి వస్తుంది" అన్నాడు. దానితో సీత మనసు భారమై ఇంటికి వచ్చింది.

రాగానే తల్లి "వచ్చావా సీతా! ఆకలి దంచుతోంది, ఒక చిన్నకప్పు

మైసూరుపాకు చేసి, నాలుగు ఉల్లిపాయ పకోడీలు చెయ్యి" అంది.

ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది సీతకి.
"ఇంట్లో మనుషులు, ఒకొకళ్ళు చచ్చినా, నీ తిండి గోల నీదే, 60 ఏళ్ళ వాళ్ళు, డెబ్బయ్యి ఏళ్ళ వాళ్ళు పుటుకు, పుటుకు ఛస్తున్నారు. తొంభయ్ కి గుండ్రాయి లాగా ఉన్నావు, ఏమన్నా అంటే ఇచ్ఛా మరణం అంటావు. అదేదో అడగకూడదూ, పీడా పోతుంది" అని లోపలికి వెళ్లి తలుపు వేసుకుంది.

లక్ష్మమ్మ , రాజవ్వ హతాశులయ్యారు. ఎంత కోపం వచ్చినా సీత ఎప్పుడూ ఇలా మాట్లాడ లేదు.
ఆ రోజంతా తల్లి, కూతుళ్లు మాట్లాడుకోలేదు.
మర్నాడు, సీత కొడుకు ఊరునుంచి వచ్చాడు.

"ఏమయిందిరా? ఇంత అకస్మాత్తుగా వచ్చావు?"
అడిగిన అమ్మమ్మకి "నాన్న పరిస్థితి బాలేదు అమ్మమ్మా!

ఇక్కడ, అమ్మ ఒక్కతీ చూసుకోలేక పోతోంది, వాళ్ళని, ఇంక నా దగ్గరికి తీసుకెళ్లిపోదాము అనుకుంటున్నా, అమ్మ నీ గురించే బాధ పడుతోంది, పోనీ, నువ్వు కూడా వాళ్లతో వచ్చేయి అమ్మమ్మా!" అన్నాడు.

"నాదేముందిరా నాయనా! ఎంతకాలం ఉంటాను. పాపం, మీ అమ్మ, ఇన్నాళ్లనుంచి నన్ను కనిపెట్టుకునే ఉంది, ఇప్పుడు వాళ్ళని నువ్వు కనిపెట్టుకుని ఉండు." అన్న అమ్మమ్మ మాటలకి తల ఊపుతూ "వచ్చే వారం వచ్చి తీసుకెళ్తా, ఈలోగా ఇక్కడ ఏర్పాట్లు చూస్తుంది అమ్మ" అని చెప్పాడు.

మర్నాడు, సీత నెమ్మదిగా తల్లి రూంలోకి వెళ్ళితే, లక్ష్మమ్మ బీరువాలో చీరలు, వస్తువులు తీసి సర్దుతోంది.

"ఏంటమ్మా! సర్దుతున్నావు?" అంది సీత తల్లి పక్కనే కూర్చుని.

"ప్రయాణానికి సిద్ధపడాలి కదా!" అంటూ లక్ష్మమ్మ ఒక పది కవర్లు తీసి సీతకి ఇచ్చింది.

ఏమిటి అన్నట్టు చూస్తున్న సీతతో "నా దగ్గరున్న డబ్బులతో అప్పుడు కొంత, ఇప్పుడు కొంత బంగారం కొని పెట్టా అందరికీ, పేర్లు రాసాను కవర్లమీద, అందరికీ అందచెయ్యి. ఒక కవర్ మన రాజవ్వకి కూడా" అంటూ కవర్లు సీత చేతికి ఇచ్చింది.

"బట్టలు, సామాన్లు కూడా మీకు కావాల్సినవి ఉంచి, మిగిలినవి రాజవ్వ కి ఇవ్వండి" అంటున్న తల్లితో

"నేను ఊరెళ్తుంటే, నాకు అప్పగింతలు పెడతావేంటి?" అంది ఆశ్చర్యంగా.

"నీ ప్రయాణానికి నువ్వు సర్దుకుంటున్నావు, నా ప్రయాణానికి నేను సర్దుతున్నాను" అన్న లక్ష్మమ్మ చెయ్యి పట్టుకుని,

"అమ్మా! నేను తప్పుగా మాట్లాడాను, డాక్టర్ గారు, ఒక్కసారిగా ఈయన పరిస్థితి సీరియస్ గా ఉంది అంటే, నాకు బుర్ర పనిచెయ్యలేదు. నిన్ను అనకూడని మాటలు అన్నాను, నన్ను క్షమించు" కళ్ళనీళ్ళతో అంది సీత.

"పిచ్చి పిల్లా! నీ సంగతి నాకు తెలీదూ, నాన్న పోయినప్పటి నుంచి, నువ్వేగా నన్ను కనిపెట్టుకుని ఉన్నావు. . ఇలా నాకు తిండిమీద కొంత ఇష్టం ఉండడం నిజమే, కానీ, మరీ అంత పిచ్చి లేదే సీతా! తెగతిని, అరగక, ఏదో ఒక రోగం వస్తే, త్వరగా పోతానేమో అని. కానీ... దేవుడు అలా కూడా నన్ను కరుణించడంలేదు.

అవి, ఇవి చెయ్యమంటే, పనిలో పడి కష్టం మరిచి పోతావని, నీ వెనకాల పడతాను. ఎంత కాదన్నా, నీలాగా, ఎవరు చేసి పెడతారు నాకు?" బాధగా అంది లక్ష్మమ్మ.

"అమ్మా! నా బాధ కూడా అదే. నేను ఉన్నంత కాలం చూస్తాను, నాకేదన్నా అయితే నీకు ఇవన్నీ ఎవరు చేస్తారు? అందుకే, నోరు కట్టుకో, అని చెప్పడం, నీకు చెయ్యడానికి బాధకాదు"

అంటూ కళ్ళు తుడుచుకుని "కాసేపు పడుకో, లేచాక నీకు

పకోడీలు వేస్తాలే" నవ్వుతూ అంటూ లేచింది.

"మళ్ళీ వెళ్ళిపోతే ఎలానూ కుదరదు. ఇలా నా దగ్గర పడుకో సీతా!" అంటూ మంచం మీద చోటు చూపిస్తే పక్కనే పడుకుంది సీత. మనసు, శరీరం అలసిపోయాయేమో అలా పడుకోగానే మంచి నిద్ర పట్టింది.

ఒక గంట తరవాతలేచి "అమ్మా! చాలా రోజుల తరవాత భలే నిద్ర పట్టింది, నేను పకోడీ చేసి టీ పెడతాను లే" అంటూ తల్లిని లేపితే ఆవిడ తల పక్కకిపడిపోయి నోరు తెరుచుకుని ఉంది.

భయంతో సీత మళ్ళీ గట్టిగా కుదిపి పిలుస్తుంటే రాజవ్వ వచ్చి చూసి అమ్మ ఎల్లిపోయింది సీతమ్మా!" అంటూ ఏడ్చింది.

"అమ్మా! భీష్ముడి అంశ అన్నావు, నాకు ఇచ్ఛామరణం ఉంది అన్నావు, అమ్మా వెళ్ళిపో' అనగానే వెళ్లిపోయావా! నాకు ఇబ్బంది ఉండకూడదని వెళ్లిపోయావా?" అని ఏడుస్తున్న సీతని ఆపడం ఎవరి తరం కాలేదు.

★★★★ .

కథ

# నేను ఒంటరిని కాను

యశోద కైలాష్

"ఇదిగో వసంతా, ఎక్కడున్నావు ? ఒకసారి వస్తావూ"? అంటూ భర్త రామకృష్ణ పిలిచిన పిలుపుకి వంటింట్లోనుండి హాలులోకి వచ్చింది..
లేప్ టాప్ ముందు పెట్టుకుని కీబోర్డుమీద టైప్ చేస్తూ, "వచ్చావా ? ఎల్లుండి బుధవారం నా స్నేహితుడు విశ్వమూర్తి వస్తున్నాడు మనింటికి.. పదిరోజులు ఉంటాడుట".
'విశ్వం గురించి నీకెప్పుడూ చెపుతూనే ఉంటాను కదా వసంతా.. ఆ మధ్య కాకినాడ లో కాలేజ్ రీ యూనియన్ ఫంక్షన్ లో కలసినపుడు మన ఇంటికి రమ్మనమని ఆహ్వానించాను.. వస్తానులేరా రామం అన్నవాడు ఇప్పుడు వస్తున్నాడంటూ' ముఖంనిండా ఆనందం పులుముకుంటూ భార్యతో పంచుకున్నాడు ఆ విషయాన్ని..
రామకృష్ణ, విశ్వమూర్తి కాకినాడలో పి..ఆర్ గవర్న్ మెంట్ కాలేజ్ లో బి..కామ్ చదువుతున్నరోజుల్లో మంచి స్నేహితులు..
విశ్వమూర్తి బి..కామ్.. చదివిన తరువాత అతని తండ్రి ఉద్యోగరీత్యా హైద్రాబాద్ కి ట్రాన్స్ ఫర్ అయితే మొత్తం కుటుంబం హైద్రాబాద్ కి వెళ్లిపోయారు..

అప్పట్లో ఇద్దరూ ఉత్తరాలు వ్రాసుకునేవారు కొంతకాలం.. ఆ తరువాత కాకినాడలోనే తనకి బి..ఎస్..ఎన్.ఎల్ లో ఉద్యోగం రావడం, అదే జిల్లాలో అటూ ఇటూ బదిలీలతో ఇద్దరిమధ్యా ఉత్తరాలు పూర్తిగా తగ్గిపోయాయి.. విశ్వం ఎమ్..కామ్ చదివి ఆ తరువాత సీ..ఏ చేసి ప్రైవేట్ గా ప్రాక్టీస్ పెట్టాడని ఆ తరువాత తన క్లాస్ మేట్ ఎవరో కలసినప్పుడు చెప్పాడు..

తను కొంతకాలం బదలీల మీద అటూ ఇటూ తిరిగినా చివరకు తుని బ్రాంచ్ కి బదిలీ చేయడంతో తుని లోనే స్తిరపడిపోయాడు.. రెండువందల గజాల స్తలం కొనుక్కుని సొంత ఇల్లు కట్టుకున్నాడు..

తరువాత చాలా కాలం తరువాత కాలేజ్ రీ యూనియన్ ఫంక్షన్ లో విశ్వం కలసినపుడు ఇద్దరూ ఒకరినొకరు తమ వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు..

పాపం విశ్వం భార్యపోయి రెండు సంవత్సరాలు దాటిపోయిందని చెప్పినపుడు చాలా బాధ పడ్డాడు తాను.. ఇద్దరు కొడుకులని చెప్పినపుడు వాళ్లతోనే ఉంటున్నావా అని అడిగితే, రెండోవాడు అమెరికాలో సెటిల్ అయ్యాడని, భార్యా పిల్లలతో అక్కడే ఉన్నాడని చెప్పాడు.. అయితే మీ పెద్దబ్బాయితో ఉంటున్నావా అంటే ఔనన్నట్లుగా తల ఊపాడు.. కానీ వివరాలు ఎందుకో చెప్పలేదు, తానూ గుచ్చి గుచ్చి అడగలేదు..

"మరి నీవురా రామం అని తనని అడిగితే, తనకి ముగ్గురు కూతుళ్లని, ఇద్దర కూతుళ్లకూ పెళ్లిళ్లు అయిపోయాయని పెద్దకూతురు, అల్లుడు నాగపూర్ లో ఉంటున్నారని వాళ్లకు ఒక కొడుకు, కూతురని, అల్లుడు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ లో పనిచేస్తున్నాడని, చిన్నమ్మాయి చెన్నయ్ లో ఉంటోందని, చిన్న అల్లుడు బేంక్ ఆఫ్ బరోడా లో పని చేస్తున్నాడని, వాళ్లకు ఒక పాప అని చెప్పాడు.. రెండో అమ్మాయి పుట్టిన పది సంవత్సరాల తరువాల మూడోది పుట్టిందని దానిపేరు హరిణి అని, అది ప్రస్తుతం తునిలోనే ఇంటర్ ఫైనల్ ఇయర్ చదువుతోందని చెపితే నవ్వుతూ అదృష్టవంతుడివా రామం అంటూ ప్రేమగా భుజం తట్టాడు..

రిటైర్ అయిపోయాను, ఇంకా మూడో అమ్మాయి హరిణి చదువు పెళ్లి బాధ్యత ఉందంటే, అన్నీ సక్రమంగా జరుగుతాయిలేరా అంటూ తనకి ధైర్యం చెప్పాడు..

భార్యపోయినప్పటి నుండి తను ప్రాక్టీస్ పూర్తిగా మానివేసానని ప్రస్తుతం ఖాళీగానే ఉంటున్నానని విశ్వం చెప్పాడు.. ఎందుకో విశ్వం ముఖంనిండా నైరాశ్యం అలుముకుంది..

భార్యపోయినందుకు బాధ పడుతున్నాడేమోననుకుంటూ, మా ఇంట్లో కొన్నాళ్లు ఉందువుగాని రారా, కాస్త మార్పు ఉంటుందని పిలిస్తే తప్పక వస్తాను రా రామం అంటూ మాటిచ్చాడు..

రామం విశ్వం గురించి ఆలోచిస్తుండగా వసంత 'ఇంకేమీ మీ కాలేజ్ స్నేహితునితో మీకు భలే కాలక్షేపం అన్నమాట' .. మన రెండో బెడ్ రూమ్ సర్దుతానండీ మీ ఫ్రెండ్ ఉండడానికి.. హరిణి హాల్ లో చదువుకుంటుంది లెండి.. మన చిన్న ఇల్లు మీ స్నేహితునికి సౌకర్యంగా ఉంటుందో లేదో నండీ..

వాడు అలా ఏమీ అనుకోడు వసంతా.. వాడు స్తితిమంతుడైనా ప్రేమకూ ఆప్యాయతకూ ప్రాణమిచ్చే మనిషి.. ఏ భేషజాలూ లేవు మా విశ్వంకంటూ గర్వంగా వసంతతో అన్నాడు..

అనుకున్నట్లుగా విశ్వం వచ్చాడు.. రామం, విశ్వం కాలేజ్ విషయాలెన్నో మాటలాడుకుంటూ తెల్లనార్లూ గడిపేవారు.. వసంత కైతే విశ్వాన్ని చూడగానే ఒక సొంత అన్నగారిలా అనిపించాడు.. "అమ్మా వసంతా అని పిలుస్తుంటే", అన్నయ్యలు లేని వసంత విశ్వాన్ని అభిమానంగా అన్నయ్యా అంటూ పిలిచేది.. హరిణి అయితే మామయ్యా అంటూ విశ్వం పక్కనే కూర్చుని కబుర్లు చెపుతూ జోకులేస్తూ

నవ్విస్తూ ఉండేది.. అసలే వాగుడుకాయ హరిణి.. నాన్న స్నేహితుడనేసరికి ఇంక హరిణిని ఆపేవారే లేరు.. ఖాళీగా ఉన్నపుడు విశ్వంతో మామయ్యా కేరమ్స్ ఆడదాం రండంటూ, మరోసారి చెస్ ఆడదామా అంటూ విశ్వాన్ని ఒక్క క్షణం ఖాళీగా ఉంచేదికాదు..

విశ్వం హరిణిని తీసుకుని బజారుకెళ్లి ఆ అమ్మాయికి కావలసిన డ్రెసులెన్నో కొనిచ్చాడు.. "ఒరేయ్ విశ్వం అది సామాన్యమైనది కాదు, చనువిస్తే నీ నెత్తిమీద కూర్చుంటుంది, నీ జేబులు ఖాళీ చేయిస్తుందంటే", చేయించనీయరా, చిన్నపిల్ల, నా మేనకోడలూ, నా ఇష్టం, ఆపడానికి నీవెవరురా అంటూ సరదాగా దబాయించేవాడు. వసంత విశ్వానికి ఇష్టమైన వంటలెన్నో చేసి కొసరి కొసరి వడ్డిస్తూ కబుర్లు చెపుతుంటే, ఆ ఆప్యాయతకు విశ్వం కళ్లనుండి కన్నీటిబొట్లు అన్నంలో రాలిపడేవి..

రామం, వసంత చూపిస్తున్న ఆదరణలో విశ్వం తిరుగు ప్రయాణం రెండురోజుల్లోకి వచ్చేసింది..

ఆరోజు రామం విశ్వం పార్క్ లో వాకింగ్ చేస్తుండగా హఠాత్తుగా రామం విశ్వంతో 'ఒరేయ్ విశ్వం నీవు నీ పెద్ద కొడుకు దగ్గర సంతోషంగానే ఉన్నావు కదూ ? రెండోవాడిని చూడడానికి అమెరికా వెళ్లే ప్రోగ్రామ్ ఏదైనా ఉందా' ? ఒకోసారి ఏదో పోగొట్టుకున్నట్లుగా కనిపిస్తావురా అందుకే అడిగాననేసరికి ........

"నా భార్య మాధవి గుర్తొస్తుందిరా, ఎంత మంది మధ్య ఉన్నా మాధవి లేదే అనుకుంటాను ఒకోసారి"! విశ్వం గొంతుకు గద్గదమైందో క్షణం..

స్నేహితుని భుజం మీద ఆప్యాయంగా తడుతూ, "ఒరేయ్ విశ్వం మేమున్నామురా నీకు.. నీకు ఎప్పుడు బోర్ గా ఒంటరిగా ఉన్నాననిపిస్తే అప్పుడు మా ఇంటికొచ్చేయ్.. నేను మీ పెద్దబ్బాయితో మాటలాడతాను నిన్ను తరచుగా ఇక్కడకు పంపిస్తూ ఉండమని".

"నన్ను ఎవరూ అభ్యంతరం పెట్టరురా . ఎక్కడికి వెళ్లినా ఎవరూ ఏమీ ప్రశ్నించరు.. మీ అందరితో నేను ఇక్కడ గడపిన రోజులు, నాకు మీరున్నారనే ధైర్యం ఒక టానిక్ లా పనిచేస్తుందిరా.. తప్పకుండా వస్తూ ఉంటాను, సరేనా" అంటూ రామానికి మాటిచ్చాడు..

విశ్వం వెళ్లేముందు హరిణిని పిలిచి తన దగ్గర కూర్చోపెట్టుకున్నాడు..

"చూడమ్మా హరిణీ, నీకు చదువుమీదున్న ఆసక్తిని గమనించాను.. ఒకరోజు అనుకోకుండా మీ నాన్న నీతో అన్నమాటలు విన్నాను.. ఇంజనీరింగ్ చదివించలేనమ్మా, అక్కల్లాగే డిగ్రీ చదువుదువుగానంటే నీవు కాసేపు ఏడ్చి తరువాత మీ నాన్నతో సరేనంటూ కాంప్రమైజ్ అయిపోయావు.. ఇంటి పరిస్థితులను చక్కగా అర్థం చేసుకున్నావు.. నీకు కాకినాడ ఇంజనీరింగ్ కాలేజ్ లో సీట్ వస్తుందని చెప్పడం విన్నాను".


"అవును మామయ్యా నాకు వచ్చిన రేంక్ కు కాకినాడ కాలేజ్ లో సీట్ వస్తుంది. హాస్టల్, ఫీజులు బోల్డంత ఖర్చు అవుతుందని నాన్న అన్నారు. ముందర పేచీ పెట్టాను, కానీ మా ఆర్థిక పరిస్తుతులను అర్థం చేసుకున్నాను. ఇప్పుడు నాకేమీ బాధ లేదు మామయ్యా. డిగ్రి అయ్యాకా పీజీ చేయనా ఏంటీ, ఆత్మవిశ్వాసంతో చెపుతున్న హరిణి ముఖంలో వింత కాంతులు మెరుపులీనుతున్నాయి.

"నీవు ఇంజనీరింగ్ చదువు హరిణీ.. ఆ ఖర్చు నేనిస్తానంటూ" ఒక బేంక్ చెక్కు హరిణి చేతికి అందించాడు..

ఈలోగా రామం వచ్చాడ్కడకు.. హరిణి విషయమంతా చెపుతూ ఆ చెక్కు తండ్రికి ఇచ్చింది..

రామం స్తాణువైపోయాడు.. "విశ్వం ఏమిటిదంతా ? అభిమానానికి కూడా హద్దు ఉంటుందిరా"!

"అయిదు లక్షల రూపాయలకు హరిణికి చెక్కు ఇస్తావా ? ఇదేమీ బాగోలేదురా.. మన మధ్య స్నేహబంధమే ఉండాలిగానీ డబ్బుతో ముడిపడిన బంధం ఉండకూడదురా.. తీసుకోరా" అంటూ తిరిగి ఇవ్వబోతుంటే, " నా సొంత మేనకోడలికిస్తున్న అనుభూతితో ఇస్తున్నానురా రామం, నా మనసు బాధ పెట్టకు







ప్లీజ్" అంటూ గంభీరంగా
అనేసరికి రామం ఏమీ
మాటలాడలేకపోయాడు..

"అమ్మా హరిణీ, బాగా
చదువుకోవాలి.. నీకేమి
కావాలన్నా మీ నాన్నతోబాటూ
ఈ మామయ్యకూడా ఉన్నాడని
గుర్తుపెట్టుకో". "అమ్మా,
వసంతా వెళ్లొస్తాను.. నీవు
చూపించిన ఆదరణకూ ప్రేమకూ
విలువకట్టలేనమ్మా"!

"అయ్యో అన్నయ్యా అలా
అనకండి.. మీరూ వస్తూ పోతూ
ఉంటేనే మాకు ఆనందం.. మళ్లీ
త్వరగా రండన్నయ్యా" అంటూ
విశ్వం కాళ్లకు నమస్కరించింది..
విశ్వం వీడ్కోలు తీసుకున్నాడు
వారందరినుండి..

విశ్వాన్ని చూస్తూనే ఆ ఫ్లాట్స్
వాచ్ మేన్ గబ గబా పరుగెత్తుకుని
వచ్చి విశ్వం చేతిలోని బేగ్ ను
అందుకుంటూ ఆయనతోబాటూ
లిఫ్ట్ లోకి వచ్చాడు..

థర్డ్ ఫ్లోర్ ముందు లిఫ్ట్ ఆగగానే
ఇద్దరూ విశ్వం ఫ్లాట్ మెయిన్ డోర్
దగ్గరకు వచ్చారు.. వాచ్ మేన్ తన
దగ్గరున్న కీస్ తో తలుపు తెరిచాడు..

తను లేకపోయినా వాచ్ మేన్
ఫ్లాట్ ను నీట్ గా ఉంచాడు..
ఎప్పటికప్పుడు పనిమనిషితో
తుడిపిస్తూ !
'వంట మనిషి అన్నపూర్ణ గారు ఫోన్
చేసారు సర్, ఇంకో అరగంటలో
వస్తానని చెప్పమన్నారు'.

"సరే నీ వెళ్లవోయ్
ఆంజనేయులూ, అవసరమైతే
ఫోన్ చేస్తానని" వాచ్ మేన్ ను
పంపించేసాడు..

విశ్వమూర్తి స్నానం అదీ
పూర్తయేసరికి వంటావిడ
వచ్చింది.

"నమస్తే సార్, మీ ప్రయాణం
అదీ బాగా జరిగిందా"?
అంటూ కుశలప్రశ్నలు వేసింది..
మాధవి కి అనారోగ్యంగా
ఉన్నప్పుడు వంటపనికోసం
ఈవిడను పెట్టుకున్నారు..
భర్త పౌరోహిత్యం చేస్తుంటే
ఈవిడ ఇలా బాగా
తెలుసున్న ఇళ్లల్లో వంటలు
చేస్తూ ముగ్గురాడపిల్లలను
చదివించుకుంటున్నారు..

విశ్వమూర్తి ఆ కుటుంబానికి
సాయపడ్తూనే ఉంటాడు...
ఆవిడే వస్తూ వస్తూ
కూరగాయలూ, ఇంట్లోకి
కావలసిన పచారీసామాన్లూ
అవీ తెచ్చి పెడ్తే విశ్వమూర్తి
వాటికయిన డబ్బు వెంటనే
ఇచ్చేస్తాడు.. ఆవిడ
వంటింట్లోకి వెళ్లి వంటపని
ప్రారంభించారు..

ఇంక మళ్లీ ఒంటరి బ్రతుకు
మొదలు..
ఈ పదిరోజులూ తను
అనుభవించిన ఆనందం తన
జీవితంలో మరచిపోలేనిది..
రామానికి తన గురించి ఏమీ
సరిగా చెప్పనేలేదు..
'ఎందుకని ? తనలో తనే
ప్రశ్నించుకున్నాడు'. తన
అంతరాత్మ పరిహసిస్తోంది.. "నీ
బాధ, ఆవేదనను నీ ప్రాణ మిత్రుడికి
కూడా చెప్పకపోవడమేమిటి విశ్వం
అంటూ"?

'నిజమే, ఏమని చెప్పుకోవాలి..
ఏమంత గొప్ప జీవితం అని'!
తన మాధవి తనను శాశ్వతం
గా విడిచి వెళ్లిపోయిందని
తెలిసినా తన పెద్దకొడుకు
సంసారంతో హాయిగా కాలక్షేపం
చేస్తున్నాననుకుంటున్నాడు..
అమెరికాలోని చిన్నకొడుకు
ప్రతీరోజూ ఫోను చేస్తూ ఉంటాడని
అనుకుంటున్నాడు.. "నాన్నా
దగ్గరకు వచ్చేయ్" అంటూ
చిన్నకొడుకు బ్రతిమాలుతూ
ఉంటాడనుకుంటాడు..

కానీ, ఇందులో ఏదీ నిజంకాదు.
అమాయకుడైన రామం అంతా
నమ్మేసాడు.
చెప్పేయాలి రామంతో.......

లేప్ టాప్ తెరిచి మెయిల్
ఇవ్వసాగాడు..

"డియర్ రామం..
క్షేమంగా చేరానింటికి.. మళ్లీ
యధాప్రకారం ఒంటరి జీవితం..
ఒంటరి జీవితం అంటున్నాడేమిటా
అని ఆశ్చర్యపోతున్నావుకదూ
రామం? నన్ను క్షమించు రా !
నీతో కొన్ని విషయాలు చెప్పకుండా
దాచిపెట్టాను..

చెప్పలేకపోయానురా రామం.. గొంతు పెగల్లేదు.. నీ ఎదురుగా లేనుకనుక ఇప్పుడు ధైర్యం వచ్చేసిందిరా..

మా పెద్దవాడు రాహుల్ ఐఐటి లో టాపర్.. తపువాత యు..ఎస్ లో టాప్ యూనివర్సిటీలో ఎమ్ ఎస్ లో అడ్మిషన్ దొరికింది.. మొదటనుండీ పుస్తకాల పురుగు.. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఏదో సాధించాలన్న తపన కనబడేది వాడిలో.. యూ.. ఎస్ లో చదువు పూర్తయ్యాక పెద్ద పెద్ద కంపెనీలు ఉద్యోగాలు ఇస్తామంటూ వీడికోసం క్యూ కట్టాయి అమెరికాలో.

ఎందుకో సడన్ గా ఒక రెండునెలలు మా పెద్దవాడి నుండి ఏ ఫోనూ లేదు మాకు .. ఫోన్ కనక్ట్ అవడంలేదు.. ఈ–మెయిల్స్ ఇచ్చినా డెలివర్ అయ్యేవి కావు.. కొత్త జాబ్ తో బిజీగా ఉన్నాడనుకున్నాం.. ఒకరోజు మాధవి పోరు పడలేక ఎలాగో వాడి రూమ్ మేట్ ఫోన్ నంబరు సంపాదించి ఫోన్ చేస్తే "అదేమిటి అంకుల్ మీకు తెలియదా" అంటూ ఆశ్చర్యపోయాడు. వాడు అక్కడ ఉండలేనని జాబ్ చేయలేనని చెపుతూ కలకత్తా బెలూర్ లోని రామకృష్ణా మఠంలో చేరిపోవాలన్న ఆశయంతో వెళ్లిపోతున్నానని నాతో చెప్పాడు.. రాహుల్ మీకు చెప్పలేదా? మిమ్మలని కలవనేలేదా? అంటూ బోల్డు ఆశ్చర్యపోయాడు.. విషయం విన్న మాధవి దుఖాన్ని ఆప లేకపోయాను.. సరిగా అంతకు పూర్వమే అంటే అప్పటికి మూడు నెలల క్రితమే మా చిన్నవాడు రాకేష్ ఇంజనీరింగ్ తరువాత ఎమ్ బి ఏ చదవాలని యు.. ఎస్ వెళ్లాడు.. మా పెద్దవాడికీ, చిన్నవాడికీ వయసు వ్యత్యాసం సంవత్సరంన్నరే..

మాధవీ నేనూ హుటాహుటిన బేలూర్ చేరుకుని రామకృష్ణ మఠానికి వెళ్లి వాకబు చేస్తే ఆ మఠం వాళ్లు వివరాలిచ్చారు.. వాడిని కలవాలని వెడితే ఫారిన్ డెలిగేట్స్ తో స్పిరుట్యుయల్ లెక్చర్ లో ఉన్నాడని వెయిట్ చేయమని చెప్పారు.. ఆ తరువాత కొద్దిసేపటికి పిలుపు వచ్చింది.. వాడి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి .. పూర్తిగా గుండు, కాషాయరంగు దుస్తులలో కనిపించాడు.. మౌనంగా మా ఇద్దరినీ కళ్లతోనే పలకరించాడు.. మాధవి భోరున ఏడుస్తూ "ఇదేమి ఖర్మరా నీకు, వచ్చేయమంటూ" కంటికిమంటికి ఏకధారగా ఏడ్చేసింది.. రాలేను అన్నాడు.. ఎవరికి నచ్చిన మార్గంలో వారు ప్రయాణించడమే సబబు అన్నాడు.. తనకు సాంసారిక విషయాలపట్ల, భౌతికపరమైన జీవితం పట్ల వ్యామోహం లేదని , తన జీవితాన్ని ఆధ్యాత్మిక దిశగా మలచుకోవాలని నిర్ణయించుకున్నానని , అందుకనే సన్యాసం స్వీకరించానని చెప్పాడు.. జీవితానికి పరమార్ధం గొప్ప గొప్ప పదవులు, వైవాహిక జీవితం, పిల్లలు, సంసారం కాదుట.. ప్రజల్లో సామాజిక సేవ, ఆధ్యాత్మిక భావన, క్రమశిక్షణను జాగృతం చెయ్యడానికి కృషి చేసిన స్వామి వివేకానంద బోధనలు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయ సంకల్పించానని అదే తన ఆశయం అంటూ గంభీరంగా చెప్తూ లోపలకు వెళ్లిపోయాడు..

నేను మాధవి ఏమీ చేయలేని నిస్సహాయత స్తితికి గుర్రైనాము.. మాధవి దుఖాన్ని నియత్రించలేకపోయాను.. మాధవి బ్రతికి ఉండగా అప్పుడప్పుడు వాడిని చూడడానికి వెళ్లినా విజిటర్స్ లాగే దూరం నుండే చూసి వచ్చేసేవాళ్లం.. వాడు పూర్తిగా ఆ మఠానికీ, ఆధ్యాత్మిక సేవకూ అంకితమైపోయాడు.. ఇదిలా ఉంటే మా రెండోవాడు చదువు పూర్తవడం అక్కడే ఒక అమెరికన్ అమ్మాయిని ప్రేమ వివాహం చేసేసుకున్నాడు ఎవరికీ చెప్పకుండానే.

మాధవి ఈ రెండింటినీ జీర్ణంచుకోలేక బెంగపడిపోయి అనారోగ్యం తెచ్చుకుని మంచాన పట్టింది. ఆ తరువాత కొన్ని నెలలకే నా నుండి శాశ్వతంగా వెళ్లిపోయింది..

మాధవి మరణవార్త విని రెండవ వాడు వచ్చి ఆ కార్యక్రమాలు పూర్తి చేసి నన్ను తనతో వచ్చేయమన్నాడు.. నాకూ గ్రీన్ కార్డ్ కి అప్లై చేస్తానన్నాడు.. రానని చెప్పేసాను రా రామం.. అప్పటినుండి వాడు రాలేదు, నన్ను మళ్లీ రమ్మనమని పిలవలేదు.. పెద్దవాడు భౌతికంగా ఉన్నా మన మనుషులలో లేడు.. చిన్నవాడు అమెరికన్ పౌరసత్వం తెచ్చుకుని అమెరికన్ అయిపోయాడు..

నా ప్రాణం అయిన మాధవి లేదు..
నా కొడుకులున్నా నా కోసం ఎవరూ
ఆరాటపడరు..

ఇదీ నా పరిస్థితి.. నిన్ను నీ
కుటుంబాన్ని చూసాకా నేను ఏమి
పోగొట్టుకున్నానో అర్ధం అయింది..
నేను ఒంటరిగా ఉండలేనురా..
నీవు మాటల మధ్యలో మీ
ఇంటి పక్కనే ఉన్న ఇంటి ఓనర్
ఇల్లు అమ్మేయాలనుకున్నట్లు
చెప్పావు.. అందమైన పెద్ద తోట
మధ్యలో కట్టిన ఆ ఇల్లు నాకు
చాలా నచ్చింది.. ప్రశాంతమైన
పచ్చని వాతావరణం అంత
కంటే నాకు నచ్చింది మీ ఇంటి
పక్కనే ఆ ఇల్లు ఉండడం.. ఇక్కడ
నేనుంటున్న ఫ్లాట్, కొన్ని ఆస్తులు
అమ్మేసి నీ దగ్గరకు వచ్చేయాలని
నిర్ణయించుకున్నాను.. ఆ ఇంటి
యజమానికి నేను వారిల్లు
కొంటానని చెప్పి టోకెన్ గా
కొంత ఎడ్వాన్స్ పేచేయి.. నేను నీ
బేంక్ అకౌంట్ కి మనీ ట్రాన్స్ ఫర్
చేస్తాను..నేను ఒక నెలరోజులలో
నా పనులన్నీ పూర్తి చేసుకుని
వచ్చేస్తాను.. చి.. సౌ.. వసంతకు,
హరిణి కు నా ఆశీస్సులు..
ఉంటానురా,
ఎప్పటికీ నీ విశ్వం"!
మెయిల్ ను పైకే చదివిన రామం
బరువుగా నిట్టూర్చాడు.. అతని
కనుకొనలనుండి దుఖాశ్రువులు
రాలిపడ్డాయి.. హరిణి అయితే
బిగ్గరగా ఏడ్చేసింది.. "పాపం
మామయ్య కదూ నాన్నా,
మామయ్యను ఎప్పుడూ మనతోనే
ఉంచేకుందాం అంటూ". వసంత
అయితే అన్నయ్య ఎంతటి
వేదనను తన మనసులో
దాచేసుకున్నారండీ అంటూ
కంటతడి పెట్టింది.. "నాన్నా
మామయ్య మెయిల్ ఐడి ఇవ్వు,
నేను జవాబు వ్రాస్తానని"
హరిణి మెయిల్ అడ్రస్
తీసుకుంది..
రామం వెంటనే జవాబు
వ్రాసాడు..
"ఒరేయ్ విశ్వం,
ఎంతటి ఆవేదనను మనసులో
దాచేసుకున్నావురా? నీ భార్య
నీ నుండి దూరమైనా నీ
కొడుకులతో ఆనందంగానే
ఉన్నావనుకున్నాను గానీ,
అప్పుడప్పుడు డల్ గా
నిరాశగా కనపడుతున్న నిన్ను
చూస్తూ మాధవి లేదన్న
దిగులనుకున్నాను..
నీవెప్పటికీ ఒంటరివి
కావు.. నాలో చివరి శ్వాస
ఆగిపోయేవరకు నీవు నాతోనే
ఉంటావు.. వచ్చేయ్..
మనిద్దరం కలిసి సమయాన్ని
సద్వినియోగం చేసుకుంటూ,
సామాజిక సేవలందిస్తూ,
మనలాంటివారికి
అండంగా ఉందాం.. నా
పెద్దకూతురు, చిన్నకూతురు
నిన్ను చూడడానికి
వస్తామంటున్నారు.. ఇంక
నీ ప్రియమైన మేనకోడలు
హరిణి గురించి చెప్పాలా ?
మామయ్యా అంటూ నీకోసం
ఏడుస్తోందిరా.. వసంత
దుఖాన్ని ఆపలేకపోతున్నాను..

నీకోసం పరితపించే ఇంతమంది
ఉండగా నీవు ఒంటరి వాడివి
ఏమిటిరా ? బోలెడు సందడిని,
ఆనందాన్ని పంచి ఇచ్చేందుకు
మేమందరం సిద్ధంగా ఉన్నాం..
నీ రాక కోసం ఎదురుచూస్తూ........
నీ రామం.. ".
మెయిల్ చదివిన
విశ్వమూర్తికి రామం మాటలు
ఓదార్పునిచ్చాయి..
హరిణి మెయిల్ విశ్వమూర్తిని
సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది..
కంటినుండి ఆనందాశ్రువులు
రాలిపడ్డాయి.
" మామయ్యా, నాకెవరూ
లేరు, ఒంటరిననే మాట మీ
నోటినుండి రానివ్వకుండా
చూసుకుంటాం మేమందరం. నా
చదువు అయిపోయిన వెంటనే
పెళ్లిచేసేసుకుని పిల్లలను కనేసి ఆ
పిల్లలను మీ ఒడిలో పెట్టేస్తాను..
నాకు పుట్టిన పిల్లలతో మీరు
ఆడుకోవాలి మామయ్యా.. నన్ను
మీ కూతురుగా భావించండి..
మీ బాధలన్నీ నావే.. జరిగిన
సంఘటనలన్నీ మరచిపోండి..
కొత్త జీవితాన్ని ప్రారంభించండి..
మీకు ఎల్లవేళలా ఆనందాన్ని,
సంతోషాన్ని పంచి ఇచ్చే మీ
మేనకోడలు హరిణి ఉండగా మీకు
దుఖం ఎందుకు మామయ్యా ?
వింటున్నారా మామయ్యా?
మీ రాక కోసం ఎదురుచూస్తూ,
మీ ప్రియమైన మేనకోడలు,
హరిణి.
హరిణి మెయిల్ చదివిన
విశ్వమూర్తికి ఆ పసిపిల్ల
అభిమానానికి ముగ్ధుడైనాడు..
అతని మనసు మునుపెన్నడూ
లేని ఉత్సాహం తో నేను ఒంటరిని
కానని భావం తో నిండిపోయింది.
★★★

కథ

# ఎద లోపల

వి .అనసూయ

"ఏయ్ విన్నూ! ఇది విన్నావా?" అడిగాడు ప్రవీణ్ భార్య వినోదని.

"ఏది?"

"ఆ బి బ్లాక్ 16 పింకీ కి పెళ్ళి కుదిరిందిట".


"అవునా...అయితే చాలా విచారమే కదా!"

"అదేంటి? పెళ్ళంటే సంతోషం కదా అలా విచారం అనేసావు".

"నేను సంతోషించటానికే చెప్పారు కానీ మీలాంటి మగాళ్ళకి ఆమె పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే విచారమే కదా?"

"హమ్మ! ఎంత మాటన్నావ్ ...నన్ను... నన్నునుమానిస్తున్నావా?"

"ఇందులో అనుమానం ఏం వుంది ? ఉన్నదే అన్నాను. ఆ అమ్మాయి ఉదయం లేచింది మొదలు సాయంత్రం నిద్రపోయే వరకు మన అపార్ట్మెంట్ వాళ్ళు ఎంతలా కళ్ళప్పగించుకుని ఆమెను చూస్తారో నేను చూడలేదా? అంతెందుకు ఇప్పుడు మీరు ఆ అమ్మాయి పెళ్ళి వార్త ప్రత్యేకించి చెప్పడంలో అర్థం ఏమిటి?







"ఒసేయ్ పిచ్చి మొహమా... ఆ అమ్మాయిని మొదట చూసినప్పుడు ఆమె హొయలు పోతూ మాట్లాడే విధానం, వేసుకునే మేకప్ గురించి చెప్పి... పాపం అమాయకంగా వుంది కొంచెం చెప్పి చూడు.. అని నీకు చెప్పింది నేనే కదా! నాకలాంటి ఉద్దేశ్యమే వుంటే నీకెందుకు చెప్తాను? ఏమైనా ఓ యింటి దవుతుందంటే సంతోషమే. కానీ.. ఇప్పుడు ఎందుకు ప్రస్తావించాలంటే చేసుకోబోయే వాడి బాధ తలచుకుని మళ్ళీ ఓమారు సలహా చెపుతావేమో అని" అన్నాడు.

"ఈరోజుల్లో ఎవరైనా ఎంత ఆప్తులైనా ఎదుటి వ్యక్తులకి సలహా ఇచ్చేట్లు వున్నామా? ఇంతకు ముందు చాలా సార్లు చెప్పాను... నవ్వుతూ టాపిక్ మారుస్తుంది. ఇంకా ఎక్కువ చెబితే హర్ట్ అవుతుంది. సర్లేండీ ఆ పిల్ల గురించి మనకి వాదన ఎందుకు? ఇదిగో మీ లంచ్ బాక్స్ అంటూ బాక్స్ అందించింది. అతను బాక్స్ తో పాటు భార్యని దగ్గరకు తీసుకుంటూ రోజు రోజుకూ అందం పెరిగిపోతోంది అందం అంటే ఇది కదా ఆ పైపై సోకులు కాదని మా మగాళ్ళు ఎప్పుడు తెలుసుకుంటారో ఏమో?" స్వంతంగా అనుకున్నట్లు అన్నాడు

"అయితే ఇప్పుడు మగాళ్ళందరూ నా అందాన్ని చూడాలంటారు"

ఆమెని చప్పున వదిలేస్తూ "సేయ్ రాక్షసీ! నీ నోటికి అదుపులేదా? దానికి తాళం ఇలా కాదు రాత్రికి వచ్చి వేస్తా" అని చెపుతూ ఆఫీసుకు వెళ్ళటానికి గుమ్మం దాటాడు. భర్త వెళ్ళిన వైపే నవ్వుతూ చూస్తూ గుమ్మం వరకూ వచ్చి బై చెప్పి లోనికి వెళ్ళబోతూ బాల్కనీలోంచి బి బ్లాక్ వైపు చూసింది.

ఇక్కడ నుండి చూస్తే పింకీ వాళ్ళు వుండే ఫ్లాట్ బాల్కనీ బాగా కనిపిస్తుంది. అప్పుడే ఆ అమ్మాయి కూడా బాల్కనీ లోంచి చేయి వూపింది. తాను కూడా చేయి ఊపితే నేను అక్కడికి వస్తాను అన్నట్లు చేతులతో సైగ చేసింది.

"ఒకే కం" అంటూ వినోద నోటితోనూ చేతులతోనూ నవ్వుతూ రిప్లయ్ ఇచ్చి లోనికి వచ్చింది. బహుసా పెళ్ళి వార్త చెప్పటానికే అనుకుంటా వస్తుంది అనుకుంది. ఆ పిల్లకి కాస్త జాగ్రత్తలు చెప్పు అన్న భర్త మాటలు గుర్తొచ్చాయి.

పింకీ అసలు పేరు సువర్ణ. ఆరు నెలల అవుతుంది వారు ఈ కాలనీలోకి వచ్చి. సువర్ణ పేరుకి తగినట్లే మంచి పసిమి ఛాయ. మంచి రంగు కలిగిన వారంతా అందగత్తెలని చెప్పటానికి లేదు. కానీ ఈమె అలా కాదు భగవంతుడు చాలా శ్రద్ధతో ఒక్కొక్క అవయవాన్ని తీర్చిదిద్దినట్లుంటుంది. అలా వున్నవారిని ఎవ్వరైనా కళ్ళప్పగించి చూడాల్సిందే. కానీ ఈ అమ్మాయిని అంతకు మించి ఒక విధమైన కాంక్షతో చూస్తారు. విచిత్రం ఏ మంటే వాళ్ళు అలా చూస్తున్నారని, ఇంకా చూడాలని వుంటాయి ఆమె చేష్టలు. ఆమె ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తుంది. ఆఫీసుకు వెళ్ళేప్పుడు వచ్చేప్పుడు నాలుగు ఫ్లోర్లు వినబడేట్లు గట్టిగా 'అమ్మా! నేను ఆఫీసుకు వెళ్ళి వస్తా'

## పాఠకులకు విజ్ఞప్తి

సుమతి సకుటుంబ వార పత్రికకు పాఠకులే మూల స్థంభాలు . మీరిచ్చే ప్రోత్సాహమే సుమతికి ఆయువు . మీరు కట్టే చందాలే సుమతికి ఆధరవు. అందుకనే పాఠకుల అభిప్రాయాలకు సుమతి ఎప్పుడు అత్యంత విలువనిస్తుంది. కావున సుమతి పాఠకులు తమ తమ అభిప్రాయాలను ఈ కింది మెయిల్ కు పంపండి . పాఠకుల కోసం ఇకనుండి ఒక పేజిని కేటాయించటం జరుగుతుంది. పాఠకుల అభిప్రాయాలతో పాటుగాpho-to కుడా ప్రచురించ బడును.

ఉత్తమ అభిప్రాయానికి రు 116 /- బహుమతిగా ఇవ్వ బడును . sumathi.salahaalu@gmail.com

అంటుంది. నిగూఢంగా మిగిలిన వారికి నన్ను ఫాలో అవ్వండి అన్నట్లుంటుంది. తాను టూ వీలర్ స్టార్టు చేసేప్పుడు కావాలని ఒంగుని తన లోనెక్ టీ షర్టు నుండి బ్రెస్ట్ కనపడే విధంగా ఓ యాంగిల్ ఇచ్చి తర్వాత బైక్ స్టార్ట్ చేస్తుంది. ఈ సీను చూడడం కోసం చాలా జతల కళ్ళు ఎదురు చూస్తుంటాయి. శుక్రవారం అయితే మరీ పద్ధతిగా పూజ అదీ చేసి పల్చని చీర కట్టులోంచి బంధాలు తెంచుకు చూసే ఎద సంపదపై చీర సర్దుకుంటూ, వీపు మొత్తం కనబడేట్లు కేవలం రెండంగుళాలు వున్న జాకెట్ మీదగా నడుం ఒంపులు తెలిసేలా చీర అంచు దోపి కట్టుకుని అందరికీ కనువిందు చేస్తుంది. ఇదిగో ఈ వాలకంతో ఆమె ఈ కాలనీ అపార్ట్మెంట్ ఆడవాళ్ళందరికీ శత్రువైంది. మొదట్లో తన భర్త తనకి చెప్పి పాపం అమ్మాయి చాలా అమాయకురాలల్లే వుంది. అందరి కళ్ళు తనపై వున్నాయని చూచాయగా చెప్పు జాగ్రత్త పడుతుంది అన్నాడు.

"ఏమని చెప్ప మంటారు? నీవు అలా ఒంగొవద్దనా? లేక అలాంటి లో నెక్ షర్టులు వేయొద్దనా?" అంది కోపంగా.

"ఎందుకు అంత కోపం? సాటి స్త్రీ గా కొంచెం జాగ్రత్త చెప్పటంలో తప్పులేదుగా. మనది అటూ పల్లె కాదు.. ఇటు పట్నం కాదు, అన్నీ చూస్తూ పోటానికి... నీకేం తెలుసు ఆ అమ్మాయిని అలా చూసినప్పుడు మగ వారు మాట్లాడే మాటలు వినలేక పోతున్నా అందుకే చెప్పి చూడు తప్పు లేదుగా" అన్నాడు మళ్ళీ.

"ఏమనుకుంటా రేమిటి?" కుతూహలంతో అడిగింది నిజంగా ఎలా చెప్పుకుంటారో తెలుసుకుందామని.

"ఇప్పుడు నీవు తెలుసుకోటం అవసరమా? చెప్తే మంచి చెప్పు లేకుంటే మానేయ్ అంతేగానీ నాకు నీవు పరీక్ష పెట్టకు" అంటూ దాటేసాడు.

తర్వాత అనుకోకుండా ఓరోజు లిఫ్టులో కలిసింది పింకీ. తనే ముందుగా పలకరిస్తూ "మీరు వినోద కదూ?" అంది.

తన పేరెలా తెలుసు? అని ఆశ్చర్యపోతుంటే "బావగారితో మాట్లాడాను" అంది.

"ఏ బావగారు?" అన్నట్లు ముఖం పెట్టింది వినోద.

"అదే అక్కా! ప్రవీణ్ గారు" అంది. అక్కా అనటంతోపాటు భర్త పేరు ఆమె నోటి నుండి రాగానే తన ముఖంలో రంగులు మారాయి .

ఓ నిమిషం తర్వాత "ఏమన్నారు?" అంది. అప్పుడప్పుడూ కాస్త ఆ పిల్లకి జాగ్రత్త చెప్పు అనే భర్త మాటలు గుర్తొచ్చాయి. ఒకవేళ తను చెప్పలేదని ఆయనే సాహసం చేసి అవమాన పడ్డాడేమో అని అనుమానం వచ్చింది.

ఈలోపు రెండో ఫ్లోర్ లో లిఫ్ట్ ఆగింది. ఆమె విషయం చెప్పకుండా వెళ్ళిపోతుందేమో అని కంగారు పడుతుంటే.. "ఇక్కడ 21లో ఆంటీకి ఇది ఇచ్చేసి మీ ఇంటికి వస్తా" అంది చేతులోకి పాకెట్ పైకి ఎత్తి చూపుతూ. తనకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

సరే అన్నట్లు తల ఊపింది. తను వెళుతూ "32 నేగా" అంది. అది వినోద అపార్ట్మెంట్ నెంబరు. అవును అని చెబుతూ "నేను వెయిట్ చేస్తుంటాను" అంది..తప్పకుండా రా అనే వుద్దేశ్యంతో.

తను ఇంట్లోకి వెళ్ళాక దాదాపు ముప్పావు గంటకి వచ్చింది. ఈ ముప్పావు గంటా ఆమెకి ఒకటే టెంక్షన్ ఏం జరిగిందో ఇద్దరి మధ్యా అని. ఒకవేళ భర్తకి ఫోన్ చేసి అడుగుదామంటే ఏం తెలియకుండా ఏమని అడగాలో తోచలా.

తన టెంక్షన్ తగ్గిస్తూ లోనికి రావటంతోనే "హబ్బా! ఎంత అందంగా అలంకరించారు ఇంటిని" అంటూ గోడలకి వున్న పెయింటింగ్స్ వైపు తదేకంగా చూస్తూ ఓ పెయింటింగ్ చూస్తూ నిలుచుండి పోయింది.

తన దృష్టి ఎక్కడ వుందో అటువైపు దృష్టి సారించింది వినోద. ఇంటి ముందు కూర్చున్న ఓ పేదరాలు తన బిడ్డకు పాలిస్తూ తన్మయంగా బిడ్డను చూస్తున్న చిత్రం అది. అది వినోదకి డిగ్రీ చదివే రోజుల్లో యూనివర్శిటీ కాంపిటీషన్స్ మొదటి బహుమతి తెచ్చిన పెయింటింగ్. దాన్ని భద్రంగా లామినేషన్ చేయించి అక్కడ వుంచింది. ఆ విషయమే ఆమెతో చెబుతూ వుండగా ఆమె కన్నులు చెమ్మగిల్లి కనిపించాయి.

ఆమె గమనించిందని అర్థం అయి చేతిలో వున్న కవరులోంచి మరో ఓ చిన్న కవరుతీసి ఇస్తూ "ఇంట్లో సాయిబాబా పూజ జరిగింది. అందర్నీ పిలవలేక పోయాం.. అందుకే ప్రసాదం

తెచ్చా" అంటూ ఇచ్చింది.

ఆ అమ్మాయి లోనికి వచ్చిన దగ్గర నుండి నడిచే తీరు, నిలబడే తీరు, మాట్లాడే తీరు ఎంతో ముగ్ధ మనోహరంగా అనిపించింది. ఈ అమ్మాయిలో ఏదో మ్యాజిక్ వుంది ఎంత శత్రువైనా ఈమె ముందు బొమ్మలా నిడబడాల్సిందే. అనుకుంటూ "కాఫీ!.." అంది చేతిని కొద్దిగా తాగుతావా అన్నట్లు చూపిస్తూ.

"ఓ షూర్..." అనగానే వినోద లోపలికి వెళ్ళింది కాఫీ కలిపేందుకు. తను కూడా చనువుగా వెంబడిస్తూ "మిమ్మల్ని రోజూ గమనిస్తూ వుంటాను మా బాల్కనీ లోంచి.. మీరు అచ్చూ మా అక్కాలా వుంటారు. మీతో మాట్లాడాలని చాలా రోజుల నుంచి అనుకుంటుంటే ఇందాక ప్రవీణ్ గారు అనుకోకుండా కలిసారు. వారితో ఈ విషయమే చెబితే మీ పేరు వినోద అని చెప్పి....అక్క అంటున్నావు కదా! మా ఇంటికి వెళ్ళి తనతో ఈ విషయం చెప్పు చాలా సంతోషిస్తుంది. తను చాలా మంచిది అన్నారు. మీరంటే బావగారికి చాలా ఇష్టం అన్న సంగతి అర్థం అయింది" అంది నవ్వుతూ.

భర్త తన గురించి ఓ ముద్దుగుమ్మ దగ్గర అలా చెప్పటం మాటలా? అందుకే ఇందాక పడిన టెంక్షన్ అంతా పటాపంచలై ఆయన ఎందుకు తన దగ్గరకు పంపారో అర్థం అయింది.

కలిపిన కాఫీ చేతి కిచ్చి "నీవు నన్ను అక్కా అనటం బావుంది. చాలా రోజులుగా ఇటువంటి పిలుపులు బంధువులు మధ్య తప్ప ఈ వూర్లో ఇతరులు నుండి వినలేదు. అలాగే పిలువు" అంది సంతోషంగా. ఆరోజు మొదలు ఇద్దరూ కాసేపు వాకింగ్ పేరుతో కిందికి వచ్చినప్పుడు చాలా కబుర్లు చెప్పుకోటం అలవాటయింది.

అప్పుడప్పుడు మాటల్లో నొప్పించ కుండా జాగ్రత్త పడుతూ చెప్పేది. ఓ రోజు అంది సరదాగా "చూడు నీవు చాలా అందంగా వుంటావు.. ఎవరైనా తప్పకుండా తిరిగి చూడాల్సిందే కానీ ఈ డ్రెస్సు లెందుకు జనాల్ని యాక్సిడెంట్స్ గురిచేయటానికి కాకపోతే"

పింకీ విజయ విలాసంగా నవ్వుతూ "అక్కా! స్త్రీ అంటే ఇలాంటి డ్రస్సే వేసుకోవాలని ఎందుకు నిర్దేశించారు?"

"అంత పెద్ద సబ్జెక్టు నా దగ్గర లేదమ్మా... కానీ నా ఉద్దేశం అందంగా లేని వాళ్ళు ఎదుటివారిని ఆకర్షించటానికి ప్రయత్నం చేస్తుంటారు.. నీకు ఆ అవసరం లేదని చెప్పటమే నా ఉద్దేశ్యం" అంది.

"ఒకటి అడుగుతాను ఏం అనుకోకు ఆడదాని వక్షస్థలం చూడగానే మగవాడికి కామవాంఛ తప్ప ఏం వుండదా?" అంది.

మళ్ళీ తనే అంది "వాత్సాయన కామసూత్ర లో అసలు స్త్రీకి చెవి వెనుక వున్న గ్రంధులు, మెడ ఒంపులు సెక్స్ కోరికలు చెలరేగే స్థానాలట. మరి అవి చూడగా రాని కైపు స్త్రీ వక్షస్థలం చూడగానే ఎలా వస్తుంది?"

పింకీ సీరియస్ అయిపోవటం కాస్త ఆశ్చర్యం వేసింది. పెళ్ళికాని పిల్ల ఈ విషయం మాట్లాడటం కాస్త సిగ్గనిపించి ఆమెకి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"బహుసా కవుల వర్ణనలు, సినిమాలు మూలంగా మొదటి నుంచి ఆ రకంగా మైండ్ సెట్ చేసి వుంచ బట్టి అలా వున్నారా?... అసలు ఆడ వారికి నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ ఎందుకు లేదు?" అంది మళ్ళీ.

"స్వేచ్ఛ, హక్కులు లాంటి పెద్ద మాటలెందుకు? స్త్రీ పొందికైన వస్త్రధారణలో ఆకర్షణ లేదని నీ అభిప్రాయమా?"

"కానీ అది కాదు నా ఆలోచన.. అర్ధనగ్నంగా డ్రెస్ వుంటే మాత్రం కాంక్షతోనో, అసహ్యం తోనో చూడటమెందుకు? అవి శరీరం భాగాలే అని తేలికగా ఎందుకు తీసుకోరు అనేది నా ప్రశ్న?"

"మహామహ ఋషులకే తప్పలేదు ఈ చపల చిత్తం. మనమెంత అందుకే నీకు జాగ్రత్త చెప్పేది."

"హా...అదే నేనంటున్నా...మహా మహులు ఇటువంటి విషయాల్లో తప్పు దోవ పట్టారు కాబట్టి మనమే అర్థం చేసుకుని నిబ్బరంగా వుండాలని మగవారెందుకు ఉపన్యాసాలు ఇచ్చుకోరు?" మనకే ఎందుకు నీతులు?"

వినోదకి అంత సీరియస్ మాట్లాడుతున్న పింకీ మాటలకి ఎలా రియాక్టర్ అవ్వాలో అర్థం కాక "హబ్బా! నిన్ను పింకీ కాదు పెంకీ

అని పిలవాలి" అంది వాతావరణం కూల్ చేయాలని

"కానీ ఒకటి మాత్రం నిజం ఇక మీదట ఈ కాలనీలో ఏ ఆడదాన్ని చూసినా మగవాళ్ళు పశ్చాత్తాపంతో బాధపడేలాగ చేయబోతున్నా" అంది పింకీ సీరియస్ గా.

"ఈ రకంగా అందర్నీ ఇబ్బందులు పెట్టి ఇంకేం పశ్చాత్తాపం పడాలి?" అంది వినోద నవ్వుతూ.

ఇలా వాళ్ళ సంభాషణ ఏదోరకంగా నీ డ్రెస్ సెన్స్ మార్చుకో అని తను చెప్పటం, ఆ అమ్మాయి చెప్పే విషయాన్ని అటూ ఇటూ మార్చేస్తూ అందరూ నన్ను తలుచుకునే రోజొస్తుందని చెప్పటం పరిపాటైపోయింది.

ఇప్పుడు పెళ్ళికుదిరింది... మరి వచ్చిన భర్త అర్థం చేసుకునే వాడు వస్తే బావుండు.. పాపం! మంచి పిల్ల అనుకుంది.

. .... .... ...

డోర్ తీసి వుండటం వల్ల లోపలికి వస్తూనే ఆయాస పడుతూ సోఫాలో కూర్చుంది. కాఫీ తెచ్చి ఇస్తూ "ఏంటి ఎక్కడైనా ఆగావా? చాలా సేపు పట్టింది రావడానికి?" అంది.

"లేదు నిదానంగా నడిచి వచ్చా. కొంచెం ఓపిక తగ్గింది" అంది.

"ఏం ఒంట్లో బాలేదా?" అంటూ నుదిటిపై చేయి పెట్టి చూసింది. జ్వరం వున్నట్లేం లేదు అంటూ ముఖంలోకి చూసింది.

"సరే ముఖ్యమైన విషయం చెబుదామని వచ్చా..నాకు మ్యారేజ్ ఫిక్స్ అయింది" అంది.

తెలిసిన వార్తే అయినా కొత్తగా వింటున్నట్లు ముఖం పెట్టి "హార్టీ కంగ్రాట్స్. ఈ అపురూపమైన అందగత్తెని సొంతం చేసుకుంటున్న అందగాడు ఎవరో? ఏం చదువు కున్నాడు? ఏ దేశం నుండి వచ్చాడు?" అంది.

చిన్న నవ్వొకటి నవ్వి "నా అంత అందగాడు కాదులే గానీ మంచి మనసున్న వాడు. నన్ను నన్నుగా ఇష్టపడుతున్నవాడు పదవ తరగతి చదివిన ఓ రైతు" అంది.

"ఏయ్ ఏంటి జోక్ చేస్తున్నావా?"

"లేదు నిజమే చెబుతున్నా... కంగారు పడకుండా చెప్పేది పూర్తిగా విను అని కొంచెం సీరియస్ గా ముఖం పెట్టి..." అక్కా! నాకు సంవత్సరం క్రితం బ్రెస్ట్ కాన్సర్ వచ్చింది. ఫోర్త్ స్టేజి. అన్ని రకాల ట్రీట్ మెంట్స్ జరిగాయి. మాకు డబ్బుకు కొదవలేదు. కానీ భగవంతుని అనుగ్రహం ఇలా వుంది. ఇంకో నెల కన్నా ఎక్కువ బతుకను. అందుకే బంధువులకు దూరంగా వుండాలని ఈ కాలనీలోకి వచ్చాం. అమ్మా నాన్న నాకు కన్యగా కన్నా కన్యాదానం చేసిన వ్యక్తిగా సాగనంపాలని... పెళ్ళి చేసి ముచ్చట తీర్చుకోవాలని పట్టు బడితే కాదన లేక పోయా. మా దూరపు బంధువుల అబ్బాయికి విషయం చెప్పి రిక్వెస్ట్ చేసారు. పాపం అతను మా వాళ్ళ కోరిక తీర్చటానికి సిద్ధమైనాడు. పెళ్ళయ్యాక భార్య చనిపోతే మళ్ళీ పిల్లని ఇవ్వటానికి కొంచెం ఆలోచిస్తారు ఎందుకు అతన్ని ఇబ్బంది పెడతారు అని వద్దాన్నా. అతను కూడా నా సంగతి తెలిసి జాలి పడి పెళ్ళి వద్దంటూ స్నేహం కొనసాగించాడు. అతని పరిచయంతో డాక్టరు చెప్పిన దాని కన్నా రెండు నెలలు ఎక్కువే బతికాను. ఇప్పుడు నిజంగా అతని భార్యగా చనిపోవాలని కోరిక ఎక్కువై పెళ్ళికి సరే అన్నాను. నా పిచ్చి చేష్టలు అన్నీ తెలిసే భరించాడు. నువ్వు అప్పుడప్పుడు చెబుతావు కదా... ఇప్పుడు ఇలా వుంటే పర్లేదు కానీ రేపు పెళ్ళయితే నీ భర్త మీద అక్కసు తీర్చుకునేవారు చాలా మంది వుంటారు అని... ఆ మాట చెప్తే అతను నవ్వుకునేవాడు. రేపు పెళ్ళిలో కూడా అంతా అతని వైపు చూసే చూపుల్ని గుర్తుంచేసుకుంటుంటే నవ్వు వస్తుంది" అంది.

అంతా వింటున్న వినోదకి నవ్వు రాలేదు. మెదడు ఎప్పుడో మొద్దు బారింది. ఒక్కసారిగా కళ్ళంట నీళ్ళొచ్చాయి. ఏంటి ఈ కుందనపు బొమ్మ... మరి కొన్ని రోజుల్లో చనిపోతుందా? ఆ విషయం తెలిసి ఇంత హాయిగా ఎలా వుండగలుగుతుంది. నోట మాటరాక చూస్తున్న ఆమెని చూసి .... "అందుకే మీకు చెప్ప కూడదు అనుకున్నా కానీ ఎందుకో మీరు నాకు అక్కాలా ఆత్మీయంగా అనిపిస్తారు అందుకే చెప్పా... ఎక్కడా అనకండి ప్రామిస్ అంటూ ఆమె చేయి బలవంతంగా లాక్కుని తన తలపై వుంచుకుని... అసలే ఆయువు తక్కువ దాన్ని జాగ్రత్త" అని చెప్తూ వెళ్ళి పోయింది.

ఇందుకా తనని చూసిన ఏ మగాడికైనా మరే ఆడదాని ఛాతీ చూసినా తాను గుర్తొచ్చి పశ్చాత్తాపంతో బాధపడాల్సిన

రోజు తెప్పిస్తా అనేది. అందంగా కనిపించే అవయవాలకూ రోగాలొస్తాయి తెలిసుకోండని చెప్పటమే తన ఉద్దేశం కాబోలు. ఈమె తనకి బ్రెస్ట్ క్యాన్సర్ వున్నదన్న సంగతి తెల్సీ మనల్ని ఒకాట ఆడుకుందని తెల్సుకున్న ఏ మగాడైనా తప్పకుండా ఫీల్ అవుతాడు. ఇంక మీదట ఏ స్త్రీ వక్షోజాలు చూసినా ఆమె గుర్తొచ్చి పశ్చాత్తాపంతో అన్ని అవయవాలు వున్నట్లే అవీనూ అనుకునే రోజు తప్పకుండా వస్తుంది... అదే ఆమె కోరుకున్నది కూడా అనుకుంటూ చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంది.

..... సమాపం ....

## పారిస్ ఒలింపిక్స్ 2024 లో అత్యుత్తమ “నైతిక విలువలు” ప్రదర్శించిన స్పానిష్ ఆటగాడు.

కెన్యా ఆటగాడు రన్నింగ్ రేసులో ముందున్నాడు. గెలుస్తున్నాడు. ముందు గీతను చూసి రేసు చరమ గీత అనుకుని ఆగిపోయాడు. భాష రాదు. కాబట్టి అదే విన్నింగ్ రేఖ అనుకుని ఆగిపోయాడు. కానీ వెనకాలే పరుగెడుతున్న స్పానిష్ రన్నర్ కెన్యా రన్నర్ ను “ ఇంకా పరుగెత్తాలి “ అంటూ కెన్యా ఆటగాడిని ముందుకు తోసి ఆ రేస్ కెన్యా ఆటగాడే గెలిచేలా చేశాడు.

తరువాత ఓ జర్నలిస్టు స్పానిష్ ఆటగాడి మధ్య జరిగిన సంభాషణ మానవునిలోని దైవాన్ని చూపుతుంది.

జర్నలిస్టు : “ మీరు అలా ఎందుకు చేశారు “

ఇవాన్ ఫెర్నాండెజ్ : ఏదో ఒకరోజు మనం ఒకళ్ళకి ఒకళ్ళు సహాయం చేసుకుంటూ అందరం గెలిచే సమాజం కోసం అలా చేశాను. “

జ: మీరు ఆ కెన్యా రన్నర్ కు మీకు రావలసిన బంగారు పతకం ధార పోశారు తెలుసా ?

ఇవాన్ : నేనేం అతనికి సహాయం చేయలేదు. ఈ రేసు అతను గెలవబోతున్నాడు. కేవలం భాష రాకపోవటం వలన ఆయన ఆగాడు.

జ: కానీ మీరు గెలిచేవారే కదా !

ఇవాన్ : అవును. బంగారు పతకం గెలిచేవాడినే. కానీ ఆ బంగారు పతకానికి అప్పుడు ఏమి విలువ ఉంటుంది.

జర్నలిస్టు ఇవాన్ ని వదలకుండా ప్రశ్నిస్తునే ఉన్నాడు.

జ : మీరు బంగారు పతకాన్ని గెలిచేవారే కదా ?

ఇవాన్ : ఆ గెలుపుకు విలువేమున్నది ? నా తల్లి నా గురించి ఏమనుకుంటుంది ? మానవీయ విలువలు ఒక తరం నుండి మరో తరానికి పెరుగుతూ అందింపబడాలి. మన పిల్లలకు మనం అదే నేర్పాలి. మన పిల్లలకు మనం సరైన మార్గంలో వెళ్ళడం నేర్పాలి. తప్పు మార్గంలో వెళ్ళి గెలవడం మన పిల్లలకు నేర్పకూడదు. అలా కాకుండా మానవీయ విలువలు పెంచుతూ ఒకరికొకరం సహాయ పడుతూ పురోగమించాలి. ఎందుకంటే నిజాయితీ, నైతిక విలువలే ఎప్పుడూ విజయం సాధిస్తాయి.

## నమ్మకాలు- నిజాలు

# ప్రపంచంలో 10 వింత మూఢ నమ్మకాలు

స్వాతంత్ర్యోద్యమ కాలంలో మన దేశంలో చెప్పలేనన్ని మూఢనమ్మకాలు ఉండేవి. భర్తలేని మహిళ తెల్లచీరే కట్టుకోవాలనీ, బొట్టు పెట్టుకోకూడదనీ... ఇలా వందలకొద్దీ ఉండేవి. లక్కీగా అప్పట్లో సంఘ సంస్కర్తలు సమాజాన్ని మార్చారు. తప్పులను సరిదిద్ది సన్మార్గంలో నడిపారు. అలా జనరేషన్లు మారుతున్న కొద్దీ మూఢనమ్మకాలు మాయమవుతున్నాయి. మన దేశంలో ఇలా మార్పు మంచిదే అంటుంటే... కొన్ని దేశాల్లో ప్రజలు మాత్రం... ససేమిరా అంటున్నారు. తమ నమ్మకాలు తమవి అంటూ నమ్మేస్తున్నారు. కాలంతోపాటూ వారు మారట్లేదు. అసలు వాటిని తెలుసుకుంటే... ఇలా కూడా నమ్ముతున్నారా... ఏంటో వీళ్లు అనిపించకమానదు. అలాంటి ఓ 10 విచిత్రమైన అతి విశ్వాసాల్ని తెలుసుకుందాం.

# మేలుకొలుపు

1. లాటిన్ అమెరికా దేశాల్లో మంగళవారం పెళ్లి చేసుకోరు. ఆ రోజు చేసుకుంటే దంపతులు ఎప్పుడూ తిట్టుకుంటూ... విడాకులు తీసేసుకుంటారని నమ్మకం. అంతేకాదు... మంగళవారం ఎవరైనా పెళ్లి చేసుకుంటే... ఆ పెళ్లికి వెళ్లేందుకు కూడా ఎవరూ ఇష్టపడరు. ఏవో పనులు ఉన్నాయని చెప్పి ఎగ్గొడతారట.

2. దక్షిణ కొరియాలో ఎక్కడైనా కూర్చున్నప్పుడు కాళ్లను కదపకూడదట. అలాచేస్తే ఆ వ్యక్తి సంపద మొత్తం పోతుందని నమ్మకం. అందుకే దక్షిణ కొరియాలో ఎవరైనా కాళ్లు కదుపుతూ ఉంటే... అందరూ ఆ వ్యక్తిని అసహ్యంగా చూస్తారట.

3. నిచ్చెన కింది నుంచీ వెళ్లకూడదు అనేది మరో వింత నమ్మకం. మధ్యయుగంలో ప్రజలను నిచ్చెనలకు వేలాడదీసి ఉరి వేసేవాళ్లు. అందువల్ల చాలా దేశాల్లో గోడకు ఆనించివున్న నిచ్చెన కింది నుంచీ వెళ్లరు.

4. ఇళ్లు, ఆఫీసులు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ ఈల వేస్తే లిథువేనియాలో పెద్ద గొడవే అవుతుంది. అలాచేస్తే దెయ్యాల్ని పిలిచినట్లు అవుతుందట. వచ్చిన దెయ్యాలు ఈల వేసిన వారి పక్కనే కూర్చుంటాయని అతి నమ్మకం

5. వర్షం పడుతుంటే మనం ఇంట్లోంచీ బయటకు వెళ్తూ... గొడుగు తెరుస్తాం. ఇంట్లో ఉండగానే గొడుగు తెరిస్తే దురదృష్టమట. ఇంట్లో లోహ వస్తువులు, గొడుగు విడి భాగాలు, బయటి వర్షం అన్నీ కలిసి గాయపరుస్తాయని ఓ నమ్మకం.

6. ఐస్‌ల్యాండ్‌లో ఆరుబయట అల్లికలు (దారాలతో అల్లుట) చేపట్టరు. అలా చేస్తే చలికాలం మరింత ఎక్కువ కాలం కొనసాగుతుందని భావిస్తారు. అసలే అక్కడ మైనస్ డిగ్రీల వాతావరణం కాబట్టి... ఈ పని అస్సలు చెయ్యరు.

7. జపాన్‌లో ఉత్తరం (North) లేదా పశ్చిమం (West) వైపు చూస్తూ ఎవరూ నిద్రపోరట. ఎందుకంటే జపాన్‌లో చనిపోయిన వారి తలలు ఉత్తరం వైపు చూస్తున్నట్లు ఉంచుతారు. ఆఫ్రికాలో పశ్చిమంవైపు చూస్తున్నట్లు ఉంచుతారు. అందుకని జపనీస్ అలా నిద్రపోరట.

8. జర్మనీలో కొవ్వొత్తితో సిగరెట్ వెలిగించకూడదు. అది సముద్ర నావికులకు చెడు చేస్తుందట. వందల ఏళ్ల నాటి ఈ మూఢనమ్మకాన్ని ఇప్పటికీ నమ్ముతున్నా... ఇప్పుడు ఎవరూ ఇలా చెయ్యట్లేదు.

9. అజర్‌బైజాన్‌లో ఉప్పు, మిరియాల పొడిని ఆహార పదార్థాలపై చల్లుకోరు. ఎందుకంటే ఆ దేశంలో అవి చాలా రేటెక్కువ. వాటిని చల్లుకుంటే ఎంతోకొంత గాలికి చెల్లా చెదురవుతాయనీ, వృథా అవుతాయని ప్రజలు అలా చెయ్యరు.

10. ఆఫ్రికా దేశం రువాండాలో మహిళలు మేక మాంసం తినకపోవడమే మంచిదట. ఎక్కువగా మేక మాంసం తింటే, ముఖంపై వెంట్రుకలు వస్తాయనేది మూఢ నమ్మకం.

★★★

# బంగ్లాదేశ రిజర్వేషన్ల చిచ్చు



కొండేటి వీణ

పొరుగు దేశం బంగ్లాదేశ్‌ను రిజర్వేషన్ల అంశంపై కార్చిచ్చులా దహించివేస్తోంది. నెల రోజుల కిందట మొదలైన జ్వాల ఇంకా చల్లారలేదు . ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్య సమరయోధుల వారసులకు 30 శాతం రిజర్వేషన్ల కోటాపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో చిచ్చు మొదలైంది. ఈ కోటాపై భగ్గుమన్న యువత.. ఆందోళనలు, నిరసనలతో కదం తొక్కుతోంది. చివరకు ఆందోళనకారులకు, అధికార పార్టీ మద్దతుదారులకు మధ్య అదివారం జరిగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘటనల్లో 14 మంది పోలీసులు సహా సుమారు 100 మంది ప్రాణాలు కోల్పోగా.. వందలాది మంది గాయపడ్డారు. రిజర్వేషన్లపై జరుగుతోన్న ఆందోళనల్లో ఇప్పటి వరకు మృతిచెందినవారి సంఖ్య 300 దాటింది ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు 30 శాతం రిజర్వేషన్ కోటాను 1972లో తీసుకురాగా.. 2018లో అధికారంలో ఉన్న షేక్ హసీనా ప్రభుత్వం రద్దు చేసింది. వారసులకు 5 శాతం, ఇతర వర్గాలకు మరో 2 శాతం మాత్రమే రిజర్వ్ చేశారు.

# కరెంట అఫైర్స్

అయితే హైకోర్టు మళ్లీ 30 శాతం కోటాను పునరుద్ధరించడంతో బంగ్లాదేశ్ వ్యాప్తంగా నిరసనలు మొదలయ్యాయి.గతనెలలో హైకోర్టు తీర్పుపై స్టే విధించిన బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు.. కోటా చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఆందోళనలు ఆపేయాలని విద్యార్థులకు సూచించింది. అయితే, ఆందోళనల్లో చనిపోయినవారికి న్యాయం చేయాలని కోరుతూ మరోసారి ఉద్యమం మొదలుపెట్టారు.

రిజర్వేషన్ల అంశంపై జులై 19 జరిగిన హింసాత్మక ఘటనల్లో 67 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం దీనికి మించి మృతిచెందారు. ఆదివారం 20 అవామీ లీగ్ ఆఫీసులు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలపై నిరసనకారులు దాడి చేసి నిప్పంటించారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు నాయకుల నివాసాలను కూడా టార్గెట్ చేశారు. దీంతో దేశవ్యాప్తంగా నిరవధిక కర్ఫ్యూను విధించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం.. సైన్యాన్ని రంగంలోకి దింపింది. మూడు రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. అలాగే, ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. దేశవ్యాప్తంగా కొనసాగిన గొడవల్లో దాదాపు 100 మంది మృత్యువాత పడినట్లు బెంగాలీ పత్రిక ప్రోథోం అలో వెల్లడించింది. ఢాకాలో బంగబంధు షేక్ ముజీబ్ మెడికల్ యూనివర్సిటీ వద్ద పలు వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. పోలీసు ప్రధాన కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. హింసాత్మక ఘటనల్లో 14 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. మరో 300 మంది పోలీసులు గాయపడ్డారు.

ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో మూడో వంతు 1971లో పాకిస్తాన్‌తో యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుల బంధువులకు ఇచ్చేలా ఉన్న రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు.

ప్రభుత్వం వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు ప్రతిభ ఆధారంగా జరగాలనేది వారి వాదన.

ఆందోళనలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. విద్యార్థుల మధ్య సమాచార మార్పిడి జరగకుండా గురువారం ఇంటర్నెట్, మొబైల్ సేవలను నిలిపివేసింది.

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలలో కోటా రద్దు చేయాలన్న డిమాండ్‌తో గత నెలలో మొదలైన ఈ నిరసనలు క్రమంగా విస్తృత రూపం దాల్చుతూ ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారాయి. ప్రధాని షేక్ హసీనా పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి నాయకులు నిరసనలకు పిలుపునివ్వడంతో ఆ దేశంలో అశాంతి పెద్దదైంది.

పన్నులను, ఇతర బిల్లులను ప్రభుత్వానికి కట్టవద్దని నిరసనలు చేస్తోన్న విద్యార్థుల బృందం ప్రజల్ని కోరింది.

అన్ని ఫ్యాక్టరీలను, ప్రజా రవాణా సర్వీసులను నిలిపివేయాలని విద్యార్థులు పిలుపునిచ్చారు.

బంగ్లాదేశ్ బహిష్కృత ప్రధాని షేక్ హసీనాకు దీర్ఘకాల రాజకీయ శత్రువు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ముహమ్మద్ యూనస్ ఆ దేశ తాత్కాలిక నేతగా ఎంపికయ్యారు.

షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత 84 ఏళ్ల యూనస్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా నియమితులయ్యారు.

సూక్ష్మరుణాల విషయంలో ఆయన ఎన్నో ప్రశంసలు పొందినా, హసీనా ఆయన విధానాలను తీవ్రంగా విమర్శించేవారు. స్థానిక కోర్టు ఇటీవల ఆయనకు జైలు శిక్ష విధించగా.. ఆయన దీనిని రాజకీయ ప్రేరేపిత కేసుగా అభివర్ణించారు.

నిరసనలకు నాయకత్వం వహించిన విద్యార్థులు సైనిక ప్రభుత్వాన్ని అంగీకరించబోమని..

ప్రొఫెసర్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహించాలని కోరారు.

హసీనా రాజీనామా కోరుతూ శాసనోల్లంఘన ఉద్యమానికి నిరసనకారులు పిలుపునిచ్చారు. పోలీసులు, ప్రభుత్వాధికారులు తమకు మద్దతుగా నిలవాలని వారు కోరారు. ఈ క్రమంలో స్టూడెంట్స్ ఎగైనెస్ట్ డిస్క్రిమినేషన్ పేరిట సహాయ నిరాకరణ ఉద్యమానికి హాజరవుతోన్న ఆందోళనకారులను అధికార అవామీలీగ్, విద్యార్థి విభాగం ఛాత్ర లీగ్, జుబో లీగ్ కార్యకర్తలు అడ్డగించడంతో ఘర్షణలు మొదలయ్యాయి. దీంతో వాటిని నిరోధించేందుకు పలుచోట్ల భద్రతా బలగాలు కాల్పులకు దిగాయి.

అధ్యక్షుడు మొహమ్మద్ షహబుద్దీన్, సైనిక నేతలు, విద్యార్థి నేతల మధ్య జరిగిన సమావేశం అనంతరం ప్రొఫెసర్ యూనస్‌ను ప్రధాన సలహాదారుగా నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. 1983లో ప్రొఫెసర్ యూనస్ గ్రామీణ్ బ్యాంకును ప్రారంభించారు. ఇది పేద ప్రజలు తమ సొంత, చిన్న వ్యాపారాలను ప్రారంభించడానికి సూక్ష్మ, దీర్ఘకాలిక రుణాలను అందజేస్తుంది. అప్పటి నుంచి ఈ మైక్రోఫైనాన్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

2006లో ప్రొఫెసర్ యూనస్‌కు నోబెల్ శాంతి బహుమతి లభించింది.

బంగ్లాదేశ్‌తో భారత్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. రెండు పొరుగు దేశాలు 4,096కిలోమీటర్ల మేర సరిహద్దును కలిగి ఉన్నాయి.

భాష, సాంస్కృతిక, ఆర్థిక అంశాల్లో గట్టి సంబంధాలున్నాయి. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం తర్వాత బంగ్లాదేశ్ ఆవిర్భవించింది.

పాకిస్తాన్ నుంచి విడిపోకముందు బంగ్లాదేశ్ ప్రాంతాన్ని తూర్పు పాకిస్తాన్‌గా పిలిచేవాళ్లు. ఆ యుద్ధంలో భారత్ బెంగాలీలకు మద్దతుగా నిలిచింది. రెండు దేశాల మధ్య దాదాపు 1600 కోట్ల డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం ఉంది.

ఆసియాలో బంగ్లాదేశ్ ఎగుమతులకు ప్రధాన గమ్య స్థానం భారత దేశమే. అయితే రెండు దేశాల మధ్య సంబంధాల విషయంలో అంతా బాగుందని చెప్పడానికి లేదు.

బంగ్లాదేశ్‌కు చైనాతో ఉన్న దగ్గరి సంబంధాలపై గతంలో రెండు దేశాల మధ్య విభేదాలు నెలకొన్నాయి.

సరిహద్దు భద్రత, వలసదారుల సమస్యలు వంటివాటితో పాటు మోదీ హిందూ జాతీయవాద రాజకీయాలపై కొందరు బంగ్లాదేశ్ నాయకులు, అధికారుల్లో అసంతృప్తి ఉంది.

షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసిన తర్వాత మధ్యంతర ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పిన బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌కు భారత్‌తో సంబంధాలు లేవు.

తాజా పరిణామలకు ముందు.. బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాత్మక అల్లర్లను ఆ దేశ అంతర్గత సమస్యలుగా భారత్ అభివర్ణించింది.

షేక్ హసీనా రాజీనామా చేయడం, బంగ్లాదేశ్‌ను వీడడం భారత్‌కు అంత మంచి పరిణామం కాదని.. ఆమెకు, ఆమె పార్టీకి అక్కడ ప్రత్యామ్నాయం రావడం తమకు ఏమాత్రం అనుకూలం కాదన్నట్లుగా భారత్ చాలాకాలంగా చూస్తోందని అమెరికన్ థింక్–టాంక్ విల్సన్ సెంటర్‌కు చెందిన మైఖేల్ కుగల్‌మాన్ విశ్లేషించారు.

★★★

# కూలి నుండి కలెక్టర్ దాక

## వైరల్



కొందరు ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా.. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారు. చరిత్రతో తమకంటూ ఓ పేజీని లిఖించుకుంటారు. కొంతమంది ఎప్పుడూ అది లేదు.. ఇది లేదంటూ అంటూ నిరాశావాదంతో నిత్య అసంతృప్తితో తమ జీవితాన్ని గడిపేస్తారు. మరికొందరు బతకడం కోసం.. తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి మార్గాలను అన్వేషిస్తాడు. అందుకు అనుగుణంగా తనకు అందుబాటులో ఉన్న ప్రతి ఒక్క అవకాశాన్ని వినియోగించుకుని కష్టాలకు, నష్టాలకు వెరవకుండా ప్రయత్నం చేస్తాడు. తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారు. చరిత్రతో తమకంటూ ఓ పేజీని లిఖించుకుంటారు. ఈరోజు రైల్వే స్టేషన్ లో ఫ్రీ వై ఫై సహాయంతో కేరళ పబ్లిక్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన స్ఫూర్తివంతమైన ఓ యువకుడిగురించి తెలుసుకుందాం.

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లోకి వెళ్లే మార్గం చాలా కఠినమైనది. అయితే కేరళకు చెందిన ఓ రైల్వే కూలీ కేరళ పబ్లిక్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి IAS లో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. రైల్వే కూలీ శ్రీనాథ్ కె.. రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉన్న ఉచిత వై-ఫై సహాయంతో KPSC KAS పరీక్షలో విజయాన్ని సొంతం చేసుకున్నారు.

మున్నార్ యాడ్‌కు చెందిన శ్రీనాథ్ .. కొచ్చిన్ రైల్వే స్టేషన్‌లో కూలీగా పని చేశారు. అయితే..తన కుటుంబానికి మెరుగైన జీవితం ఇవ్వాలంటే.. తాను ఇప్పుడు సంపాదిస్తున్న సంపాదన సరిపోదని భావించారు. మంచి జీతం కలవాలంటే.. ప్రభుత్వం ఉద్యోగం సంపాదించాలని ఆలోచించిన శ్రీనాథ్ ప్రభుత్వ ఉద్యోగం కోసం చదువు ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు.

అయితే నిర్ణయం అయితే తీసుకున్నారు.. కానీ ఓ వైపు కూలీగా పనిచేయాల్సి ఉండడంతో.. పని సమయాలు, భారం ఇవన్నీ కలిపి శ్రీనాథ్ కు చదువుకోవడానికి సమయం సరిపోయేది కాదు. ఈ నేపథ్యంలో 2016లో.. రైల్‌టెల్, గూగుల్ భారతదేశంలోని అనేక రైల్వే స్టేషన్లలో ఉచిత Wi-Fiని అందించాయి. ఇలా రైల్వే స్టేషన్ లో ఉచిత Wi-Fi ప్రారంభించిన తర్వాత.. శ్రీనాథ్ పని చేస్తూనే చదువుకోవడంపై మరింత దృష్టి పెట్టాడు. ఆడియోబుక్స్ , వీడియోలను డౌన్‌లోడ్ చేసుకునేవారు.. ఓ వైపు పనిచేస్తూనే.. డౌన్ లోడ్ చేసిన పుస్తకాలను వింటూ.. KPSC పరీక్షకు సిద్ధమవడం ప్రారంభించారు.

కోచింగ్, అదనపు తరగతులకు ఖర్చు చేసే అనేక మంది అభ్యర్థులకు విరుద్ధంగా.. శ్రీనాథ్ తన డబ్బును మెమరీ కార్డ్, ఫోన్, ఒక జత ఇయర్‌ఫోన్‌ల కోసం ఖర్చు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమైన తర్వాత.. విలేజ్ అసిస్టెంట్ పోస్టు కోసం కేరళ పబ్లిక్ సర్వీస్ పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 82 శాతం స్కోర్‌తో ఉత్తీర్ణత సాధించారు. 2018లో శ్రీనాథ్ సాధించిన విజయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గూగుల్ ఇండియా ద్వారా పంచుకున్నారు. అప్పుడు శ్రీనాథ్ కృషి, పట్టుదల పై సర్వత్రా ప్రశంసలను అందుకున్నారు.

మూడో కన్ను

# ఫోతోగ్రఫికి 150 వసంతాలు





తమ్మ శ్రీనివాస రెడ్డి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం అనేది ఫొటోగ్రాఫిక్ అభ్యాసాల యొక్క కళ, క్రాఫ్ట్ మరియు చరిత్ర, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల జీవితాలపై దాని ప్రభావాన్ని జరుపుకోవడానికి ప్రయత్నించే ఒక ఆచారం. ఈ వార్షిక కార్యక్రమం కమ్యూనికేషన్ మాధ్యమంగా, చారిత్రక డాక్యుమెంటేషన్కు సాధనంగా మరియు సృజనాత్మక వ్యక్తీకరణకు ఒక మార్గంగా ఫొటోగ్రఫీ యొక్క ప్రాముఖ్యత మరియు శక్తి గురించి అవగాహనను పెంచుతుంది. ఆలోచింపజేసే చిత్రాల ద్వారా విభిన్న దృక్కోణాలు మరియు కథనాలను హైలైట్ చేస్తూ, ఈ రోజు దృశ్యమాన కథనం యొక్క శక్తిని, సంభాషణలు మరియు వ్యక్తిగత అనుభవాలను రూపొందించడంలో పొటోగ్రఫీ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఫోటోగ్రఫీ పాఠాలు



ఈ రోజు యొక్క మూలాలు 1839 లో ఫ్రాన్స్లో డాగ్యురోటైప్ ప్రక్రియ యొక్క ఆవిష్కరణ నుండి గుర్తించబడతాయి. భారతదేశంలో, ఈ ఆచారం దేశం యొక్క గొప్ప దృశ్య వారసత్వం ఔత్సాహిక మరియు వృత్తిపరమైన ఫోటోగ్రాఫర్ యొక్క ఎప్పటికప్పుడు పెరుగుతున్న కమ్యూనిటీకి ప్రత్యేక ఔచిత్యాన్ని కలిగి ఉంది. భారతదేశం అంతటా ఫోటోగ్రాఫర్లు తమ ప్రత్యేక దృక్కోణాలను పంచుకోవడానికి, భారతదేశ సాంస్కృతిక గుర్తింపుపై ఫోటోగ్రఫీ ప్రభావాన్ని ప్రతిబింబించడానికి మరియు ప్రపంచ పరిశ్రమను రూపొందించే సమకాలీన ఫోటోగ్రాఫిక్ పద్ధతులు మరియు ధోరణులతో నిమగ్నమవ్వడానికి ఈ రోజు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, భారతదేశం అంతటా వివిధ ఫోటోగ్రఫీ పోటీలు, ప్రదర్శనలు, వర్క్షాప్లు మరియు సెమినార్లు నిర్వహించబడుతున్నాయి, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, తోటి నిపుణులతో నిమగ్నమవ్వడానికి, వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి మరియు దృశ్యమాన కథన శక్తిని అన్వేషించడానికి అవకాశాలను అందిస్తారు. ఈ సహకార ప్లాట్ఫారమ్లను ఉపయోగించడం ద్వారా, ఫోటోగ్రఫీ ప్రపంచాన్ని ఆకృతి చేసే విభిన్న కథనాలు, సాంకేతికతలు మరియు లెన్స్లను అభినందించడానికి ఫోటోగ్రాఫర్లు కలిసి వస్తారు, తద్వారా సాంస్కృతిక మార్పిడిని మరియు దృశ్యమాన ప్రకృతి దృశ్యంపై ప్రపంచ అవగాహనను ప్రోత్సహిస్తారు. భారతదేశ చరిత్రను మరియు దాని అనేక అనుభవాలను డాక్యుమెంట్ చేయడంలో ఫోటోగ్రఫీ యొక్క శాశ్వత ప్రాముఖ్యతను గుర్తుచేసే విధంగా ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటారు.

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం వాస్తవాలు :

జోసెఫ్ నైసెఫోర్ నీప్సే 1826 లో ప్రపంచంలోని మొట్టమొదటి ఛాయాచిత్రాన్ని తీసిన ఘనత పొందాడు. నీప్సే సూర్యకాంతి మరియు గాజు పలకలను కలిగి ఉన్న హెలియోగ్రఫీ అనే సాంకేతికతను ఉపయోగించాడు. అతను ఫ్రాన్స్లోని తన ఎస్టేట్ వెలుపలి దృశ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

* ఫోటో పేరు వ్యూ ఫ్రమ్ ద విండో ఎట్ లే గ్రాస్. డాగ్యురోటైప్ ప్రకారం వాణిజ్యపరంగా విజయవంతమైన మొదటి ఫోటోగ్రాఫిక్ ప్రక్రియ. ఈ ఫోటోగ్రఫీ పద్ధతిని ఫ్రెంచ్ ఫోటోగ్రాఫర్ లూయిస్ జాక్ మాండే డాగురే 1839లో కనుగొన్నారు. ఇది ప్రత్యేకమైన చిత్రాలను రూపొందించడానికి మరియు రికార్డ్ చేయడానికి వెండి రాగి పలకను ఉపయోగించింది.

* చరిత్రలో అత్యధికంగా వీక్షించబడిన ఫోటో Windows XP కోసం డిఫాల్ట్ వాల్పేపర్ అయిన "బ్లిస్" చిత్రం కావచ్చు.
భారతదేశంలోని బ్రిటిష్ పాలన దేశంలో ఫోటోగ్రఫీ అభివృద్ధి మరియు అభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషించింది. వారు భారతీయ వాస్తుశిల్పం, భౌగోళిక నిర్మాణాలు, సహజ వనరులు మరియు కాలనీ పరిపాలనలో సహాయం చేయడానికి ఎథ్నోగ్రాఫిక్ అధ్యయనాలను డాక్యుమెంట్ చేయడానికి ఫోటోగ్రఫీని ఉపయోగించారు.

లాలా దీన్ దయాళ్, రాజా దీన్ దయాళ్ మరియు నారాయణ్


# ఫోటోగ్రఫీ పాఠాలు

వినాయక్ విర్కార్ భారతదేశంలోని తొలి ఫోటోగ్రాఫర్లు. వారి ఛాయాచిత్రాలు 19వ శతాబ్దం చివరి మరియు 20వ శతాబ్దం ప్రారంభంలో దేశంలోని ప్రకృతి దృశ్యాలు, వాస్తుశిల్పం మరియు విభిన్న సంస్కృతిని సంగ్రహిస్తాయి.

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ప్రారంభం :

'కెమెరాతో ఫోటోలు తీస్తున్నారన్నది భ్రమ కాని అవి కన్ను, గుండె, మనస్సు పెట్టి మెదడుని ఉపయోగించి తయారవుతాయి. ప్రతి సంవత్సరం, ఫోటోగ్రఫీ ప్రేమికులు కళ వెనుక ఉన్న సైన్స్ నుండి ప్రారంభ ఫోటోగ్రఫీ చరిత్ర వరకు అన్ని విషయాల ఫోటోగ్రఫీ యొక్క గ్లోబల్ వేడుకలో పాల్గొంటారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రాఫర్లకు వారి ఆలోచనలు, ఆవిష్కరణలు మరియు కళలను పంచుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశం. ఇది వివిధ సంస్కృతులు మరియు దేశాలకు చెందిన వ్యక్తుల మధ్య కమ్యూనికేషన్ను ప్రోత్సహిస్తుంది, గ్లోబల్ కమ్యూనిటీ యొక్క భావాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. తదుపరి తరం ఫోటోగ్రాఫర్లను ప్రోత్సహించడానికి మరియు ప్రేరేపించడానికి కూడా ఇది ఉపయోగించ బడుతుంది.

1839 ఆగస్టు 19న ఫ్రెంచ్ ప్రభుత్వం డాగ్యురోటైప్ ప్రక్రియ కోసం పేటెంట్ను కొనుగోలు చేసింది, అది ప్రపంచానికి ఉచితంగా అందించబడింది. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఎంతగా ప్రాచుర్యం పొందింది అంటే 2022 లో ప్రపంచ ఫోటోగ్రఫీ వీకిని ప్రవేశపెట్టారు. వాస్తవానికి, ఇది ఆగస్టు 12 నుండి ఆగస్టు 26 వరకు జరిగే రెండు వారాల వేడుక.





ప్రతి సంవత్సరం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవానికి ఒక థీమ్ ఉంటుంది. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం 2024 సం||నికి థీమ్ "యాన్ ఎంటైర్ డే". మొత్తం రోజు వ్యవధిలో, భూమి యొక్క జనాభా మొత్తం 20 మిలియన్ సంవత్సరాల కంటే ఎక్కువ మానవ అనుభవాన్ని కలిగి ఉంది (దాదాపు 8 బిలియన్ ప్రజలు, ఒక్కొక్కటి 24 గంటలతో). ప్రతి ఒక్కరూ తమ స్వంత జీవితాన్ని గడుపుతున్నారు, ఒక ప్రపంచాన్ని పంచుకుంటారు.

గతంలో ఈక్రింది థీమ్లతో జరుపుకున్నారు :

* 2023 : "ల్యాండ్ స్కేప్లు"
. 2022 : "లెన్స్ ద్వారా పాండమిక్ లాక్ డౌన్"
* 2021 : "ఈరోజు జీవితాన్ని సంగ్రహించే కళను జరుపుకోండి!"
* 2020 : "పాండమిక్ త్రూ ది లెన్స్"

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రాఫర్లు మరియు ఫోటోగ్రఫీ ఔత్సాహికులు జరుపుకునే గ్లోబల్ ఈవెంట్. సమయానుకూలంగా క్షణాలను సంగ్రహించడానికి మరియు పంచుకోవడానికి ఫోటోగ్రఫీ యొక్క శక్తిని జరుపుకునే రోజు ఇది.

ప్రపంచ ఫోటోగ్రఫీ ఎందుకు ప్రసిద్ధి చెందింది?

పైరోగ్రఫీని "ఫైర్ రైటింగ్" అని కూడా అంటారు. ఇది శతాబ్దాలుగా మానవుల ఊహలను ఆకర్షించిన

## ఫోటోగ్రఫీ పాఠాలు

పురాతన కళారూపం. ప్రపంచవ్యాప్తంగా, సంస్కృతులు వివిధ ఉపరితలాలపై క్లిష్టమైన డిజైన్లను రూపొందించడానికి వేడిని ఉపయోగించాయి. ఇది చరిత్ర మరియు సృజనాత్మకత యొక్క వస్త్రాన్ని మిగిల్చిన మనోహరమైన అభ్యాసం. "మీ దైనందిన జీవితంలోని అందాన్ని సంగ్రహించడం." "మేము ప్రతి ఫోటోతో ఆనందం మరియు సృజనాత్మకతను తీసుకువస్తాము." "ఒక ఛాయాచిత్రం కేవలం చిత్రంగా ఉండకూడదు అది తత్వశాస్త్రం అయి ఉండాలి." "పాత్ర, ఛాయాచిత్రం వలె, చీకటిలో అభివృద్ధి చెందుతుంది."ప్రతి సెకనుకు 54,400 ఫోటోలు తీయబడుతున్నాయని మీకు తెలుసా?

మనది ఫోటో ప్రియుల ప్రపంచం. రోజుకు 95 మిలియన్ల ఫోటోలు, ఖచ్చితంగా చెప్పాలంటే, Instagramలో షేర్ చేయబడుతున్నాయి. వేలాది మంది ఇతర వికసించే ఫోటోగ్రాఫర్లతో కలిసి చేరండి మీ సోషల్ మీడియాను ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ ఫోటోగ్రఫీ ఈవెంట్తో సమలేఖనం చేసుకోండి. డాగ్యురోటైప్ నుండి డిజిటల్ వరకు: Daguerreotypy అనేది అయోడిన్– సెన్సిటివ్ సిల్వర్ ప్లేటెడ్ రాగి షీట్ను మిర్రర్ ఫినిషింగ్కు పాలిష్ చేయడం, ప్లేట్ ఉపరితలం కాంతికి సున్నితంగా ఉండేలా చేయడానికి పొగలతో చికిత్స చేయడం మరియు ప్లేట్ను కాంతికి బహిర్గతం చేయడానికి కెమెరాను ఉపయోగించడం. డాగ్యురోటైప్ వంగనిది, భారీ మరియు చాలా పెళుసుగా ఉంటుంది. ప్లేట్ కలిగి ఉన్న చిత్రం వివరంగా మరియు పదునుగా ఉంటుంది కానీ గీతలు మరియు ఇతర నష్టాలకు కూడా హాని కలిగిస్తుంది.

1861లో, మన్నికైన రంగు చిత్రాన్ని తీసిన మొదటి వ్యక్తి థామస్ సుట్టన్, సింగిల్–లెన్స్ రిఫ్లెక్స్ (SLR) కెమెరాను కనిపెట్టాడు.

సింగిల్–లెన్స్ రిఫ్లెక్స్ కెమెరా మిర్రర్ మరియు ప్రిజం సిస్టమ్ను ఉపయోగించి లెన్స్ ద్వారా ఇమేజ్ను ప్రతిబింబిస్తుంది, ఫోటోగ్రాఫర్ తాను

మానవ జీవితంలో ఫోటోగ్రఫీ ముఖ్యమైనది :

మన పుట్టినరోజులు, వివాహాలు, వార్షికోత్సవాలు, సెలవులు మరియు కొత్త గృహాల వేడుకలు అన్నీ ఏదో ఒక రూపంలో నమోదు చేయబడతాయి ఎందుకంటే అవి ముఖ్యమైనవి.

ఫోటోగ్రఫీ అందించే కొన్ని విషయాలు ఏమిటి?

* ఫోటోగ్రఫీ ద్వారా అమరత్వం లభిస్తుంది.
* ఫోటోగ్రఫీ మీ జీవిత ప్రయాణాన్ని రికార్డ్ చేస్తుంది.

ఫోటోగ్రఫీ నొప్పికి అద్భుతమైన ఉపశమనం.

మీ సృజనాత్మకత ఫోటోగ్రఫీ ద్వారా ప్రభావితమవుతుంది.

* నిజమైన అభిరుచి ఉన్న ఎవరికైనా, ఫోటోగ్రఫీ వృత్తిగా సాధ్యమవుతుంది.
* ఫోటోగ్రఫీ అనేది ఆత్మగౌరవానికి అందమైన, ఆరోగ్యకరమైన మరియు సాధారణ బూస్ట్.
* ఫోటోగ్రఫీ మిమ్మల్ని ప్రకృతికి మరియు ఆధ్యాత్మికానికి దగ్గర చేస్తుంది.

మీరు ఎల్లప్పుడూ మీ పాత జ్ఞాపకాలను సంగ్రహించవచ్చు

* "ఫొటోగ్రఫీలో వాస్తవికత చాలా సూక్ష్మంగా ఉంటుంది, అది వాస్తవికత కంటే వాస్తవమైనది."
* "ఛాయాచిత్రంలో తప్పనిసరిగా ఒక విషయం ఉంది, ఈ క్షణం యొక్క మానవత్వం."

"ఒక చిత్రాన్ని తీయడం, ఒక క్షణం స్తంభింపజేయడం, వాస్తవికత ఎంత గొప్పదో తెలియజేస్తుంది."

* "ఫొటోగ్రఫీ అనేది అనుభూతికి, స్పర్శకు, ప్రేమించడానికి ఒక మార్గం. మీరు చలనచిత్రంలో పట్టుకున్నది శాశ్వతంగా సంగ్రహించబడుతుంది. మీరు ప్రతిదీ మరచిపోయిన చాలా కాలం తర్వాత ఇది చిన్న విషయాలను గుర్తుంచుకుంటుంది."

"ఒక వ్యక్తి ఎలా కనిపిస్తుందో దాని చిత్రాన్ని రూపొందించడం ఒక విషయం, వారు ఎవరో ఒక చిత్రాన్ని రూపొందించడం మరొక విషయం."

"చిత్రంలోని గొప్పదనం ఏమిటంటే, అందులోని వ్యక్తులు మారినప్పటికీ అది ఎప్పటికీ మారదు."

* "ఫొటోగ్రఫీని ఒక వింత ఆవిష్కరణగా మార్చేది ఏమిటంటే, దాని ప్రాథమిక ముడి పదార్థాలు సమయం మరియు కాంతి."
* పొటోగ్రఫీ యొక్క మార్గదర్శకులను గౌరవించండి : ఫొటోగ్రఫీ అనేది సాపేక్షంగా యువ కళారూపం ★★★







# యువత తెలుసుకో
# నిన్ను నువ్వు మలుచుకో




## మీదైన ముద్ర వేయండి


చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను పెంచేటప్పుడు వాడిలా చదువు, వీడిలా వుండు, వాళ్ళ పిల్లవాడు ఇలా అయ్యాడు అంటూ ఎంతోమంది ఉదాహరణలు చూపిస్తుంటారు. మరొకళ్ళు గొప్ప అని, వాళ్ళను అనుకరించమని, వాళ్ళని లక్ష్యంగా ఎన్నుకొనమని ఎప్పుడూ చెప్పొద్దు. వాళ్ళని వాళ్ళలా ఎదగనివ్వండి.

మీకు మీరుగా ఎదగటానికి ప్రయత్నించండి. లేని రెక్కలు కట్టుకుని ఎగరాలనుకోకండి. ఎవరో ఏదో సాధించారని, దానికై పాకులాడొద్దు. చాలామంది కుర్రవాళ్ళు వాళ్ళు ఆరాధించే సినిమా హీరోల్లా కావాలని ప్రయత్నిస్తుంటారు. మీరున్న పరిస్థితులు, అవకాశాలు, మీ నేపథ్యం వీటన్నిటిని పరిగణలోకి తీసుకోకుండా చేసే ఏ ప్రయత్నమైనా ఫలించదు.

# వ్యక్తిత వికాసం

ఎవరో కొండెక్కారని మీరు ప్రయత్నిస్తే రాళ్ళ దెబ్బలు తప్పవు. కొండెక్కాలనే కోరిక మీలో బలంగా వుంటే ఎక్కే నేర్పును సంపాదించాలి. తగినంత శక్తి సంపాదించాలి. అంతేకాని ఒకరిని చూసి గాభరాపడితే దొర్లిపడటం ఖాయం. ఎప్పుడూ ఏదన్నా పని చేసేటప్పుడు ఒకరితో పోల్చుకోకండి. మీరు గొప్పగా ఎలా చేయగలుగుతారో వివేకంతో వ్యూహరచన చేయండి. వివేకంతో, నిదానంగా ఆలోచించి వ్యవహరించడంవల్ల మీలో కొత్త శక్తి ఉద్భవిస్తుంది. ఐన్స్టీన్, ఎడిసన్, న్యూటన్ వీరెవ్వరు ఎవరినీ అనుకరించ లేదు. వారిలా ఆలోచించి వారిలానే తమదైన ముద్రను ఈ సమాజం మీద మిగిల్చి వెళ్ళారు కాబట్టే వారు మనకింకా గుర్తున్నారు. లేకపోతే వారిని ఏనాడో మర్చిపోయేవాళ్ళం. మీరు అంతే, ఒకరిని అనుకరిస్తే చరిత్ర మిమ్మల్ని గుర్తు పెట్టుకోదు.





మరొకరు చేరుకున్న స్థానానికి మీరు చేరుకోలేక పోవచ్చు. ఆస్థానం మీకు అవసరం కూడా లేకపోవచ్చు. కాని మీకు మీరుగా ప్రయత్నిస్తే మీ శక్తికి తగ్గ ఎత్తుకు తప్పక చేరుతారు. ఒకర్ని అనుకరిస్తూ వెళ్తుంటే దానికి అంతెక్కడో కనపడదు.

మనకు చాలామంది చాలా రంగాల్లో రోల్మోడల్స్ కనపడతారు. వీరందరిని మీరు అనుకరించలేక నిరాశ చెందుతారు. మీకు మీరే రోల్ మోడల్గా గ్రహించినట్లయితే నిరాశకు తావుండదు.

ఈ సృష్టిలో దేనికి ఏది పోటీకాదు, అనుకరణ కాదు. ఒక పువ్వు ఇంకొక పువ్వులా వికసించాలనుకోదు. సృష్టిలోని ప్రతి జీవి తనదైన ముద్ర వేస్తుంది, ప్రతి జీవి ఒక ప్రత్యేకమైన అవసరం కోసమే భగవంతుడు ఈ భూమి మీద సృష్టించాడు. ఏ రెండు జీవులు ఒకే అవసరం కోసం జన్మించవు. కాబట్టి నీ అవసరం కూడా ఈ భూమికి అవసరం, అదేమిటో గుర్తించు, నీ ప్రత్యేకత నిలబెట్టుకో. అనుకరణలు, అడ్డదారులు మీకు గుర్తింపునివ్వవు. ఎప్పుడూ ఇంకొకరి ఆలోచనలు, కోరికలు ప్రకారం నడుచుకుంటే మనకు బదులుగా వారే మిగిలిపోతారు. నిన్ను నువ్వు కోల్పోతున్నప్పుడు, నిన్ను నువ్వు తిరిగి కనుగొనే ప్రయత్నం చెయ్యాలి.

★★★

# ఊడలమర్రి ఉపన్యాసాలు




విక్రమార్కుడు ఊడల మర్రి, చేరుకునే సరికి, భేతాళుడు, గంభీరంగా ఏదో రాస్తూ కనిపించాడు. సరే భేతాళుడిని ఎందుకులే ఇబ్బంది పెట్టడం అని, భేతాళుడి పక్కనే కూర్చున్నాడు ఏమి రాస్తున్నాడో చూద్దామని. తీరా చూస్తే కాగితాల మీద అక్షరాలేవీ కనపడలేదు. భేతాళుడి చేతిలో కలం కదులుతోంది కాని, కాగితం మీద అక్షరాలేవి పడట్లేదు. ఏమిటీ విచిత్రం అని మనసులో అనుకుంటూ ఇక వుండ బట్టలేక, 'ఏమిటి భేతాళ ఏదో రాస్తున్నావు " అంటూ పలకరించాడు

"దానికి జవాబు ఇవ్వకుండా. 'నేను రాసేది ఎమన్నా నీకు కనపడుతుందా? అని ఎదురు ప్రశ్న వేశాడు

"అది కనపడకేగా నిన్ను అడుగుతోంది.. "అంటూ మళ్ళీ అడిగాడు

భేతాళుడు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ''హమ్మయ్య ' అంటూ



# భేతాళ భారతం



ఊపిరి పీల్చుకున్నాడు భేతాళుడు
'ఏమిటి భేతాళా ఇవేళ
నువ్వు ఎంతో విచిత్రంగా
ప్రవర్తిస్తున్నావు.. విషయం ఏమిటి?
" అన్నాడు కాస్త గట్టిగానే

భేతాళుడికి ఇక చెప్పక తప్పలేదు.
'ఏమిలేదు విక్రమార్క. గత
ప్రభుత్వం మీద శ్వేత పత్రాలు
రూపొందిస్తున్నా "అంటూ
జవాబిచ్చాడు.

శ్వేత పత్రమా?.." ఒకింత
ఆశ్చర్యానికి లోనవుతూ అన్నాడు
విక్రమార్కుడు

అవును సవత పత్రమే నీకు
తెలియదా శ్వేత పత్రం అంటే
ఏమిటో.. ' అంటూ ప్రశ్నించాడు
" నాకు తెలుసో తెలియదో
పక్కనపెట్టు. అసలు నీకు తెలుసా?
"అని అడిగాడు విక్రమార్కుడు.

'తెలియక పోవట మేమిటి శ్వేత
పత్రం అంటే తెల్ల కాగితం ......'
అని జవాబిచ్చాడు.

ఆ జవాబుకు విక్రమార్కుడు పెద్దగా
పడి పడి నవ్వుతూ, 'మరి తెల్ల
కాగితం అయితే, గత ప్రభుత్వం
ఏమి తప్పులు చెయ్యలేదని
అందరికీ చెప్పలబోతున్నావా
ఏమిటి కొంపదీసి అన్నాడు.
"అదెలా, గత ప్రభుత్వం చాలా
తప్పులు చేసింది. అందుకనే
వాటినన్నిటినీ కాగితం మీద
రాస్తున్నాను.

'నువ్వు రాసేవేవి కనబట్లేదు
కదా?" అడిగాడు విక)మార్కు డు.
'శ్వేతపత్రం లావుండాలని,
నల్ల సిరా బదులు తెల్ల సిరాతో
రాస్తున్నాను ..'

'తెల్ల సిరానా?' ఈ సారి తెల్లమొఖం
వెయ్యటం విక్రమార్కుడి
వంతయ్యింది.

" శ్వేతపత్రం లావుండాలని,
నల్ల సిరా బదులు తెల్ల సిరాతో
రాస్తున్నాను.

'తెల్ల సిరానా? ' ఇసారి తెల్లమొఖం
వెయ్యటం విక్ర మార్కుడి
వంతయ్యింది.

అదే నయ్య తెల్ల సిరా అంటే పాలు,
అన్నీ విడమర్చి చెప్పాలి నీకు.
పైకేమో పెద్ద మహారాజునంటావు"
అంటూ విసుక్కున్నాడు భేతాళుడు
"ఓ తెల్ల సిరా నా సరి సరి, మరి
తెల్లకాగితం మీద తెల్ల సిరాతో
రాస్తే ఇంక ఎవరికి కనపడు తుంది

" నిజమే సుమీ నాకంత ఆలోచన
రాలేదు. శ్వేత పత్రం అంటే తెల్లటి
కాగితం మీద తెల్లటి అక్షరాలతో
రాయాలేమో అనుకున్నా "
అన్నాడు

'భలేవాడివి భేతాళ.. అందుకనే
దెయ్యాలకు బుర్రలు ఉండవు
అన్నారు'అంటు వెక్కిరించాడు
విక్రమార్కుడు

' నాకు బుర) వుందో లేదో
తరువాత తెలుద్దువుగాని ముందు
శ్వేత పత్రం అంటే ఏమిటో చెప్పు
అన్నాడు భేతాళుడు అమాయకంగా
' నేత పత్రం అంటి దేణి గురించి
అయినా వాస్తవాలు వెల్లడించటం,
గత ప్రభుత్వంలో ఏంజరిగిందో
నిజాలు బహిర్గతం చెయ్యటం
మరి శ్వేత పత్రం అంటూ అందరు
అబద్ధాలే చెబుతున్నారుకదా?"
తన సందేహం బయట పెట్టాడు
భేతాళుడు.

"అదే కదా నేటి రాజకీయం అంటే
. వాస్తవాలు వెల్లడించ కుండా,
తమకు తోచిన అవాస్తవాలను
ప్రచారం చెయ్యటానికి, ఈ
శ్వేతపత్రాలను నేటి , రాజకీయ
నాయకులు వాడుకుంటున్నారు.
"అదే కదా నేటి రాజకీయం అంటే.
వాస్తవాలు వెల్లడించకుండా,
తమకు తోచిన అవాస్తవాలను
ప్రచారం చెయ్యటానికి, ఈ
శ్వేత పత్రాలను నేటి రాజకీయ
నాయకులు వాడుకుంటున్నారు"
'అలాగా, అయితే వీటి పేరు
మార్చాలెమో? '

అవును నువ్వన్నది నిజం ,
ప్రత్యర్థుల మీద బురద చల్లటానికి
ఉపయోగించే వీటిని బురద
పత్రాలని పిలవాలి '
'అవునవును' అంటూ తాను రాసిన
వాటిని చించేసాడు భేతాళుడు

★★★

# మన కథానాయకులు

## మహా కవుల మానస పుత్రులు

## రాజశేఖరం

నలభై ఏళ్లకు పైగా నవలారాణి అన్న ప్రాచుర్యం పొందిన యద్దనపూడి సులోచనారాణి తొలినవల సెక్రటరీ. జ్యోతి మాసపత్రికలో 1964లో ధారావాహికగా ప్రచురితమైంది. ఆధునిక నవలా సాహిత్యంలో ప్రాచుర్య సాహిత్యం (పాపులర్ లిటరేచర్), నిబద్ధ సాహిత్యం (సీరియస్ లిటరేచర్) అనే రెండు శాఖలు విస్తరించాయి. ప్రాచుర్య నవలా సాహిత్యం మొదట్లో కొవ్వలి, జంపన నవలలతో ప్రారంభం కాగా 1960 దశకం నుంచి ఆ నవలా శాఖలో మైలురాయిగా సెక్రటరీ నవల నిలుస్తుంది.




1964లో తొలిసారిగా ఈ నవల ధారావాహికగా ప్రచురణ




పొందుతున్న రోజుల్లో నవలా పఠనం అలవాటు ఉన్న కుటుంబాలలో జయంతి, రాజశేఖరాలు వారిలో ఒకరైపోయారని విమర్శకులు ప్రశంసించారు. ఆ రెండు పాత్రల జీవితాల్లో మలుపులు, సంఘటనలు తమ బంధుమిత్రుల జీవితాల్లోనివే అన్నంతగా పాఠకులు తాదాత్మ్యత పొందారు. సినిమాగా విజయం పొందినా, నవలగా అమ్మకాల్లో, ప్రాచుర్యంలో చరిత్ర సృష్టించినా అంతా పాఠకుల కలల లోకాన్ని వారి ముందు నిలపడంలో ఉందని విమర్శకులు రాజారామమోహనరావు అభిప్రాయం.

ప్రధానంగా ఇది జయంతి అన్న యువతి కథ. అందం, పరువం, పొగరుమోతుతనం, ఆత్మాభిమానం

# మన కధానాయకులు




ఉన్న దిగువ మధ్యతరగతి యువతి జయంతి. హుందా, టీవి, డబ్బు, పలుకుబడి, ఆడపిల్లలను సమ్మోహనపరిచే రూపు ఉన్న నిండైన వ్యక్తి రాజశేఖరం. వీరిద్దరి పరస్పర ఆకర్షణ, ప్రేమ, ద్వేషం, కోపం, పట్టుదలలతో నిండిన ప్రేమకథ "సెక్రటరీ". జయంతి దిగువ మధ్యతరగతి అమ్మాయి, ఆమె బామ్మ జయంతిని కష్టపడి పెంచి చదువు చెప్పిస్తుంది చదువు పూర్తికాగానే ఉద్యోగం చూసుకుని ఆ వృద్ధురాలి శ్రమ తగ్గించాలనే సదుద్దేశంతో ఉద్యోగప్రయత్నాలు చేస్తూంటుంది ఆమె. ఈ నేపథ్యంలో "ఆంధ్ర వనితా విహార్" సంస్థలో సెక్రటరీ ఉద్యోగం దొరకగానే జయంతి ఆనందంలో తేలిపోతుంది. నగరంలో ధనికులు, ఉన్నతోద్యోగులతో ఆ సంస్థకు అనుబంధం ఉంటుందనీ, అలాంటివారి మధ్య తిరగడం తనలాంటి సామాన్యురాలికి అందివచ్చిన అవకాశమని ఆమె భావిస్తుంది. ఐతే వనితా విహార్ లో ఉద్యోగం అందుకు భిన్నంగా ప్రముఖులైన స్త్రీల మధ్య ఈర్ష్యాసూయలు, భేదాభిప్రాయాలే కాక నమ్మశక్యం కాని దుస్సంఘటనల మధ్య సాగుతుంది. బామ్మని కష్టపెట్టాల్సి ఉంటుందని తెలిసీ, మరో ఉద్యోగం దొరకడం కష్టమని అవగాహన ఉండి కూడా ఆమె ఆ ఉద్యోగానికి రాజీనామా చేస్తుంది. అనంతరం రాజశేఖరం వద్ద సెక్రటరీగా ఉద్యోగాన్ని పొందుతుంది.


రాజశేఖరం వద్ద ఉద్యోగం వనితా విహార్లోని ఉద్యోగానికి భిన్నంగా అన్ని రకాల సౌకర్యాలు, క్రమశిక్షణతో కూడిన పనితో ఉంటుంది. పైగా వనితావిహార్ ఉద్యోగం కన్నా గౌరవం, జీతం కూడా ఎక్కువే. జయంతి అంతకుముందు కన్న కలలన్నీ ఈ ఉద్యోగంలో నిజమైనట్టుగా ఉన్న పరిస్థితుల మధ్య రాజశేఖరం వల్ల ఓ సమస్య ఎదురవుతుంది. రాజశేఖరం పద్ధతేమిటో, అతనేమిటో ఒక పట్టాన అర్థం కాక, రకరకాల ఊహలకీ, భావనలకీ లొంగి ఆత్మాభిమానం చంపుకోకూడదనుకుని జయంతి ఈ ఉద్యోగానికి కూడా రాజీనామా చేస్తుంది. రాజశేఖరం అంగీకరించడు, అలాగని తానేమిటో, తన పద్ధతేమిటో స్పష్టంగా విప్పిచెప్పడు. అందం, ఐశ్వర్యం, హోదా ఉన్న ఓ మగవాడి ఆకర్షణలో మధ్యతరగతి అమ్మాయిగా జయంతి మనసు ఎన్నో ఉద్విగ్నతలకు లోనవుతుంది. అనంతరం జరిగే మలుపుల్లో ఎన్నో విచిత్రమైన సంఘటనల మధ్య ఈ నవల ఆసక్తికరంగా సాగుతుంది.

★★★





# నవ్వండి ప్లీజ్



**నవ్వటం ఒక యోగం ,**

**నవ్వలేక పోవటం ఒక రోగం ,**

**తరువాత మీ ఇష్టం**



శ్రీనివాస్ కార్టూన్లు








## పద్మ విభూషణ్
## యామిని కృష్ణమూర్తి



తన నాట్యంతో భారత దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాప్తింపజేసిన ప్రముఖ నృత్యకారిణి యామినీ కృష్ణమూర్తి ఇక లేరు. 84 ఏళ్ల యామినీ కృష్ణమూర్తి వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబర్ 20వ తేదీన యామినీ కృష్ణమూర్తి జన్మించారు. పౌర్ణమి రోజు జన్మించడంతో ఆమెకు యామినీ పూర్ణ తిలక అనే పేరును ఆమె తాతగారు నామకరణం చేశారు. ఐదేళ్ల వయసులోనే.. చెన్నైలోని కళాక్షేత్ర స్కూల్ ఆఫ్ డ్యాన్స్‌లో ప్రముఖ డ్యాన్సర్ రుక్మిణీ దేవి అరుండేల్ ఆధ్వర్యంలో భరతనాట్యం నేర్చుకున్నారు. 1956లో తొలి ప్రదర్శన ఇచ్చిన యామినీ కృష్ణమూర్తి.. కాంచీపురం ఎల్లప్ప పిల్లై, తంజావురు కిట్టప్ప పిల్లై వద్ద భరత నాట్యానికి మెరుగులు దిద్దుకున్నారు. 21ఏళ్లవయసుఉన్నప్పుడమద్రాసులోనివేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి దగ్గర యామినీ కూచిపూడి నేర్చుకున్నారు.

# వార్తల్లో వ్యక్తి

ఆ తర్వాత పంకజ్ చరణ్ దాస్, కేలుచరణ్ మోహపాత్ర వంటి వారి వద్ద ఒడిస్సీ నేర్చుకున్నారు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీలతో పాటుగా కర్ణాటక గానం, వీణలో శిక్షణ పొందారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన ఆమె.. టీటీడీ ఆస్థాన న ర్త కి గా నూ సేవలందించారు.



తన నృత్యంతో భారతదేశ కీర్తిని ఖండాంతరాలకు చాటిన ఆమెకు.. ప్రభుత్వం అనేక అవార్డులతో సత్కరించింది. 28 ఏళ్ల వయసున్నప్పుడు 1968లో యామినీ కృష్ణమూర్తి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 2001లో కేంద్ర ప్రభుత్వం యామినీ కృష్ణమూర్తిని పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. 2016లో పద్మవిభూషణ్ పురస్కారం ఆమెను వరించింది.. 1977లో సంగీత్ నాటక్ అకాడమీ అవార్డును కూడా యామినీ కృష్ణమూర్తి అందుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో యామినీ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ స్థాపించి యువతకు భరత నాట్యం, కూచిపూడిలో శిక్షణ అందిస్తున్నారు. నాట్యానికి అందం, గ్లామర్, శక్తిని యామినీ కృష్ణమూర్తి తీసుకువచ్చారని ఆమె శిష్యులు చెప్తుంటారు.

వివిధ రకాల నృత్యాలను హేమాహేమీలైన గురువుల వద్ద ఎంత నేర్చుకున్నా, ఈమె తన కళతో ప్రేక్షకులను నిలవేసి "ఇది నా ఒరవడి" అని చాటే ఒకానొక విశిష్ట బాణీ నృత్యాన్ని



ప్రదర్శిస్తుంది. ఈమె ఏ బాణీ నృత్యం చేసినా వివిధ నృత్య రీతులను కలగాపులగం చేయకుండా ఆయా నృత్య సంప్రదాయాల పరిధిలోనే తన వ్యక్తిత్వాన్ని అభివ్యక్తం చేస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నర్తనానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా,

న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, బర్మా ఇత్యాది ఎన్నోదేశాలు పర్యటించి ఆయా చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య ప్రచారం చేయడం జరిగింది. ఢిల్లీలో నృత్యకౌస్తుభ కల్చరల్ సోసైటి – యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నది.

ఈమె తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకి. "క్షీరసాగరమథన"మనే నృత్యరూపకాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆకాశవాణి కోసం రచించాడు. కాని దాన్ని కూచిపూడి ... సిద్ధేంద్ర ... కళాక్షేత్రంలో నాట్యాచార్యుడు చింతా కృష్ణమూర్తి ప్రిన్సిపల్‌గా ఉన్న రోజుల్లో అక్కడ ప్రదర్శించ తలపెట్టి ఈ రూపకానికి నృత్యం కూర్చవలసిందిగా ప్రఖ్యాత నర్తకుడు, నాట్యాచార్యుడు వెంపటి చినసత్యంకు అప్పగించాడు. అప్పుడు ఆయన నేతృత్వంలో మొట్టమొదట ప్రదర్శించిన "క్షీరసాగరమథనం"లో యామినీ కృష్ణమూర్తి "విశ్వమోహిని" పాత్రలో, ధన్వంతరి, మహావిష్ణువు

పాత్రల్లో వేదాంతం సత్యనారాయణ శర్మ నటించి ఈ ప్రదర్శనను రక్తి కట్టించారు. ఆనాటి నుండి ప్రజలు ఈమెను "విశ్వమోహిని" అని సంబోధించడం మొదలు పెట్టారు. తరువాత ఈమె క్షీరసాగరమథనం నృత్యనాటికను అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ముందు ప్రదర్శించి అతని నుండి భామావేణీ బిరుదును అందుకున్నది. అంతే కాక ఈమె "భామాకలాపం"లో సత్యభామగా అవతరించే వైఖరి, "మండూక శబ్దం"లో కృష్ణదేవరాయల ప్రశస్తిని లీలగా చూపే అభినయం, భంగిమల్లోని ఠీవి, ఔచిత్యం, "సింహాసనస్థితే" శ్లోకంలో దేవిని కళ్ళకు కట్టిస్తూ పట్టే భంగిమలు, "కృష్ణశబ్దం"లో భావతీవ్రత, లాలిత్యం, వైవిధ్యం ఈమె ప్రతిభకు తార్కాణాలు. వేదాలకు కొన్ని పసందైన జతులతో ఈమె కూర్చిన నృత్యం ఈమె పాండిత్యానికి ఉదాహరణ. యామిని సేవలను గుర్తించిన ప్రభుత్వం 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్ 2016లో పద్మవిభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది.

2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. ఆపై యామిని కూచిపూడి నృత్యానికి సంబంధించి డీవీడీలు విడుదల చేసింది. తన నృత్యప్రస్థానాన్ని "రేణుకా ఖాండేకర్" సహకారంతో "ఎ ప్యాషన్ ఆఫ్ డాన్స్" పేరుతో పుస్తకంగా రాసింది.

నృత్యకళ పట్ల జనసామాన్యంలో అవగాహన కలిగించడానికి అభిరుచి పెంచడానికి సుమారు మూడేండ్ల పాటు పరిశోధన చేసి "నృత్యమూర్తి" సీరియల్‌ను పదమూడు భాగాలుగా దూరదర్శన్ ప్రసారం చేసింది. మన సంస్కృతీ వైభవానికి గోపురమై నర్తనశిల్పాల ఆధారంగా, స్థలపురాణాలు, చరిత్ర జోడించి వ్యాఘ్రపాద, పతంజలి సూక్తులు, కర్ణాటక సంగీతం రుచిచూపిస్తూ ఈ సీరియల్‌లో నృత్య సర్వస్వాన్ని ఇమిడ్చి చూపించింది.

2017లో విశాఖపట్నంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారు ఈమెకు స్వర్ణకమలం బహూకరించి "నాట్య విద్యాభారతి" అనే బిరుదును ఇచ్చి సత్కరించారు.. న్యూఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు ఈమె డైరెక్టరుగా సేవలను అందించింది. ఈమె వివాహం చేసుకోకుండా అవివాహితగానే వుండి నాట్యరంగానికి తన పూర్తి జీవితాన్ని అంకితం చేసింది.

★★★

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్





కొండగుంట వెంకటేష్.

ఈ విషయం నేను ప్రతిరోజు గమనించేవాడిని. నాన్న గొప్పతనం నాకు పూర్తిగా తెలిసింది. ముఖ్యంగా ఆడవాళ్ళ పట్ల ఆయన ఎంతో మర్యాదగా ప్రవర్తించేవాడు. అమ్మని ఓసేవ్ అని ఎప్పుడు పిలిచేవాడు కాడు. పేరు పెట్టి పిలిచేవాడు. దాని చివరన అమ్మ అని జోడించేవాడు. వాటితో పాటు ఆయనకు ఎన్నో మంచి గుణాలు ఉన్నాయి. వాటిని నేను పూర్తిగా ఆకళింపుచేసుకున్నాను. పెద్దయిన తరువాత నాన్నలాగే ప్రవర్తించాలని నిర్ణయించుకున్నాను.

కాని నా మాట నిలబెట్టుకోలేకపోయాను. పెద్ద తప్పు చేశాను. ఒక పెళ్ళి కాని అమ్మాయితో పారిపోయాను. ఈ విషయం నాన్నకు తెలిస్తే ఎంతో బాధపడతాడు. తన కొడుకు ఇంత నీచుడా అని బాధపడతాడు. నేను ఏదైన సహిస్తాను కాని నాన్న బాధపడుతుంటే సహించలేను. ఆయన ఎప్పుడు నన్ను కోప్పడలేదు. కనీసం పరుషంగా మాట్లాడలేదు. ఒక స్నేహితుడిలా ప్రవర్తించాడు.

# క్రైం సీరియల్

## జరిగిన కథ

పోలీసు డిపార్ట్మెంటు లో పనిచేసిన సుయోధనరావు ను ఎవరో అనుసరిస్తూ ఉంటారు .అవినాష్, కుసమలు ఒకరిని ఒకరు ఇష్టపడతారు. సుయోధనరావును వెంటాడుతున్న వ్యక్తే అవినాష్ ని కుడా అనుసరిస్తూ ఉంటాడు. సుయోధన రావ్, ఒక కుటుంబాని అన్యాయం చెయ్యటంతో అ కుటుంబం లోని వాళ్లు ఆత్మహత్య చేసుకుంటారు . అ కుటుంబం లోని వారసుడు అతని మీద పగబడతాడు. కుసుమకు అతడు ఫోన్ చేసి బెదిరిస్తుంటాడు.సాగర్ భార్య ప్రమీల ఫోన్ చేస్తే సుయోధన రావు అక్కడికి వెళతాడు. అక్కడ సాగర్ చచ్చిపడి ఉంటాడు .ఫ్యామిలీ డాక్టర్ ప్రకాష్ కి ప్రమీలకి సంబంధం ఉండనే అనుమానం తో ప్రకాష్ తో గొడవ పడతాడు సాగర్. కోపం లో ప్రకాష్ సాగర్ని చంపేస్తాడు . ప్రకాష్ కోసం సుయోధన రావు వెళితే అతను కనిపించుడు. చివరకు అతను చచ్చి శవమై తేలతాడు .కాని చనిపోయింది ప్రకాష్ కాదు సాగర్ అని తెలుసుకుంటాడు సుయోధన రావు .సుయోధన రావుకు బెదిరింపు లేఖ వస్తుంది.రవితన తండ్రిని చంపినా సుయోధన రావును చంపాలని నిర్ణయించుకుంటాడు .సుయోధనరావు జాగింగ్ చేసే టప్పుడు రవి అతన్ని కాల్చి చంపుతాడు. పోలీసులు దర్యాప్తు మొదలు పెడతారు.హంతకుడు అవినాష్తల్లిని కుడా చంపుతానని మెసేజ్ పంపుతాడు .లీన రవిని బెదిరిస్తుంది .హంతకుడి బొమ్మలు గీయిస్తాడు ప్రతాప్ .

ఇక చదవండి

నేను కూడా ఒక మంచి పౌరుడిగా ఉంటానని అనుకున్నాడు.

కాని ఆయన నమ్మకాన్ని నేను వమ్ముచేశాను. ఎవరు చెయ్యకూడని పని చేశాను.

తలుచుకుంటే నాకే సిగ్గుగా ఉంది. తలపట్టుకుని కూర్చున్నాను. అప్పుడే బయటకు వచ్చింది అలేఖ్య. "ఏమిటి అలా ఉన్నావు? అంది నవ్వుతూ.

నేను ఇంత ఉద్వేకంగా ఉంటే ఆమెనవ్వుతోంది. ఈ పరిస్థితిలో ఆమె ఎలా నవ్వుతుందో అర్ధంకాలేదు.

"ఏం లేదు. కొంచం తలపోటుగా ఉంది"అన్నాను.

"ఉదయం టిఫిన్ చేశాం. తరువాత ఏం తినలేదు. అందుకే తలపోటు వచ్చి ఉంటుంది. పద భోజనం చేద్దాం. ముందు నువ్వు కూడా తయారవ్వు. ఇద్దరం ఏదైన హోటల్ కు వెళదాం"అంది.

పది నిమిషాలలో రిఫ్రెష్ అయ్యాను. బట్టలు మార్చుకుని గదికి తాళం వేశాం. కౌంటర్ లో తాళం ఇచ్చి బయటపడ్డాం. రోడ్డు మీద నడుస్తున్నాం. అందరు వింతగాచూస్తున్నారు. నాకు ఏదోలా తోచింది. కాని అలేఖ్యకు మాత్రం ఏం అనిపించలేదు. కొంచం కూడా స్పందించలేదు. వరుసగా రెండుహోటల్స్ కనిపించాయి. నేను వెజిటేరియన్ ను తను నాన్ వెజిటేరియన్. అదృష్టవశతు అది వెజిటేరియన్ హోటల్.

ఇద్దరం లోపలికి వెళ్ళి మూలగా ఉన్న టేబుల్ ముందు కూర్చున్నాం. కస్టమర్స్ అందరు మా వైపు చూస్తున్నారు. వాళ్ళ చూపులు అనుమానస్పదంగా ఉన్నాయి. నాకు ఎంతో సిగ్గువేసింది.

సర్వర్ భోజనం ప్లేట్లు తీసుకువచ్చి మా ముందు పెట్టాడు. ఇద్దరం భోజనం చేశాం. బిల్ అలేఖ్య ఇచ్చింది. నా దగ్గర కూడా కొంత డబ్బు ఉంది. అది నాన్నగారు ప్రతిరోజు నాకు ఇచ్చిన పాకెట్ మని అది. ఆ డబ్బును పూర్తిగా ఖర్చుపెట్టలేదు. కొంత ఖర్చుపెట్టి మిగతాది దాచుకున్నాను. సమయం ఆరుదాటింది. క్రమంగా చీకటిపడుతోంది. ఈ రాత్రి మేమిద్దరం హోటల్ లో నే ఉండాలి. నాకు ఎంతో అనీజీగా తోచింది. హోటల్ చేరుకున్నాం. లోపలికి

వెళ్ళబోతుంటే అప్రయత్నంగా ఆగిపోయాం.

కౌంటర్ ముందు ఒక పోలీస్ అధికారి ఇద్దరు కానిస్టెబుల్ కనిపించారు. ఆఫీసర్ సోఫాలో కూర్చున్నాడు. కానిస్టెబుల్ అయన వెనుక నిలబడ్డారు. కౌంటర్ లో ఉన్న వ్యక్తి కంగారుగా ఉన్నాడు. అప్పుడే అతను మమ్మల్ని చూశాడు. “సార్ మీరు వెతుకుతున్నవాళ్ళు వచ్చారు”అన్నాడు.

పోలీస్ ఆఫీసర్ లేచి మా దగ్గరకు వచ్చాడు. జేబులో ఉన్న ఫోటోలు తీసి చూశాడు. తరువాత మా వైపు చూశాడు. అంతా అర్థమైనట్టు తలపంకించాడు.

“నీ పేరు అలేఖ్య. నీ పేరు రవి కదూ” అన్నాడు కరుకుగా.

“అవునని తలూపాము. అతను అలేఖ్య వైపు చూసి “మీ నాన్నగారు మీ గురించి కంప్లయింట్ ఇచ్చారు. పదండి”అన్నాడు.

నా మొహం పాలిపోయింది. భయంతో నా కాళ్ళు చేతులు వణికాయి. మొదటిసారి అలేఖ్య కూడా భయపడింది. మేము ఇక్కడ ఉన్నట్టు పోలీసులకు ఎలా తెలిసిందో అర్థంకాలేదు. మేము ఏం మాట్లాడలేదు. మాట్లాడటానికి ఏముంది కనుక. మౌనంగా వెళ్ళి కారులో కూర్చున్నాం. నేను అలేఖ్య వెనుక సీటులో కూర్చున్నాం. ఆఫీసర్ కానిస్టెబుల్స్ ముందు సీటులో కూర్చున్నారు. అని చెపుతూ ఆగిపోయాడు రవి.

ఆశ్చర్యంగా చూసింది ప్రభ. “రేపు చెప్తాను. నాకు ముఖ్యమైన పని ఉంది. దయచేసి తప్పించుకోవటానికి ప్రయత్నించకు. బయట రౌడి లాంటి మనిషి కాపలా ఉన్నాడు. వాడు అసలే మంచివాడు కాదు. తరువాత నీ ఇష్టం.”అన్నాడు రవి.

“ఇంకా ఎన్నిరోజులు నేను ఇక్కడ ఉండాలి”చిరాకుగా అడిగింది ప్రభ.

“రేపు నా కథ పూర్తిగా చెప్తాను. అది విన్నతరువాత నేను ఎందుకు ఆ నిర్ణయం తీసుకున్నానో నీకు అర్థమవుతుంది. ఆ తరువాత నువ్వు ఎలాంటి నిర్ణయమైన తీసుకో. నాకు అభ్యంతరంలేదు. నువ్వునన్నుఇష్టపడకపోయిన ఫర్వాలేదు. కాని ద్వేషించకు. అదే నేను కోరుకునేది. వస్తాను”అని బయటకు వెళ్ళాడు రవి.

వెంటనే తలుపులు మూసుకున్నాయి. కాని బయటనుంచి గడియవెయ్యలేదు. మూములుగా దగ్గరగా వేసి ఉన్నాయి. తలుపు దగ్గర నిలబడి చూసింది. ఎదురుగా మెయిన్ గేటు కనిపించింది. దాని ముందు ఒక వ్యక్తి ఉన్నాడు. లావుగా దున్నపోతులా ఉన్నాడు. చేతిలో పెద్ద కర్ర ఉంది. లూజు ప్యాంటు దాని మీద షర్టు వేసుకున్నాడు. గేటు దగ్గర నిలబడి సిగరెట్ తాగుతున్నాడు.

అతన్ని చూసి భయపడింది ప్రభ. నిజానికి ఆమెకు తప్పించుకునే ఉద్దేశం లేదు. రవి కథ మొత్తం అంతా వినాలని ఉంది. అలేఖ్య ఏమైందో తెలుసుకోవాలి. ఆమె బతికిఉందా లేక వేరే ఎవరినైన పెళ్ళిచేసుకుందా. ఈ విషయాలన్ని తెలుసుకోవాలని ఉంది. అందుకే తప్పించుకునే ఆలోచన లేదు ఆమెకు.

టిఫిన్ తీసుకుని పనివాడు వచ్చాడు. టిఫిన్ తిన్నతరువాత కొంచం సేపు టీవి చూసింది. కొంచంసేపు పుస్తకం చదివింది. తరువాత పడుకుంది. ఎంతసేపు నిద్రపోయిందో తెలియదు. కళ్ళు తెరిచి చూస్తే బాగా పొద్దుపోయినట్టుగా ఉంది. గదిలో వెలుతురు బాగా తగ్గిపోయింది. బయటకు వచ్చి చూసింది. అప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. చుట్టు చడిచప్పుడు లేదు. నిర్మానుష్యంగా నిస్తేజంగా ఉంది. అప్పడప్పుడు కార్లు బైక్ లో మాత్రం వెళుతున్నాయి.

సెల్ కోసం చూసింది. ఎక్కడ కనిపించలేదు. బహుశా రవి తీసుకువెళ్ళి ఉంటాడు. గేటు దగ్గర రౌడి లేడు. ఎక్కడికో వెళ్ళినట్టున్నాడు. గేటుకు పెద్ద తాళం వేసి ఉంది. పైకి ఎక్కి బయటకు వెళ్ళే అవకాశం లేదు. దాదాపు ఆరున్నర అడుగుల ఎత్తు ఉంది ఆ గేటు.

“కాఫీ కాని తాగుతారా”అడిగాడు పనివాడు.

# క్రైం సీరియల్

“తీసుకురా”అంది ప్రభ.
కాఫీ తాగుతూ టీవి ఆన్ చేసింది. వార్తలు వస్తున్నాయి. యాంకరు అష్టవంకరలు తిరుగుతూ వార్తలు చదువుతుంది.

“సుయోధనరావు హత్యకేసులో పోలీసులకు ఒక పెద్ద ఆధారం దొరికింది. సుయోధనరావు కొడుకుకు హంతకుడు కాల్ చేసి బెదిరించాడు. మీ అమ్మను కూడా చంపుతానని వార్నింగ్ ఇచ్చాడు. పోలీసులు ఆ కాల్ ను ట్రేస్ చేశారు. ఆ ఫోన్ అసలు యాజమాని ఆచూకి తెలుసుకున్నారు. అతన్ని ఇంటారగేట్ చేస్తే ఆ ఫోన్ కేఫ్ లో పోయిందని చెప్పాడు. పోలీసులు హోటల్ కు వెళ్ళి విచారించారు. త్వరలోనే హంతకుడి రూపు రేఖలు స్పష్టంగా తెలుస్తుందని కేసు ఇన్ వెస్టిగేట్ చేస్తున్న ఇన్స్ పెక్టర్ ప్రతాప్ చెప్పాడు.

XXXX

లాప్ టాప్ లో దృశ్యాలు చూస్తున్నాడు ప్రతాప్. అది కేఫ్ లో దొరికిన ఫుటేజి. ఒక టేబుల్ ముందు కూర్చుని ఉన్నాడు వినాయక్. అతని వెనుక చాల మంది కస్టమర్స్ ఉన్నారు. వాళ్ళంతా ఏదో మాట్లాడుకుంటున్నారు. ఒక వ్యక్తి మాత్రం ఒంటరిగా ఉన్నాడు. అతని పక్కన ఎవరు లేరు. ఒంటరిగా వచ్చాడు. అటుఇటు చూస్తున్నాడు. ఆ వ్యక్తిని వెంటనే గుర్తుపట్టాడు ప్రతాప్. అతను రవి. సుయోధనరావును హత్యచేసిన వ్యక్తి. అప్పుడు మారువేషంలో లేడు. అయిన గుర్తుపట్టాడు ప్రతాప్. కొన్ని నెలలకు ముందు రకరకాల వేషాలతో పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు. సుయోధనరావు గురించి వాకబు చేశాడు. ఇప్పుడు ఆ మారువేషాలు తొలిగిస్తే ఫుటేజి లో కనిపిస్తున్న రూపం బయటకు వస్తుంది. అయిన అనుమానం తీర్చుకోవాలని అనుకున్నాడు. వెంటనే కంప్యూటర్ ఇంజీనీర్ ను పిలిచాడు. అతనితో జరిగింది చెప్పాడు.
అతను రవి మారువేషాలు వేసుకున్న ఫోటోలను కంప్యూటర్ లో ఫీడ్ చేశాడు. తరువాత సాఫ్ట్ వేర్ సహాయంతో రవి మొహానికి ఉన్న గడ్డాన్ని మీసాన్ని తొలగించాడు. ఇప్పుడు స్పష్టంగా రవి రూపం బయటపడింది.

ఫుటేజిలో ఉన్న రవి ని కంప్యూటర్ లో ఉన్న రవి ఫోటోను చూశాడు. రెండు సరిగ్గా సరిపోయాయి. ఊత్సాహంతో ఊగిపోయాడు ప్రతాప్. ఇన్ని రోజులు హంతకుడి అసలు రూపం తెలియలేదు. అందుకే దర్యాప్తు మందకొడిగా సాగింది. ఇప్పుడు వేగంగా సాగుతుంది. త్వరలో ఆ హంతకుడిని పట్టుకుంటాడు. ఆలోచనలకు బ్రేక్ వేసి తిరిగి ఫుటేజి అన్ చేశాడు.

వినాయక్ కాఫీ తాగుతున్నాడు. ఉన్నట్టుండి లేచాడు అతను. కాఫీ కప్పు టేబుల్ మీద పెట్టి ఎదురుగా ఉన్న రిఫ్రెష్ రూమ్ లోకి వెళ్ళాడు. ఈ అవకాశం కోసమే రవి ఎదురుచూస్తున్నాడు. వినాయక్ అటువెళ్ళగానే సెల్ తీసి జేబులో పెట్టుకున్నాడు. కౌంటర్ దగ్గరకు వెళ్ళి బిల్ పే చేశాడు. తరువాత బయటకు నడిచాడు.
వెంటనే లాప్ టాప్ ఆఫ్ చేశాడు. కమీషనర్ కు కాల్ చేశాడు.

XXXX

అవినాష్ ఇంటి ముందు నిలబడిఉన్నాడు రవి. అతని చూపులు నిశితంగా ఇంటిని పరీక్షిస్తున్నాయి. గేటు ముందు ఇద్దరు పోలీసులు ఉన్నారు. వాళ్ళదగ్గర తుపాకులు కూడా ఉన్నాయి. లోపల ఎంతమంది ఉన్నారో తెలియదు. ఈ రోజు అవినాష్ తల్లిని చంపాలని నిర్ణయించుకున్నాడు. అందుకే తుపాకితో వచ్చాడు. కాని ఇక్కడ కాపలా చాల పటిష్టంగా ఉంది. లోపలికి వెళ్ళాలంటే ఈ పోలీసులను దాటుకుంటు వెళ్ళాలి. వాళ్ళకు కనిపించకుండ వెళ్ళలేడు. అయిదు నిమిషాలు చూస్తూ గడిపాడు. పోలీసులు ఇతన్ని చూడలేదు. పిచ్చాపాటి మాట్లాడుకుంటు కూర్చున్నారు. అవినాష్ ఇంటి టోపోగ్రఫీ గురించి బాగా తెలుసు రవికి. ఇంటి వెనుక వైపుకు వెళ్ళాడు. ఇంటి చుట్టు పటిష్టంగా కాంపౌండ్ వాల్ ఉంది. దాదాపు ఆరడుగల ఎత్తు ఉంది. ఒక మాములు మనిషి ఎక్కలేడు. కాని లక్ష్యం బలంగా ఉంటే ఏదైన సాధించవచ్చు. ఇలాంటి అవరోదాలు అడ్డురావు. రవి కూడా దాదాపు ఆరడుగుల ఎత్తు ఉంటాడు. రెండు చేతులు గోడమీద పెట్టాడు. ఒకసారి ఊపిరిగట్టిగా పీల్చి వదిలాడు. తరువాత పైకి లేచాడు. వాల్ చుట్టు గాజుపెంకులు ఉన్నాయి.

కొన్ని బలంగా అతని చేతులకు గుచ్చుకున్నాయి. రక్తం బయటకు చిమ్మింది. బాధతో విలవిలలాడిపోయాడు. అతికష్టం మీద బాధను అణుచుకుని పైకి ఎక్కాడు. కాళ్ళకు మంచి చెప్పులు ఉన్నాయి. అందుకే కాళ్ళకు ఏం కాలేదు.

కాంపౌండ్ లో ఎవరు లేరు. కుక్కలు కూడా లేవు. లోపల ఎంత మంది ఉన్నారో తెలియదు. కొన్ని క్షణాలు ఆగాడు. తరువాత లోపలికి దూకాడు. వేగంగా లోపలికి దూసుకుపోయాడు. గుమ్మం దగ్గర అప్రయత్నంగా ఆగిపోయాడు. తలుపుల దగ్గర ఇద్దరు కానిస్టెబుల్స్ ఉన్నారు. వాళ్ళ దగ్గర తుపాకులు ఉన్నాయి. అవినాష్ తల్లి పైన ఉంటుంది. భర్త పోయిన తరువాత ఆమె బెడ్ రూంకే పరిమితమైపోయింది. కిందికి రావటం లేదు. ఇప్పుడు పైకి వెళ్ళాలంటే పోలీసులను దాటుకుని వెళ్ళాలి. అది అంత తేలిక కాదు. అందుకే వెనక్కి తిరిగాడు రవి. ఒక చేతికి రుమాలు కట్టుకుని గోడ మీదకు ఎక్కాడు. అవతలకు దూకి వేగంగా తన బైక్ దగ్గరకు చేరుకున్నాడు.

అ సమయంలో ప్రతాప్ పోలీసు స్టేషన్ లో నే ఉన్నాడు. అన్ని పోలీస్ స్టేషన్స్ కు రవి ఫోటోను పంపిస్తున్నాడు. ఆ పని దగ్గరుండి చూసుకుంటున్నాడు.

XXXX

ప్రభ గాఢంగా నిద్రపోతుంది. టైం ఎంతయిందో తెలియదు. అప్పుడే చప్పుడు వినిపించింది. గేటు తెరుస్తున్న చప్పుడు. తలుపు దగ్గర నిలబడి బయటకు చూసింది. గేటు దగ్గర బైక్ అగి ఉంది. దాని మీద రవి ఉన్నాడు. అతని రెండు చేతులకు బ్యాండేజి ఉంది. బాగా గాయపడినట్టున్నాడు.

ఆందోళనగా దగ్గరకు వెళ్ళింది. “ఏం జరిగింది”అడిగింది. “నిజం చెప్పమంటావా అబద్ధం చెప్పమంటావా”అడిగాడు. అతను ఏకవచనంతో పిలవటం ప్రభ గమనించింది.

నవ్వి”నిజమే చెప్పండి”అంది. రవి జరిగిన దంతా చెప్పాడు. “గుమ్మం దగ్గర పోలీసులు ఉన్నారు. వాళ్ళను దాటుకోవటం కష్టం అనిపించింది. అందుకే వెనక్కి వచ్చేశాను. త్వరలోనే ఇంకో ప్రయత్నం చెయ్యాలి”అన్నాడు రవి.

“ఒక హత్య చేసి హంతకుడివి అయ్యావు. మళ్ళి ఇంకో హత్య చెయ్యటం ఎందుకు? అది ఒక స్త్రీని”అంది.

“ఒక వయస్సు మళ్ళిన స్త్రీని చంపటం నాకు ఇష్టం లేదు. కాని తప్పలేదు. ఆవిడ మా తల్లి తండ్రిని విపరీతంగా బాధపెట్టింది. మాటలతో హింసించింది. సభ్యత సంస్కారం ఉన్నవాళ్ళు ఎవరు అలా మాట్లాడరు. ఆవిడ వల్లే మా అమ్మ మానసికంగా కృంగిపోయింది. సిగ్గుతో చితికిపోయింది. లోపల తన్నుకొస్తున్న బాధను తట్టుకోలేకపోయింది. దాంతో మంచం పట్టింది. రెండు నెలల తరువాత చనిపోయింది. ఒక రకంగా అవినాష్ తల్లి నా తల్లిని హత్యచేసింది. కత్తితో కాకపోవచ్చు. తుపాకితో కాకపోవచ్చు. మాటలతో చంపింది. దానికి కారణం అహంకారం. తన భర్త పెద్దపోలీస్ ఆఫీసర్ అని ఆమెకు గర్వం. ఇప్పుడు ఆమె వయస్సుమీరిపోయింది. ఎలా ఉందో తెలియదు. కాని వయస్సులో ఉన్నప్పుడు ఆవిడకు తలబిరుసు ఎక్కువ. ఎవరిని ఎంత మాటఅయిన అనేస్తుంది. ఆ మాటకలకు ఎదుటివాళ్ళు ఎంత బాధపడతారో ఆమె ఆలోచించదు. చెప్పదలచుకుంది కుండబద్దలు కొట్టినట్టు చెప్తుంది.” “నా కన్న తల్లి పట్ల కూడా ఆమె అలాగే ప్రవర్తించింది. చాల దురుసుగా ప్రవర్తించింది. నా తల్లిది సున్నిత మనస్సు. ఎవరిని పరుషంగా మాట్లాడదు. ఏది మాట్లాడిన చాల మెల్లగా మెత్తగా మాట్లాడుతుంది. అలాంటి మంచి మనిషిని తన మాటలతో చంపింది ఆ మహాతల్లి. నా తల్లి ఎంత బాధపడిందో నేను స్వయంగా చూశాను. అందుకే ఆమెను చంపాలనుకుంటున్నాను. అర్ధంచేసుకో”అని లోపలికి వెళ్ళాడు.

ప్రభకు చప్పున ఏం మాట్లాడాలో తోచలేదు. అతని వాదన

సమంజసంగానే ఉంది. అతని స్థానంలో ఎవరు ఉన్నా అలాగే ప్రవర్తిస్తారు. అలాగే స్పందిస్తారు. ఉచిత సలహాలు ఇవ్వటం చాల తేలిక. అతని స్థానంలో తాము ఉంటే అసలు కష్టం తెలుస్తుంది. అందుకే ప్రభ ఏం మాట్లాడలేకపోయింది. ఆమె హాలులోకి వచ్చేసరికి అతను లేదు. హాలులోనే కూర్చుంది. పది నిమిషాల తరువాత వచ్చాడు అతను. రెండు చేతులకు బ్యాండేజి అలాగే ఉన్నాయి.

“భోజనం చేశావా? మళ్ళీ ఏకవచనంతో అడిగాడు. అయిన ఏం అనుకోలేదు ప్రభ. పైగా సంతోషపడింది.

“లేదు. మీరు చేశారా? అడిగింది.
“లేదు. రండి కలిసి భోజనం చేద్దాం”అని డైనింగ్ హాలులోకి వెళ్ళాడు. అప్పటికే కేర్ టేకర్ అంతా సిద్ధం చేశాడు. ఇద్దరు ఎదురెదురుగా కూర్చున్నారు. కేర్ టేకర్ వడ్డిస్తున్నాడు.

“మీ కథ పూర్తిచెయ్యండి”అంది ఉన్నట్టుండి ప్రభ.

రవి నవ్వి” మీకు పూర్తిగా వినాలని ఉందా”అన్నాడు.

“అవును.”

“అంత ఆసక్తిగా ఉందా”.

“అవును. తరువాత ఏమైందో తెలుసుకోవాలని ఉంది. అందుకే అడిగాను.”

“భోజనం చేసిన తరువాత చెప్తాను”అన్నాడు మెల్లగా. పది నిమిషాలలో భోజనం అయింది. ఇద్దరు బాల్కనిలో కూర్చున్నారు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. పైగా ఆహ్లాదకరంగా ఉంది. ఆకాశంలో చంద్రుడు వెన్నల ముద్దలా మెరిసిపోతున్నాడు. దూరంగా నక్షత్రాలు తమ ఉనికిని చెప్తుతున్నాయి. ఒక ఉల్క అప్పుడే వేగంగా వెళుతు మెరిసింది. తరువాత ఆరిపోయింది.
“చెప్పండి”అని సర్దుకుని కూర్చుంది.

“ఎంత వరకు చెప్పాను”అడిగాడు రవి.

“మీ ఇద్దరిని పోలీసులు కారులో తీసుకువెళుతున్నారు. అంతవరకు చెప్పారు”.

కారు వేగంగా భైరవలకం వైపు సాగిపోయింది. నా మైండ్ పూర్తిగా బ్లాంక్ అయిపోయింది. పట్టుబడినందుకు నేను భయపడటం లేదు. నాన్నగారికి నా మొహం ఎలా చూపించాలో అర్ధంకాలేదు. సిగ్గు బాధ కలిసికట్టుగా నన్ను కుదిపేశాయి. శ్రీలేఖ మాత్రం ఠీవిగా కూర్చుంది. ఆమెలో కొంచం కూడా స్పందన కనిపించటం లేదు. చాల మాములుగా కూల్ గా ఉంది. సహజంగా ఆలాంటి సమయంలో అమ్మాయిలు భయపడతారు. ఏం జరుగుతుందా అని తల్లడిల్లిపోతారు. కొంతమంది ఏడుస్తారు కూడా.

కాని అలాంటి లక్షణాలు ఏం అలేఖ్యలో కనిపించటం లేదు. ఏం జరగనట్టు బొమ్మలా కూర్చుంది.
“ఇప్పుడు ఏం చేద్దాం”అన్నాను భయంతో.
“ఊరికే భయపడకు. నీ అంత పిరికివాడిని నేను చూడలేదు. నాకున్న ధైర్యం కూడా నీకు లేదు. అనవసరంగా ప్రతి దానికి భయపడుతుంటావు. నిన్ను ఎలా ఇష్టపడ్డానో నాకు అర్థం కావటం లేదు”అంది చిరాకుగా.

“అది కాదు”అని ఏదో సర్దిచెప్పబోయాను.మధ్యలోనే అందుకుంది ఆమె.
“పెద్దవాళ్ళు బెదిరిస్తారు. కాని మనం భయపడవద్దు. ధైర్యంగా నిలబడదాం. ఇద్దరం ఒకరిని ఒకరు ఇష్టపడ్డామని చెప్తుదాం. ఒప్పుకుంటే సరి. లేకపోతే మొండిపట్టుపడదాం. భోజనం చెయ్యమని బెదిరిద్దాం. దానికి కూడా భయపడకపోతే ఆత్మహత్య చేసుకుంటామని అందాం. దాంతో అందరు దిగివస్తారు. మన పెళ్ళికి ఒప్పుకుంటారు. ఏమంటావు “అంది.

ఏం మాట్లాడలేదు నేను. మొహం పక్కకు తిప్పుకున్నాను.

విపరీతమైన ఉద్వేకంతో నా శరీరం కంపిస్తోంది. ఆ పరిస్థితి చెప్పటానికి వీలులేదు. అనుభవించినవాళ్ళకే తెలుస్తుంది. భైరవలంక చేరుకోవటానికి రెండు గంటలు పట్టింది. కారు తిన్నగా శ్రీలేఖ ఇంటి ముందు ఆగింది. అందరం దిగాం. పోలీసులు మమ్మల్ని పట్టుకుని

లోపలికి తీసుకువెళ్ళారు. హాలులో శ్రీలేఖ తండ్రి తల్లి కూర్చుని ఉన్నారు. వాళ్ళకు కొంచం దూరంలో నా కన్నతల్లి తండ్రి నిలబడిఉన్నారు. తప్పుచేసినట్టు తలవంచుకుని ఉన్నారు.

శ్రీలేఖ కన్నవాళ్ళకు ఎదురుగా ఒక పెద్ద పోలీసు ఆఫీసర్ కూర్చున్నాడు. అతని బ్యాడ్జ్ ను చూసి చాల పెద్ద ఆఫీసర్ అని గుర్తించాను. ఇద్దరిని తీసుకువచ్చి ఆఫీసర్ ఎదురుగా నిలబెట్టారు.

"మీరు వెళ్ళండి. మీ బాబుతో కొంచం సేపు మాట్లాడాలి. తరువాత పంపిస్తాం"అన్నాడు ఆ ఆఫీసర్. అతని పేరు సుయోధనరావు అని తరువాత తెలిసింది."

"నాన్న అమ్మ నా వైపు బాధగా చూస్తూ వెళ్ళిపోయారు. నా గుండెలు పిండినట్టుగా అయింది. ఒక పెద్ద ప్రభుత్వ సంస్థలో నాన్న క్లాస్ వన్ ఆఫీసర్. ఆయన కింద యాభై మంది సబార్డినేట్స్ ఉన్నారు. వాళ్ళందరు నాన్నకు ఎంతో గౌరవం ఇస్తారు. ఇష్టపడతారు. ఇంతవరకు ఆయన ఎవరి ముందు తలవంచలేదు. ఇప్పుడు వంచవలసివచ్చింది. అది పోలీస్ ఆఫీసర్ ముందు. దీనికి అంతటికి కారకుడిని నేను. నేను ఈ పిచ్చిపని చెయ్యకపోతే నాన్నకు అమ్మకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. తలుచుకుంటే నాకే సిగ్గు అవమానంగా ఉంది. నాన్నగారికి ఎలా ఉంటుందో ఊహించగలను." సుయోధనరావు అలేఖ్య తండ్రికి సైగ చేశాడు. ఆయన తన భార్య కుతురిని తీసుకుని లోపలికి వెళ్ళిపోయాడు. నేను సుయోధనరావు ఆయన సిబ్బంది మాత్రం ఉన్నారు. "నీ పేరేమిటి? నా వైపు చూస్తూ అడిగాడు ఆయన.

"రవి"అన్నాను బెరుకుగా.
"ఈ ప్లాన్ ఎవరిది?
నేను ఏం మాట్లడలేదు. తలవంచుకున్నాను. నిజానికి ఆ ప్లాన్ నాది కాదు. అలేఖ్యది. కాని ఆ విషయం చెప్పలేకపోయాను. "నీతో నిజం ఎలా చెప్పించాలో నాకు తెలుసు. పోలీస్ ట్రీట్మేంట్ గురించి నీకు తెలియదు"అన్నాడు.

తరువాత తన సిబ్బందికి సైగ చేశాడు. వాళ్ళు నన్ను పట్టుకుని బయటకు తీసుకువెళ్ళారు. జీపు వెనుక కూర్చోపెట్టారు. అయిదు నిమిషాల తరువాత సుయోధనరావు వచ్చాడు. ఆయన మొహం ఆనందంతో వెలిగిపోతుంది. దానికి కారణం అప్పుడు నాకు తెలియలేదు. టీనేజ్ కుర్రవాడిని అప్పుడు. పావుగంట తరువాత స్టేషన్ చేరుకున్నాం. ఏం జరుగుతుందో నాకు తెలియదు. ఊహించ లేకపోతున్నాను. నన్ను సుయోధనరావు చాంబర్స్ లోకి తీసుకువెళ్ళారు. కానిస్టెబుల్స్ వెళ్ళిపోయారు. బిక్కుబిక్కు మంటు నిలబడ్డాను. పదినిమిషాల తరువాత సుయోధనరావు వచ్చాడు. సిగరెట్ తాగుతూ నా వైపు అదోలా చూశాడు. ఎందుకో కారణం తెలియదు. ఆ టైంలో ఆయన నాకు ఒక ఆకురౌడిలా కనిపించాడు. కాకపోతే రౌడీలు యునిఫారమ్ వేసుకోరు. కాని ఈయన యూనిఫారమ్ వేసుకున్నాడు. అంతే తేడా. "నీది ఏం కులంరా"అడిగాడు. చెప్పాను.

"అలేఖ్యను ప్రేమించే అర్హత నీకు లేదు. వాళ్ళు చాల పెద్దవాళ్ళు. సంఘంలో పెద్దమనుష్యులు. డబ్బు పలుకుబడి రెండు వాళ్ళకు ఉన్నాయి. తలుచుకుంటే నిన్ను వాళ్ళు ఏమైన చెయ్యగలరు. జరిగింది మరిచిపో. ఇంకేప్పుడు ఆమెను కలుసుకోనని మాట ఇవ్వు."

కోపంగా చూశాను. అయన అనవసరంగా కులం పేరు ఎత్తాడు. దేనినైన నేను సహిస్తాను కాని కులంపేరుతో అవమానిస్తే సహించను. కోపంతో ఊగిపోతాను. అప్పుడు కూడా అదే జరిగింది.

"మా కులాన్ని కించపరిచే అధికారం మీకు లేదు." అన్నాను. ఆయన విసురుగా లేచి గట్టిగా చెంపమీద కొట్టాడు. పోలీసు దెబ్బ గురించి విన్నాను. కాని ఇప్పుడు అనుభవం అయింది. ఆ దెబ్బకు నా కళ్ళు పచ్చబడ్డాయి. శరీరం తూలి వెనక్కి పడింది. కొన్ని క్షణాలపాటు అచేతనంగా ఉండిపోయాను. "పిచ్చిపిచ్చిగా మాట్లాడితే చర్మ వలుస్తాను. పోలీస్ ఆఫీసర్ మాటకే ఎదురుచెప్తావా. మర్యాదగా నేను చెప్పినట్టు రాసివ్వు. లేకపోతే లాకప్ లో పెడతాను"అన్నాడు కోపంగా. "నేను రాయను"మొండి ధైర్యంతో

# క్రైం సీరియల్

అన్నాను. నేను తప్పుచేసినట్టు మీరు అనుకుంటే అలేఖ్య కూడా తప్పుచేసినట్టుగా అనుకోవాలి. తనని కూడా రాసివ్వమని చెప్పండి. అప్పుడు నేను రాస్తాను"
"అంటే

రాయవన్నమాట"రెట్టించాడు సుయోధనరావు.

"అవును."

ఆ అమ్మాయికి నువ్వు ఒకటి కాదు. నువ్వు ఇలా చెప్తే వినవు. తగిన మర్యాద చెయ్యాలి"అన్నాడు. తరువాత వేగంగా ఒక బుల్ డోజర్ లా నా వైపు దూసుకువచ్చాడు. తరువాత నాకు ఏమైందో తెలియదు. ఎన్నిసార్లు లాఠీతో కొట్టాడు లెక్క పెట్టలేదు. దాదాపు పది నిమిషాలపాటు టార్చర్ చేశాడు. రక్తంతో నా శరీరం తడిసిపోయింది. బట్టలు బాగా నలిగిపోయాయి. నిలబడటానికి కూడా శక్తి లేదు. అలాగే నీరసంగా నేలమీద కూలిపోయాను. తరువాత ఏమైందో తెలియదు. కళ్ళు తెరిచేసరికి సెల్ లో ఉన్నాను. చీకటిగా ఉంది.

అప్పడే దోమల దాడి మొదలైంది. విపరీతంగా దాహం వేస్తోంది. మంచినీళ్ళకోసం చూశాను. కనిపించలేదు. మంచినీళ్ళు అని నీరసంగా అరిచాను.

నా అదృష్టం కొద్ది నా అరుపు ఒక కానిస్టేబుల్ కు వినిపించింది. మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాడు.
"కుర్రవాడివి. ఎంతో భవిష్యత్తు ఉన్నవాడివి. మొండితనం విడిచిపెట్టు. ఆఫీసర్ గారు చెప్పినట్టు చెయ్యి. అది నీకే మంచిది"అన్నాడు అనునయంగా.
"తప్పునేను మాత్రం చెయ్యలేదు. ఆ అమ్మాయి కూడా చేసింది. ఆమెను కూడా సెల్ లో వెయ్యమనండి"అన్నాను ఉక్రోషంతో.

"వాళ్ళు పెద్దవాళ్ళు. ఆఫీసర్ కు బాగా పరిచయం. వాళ్ళకేం కాదు. నీ జీవితమే నాశనం అవుతుంది. నా మాట విను. ఆఫీసర్ గారు చెప్పినట్టు చెయ్యి. వెంటనే విడిచిపెడ్తారు. ఇంటికి వెళ్ళిపోదువు కాని"అన్నాడు.

ఏదో చెప్పబోయాను. అప్పుడే అమ్మ నాన్న వచ్చారు. ఇద్దరు పదిలంకణాలు చేసినవాళ్ళలా ఉన్నారు. అమ్మ అయితే చాల నీరసంగా ఉంది. నాన్నకూడా బాగా డీలాపడిపోయాడు. బాధతో నా తలకిందికి వాలిపోయింది. సిగ్గు అభిమానం కలిసికట్టుగా నన్ను కుదిపేశాయి. ఏం మాట్లాడాలో తెలియలేదు. కనీసం ధైర్యంగా వాళ్ళ మొహం కూడా చూడలేకపోయాను.

"సార్ మా బాబును విడిచిపెట్టండి. ఇంకెప్పుడు ఇలాంటి పని చెయ్యడు"అన్నాడు నాన్న బ్రతిమాలుతున్న దోరణిలో.
"మీ వాడికి మంచి మర్యాద తెలియదు. మీరు నేర్పించలేదా? అడిగాడు సుయోధనరావు.
"ఏం జరిగింది. వాడు ఏమైన అమర్యాదగా ప్రవర్తించాడా"
"ప్రశ్నలు అడుగుతే సరిగ్గా జవాబు చెప్పలేదు. తలతిక్కగా ప్రవర్తించాడు. అందుకే తగిన శిక్ష వేశాను."

"ఆఫీసర్ దయచేసి మా వాడిని వదిలిపెట్టండి. వాడు కాలేజి స్టూడెంట్. ఏదో తెలియక చేశాడు. ఇంకెప్పుడు ఇలాంటి పని చెయ్యడు. దానికి నాది బాధ్యత. ఈ సారి వాడిని విడిచిపెట్టండి."

"మీ లాంటి వాళ్ళకు ఇదేం బుద్ధి. పెద్ద ఇంటి అమ్మాయిలను ఎందుకు ఇష్టపడతారు. వాళ్ళను చేసుకుంటే బాగా డబ్బు వస్తుంది లేకపోతే ఫోటోలు వీడియోలు చూపించి బ్లాక్ మెయిల్ చెయ్యవచ్చు. ఏ రకంగా అయిన ఫ్రీగా డబ్బు వస్తుంది. అంతే కదూ"అన్నాడు సుయోధనరావు ఎగతాళిగా.నాన్న మొహం పాలిపోయింది. కోపంతో ఆయన పిడికిళ్ళు గట్టిగా బిగుసుకున్నాయి. ఆయన కోపగించుకోవటం నేను ఎప్పుడు చూడలేదు. ఎప్పుడు చూసిన శాంతంగా చిరునవ్వు చిందిస్తూ ఉండేవాడు.

ప్రక్కన అమ్మ బొమ్మలా నిల్చుంది. ఆమె కళ్ళు పూర్తిగా తడిఅయ్యాయి. జరిగింది తట్టుకోలేకపోతుంది. పైగా విపరీతంగా అవమానిస్తున్నారు. ఒక నాగరికుడు ప్రవర్తించినట్టు ప్రవర్తించటం లేదు. పోలీసుల నోటి దురుసుకు ఇది పరాకాష్ఠా. ఒక్కక్షణం మాత్రమే నాన్నకోపం ఉండింది. వెంటనే మాములుగా అయిపోయాడు.

"సారీ. ఇంకోసారి ఇలా జరగదు."

"అయితే ఇంకెప్పుడు మీ అబ్బాయి ఆ అమ్మాయి వైపు చూడడని మాట్లాడడని వాగ్దానం చెయ్యండి. ఆ మేరకు కాగితంలో రాసి ఇవ్వండి"
"అలాగే రాసి ఇస్తాను"అన్నాడు నాన్న.

వెంటనే కాగితం మీద సుయోధనరావు చెప్పినట్టు రాశాడు. తరువాత సంతకం చేశాడు. ఈ తతంగం అంతా సెల్ లోంచి నేను గమనిస్తున్నాను. నా గుండెలు మండిపోతున్నాయి. తప్పుచేసింది నేను అలేఖ్య. కాని నాకు మాత్రమే శిక్షపడింది. పైగా మా వాళ్ళను మాటలతో తూట్లు పొడుస్తున్నాడు పోలీస్ ఆఫీసర్.

ఆ తతంగం అంతా పూర్తి అయ్యేసరికి పది నిమిషాలు పట్టింది. తరువాత సెంట్రి వచ్చి సెల్ తెరిచాడు. మెల్లగా లేచి నిలబడ్డాను. కాళ్ళు చేతులు చచ్చుపడినట్టు ఉన్నాయి. నిటారుగా ఒక్కక్షణం నిలబడలేకపోతున్నాను. ఒళ్ళంతా పచ్చిపుండులా ఉంది. రక్తపు చారికలతో నా శరీరం రక్తంతో స్నానం చేసినట్టుగా ఉంది. నాన్న బాధతో కుమిలిపోయాడు. అమ్మ పరిస్థితి చెప్పనవసరం లేదు. కన్నకడుపు తట్టుకోలేకపోతుంది. క్యాబ్ లో ఇంటికి చేరుకున్నాం. నేనేం మాట్లాడలేదు. అమ్మ నాన్న కూడా నన్ను ఏం అనలేదు. అది నన్ను ఇంకా బాధపెట్టింది. నాన్నగట్టిగా అడిగిఉంటే బాగుండేది. కనీసం ఒక దెబ్బవేసిన మనస్సుకు శాంతి ఉండేది. కాని ఆయన ఏం మాట్లాడలేదు. కనీసం కోపంగా కూడా చూడలేదు. మామూలుగానే పలకరించాడు. జైలులో ఎలా ట్రీట్ చేశారని అడిగాడు. నేను నిజం దాచలేదు. అంతా విడమర్చి చెప్పాను. అంతే ఒక్కసారిగా ఆయన కదిలిపోయాడు. నన్ను పట్టుకుని గట్టిగా ఏడ్చేశాడు. అమ్మ కూడా కదిలిపోయింది. ముగ్గరం ఒకరిని ఒకరు గట్టిగా పట్టుకుని అలా ఉండిపోయాం. ముందుగా నేను తేరుకున్నాను. నాన్న అమ్మ చేతులు పట్టుకుని అన్నాను.

"నన్ను క్షమించండి. నా వల్లే ఇదంతా జరిగింది. పిచ్చివాడిలా ఆ అమ్మాయి మాటలు నమ్మాను. నిజంగానే నన్ను ఇష్టపడుతుందని అనుకున్నాను. కాని ఇంత మోసం చేస్తుందని అనుకోలేదు. ఆమెను నమ్మాను కాని మీమ్మల్ని నమ్మలేకపోయాను. మీరు తిడతారని భయపడ్డాను. పైగా ఈ విషయం మీకు చెప్పవద్దని అమ్మాయి చెప్పింది. అందుకే చెప్పలేకపోయాను. నేను చేసింది పెద్ద తప్పు కాదు. అయిన మీరు పెద్ద శిక్ష అనుభవించారు. అందరి ముందు అవమానించబడ్డారు. నానా మాటలు పడ్డారు. ఎవరికి తలవంచని నాన్న ఆఫీసర్ ముందు తలవంచాడు. ఆ దృశ్యం నేను ఎప్పటికి మరిచిపోలేను."

"చాలు నాన్న. జరిగింది చాలు. ఇంకెప్పుడు ఏ అమ్మాయి జోలికి వెళ్ళను. బద్దిగా చదువుకుంటాను. మంచి ఉద్యోగం తెచ్చుకుంటాను. నన్ను ఆశీర్వదించండి"అని ఇద్దరి కాళ్ళమీద పడ్డాను. ఇద్దరు నిర్ఘాంతపోయారు. ఈ పరిణామం వాళ్ళ ఊహించలేదు. కొన్ని క్షణాలు అచేతనంగా ఉండిపోయారు. తరువాత తేరుకుని ఒక్కసారిగా ఆనందంతో ఊగిపోయారు. కళ్ళు తుడుచుకుని నన్ను ఆశీర్వదించారు."

"దాంతో వాతావరణం తేలికపడింది. తుఫాను వచ్చి వెలిసిన అనుభూతి కలిగింది. బాధ అవమానం మరిచి రాత్రి అందరం కలిసి భోజనం చేశాం. తరువాత అందరం బెడ్ రూంలో కూర్చున్నాం. నా భవిష్యత్తు గురించి చర్చించుకున్నాం. నా లక్ష్యం ఏమిటో నాన్నకు చెప్పాను. ఆయన సంతోషంగా ఒప్పుకున్నాడు. " నా మనస్సుకు అప్పుడు శాంతి దొరికింది. పెద్ద భారం దిగిపోయిన ఫీలింగ్ కలిగింది. నా బెడ్ రూంలోకి వెళ్ళి పుస్తకం తీసుకున్నాను. ముందు ఏకాగ్రత కుదరలేదు. మాటి మాటికి అలేఖ్య అందమైన రూపం కళ్ళముందు కదులుతోంది. మనస్సును నిగ్రహించుకోవటం చాల కష్టమైంది. అందుకే అమ్మకు నాన్నకు ఇచ్చిన మాటను గుర్తుతెచ్చుకున్నాను. దాంతో నాకు ఏకాగ్రత కుదిరింది. రాత్రి పదకొండుగంటలవరకు చదివాను. తరువాత నోట్స్

# క్రైం సీరియల్

తయారుచేసుకున్నాను. అప్పటికే బాగా అలసిపోయాను. పైగా సెల్ లో చిత్రవధ అనుభవించాను. శరీరం బాగా అలసిపోయింది. పుస్తకం మూడి లైటు ఆర్పేశాను. మంచంమీద పడుకోబోతుంటే సెల్ చప్పుడు చేసింది. డిస్ ప్లే అలేఖ్య నెంబర్ కనిపించింది. వెంటనే రెస్పాండ్ అవుదామని అనుకున్నాను. కాని వెంటనే అమ్మ నాన్నకు ఇచ్చిన మాట గుర్తుకువచ్చింది. దాంతో నా కోరిక చచ్చిపోయింది. వెంటనే సెల్ ఆఫ్ చేసి కళ్ళుమూసుకున్నాను."

మరోసారి కాల్ చేసింది. అయన ఎత్తలేదు. అయిన విడిచిపెట్టలేదు అలేఖ్య. పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తునే ఉంది. నేను కూడా అదే మొండితనం ప్రదర్శించాను. దాదాపు అయిదు నిమిషాలపాటు ప్రయత్నించింది. తరువాత తనకు విసుగు కలిగిందేమో ఆపేసింది. నేను తేలికగా గాలిపీల్చుకున్నాను. వెంటనే నిద్రపోవటానికి ప్రయత్నించాను. కాని వీలుకాలేదు. అసహనంతో మంచం మీద అటు ఇటు కదిలాను. చివరకు ఎలాగైతే ఏం అర్ధరాత్రి దాటిన తరువాత నిద్రవచ్చింది. మరునాడు నిద్రలేచేసరికి కొంచం లేటయింది. ఆ రోజు కాలేజి ఉంది. ముఖ్యమైన పాఠం చెప్తానని అన్నాడు లెక్చరర్. ఆ విషయం గుర్తుకు వచ్చి గబగబ తయారయ్యాను.బట్టలు వేసుకుని టిఫిన్ తిన్నాను."


"అప్పుడే నాన్నగారు ఆఫీసుకు బయలుదేరుతున్నారు. నన్ను చూసి నవ్వారు. నేను కూడా జవాబుగా నవ్వాను. "కాలేజికి వెళుతున్నాను నాన్న"అన్నాను టిఫిన్ తింటు. "అలాగే జాగ్రర్తగా వెళ్ళు. ఆ అమ్మాయి పలకరిస్తే మాట్లాడు. మితంగా మాట్లాడు. పాఠాలు గురించి అడిగితే జవాబు ఇవ్వు. అంతేకాని పూర్తిగా నిర్లక్ష్యం చెయ్యకు"అన్నారు నాన్న. అలాగే అని తలూపాను." పుస్తకం టిఫిన్ బాక్స్ తీసుకుని కాలేజి చేరుకున్నాను. అదృష్టవశతు ఎవరికి మా విషయం తెలియలేదు. అందరు మాములుగానే పలకరించారు. నేను వెళ్ళి క్లాసులో కూర్చున్నాను"అని ఆగాడు రవి. ఏకాగ్రతతో వింటున్న ప్రభ "ఎందుకు ఆపావు. చెప్పు"అంది. "ఇప్పుడు కాదు. రేపు చెప్తాను. రేపు నా కథ ముగిసిపోతుంది."అని గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు రవి.

నిరుత్సాహంగా చూసింది ప్రభ. ఆమెకు కోపం వచ్చింది. మంచి సస్పెన్స్ లో కథ ఆపటం ఆమెకు నచ్చలేదు. అందుకే ఏదో చెప్పబోయింది. కాని రవి వినిపించుకోలేదు. ఏదో తట్టినట్టు గదిలోంచి వెళ్ళిపోయాడు. ప్రభ విస్సుగా చూసింది. ఒక్క నిమిషం పాటు బొమ్మలా ఉండిపోయింది. తరువాత లేచి గదిలోంచి బయటకు వచ్చింది. ఎదురుగా రవి గది కనిపించింది. గదిలో లైట్స్ వెలుగుతున్నాయి. మెల్లగా వెళ్ళి తలుపు దగ్గర నిల్చుంది. తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. మెల్లగా తెరిచి లోపలికి చూసింది.

రవి టేబుల్ ముందు కూర్చుని ఉన్నాడు. చేత్తో ఏదో పట్టుకుని తదేకంగా చూస్తున్నాడు. అది ఫోటో అని గ్రహించింది ప్రభ. బహుశా అది అతని తల్లి తండ్రి ఫోటో అయి ఉంటుంది. కొంపదీసి ఆలేఖ్య ఫోటో కాదు కదా. ఈ ఆలోచన రావటంతో ప్రభ అసహనంతో రగిలిపోయింది. చేదుమాత్ర మింగినట్టుగా అనిపించింది. ఫోటో చూస్తున్న రవి విపరీతంగా కదిలిపోయాడు. అతని కళ్ళనుంచి ఆగకుండ కన్నీళ్ళు వస్తున్నాయి. ఫోటోను గుండెలకు గట్టిగా అదుముకున్నాడు. కాని ఏడ్పు మాత్రం ఆపలేదు. కథ చెప్పటం వల్ల తన తల్లి తండ్రి గుర్తుకువచ్చినట్టున్నారు. అందుకే మద్యలో ఆగిపోయాడు. గదిలోకి వచ్చి ఏడుస్తున్నాడు.
జాలిగా చూసింది ప్రభ. దగ్గరకు వెళ్ళి ఓదార్చాలనిపించింది. కాని ధైర్యం చాలలేదు. అందుకే అడుగు ముందుకు వెయ్యలేకపోయింది. తలుపులు యధాప్రకారం వేసి తన గదిలోకి వచ్చేసింది.
జరిగింది అంతా ఒక సారి బైరీజు వేసుకుంది. రవి చేసినదాంట్లో తప్పులేదనిపించింది. ఇంతకాలం సుయోధనరావు చాల మంచివాడని అనుకుంది. అదే విషయాన్ని కుసుమ కూడా పదేపదే చెప్పింది. నిజం కాబోలు అనుకుంది. అందరిలాగే సుయోధనరావు చాల మంచి పోలీస్ ఆఫీసర్ అని అనుకుంది. కాని ఇప్పుడు అసలు నిజం తెలిసింది. అలాంటివ్యక్తిని చంపటం వల్ల రవి దోషి కావచ్చు. కాని సాటి మనిషిగా అతని చేసిన పని సరిఅయిందని తోస్తుంది.
(ఇంకా ఉంది )

చదవాల్సిన పుస్తకం

# లజ్జ




తస్లీమా నస్రీన్ పేరు తెలియని సాహిత్య పాఠకులుండరంటే ఆశ్చర్యం లేదు. ఆమె బంగ్లాదేశ్‌లో ఒక ముస్లిం కుటుంబంలో పుట్టి కూడా ముస్లిం మతఛాందసత్వాన్ని ఎలుగెత్తి ఖండించారు. మతతత్వం మైనారిటీల పాలిట ఎంత అమానుషంగా ప్రవర్తిస్తుందో 'లజ్జ' నవల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులకు జీవిత భద్రత లేదు, అడుగడుగునా అవమానాలకూ, అణచివేతలకూ బలి కావటంతప్ప! నోరెత్తి ఎదిరించే స్థితి కూడా లేదనీ 'లజ్జ' నవల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పటం ఆవిడ చేసిన తీవ్రమైన నేరంగా బంగ్లాదేశ్‌లో మతవాదులూ, ప్రభుత్వమూ భావించాయి ఆకాశంలో సగమైన మహిళలను పడగవిప్పిన మత ఛాందసం ఎంత క్రూరంగా నియంత్రిస్తుందో వెల్లడించి సవాలు చేశారు. చివరకు ముస్లిం మతవాదుల 'ఫత్వా' కు గురైనారు. ఆమె ప్రాణాలకు ముస్లిం ముల్లాలు 50వేల టాకాల వెలను కట్టారు. మరణశిక్ష విధించి, పాశ్చాత్య దేశాలలో (స్వీడన్) తలదాచుకోవాల్సిన దుస్థితిని ఆమెకు దాపురించేట్టు చేశారు. మత తత్వానికి తలొగ్గటం లాంటి లజ్జా కరమైన పనులకు పాల్పడకుండా ఆమె ఎదిరించి నిలిచారు.

1992 డిసెంబరు 6న అయోధ్యలోని బాబ్రీమసీదు కూల్చివేయబడిన వెంటనే బంగ్లాదేశ్‌లో చెలరేగిన ముస్లిం మతోన్మాదపు దాడులు అక్కడి మైనారిటీలయిన హిందువులపై ఎలా సాగినాయో, ఒక కుటుంబం ఉదాహరణగా లజ్జ నవలలో చిత్రించా రు. సురంజన్ దత్తా 33 సం॥ల నిరుద్యోగ యువకుడు. రాజకీయాలలో చురుకుగా పాల్గొనేవాడు. అతని తండ్రి సుధామయి, తాత సుకుమల్ దత్తా. వీరంతా మైమెన్‌సింగ్ పట్టణంలో సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగినవారు, తాము పుట్టిన నేలనూ గాలినీ, దేశాన్నీ మనుషుల్నీ విపరీతంగా ప్రేమించినవారు.

1947లో భారత పాకిస్తాన్ విభజన సమయంలో పెద్ద ఎత్తున మతకలహాలు చెలరేగిన తూర్పు బెంగాల్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) నుండి హిందు కుటుంబాలూ, పశ్చిమ బెంగాల్ అస్సాంల నుండి ముస్లిం కుటుంబాలు సరిహద్దులు దాటి కాందిశీకుల్లా వెళ్ళి పోయినా, సుకుమల్ దత్తా కుటుంబం మాత్రం తమ దేశాన్ని విడిచిపెట్టలేదు. తాము బెంగాలీలమనే అనుకున్నారు. ఇంకా ఎక్కువగా మానవులమనుకున్నారు. వారి కుటుంబం ఏనాడూ 'మతం'తో మమేకం కాలేదు. కమ్యూనిస్టు సిద్ధాంత ప్రభావం కొంత వున్నట్టుగా రేఖామాత్రంగా అర్థమయేట్టు రచయిత్రి చేశారు. నిజమైన లౌకిక జీవనం, మానవ సంబంధాలూ నెరిపారు. అయినా వీరక్కడ మైనారిటీ లయిన కారణంగా కొందరు ముస్లిం స్వార్థపరుల దౌర్జన్యానికి గురయ్యారు. దానితో ఉన్న ఆస్తిపాస్తులను అయినకాడికి అమ్మేసుకుని, పుట్టి పెరిగిన ఊరుని బలవంతంగా వదిలి, ఢాకా నగరానికి చేరుకోవాల్సి వస్తుంది.

1952లో తూర్పు పాకిస్తాన్‌లో ఉర్దూను జాతీయ భాషగా రుద్దే ప్రయత్నాలకు వ్యతిరేకంగా



బెంగాలీలు పెద్ద ఉద్యమం లేవదీశారు. అందులో సురంజన్ తండ్రి డాక్టర్ సుధామయి చురుకుగా పాల్గొన్నాడు.

1971లో యాహ్యాఖాన్ (పాకిస్తాన్) మిలిటరీ నియంతృత్వానికి వ్యతిరేకంగా తుపాకీ పుచ్చుకుని యుద్ధం చేయలేకపోయినా గట్టి ఉద్యమకారుడుగా నిలబడి పోరాడి చిత్ర హింసల పాలయ్యాడు. పాకిస్తానీ సైనికుల మతోన్మాద తత్వానికి ఘోరంగా అవమానింప బడ్డాడు. అయినా తన మాతృదేశాన్ని ఇంకా ప్రేమిస్తూనే ఉన్నాడు. స్వతంత్ర బంగ్లాదేశ్ స్థాపన జరిగినందుకు మిక్కిలి ఆనందపడ్డాడు.

ఆ యుద్ధంలో పాకిస్తాన్ మిలటరీకి మద్దతుగా నిలిచి ఘోర హత్యాచారాలుగావించిన "జామాతీ" మత నాయకులు అధికారులు ఓటమి పాలయి, పాకిస్తాన్ పారిపోయి, షేక్ ముజుబూర్ రెహమాన్ హత్యానంతరం (1975 ఆగస్టు 15) నిదానంగా బంగ్లాదేశ్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం మత నాయకత్వాలలో మిలటరీ, నిరంకుశాధికార వర్గం, ఒకనాడు దురాగతాలకు పాల్పడినవారు తగు మోతాదులో ప్రవేశం పొందారు. (ఈ ముఖ్యమైన అంశాన్ని తస్లీమా నస్రీన్ నవలలో పేర్కొన లేదు. ఆ నాటి నుండి తిరిగి మతోన్మాదం కొత్త బుసలు కొట్టటం మొదలయింది.

"భారత దేశంలో హిందూ మతోన్మాదం పెచ్చరిల్లే కొద్దీ బంగ్లాదేశ్‌లో ముస్లిం మతోన్మాదం ప్రజ్వరిల్లుతూ వచ్చింది". 1990లో జరిగిన మతోన్మాదపు దాడులకు సురంజన్ అతని కుటుంబ సభ్యులు, తమ ముస్లిం స్నేహితుల ఆదరణ పరిరక్షణలో క్షేమంగా ఉన్నారు. మతోన్మాదం పెరిగిన కొద్దీ డాక్టరు సుధామయి ప్రాక్టీసు క్షీణిస్తూ

వుంటుంది. ఆర్థికంగా కూడా యిబ్బందులు పడే పరిస్థితుల్లోకి జారిపోతూ వుంటారు. తండ్రికి గుండెపోటు. సురంజనేమో నిరుద్యోగి.

1992 డిసెంబరు 6న అయోధ్యలో బాబ్రిమసీదు విధ్వంసాన్ని అమెరికన్ టి.వి./ఎ.ఎన్.ఎన్ (ANN) ఛానెల్ ప్రపంచమంతా కళ్ళకు కట్టినట్టు ప్రసారం చేసింది. భారత దేశంలో ముస్లిం ద్వేషాన్ని పెంచి రాజకీయ లబ్దిపొందుదామని బి.జె.పి.వారూ, వారి మూలవిరాట్టులూ ఎలా ప్రయత్నించారో, అలాగే బాబ్రీ విధ్వంసానికీ బంగ్లా హిందువు లకు ఏ సంబంధం లేకపోయినా, బంగ్లాదేశ్‌లో ముస్లిం మతోన్మాదులు అక్కడి హిందువు లపై, దేవాలయాల పై తీవ్రమైన దాడులూ విధ్వంసాలూ సాగించారు. బంగ్లాదేశ్ లోని 12 కోట్ల జనాభాలో 2 నుండి 2.5 కోట్ల మంది హిందువులుంటారు. ఈ నవల ప్రకారం వాళ్ళు  ఇండియాకు పారిపోవటానికైనా ప్రయత్నించారు కానీ ఎదురు తిరిగి నిలబడటానికి ప్రయత్నించలేదు.

ఏనాడూ మతం పట్లా, దేవుని పట్లా విశ్వాసం చూపని డాక్టర్ సుధామయి (ఢాకా) ఇంటి పైన కూడా దాడి జరిపి, విధ్వంసం చేసి ఆయన కూతురు 'మాయ'ను ముస్లిం మతోన్మాదపు రౌడీలు ఎత్తుకు పోతారు. ఆ సమయంలో ఇంటిలో లేని సురంజన్ తన ముస్లీం స్నేహితుల ద్వారా మాయ కోసం ఎంతో వెతికి విఫలమవుతాడు. తను పుట్టి పెరిగిన దేశంలో తానొక కాందిశీకుడుగా బతకటానికి మానసికంగా వ్యతిరేకిస్తున్న సురం జన్, తన తండ్రి ద్వారా తను నమ్మిన, అలవరచుకున్న ఒక్కొక్క విశ్వాసాన్నే కోల్పోతూ వుంటాడు. తన ముస్లిం స్నేహితులను కూడా అనుమానిస్తాడు. ఒక్క మసీదునైనా ధ్వంసం చేయలేని తమ లాంటి వారి అశక్తతను అసహ్యించు కుంటాడు. హేతు, తర్క బద్ధ జ్ఞానాన్నంతా కోల్పోతాడు. ఒక ముస్లిం వేశ్యకు డబ్బులు ఎరచూపి, తన గదికి తెచ్చుకుని, అమానుషంగా హింసించి, రేప్ చేశానని మిధ్యా సంతృప్తిని పొందుతాడు. చివరికి తన మీదా, తను పుట్టిన దేశం మీద, అక్కడి మతతత్వ వాతావరణం మీదా ద్వేషం, అసహ్యం కలిగి, బంగ్లాదేశం వదిలి ఇండియా పారిపోవటానికి తండ్రిని కూడా ఒప్పిస్తాడు.

జీవిత అభద్రతలకు మతకారణం కూడా వచ్చి చేరగానే, అన్నిరకాల అభద్రతల మొత్తం మతద్వేషంగా, మతోన్మాదంగా రూపాంతరం చెందుతుంది. మత కలహాల చరిత్ర నిండా మనకు ఇదే లభ్యమవుతుంది.

ఈనాడు ఎంతో ఆత్మ విశ్వాసంతో, నిబద్ధతతో కలం పడితే గాని రచయితలు నిలబడలేని స్థితులు దాపురించాయి. తన అవగాహనా పరిధిలో తస్లీమా నస్రీన్ ఇస్లాం మత ఛాందసత్వానికి వ్యతిరేకంగా కలం పట్టారు. ఎన్నో దుష్ప్రచారాలనీ, ఆంక్షలనీ అణచివేతలనూ తట్టుకుని మతతత్వవాదులకు తలవంచకుండా దూర దేశాలకు ప్రవాసం పోవలసి వచ్చినా ధైర్యంగా నిలబడి రచనలు సాగిస్తున్నారు.

★★★★






**ఈదర శ్రీవిద్య**


## ఆణిముత్యాలు

హాస్య బ్రహ్మ జంధ్యాల మనకు కామెడీ చిత్రాలతోనే రచయితగా దర్శకుడిగా ఎక్కువ గుర్తుండిపోయారు కానీ ఆయన అందించిన మ్యూజికల్ క్లాసిక్స్ కూడా ఇప్పటికీ ఎవర్ గ్రీన్ అనుకునేలా ఉంటాయి. అందులో ఒకటి ఆనంద భైరవి. 1984. అప్పటికి జంధ్యాల గారు 8 సినిమాలు డైరెక్ట్ చేశారు. శ్రీవారికి ప్రేమలేఖ తెలుగు రాష్ట్రాన్ని ఊపేసిన సమయమది. తొమ్మిదోది మాత్రం కె విశ్వనాథ్ శంకరాభరణం తరహాలో శాశ్వతంగా నిలిచిపోయే ఆణిముత్యాన్ని తీయాలని జంధ్యాల సంకల్పించుకున్నారు. అప్పుడే కొండముదిశ్రీరామచంద్రమూర్తి రాసిన 'చిరుమువ్వల మరుసవ్వడి' సీరియల్ ని చదివారు. మనసుకు హత్తుకుంది. కళకు ఆడామగా అనే లింగ భేదం ఉండకూడదనే గొప్ప సందేశంతో రాసిన ఆ నవలకు తెరరూపం ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. ఈ చిత్రము "కూచిపూడి" నృత్యము గూర్చి అవగాహన కల్పిస్తుంది. ఇందులో ఒక అబ్బాయి కూచిపూడి నాట్యాన్ని నేర్చుకుంటూ దాన్ని ఇబ్బందిగా భావిస్తుంటాడు.

# చూడాల్సిన సినిమా

మరో వైపు అతని గురువు కూచిపూడి నృత్యాన్ని వారసత్వంగా ముందుకు తీసుకెళ్లడానికి తన శక్తిమేరకు కృషి చేస్తుంటాడు. చాలా రోజులు వెతికిన అనంతరం, ఒక అమ్మాయిని చేరదీసి కూచిపూడి విద్యను నేర్పి ఆయన కోరికను నెరవేర్చుకుంటారు. ఆ కాలములో ఆడవారు నృత్యము చేయరాదు, కనుక అయన కులము నుండి, ప్రార్ధనా మందిరముల నుండి బహిష్కరింపబడుతారు.

ఆనంద భైరవి 1984 వ సంవత్సరంలో విడుదల అయిన ఈ చిత్రం హాస్య బ్రహ్మ జంధ్యాల దర్శకత్వంలో రూపొందించబడింది. ఈ చిత్రంలో గిరీష్ కర్నాడ్, సుత్తివేలు, మాళవిక, రాజేష్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి రమేష్ నాయుడు సంగీత దర్శకత్వం వహించారు. ఇది కొండముది శ్రీరామచంద్రమూర్తి నవల చిరుమువ్వల మరుసవ్వడి ఆధారంగా నిర్మించబడింది. ఈ చిత్రానికి గానూ, జంధ్యాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ దర్శకునిగా బంగారు నందిని అందుకున్నాడు. ఈ చిత్రం 1984 లో ఎన్నో ప్రశంసలు అందుకున్నది.




ప్రధాన పాత్రకు గిరీష్ కర్నాడ్ ను ఎంపిక చేసుకున్నారు. కేవలం ఈ క్యారెక్టర్ కోసమే ఆయన కష్టపడి నాట్యం నేర్చుకోవడం సంచలనం. యువజంటలో అబ్బాయిగా రాజేష్(ఇప్పటి హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అన్నయ్య), అమ్మాయిగా బెంగాల్ కు చెందిన మాళవిక సర్కార్ ని తీసుకొచ్చారు. కథానుసారం కూచిపూడి రాకపోయినా స్వతహాగా కథక్ కళాకారిణి కావడంతో జంధ్యాల గారు వేరే ఆలోచన చేయలేదు. షూటింగ్ లో అధిక శాతం రాజమండ్రిలో చిత్రీకరించారు. రమేష్ నాయుడు స్వరపరిచిన తొమ్మిది పాటలు విని పరవశించని వారు లేరు. ఎస్ గోపాల్ రెడ్డి ఛాయాగ్రహణం బాధ్యతలు తీసుకున్నారు. షూట్ లో ఎన్నో ఆటంకాలు. అన్నీ తట్టుకుని చేశారు కళ్యాణి ఆర్ట్ ఫిలింస్ అధినేతలు. సీనియర్ నటీమణి కాంచనగారికి ఇది ఆఖరి సినిమా. విడుదలకు ముందే



ఆనందభైరవికి ఉత్తమ దర్శకుడు, ఉత్తమ చిత్రం, ఉత్తమ సినిమాటోగ్రాఫర్, రెండవ ఉత్తమ కథా రచయిత విభాగాల్లో నంది అవార్డులు వచ్చాయి. దెబ్బకు థియేటర్లు దొరికేశాయి. 1984 ఏప్రిల్ 19 విడుదలైన ఆనందభైరవి జనాన్ని సంగీత నాట్య సాగరంలో ఓలలాడించింది.

★★★★

## ఆ పాత మధురాలు..



దీకొండ చంద్రకళ

# తీయతీయని తేనెల మాటలతో

ఇంతకుముందు చెప్పుకున్నట్లుగా ఆనాటి పాటల్లో తప్పక ఏదో ఒక సందేశం-సామాజిక ప్రయోజనం కలిగించేలా విద్య గురించో,కుటుంబ అనుబంధాల గురించో,అసమానతల గురించో;జీవితసత్యాల గురించో;సైనికులు,రైతులు ,వైద్యులు మొదలైనవారి గొప్పతనం గురించో... అంతర్లీనంగానో,బాహాటంగానో ఇమిడివుండేది.

అలాంటిదే

తీయతీయని తేనెల మాటలతో
తీస్తారు సుమా గోతులు-నమ్మవద్దు
తెలియని చీకటి తొలగించి
వెలుగిచ్చేది చదువే సుమా-
మానవద్దు


అనే పల్లవితో మొదలయ్యే ఈ పాట ఖైదీ కన్నయ్య చిత్రం లోనిది.ఒక ఉపాధ్యాయిని చదువు విలువ గురించి,జీవన పోరాటం గురించి విద్యార్థికి వివరిస్తూ సాగే ఈ ప్రభోదాత్మక గీతం మొదటి చరణంలోని

దొంగల చేతికి దొరకనిది
దానము చేసిన తరగనిది(2)
పదుగురిలోన పరువును పెంచి
పేరు తెచ్చే పెన్నిధది!

అనే వరుసలు విద్య నిగూఢ గుప్తమగు విత్తము అనే పద్యాన్ని సరళ పదములతో అందరికీ అర్థమయ్యేలా వివరిస్తుంది.

పాఠాలన్నీ చదివేస్తాను-ఫస్టుగ నేను పాసవుతా అని విద్యార్థి సమాధనమివ్వగానే శభాష్ అంటూ మెచ్చుకుంటుంది ఉపాధ్యాయిని పాత్రలో నటి రాజసులోచన.

రెండవ చరణంలో--
అల్లరి చేయుట చెల్లనిది
ఎల్లపుడాడుట కూడనిది(2)
ఏడువరాదు ఏమరరాదు




ధీరుని వలె నువ్ నిలవాలి

అంటూ అల్లరి చేయక,బుద్ధిగా చదువుపై మనసు లగ్నం చేయమంటూ-బ్రతుకులో ఎదురయ్యే కష్టనష్టాలను వీరునిలా ధైర్యంగా ఎదుర్కోమని వెన్ను తడతారు.గురువు యొక్క కర్తవ్యాన్ని నెరవేరుస్తారు.

# వినాల్సిన పాట

అదరను నేను–బెదరను నేను–
ఏదెదురైనా ఎదిరిస్తా అంటూ
జవాబిస్తాడు విద్యార్థి,గురువు
కలిగించిన స్ఫూర్తితో.
శభాష్ అంటూ ప్రశంసతో
ప్రోత్సాహాన్ని అందిస్తారు గురువు.


బ్రతుకను బాటను కడదాకా
నడచియె పోవలె ఒంటరిగా(2)
ఇడుములు రానీ పిడుగులు పడనీ నీ
అడుగుల వడి తడబడునా

అని చివరి చరణంగా జీవన
పోరాట స్ఫూర్తిని,ఆత్మస్థైర్యాన్ని
రగిలిస్తారు కవి–నాలుగే నాలుగు
చిన్ని సులభతర పాదాల్లో
విద్యార్థులంతా అవగాహన
చేసుకునేలా,ఆచరించేలా!

నేటి ఆధునిక యుగానికి సైతం
సరిపోయేలా ఆచరణీయ నిత్యజీవిత
సూత్రాలను పొదవుకున్న ఈ
ఆపాతమధురగేయాన్ని మధురంగా
ఆలపించారు మధుర గాయని
సుశీల.
పిడుగులు పడినా B జడువను నేను
వడివడిగానే అడుగేస్తా అని దీటుగా
సమాధానమిస్తాడు విద్యార్థి
బాలనటుడు.

ఖైదీ నెం.911 హిందీ చిత్రానికి
రీమేక్ ఈ ఖైదీ కన్నయ్య
చిత్రం(1962).ముందుగా
తమిళంలో రీమేక్ చేసారు.

జి.కృష్ణమూర్తి గారు అందించిన
సాహిత్యానికి రాజన్–నాగేంద్రలు
సంగీతాన్ని సమకూర్చారు.
ఇందులోని ఈ నిజం తెలుసుకో అనే




పాట కూడా ప్రభోదాత్మకమే.

లతామంగేష్కర్ గారు పాడిన
మీఠీ మీఠీ బాతే ను కూడా
ఆలకించండి.

★★★

# చాయ్+ సమోసా ఉచితం ?

## క్రాస్ రోడ్ కబుర్లు

**జి .అనుదీప్**

కూటి కోసం కోటి తిప్పలు అనేది పాత సామెత ,సినిమా ప్రమోషన్ కోసం సవాలక్ష పాట్లు అనేది కొత్త సామెత , ఒకప్పుడు సినిమా ప్రచారం అంటే, ఏరిక్షా లోనో, ఆటోలోనో కూర్చుని, "నేడే చూడండి" అంటూ గొంతు చించుకుంటూ కర పత్రాలు పంచే . వాళ్ళు కాని కాలం మారింది, సినిమా నిర్మాణం ఖర్చు పెరగటంతో టిక్కెట్టు రేట్లు కూడా పెరిగాయి. అంత రేట్లు పెట్టి సినిమా చూడటానికి జనం జంకు తున్నారు. సినిమా అద్భుతంగా వుందంటే తప్ప ఎవ్వరూ సినిమా హాలు మొఖం చూడటంలేదు. ప్రేక్షకుల్ని సినిమా హాలుకు రప్పించటానికి, సినిమా వాళ్ళు నానా తిప్పలు పడుతున్నారు.' ఈ మధ్య బాలివుడ్ లో ఓ ప్రముఖ హీరో చిత్రాన్ని చూడటానికి జనం ముఖం చాటేస్తే, నిర్మాతకు ఏమి చెయ్యాలో దిక్కుతోచక , సినిమా కొచ్చిన వాళ్ళకు "ఓ ఛాయ్ + రెండ ఏమోసాలు ఉచితం "అని ప్రకటించారు. అయినా కూడా జనం రాక పోవటంతో, ఒక టిక్కట్టు కొంటె ఇంకో టిక్కెట్టు ఫ్రీగా ఇవ్వటమే కాక, ఆ సినిమా ప్రమోషన్లో భాగంగా టోపీలు , పెన్నులు, బ్యాగులు ఇవ్వసాగారు.




అయినా కూడా కలక్షన్లు అంతంత మాత్రంగానే వుండటంతో నిర్మాతలకు ఏమి చెయ్యాలో పాలు పోక తలలు పట్టు కుంటు న్నారు. కొస మెరు పు. ఏమిటంటే ఈ సినిమా మాతృక వేరే భాషలో సూపర్ హిట్టవటం.

కొన్ని సినిమాల ప్రమోషన్లు చూస్తూవుంటే నవ్వు రాకుండా మానదు. ఎందుకంటే ఇటువంటి జిమ్మిక్కులు మన తెలుగు సినిమా వాళ్ళ ఎప్పుడే వాడేసారు.

నా కింకా బాగా గుర్తు, ఓ భక్తి రసాత్మక చిత్రనికి ప్రేక్షకులు కరువయ్యారని. లక్కీడిప్ ద్వారా కొంత మందిని తీర్ధ యాత్రలకు తీసుకెళతామని చెప్పటంతో జనం ఎగ బడ్డారు. కొసమెరుపు ఏమిటంటే యాత్రులకు తీసు వెళ్ళటానికి బస్సు మాత్రమే ఉచితం, భోజనం వసతి ఖర్చులు మీరే భరించాలి అని చావు కబురు చల్లగా చెప్పటంతో అంతా వెనక్కి తగ్గారు. ఇక అమ్మవారి పేరుతో వచ్చే అనేక సినిమాల




ప్రమోషన్ల దారేవేరు.సినిమా మధ్యల్లో ఒకరిద్దరు ఆడవాళ్ళరు పూనకాలు వచ్చేవి. ఆ అమ్మ వారే పూనారని, పూనకం వచ్చిన వాళ్ళకు అభిషేకాలు, హారతులు ఇచ్చేవాళ్ళు. ఈ విషయం తెలిసిన భక్త జనులు సినిమా హాలు ముందు క్యూ కట్టె వాళ్ళు. సినిమా చూస్తున్నంత సేపు ఎవరికి పూనకం వస్తుందా చూద్దామని కళ్ళు పత్తి కాయల్లో చూస్తూ కూర్చునే వాళ్ళు.

నాగదేవతకు సంబంధించిన చిత్రాలు సినిమా హాల్లో ఆడుతున్నంత కాలం, హాలు బయట పెద్దపెద్ద పుట్టలు వెలిసేవి. వాటిలో నిజంగా పాములున్నాయి అనుకుని, పుట్టలో పాలుపోసి, పసుపు కుంకమలు రాసి పూజలు చేసేవాళ్ళు. ఆపెట్టుడు పుట్ట లో పాములు లేవని తెలిస్తే భక్తజనం పూజలు చేస్తున్నారని అక్కడి వాళ్లందరికి తెలుసు. ఒక వేళ నిజంగా అందులో పామే గనుక వుంటే ఆ ఛాయలకు కూడా ఎవరూ రారు. ఒక రిద్దరు సినిమా హాలు వాళ్ళు, సినిమా ఆడుతున్నప్పుడు హాల్ లోకి పాముని వదిలే వాళ్ళు. పాముల్ని చూసి నిజంగానే నాగ దేవత ఆ "సినిమా హాల్లోకి వచ్చిందని పిచ్చి జనం నమ్మే వాళ్ళు . 'పున్నమి నాగు'అనే ఓ సినిమా అడుతున్నంత కాలం సినిమా హాళ్ళలోకి పాములు తెగ వచ్చేవని జనం చెప్పుకునే వాళ్ళు . అందులో నిజం ఎంతో అ దేవుడికి తెలియాలి.

ఆ మధ్య ఓ సినిమా ప్రమోషన్ల కోసం సినిమా ప్రచార హోర్డింగ్ లపై, ఓ డమ్మీ శవాన్ని వెలాడదీయటం

ద్వారా ప్రమోషన్ను తారా స్థాయికి తీసుకెళ్ళరు. శవం కను చూపు మేరలో రక్తం కారడం కనిపించటంతో భయపడిన ప్రేక్షకులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. మా చిన్నతనంలో పాపం పసివాడు " అని ఓ సినిమా వచ్చింది. ఆసినిమాలో ఓ పసివాడు ప్రయాణిస్తున్న విమానం ఓ చిత్రం ప్రచారానికి 'బుజ్జి' అనే 'కృత్రిమ మేధలో కూడిన ఓ కారు ను ప్రత్యేకంగా తయారు చేయించి, సినిమా హాళ్ళ దగ్గర ప్రదర్శించటం మొదలు పెట్టారు. 'సుల్తాన్' అనే సినిమా ప్రచారంలో భాగంగా రైల్వే స్టేషన్లు. బస్స్టేషన్లు,మాల్స్ లో పంచింగ్ బ్యాగాలు వేలాడ దీసి, దానిమీద 'మిమ్మల్ని మీరే లో వుండేలా ఏర్పాటు చేసారు. ఆ సినిమ ఎంత పెద్ద పెద్ద హిట్ట యిందో అందరికీ తెలిసిందే.అదే హాలివుడ్ లో అయితే ప్రచారాలు కాస్త విభిననంగా వుంటాయి. స్పైడర మాన్, బ్యాటమాన్, జెమ్స్ బాండ్ వంటి చిత్రాల్ విడుదలకు ముందు వాటికి సంబంధించిన వీడియోగేములు , కార్టున్ ఫిల్ములు



కూలిపోయి ఎడారిలో చిక్కుకు పోతాడు. ఆ సినిమా ప్రచారం కోసం, అదే విమానంలో రాష్ట్రం మొత్తం తిరిగి, ఆ పసివాడి చేత సినిమా కర పత్రాలు పంపిణీ చేయించారు.

ఈ మధ్య కాలంలో వందల కోట్లు బెట్టి సినిమాలు తీయటం, ఆ డబ్బు ఎలా వెనక్కు రాబట్టు కోవాలా అని నానాపాట్లు పడటం అలవాటుగా మారిపోయింది నిర్మాతలకు. ఇటీవల వందల కోట్లు పెట్టి తీసిన గెలవండి' అని రాసి, పంచింగ్ బ్యాగ్ తో కుస్తీ పట్టి, మీ లోవున్న వత్తిడిని తగ్గించుకోండని ప్రచారం చేసారు,

అమీర్ ఖాన్ గజని సినిమా అందరు చూసే ఉంటారు.అందులో అమీర్ ఖాన్ హెయిర్ స్టైల్ గుర్తుండే ఉంటుంది . ఆహేయిర్ స్టైల్ వింతగా వుంటుంది. .. సినిమా విడుదలకు ముందు, చాలా మాల్స్ తో , రెస్టా రెంట్లతో ఒప్పందం చేసుకుని వాటిల్లో పని చేసే వాళ్ళేందరూ అదే హెయిర్ స్టైల్ విడుదల చెయ్యడం పరిపాటి. ఇప్పుడు మన టాలివుడ్ లో కుడా ఇటువంటి పోకడలు మొదల వుతున్నాయి.

★★★

కథ

# మూగ ప్రేమ .....

యు .మధుపాత్ర శైలజ

పాతతరం నుండి అనువంశికంగా వస్తున్నకొద్దోగొప్పో పొలాలమీద ఆధారపడి, గొర్రెలనో, మేకలనో, స్థోమతను బట్టి రెండు ఆవులనో, గేదెలనో పెంచుకుంటున్న కుటుంబాలలో సీతారామయ్యగారిది ముఖ్యంగా వ్యవసాయమే 'ఆలంబన'గా ఉన్న రైతుకుటుంబం. వారసత్వంగా తాతతండ్రులనుండి వచ్చిన పదెకరాల భూమిని ఇరవై ఎకరాల దాకా పెంచి, భార్య దమయంతి, ఇద్దరాడపిల్లలతో అంతా సంతృప్తిగా, సంతోషంగా జీవితాన్ని గడిపేస్తున్నాడు. తాను పెరగటమే కాక తన దగ్గర పనిచేసే పాలేళ్ళ కుటుంబాల యోగక్షేమాలను కూడా తనవిగానే చూసుకుంటూ, ఊరిలో అందరితో "సీతారామయ్య ఉదార స్వభావం కలిగిన మంచివాడు" అనిపించుకుంటున్నాడు.

కూతుళ్ళను ఊళ్ళోనే ఉన్న హైస్కూలులో పదోతరగతివరకు చదివించి తనకు దగ్గరి గ్రామాలలోనే సంబంధాలను వెతికి కాస్త పొలంకలిగిన అల్లుళ్ళను తెచ్చుకున్నాడు. ఇద్దరికి సమానంగా వరకట్నంగా అయిదెకరాల పొలం, రెండు పాడిగేదెలను, ఓఆవును ఇచ్చి కూతుళ్ళను కాపురానికి పంపాడు.

తనకు మిగిలిన పదెకరాల భూమిని, రెండు పాడి గేదెలను చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. రెండు గేదెలకు "గంగ, మంగ" అన్న పేర్లను పెట్టుకున్నాడు. కాపురానికి వెళ్ళిన కూతుళ్ళను ఆ మూగజీవాలలో చూసుకుంటూ ఆనంద పడిపోతుంటారాయన.

ఈమధ్య ఓపికతగ్గి పొలాన్ని కౌలుకిచ్చాడు. పాలేరు వీరయ్యను మాత్రం పనిలో నుండి తీసేయక, గేదెలను శుభ్రం చేసి, పాలు పితికి, పొలానికి మేపటానికి తీసుకెడటానికి ఉపయోగించుకుంటున్నాడు.

ఓ రోజు వీరయ్యను పిలిచి పెద్దమ్మాయిని పురిటికి తీసుకురావాలి, బండిని సిద్ధం చేయమని పురమాయించాడు. అయిదారు కోసుల దూరంలో ఉన్న అమ్మాయి వాళ్ళఊరికి బయలుదేరుతూ, వీరయ్యకు గేదెలను బాగా చూసుకోమని, అన్ని జాగ్రత్తలను భార్యకు కూడా చెప్పి వెళ్ళాడు సీతారామయ్య.

యధాప్రకారం రెండు గేదెలకు పాలు తీసాక, వాటిని మేపటానికని పొలందిశగా బయలుదేరి వెళ్ళాడు వీరయ్య. మధ్యాహ్నం ఒంటిగంట కావటంతో ఎండ బాగా ఉంది. ఓ చెట్టునీడను చూసుకుని తెచ్చుకున్న అన్నం తిని అలాగే నిద్రపోయాడు వీరయ్య. గంటయ్యిందో, రెండుగంటలయ్యిందో ఒంటిపై స్పృహలేదు వీరయ్యకు.

"ఒరేయ్! వీరిగా! నీ గేదెలను బందెలదొడ్డిలో కట్టేశారురా. వెళ్ళి విడిపించుకోకుంటే ఉన్నపని ఊడుతుంది" అని మరో రైతు పాలేరు సాంబయ్య అరుపుతో ఈలోకంలోకి వచ్చాడు వీరయ్య.

ఒక్క ఉదుటున లేచి బందెల దొడ్డి వైపు పరిగెత్తుకెళ్ళాడు వీరయ్య. సాంబయ్య చెప్పింది నిజమే! తన రెండు గేదెలను బంధించేశాడు బందెలదొడ్డి వెంకన్న.

"ఏరా! వేరే వాళ్ళ పొలాల్లోకి నీ గేదెలు వెళ్ళి పాడుచేస్తూంటే గమనించకుండా హాయిగా నిద్రపోతున్నావా? ఇప్పుడు మత్తు దిగిందా? 'ఫైను' కట్టి నీ గేదెలను తీసుకెళ్ళు" అని వెంకన్న గదమాయించాడు.

"ఎంత కట్టాలి?" అని దీనంగా అడిగాడు వీరయ్య. "మొత్తం వంద రూపాయిలను కట్టు" అంటూ హుకుం జారీచేశాడు వెంకన్న.

"అయ్యా! దయతలచండి. ఇదే మొదటిసారి. తప్పు జరిగింది. ఊదయానే నిద్రలేవటంతో కునుకుపట్టేసింది. పేదోడిని. బాబ్బాబూ.." అంటు బ్రతిమాలుకున్నాడు వీరయ్య. అతను బ్రతిమాలే కొద్దీ కొండెక్కి కూర్చున్నాడు వెంకన్న.

"సరే ఇక చేసేదేముంది. అమ్మగార్ని బ్రతిమాలుకుని డబ్బులడిగి తెస్తాను. మా 'గంగామంగ'లను జాగ్రత్తగా చూస్తూండు" అని వెంకన్నకు చెప్పి యజమాని ఇంటికి పరిగెత్తాడు వీరయ్య.

అక్కడ బందులదొడ్లో వెంకన్న గేదెలకు కాస్త ఎండు గడ్డిని వేశాడు. అతను వేసిన గడ్డిని అసలు వాసన కూడా చూడలేదు గంగామంగలు.

"ఏం? తినరా? హాయిగా పక్కవాళ్ళ చేలలో తెగపడి మేసే మీకు ఈ ఎండుగడ్డి ఎందుకు నచ్చుతుంది? అందుకే మిమ్మల్ని ఇక్కడ కట్టి పడేసింది" అంటూ తన కోపాన్ని వాటిపై చూపిస్తూ అరుస్తున్నాడు వెంకన్న.

అతనికి పశువుల భాష వచ్చుంటే, వాటి కళ్ళలో కలిగిన భావాలను చదవగలిగేవాడు వెంకన్న. "గంగా! మనం మన యజమాని ఇంటికి తొందరగా వెళ్ళి పోవాలి అంటే నేను చెప్పినట్లుగా విను. ఇద్దరం బయట పడదాం" అంది మంగ.

"ఏం చేద్దామని? మనకు కాళ్ళు, కొమ్ములు తప్ప మరే ఆయుధాలు లేవుకదా, ఈ కట్లను విడిపించుకోవటానికి? అయినా మనదే తప్పుకదా! పక్క రైతు పొలంలోకి వెళ్ళి మేతమేసాం. జరిగిన తప్పుకు శిక్ష తప్పదుకదా" అంది గంగ.

మంగకు రోషమొచ్చి, "ఏం? మన యజమాని పొలంలోకూడా అప్పుడప్పుడు ఇతరుల గేదెలు పడి గడ్డితోపాటు వరికంకులను మేయటంలేదా? వీరయ్య వాటిని బయటకు మళ్ళించాడేగాని ఇలా బందులదొడ్లో బంధించలేదుకదా? వాటికో న్యాయం? మనకో న్యాయమూనా?" అంది.

“ఇతరులు చేసే తప్పునే మనం కూడా చేసి పైగా న్యాయాన్యాయాలగురించి మాట్లాడకూడదు కదా? అదలా వుంచితే నీ ఆలోచనేమిటో చెప్పు? ఏంచేద్దామని?” అంది గంగ.

“మన వీరయ్య డబ్బు తెచ్చేలోగా మనమే ఏదో ఒకటి చేసి ఇక్కడి నుండి పారిపోవాలి. ముందు ద్వారం కాకుండా, అదిగో ఆ వెనుక ద్వారం వైపు చూడు. మనం దానిని మన కొమ్ములతో పడద్రోసి తప్పించుకోవచ్చు” అంది మంగ.

“అమ్మో! అది బెడిసికొడితే రక్తం కారేటట్లుగా ఈ వెంకన్న మనల్ని కొట్టేస్తాడు” అంది గంగ.

“మనల్ని బంధించి, బయట అరుగు మీద కర్ర పక్కన పెట్టి హాయిగా పడుకున్నాడు వెంకన్న. ఇదే మంచి సమయం.

‘అనుమానంతో కాదు ఆత్మ విశ్వాసంతో’ పని చెయ్యి” అంటూ కసిరింది మంగ. తన బలంతో కట్టు తాళ్ళను తన బలంతో తెంచి పడేసి విజయ హాసంతో గంగ వైపు చూసింది.

గంగ కూడా బలంగా తలను ఊపుతూ, కాళ్ళతో నిగడతన్నుతూ, బంధనాన్ని తెంపేసుకుంది. రెండూ మెల్లిగా వెనుక ద్వారంవైపు వచ్చి తమ కొమ్ములతో ఆ బలహీనమైన తలుపును పడదోసి బయటకు వచ్చి, పరుగుపరుగున తమ యజమాని ఇంటిలోని గొడ్లశాలకు వచ్చి ‘అంబా’ అని అరిచాయి.

ఇంట్లో పడుకున్న యజమానురాలిని లేపటానికి మొహమాటపడి వీధి అరుగుపై కూర్చున్న వీరయ్య, గంగామంగలను చూసి సంతోషంగా “ఇది కలా? నిజమా?” అనుకుంటూ వాటి వెన్ను నిమురుతూ, కొమ్ములకయిన గాయాలను నీళ్ళతో కడిగి, కుడితిని తయారుచేయటానికి పూనుకున్నాడు.

“ఏరా వీరయ్యా! ఎంతసేపయ్యింది వచ్చి. నాకు బాగా నిద్ర పట్టేసిందిరా! ఇదిగో వీటి అరుపులకు మెలకువ వచ్చింది” అంటూ బయటకు వచ్చింది దమయంతి.

“అమ్మగారూ! మరండీ! అసలేమయ్యిందంటే” అంటూ చెప్పాలా, వద్దా అని నసుగుతూ ఆగాడు వీరయ్య.

“ఈరోజు ఎక్కడికైనా పనిమీద వెళ్ళాలా ఏమిటి? గంగామంగలను తొందరగా ఇంటికి తోలుకొచ్చావు” అంటూ అడిగిందామె.

అప్పుడే వచ్చిన సీతారామయ్యగారు బండిలో నుండి దిగి, “వీరయ్యా ఓ స్టూలు తీసుకురారా. అమ్మాయి దిగుతుంది” అంటూ పిలిచాడు.

భర్త గొంతు విన్న దమయంతి, “ఓ రంగమ్మా! ఎర్రనీళ్ళు తీసుకురా! ఐదూళ్ళ మధ్యనుండి వచ్చింది నా తల్లి. ఎంత దిష్టి తగిలిందో ఏమిటో? దిష్టితీయాలి” అంటూ దొడ్లో బియ్యం బాగు చేస్తున్న రంగమ్మను కంగారుగా పిలిచింది. తండ్రి సాయంతో మెల్లిగా బండి దిగిన కూతురు వాసంతికి దిష్టితీసి లోపలికి తీసుకెళ్ళింది దమయంతి. సామాన్లు తీసుకుని వీరయ్య కదిలాడు.

లోపలికి రాబోతున్న సీతారామయ్యను “ఏమండీ! మీ గేదెలను బందుల దొడ్లో బంధించాను. డబ్బు తెస్తానన్న మీ వీరయ్య ఇంతవరకు రాకపోవటంతో నేనే వచ్చాను డబ్బు కోసం” అంటూ చెయ్యి చా చి అడ్డుతగిలాడు వెంకన్న.

“అయ్యగారూ! అన్నీ అబద్ధాలు. మన గంగామంగలివిగో మన దొడ్లోనే ఉన్నాయి. వెంకన్న డబ్బుకోసం ఇలా అభాండాలేస్తున్నాడు” అన్నాడు వీరయ్య.

ఓ సారి గొడ్లసావిట్లోకి తొంగి చూసిన వెంకన్న తెల్లబోయాడు. “ఏమిటీ మాయ? మధ్యాహ్నం నేనే మీ పక్క పొలం వారి ఫిర్యాదుపై వారిపొలంలో మేస్తున్న మీ గేదెలను బందుల దొడ్లో కట్టేసాను. మరి ఎలా తప్పించుకువచ్చాయో?” అన్నాడు వెంకన్న.

సీతారామయ్యగారికి జరిగింది అర్థమయ్యింది. “వీరయ్యా! తప్పు జరిగినప్పుడు నిజాయితీగా ఒప్పుకోవాలిగానీ ఇలా బుకాయించ కూడదు” అని తన పాలేరుని కేకలేసి, “పద వెంకన్నా! మీ బందులదొడ్డి ఎంత గట్టిదో చూద్దాం” అంటూ వెనుదిరిగాడు సీతారామయ్య.

వెంకన్నకు కూడా దొడ్డి

వెనుకగేటు ఓటిదనం గుర్తుకొచ్చి, "అయ్యా, వెనుక ద్వారాన్ని బాగుచేయించకపోవటం నాదే తప్పండి" అన్నాడు ఉక్రోషంగా.

"చూడు వెంకన్నా! ఈ డబ్బు తీసుకుని ముందు ఆ వెనుక ద్వారాన్ని బాగుచేయించు" అంటూ సావిడిలోకి వెళ్ళి గంగామంగలను ప్రేమతో మందలించారు. కొమ్ములకైన గాయాలకు మందు రాసారు. సీతారామయ్యగారి చేతి స్పర్శకు గంగామంగల తనువులు పులకరించాయి. అలా గంగామంగల ప్రతాపం వీరయ్య, వెంకన్నల ద్వార తెలిసిన వూరివారంతా నవ్వుకున్నారు.

ఆ రోజు వాసంతి పురిటి నొప్పులు పడుతూంటే మంత్రసానిని పిలిచారు సీతారామయ్య. రోజంతా అమ్మాయి పడుతున్న బాధను చూసిన ఆయనకు భయంవేసి, దమయంతి కాదన్నా పట్నం తీసుకెడదామని, మునసబ్‌గారిని అడిగి వాళ్ళ కారులో పెద్దాసుపత్రికి తీసుకెళ్ళారు.

"బిడ్డ అడ్డంతిరిగింది. సమయానికి తీసుకొచ్చారు లేకపోతే తల్లి ప్రాణానికి ప్రమాదమొచ్చేది" అని ఆపరేషన్ చేసింది లేడీడాక్టర్.

"చక్కని విశాలమైన కళ్ళతో, తెల్లని మేనిఛాయతో మహాలక్ష్మి పుట్టింది" అని సంబరపడిపోతున్నారు సీతారామయ్యగారు.

"పాప అందాల బొమ్మలా ఉంది" అని మురిసిపోతూ చెపుతున్న తల్లి దమయంతి మాటలకు దిగులుగా నవ్వింది అప్పుడే స్పృహలోకి వచ్చిన వాసంతి. ఆ నవ్వులో జీవం లేదు.

సీతారామయ్యగారికి కూతురి మనోభావమర్ధమయ్యింది. అల్లుడిగారికి, వియ్యంకులకు కబురు పెట్టాడు. వారంరోజులు హాస్పటల్‌లోనే ఉన్నా అటువైపు వారెవరూ చూడటానికి కూడా రాలేదు.

పట్నంలో ఉన్న వారం రోజులు సీతారామయ్యకు కంటినిండా కునుకులేదు. కూతురి పురిటిబాధ ఒకవైపైతే, రేపోమాపో ఈనటానికి సిద్ధంగా ఉన్న "మంగ" గురించి ఆయన ఆందోళన మరియొకవైపయ్యింది. "వీరయ్య నెగ్గుకు రాగలడో? లేదో? తెలియని పరిస్థితి" ఆయనది.

వాసంతిని అత్తగారు వారసునితో రావాలని దీవించి పంపించారు. అంతకు ముందు జరిగిన సంభాషణలలో ఆమె "వారసుడు పుట్టకపోతే నువ్వు ఇబ్బందులనెదుర్కోవాల్సి ఉంటుంది" అని పదేపదే చెప్పటం వాసంతికి ఇంకా గుర్తుంది.

"ఆడపిల్ల పుట్టి వారమయినా కనీసం భర్త కూడా పాపాయిని చూడటానికి రాలేదు" అని తల్లితో తన బాధను చెప్పుకుని ఏడుస్తోంది వాసంతి.

"అసలే బాలింతరాలివి ఇలా బాధపడితే ఎలా చెప్పు? మనం ఇంటికెళ్ళాక నాన్న ఓసారి మీఊరెళ్ళి వాళ్ళకు నచ్చచెపుతారు. అల్లుడు చదువుకున్న వాడేగా అర్థంచేసుకుంటాడు. నువ్వు బాధ పడకు" అని కూతురిని ఓదార్చింది దమయంతి.

సీతారామయ్యగారు ఇంటికొచ్చిన రెండురోజులకు మంగ పెయ్యదూడను ఈనింది. గంగ, మంగలు దూడని చూసి మురిసిపోయాయి. గంగకు వయస్సు పెరగటంతో ఒట్టిపోయింది. అందుకే కాబోలు మంగతో పాటు తానుకూడా అప్పుడేపుట్టిన లేగదూడను ప్రేమతో నాకుతోంది.

ఆ దృశ్యాన్ని చూసిన సీతారామయ్యకు ఓ కంట పన్నీరు, భార్య చెప్పిన మాటలతో మరో కంట కన్నీరు ఒకేసారి వచ్చాయి. "తల్లిగా బుజ్జిదూడను చూసుకు మురిసిపోయే మంగ ఆనందం, తన కూతురికి కూడా కలగాలంటే, వాసంతి అత్తగారికి, అల్లునికి నచ్చ చెప్పే బాధ్యత తనదే" అని గుర్తెరిగిన ఆయన అల్లుడి దగ్గరకు బయలుదేరివెళ్ళాడు.

"ఆడపిల్ల పుడితే తప్పేమిటి? వాసంతి ఆడపిల్లగా పుట్టబట్టే కదా నీకు ఇల్లాలై మీఇంటిని వెలుగులతో నింపిన మహాలక్ష్మయ్యింది. జీవితమంటే వ్యాపారం కాదు. ఆఇంటిదగ్గర మంగకు కూడా పెయ్యదూడ పుట్టింది. నోరులేని ఆజీవి పొందే ఆనందం చెప్పనలవి కాదు. చదువుకున్న మీరే ఇలా ఆలోచిస్తే ఎలా? మీ తల్లితండ్రులకు నచ్చచెప్పి బారసాలకు రండి.

మీ కూతురికి మంచి మనసుతో నామకరణం చేసుకోండి" అని అల్లుని మనసుకు నచ్చే విధంగా చెప్పారు.

అతనికి తన పొరపాటు తెలిసింది. మామగారికి క్షమాపణలు చెప్పి, "తప్పక వచ్చి పాపను చూస్తాను" అని చెప్పాడు. ఇక అల్లుడే మిగిలిన విషయాలను చూసుకుంటాడనే నమ్మకంతో వియ్యంకులకు "మంచి రోజు చూసిని కబురు చేస్తాను. మనవరాలి బారసాలకు తప్పక రండి" అని తిరుగుప్రయాణమయ్యాడు సీతారామయ్య.

తనకన్నా ముందే వచ్చి భార్యతో, పాపాయితో గడుపుతున్న అల్లుణ్ణి చూసిన సీతారామయ్యగారు ఆనందపడిపోయారు. సరాసరి గొడ్లసావిడిలోని గంగామంగల దగ్గరకు వెళ్ళి ఇదంతా ఈ బుజ్జి లక్ష్మి పుట్టిన వేళావిశేషమని వాటిమేనుని ప్రేమతో నిమిరాడు.

బారసాల రోజున ఉదయమే వియ్యాలవారు, అల్లుడు, అతని చెల్లెలు అంతా వచ్చారు. పాపాయికి 'శిరీష' అని నామకరణం చేసి, మురుగులు, గొలుసు పెట్టారు. ఆ సాయంత్రం ఉయ్యాల పేరంటం ఘనంగా చేసి వచ్చిన వారందరికి బట్టలు పెట్టారు. పాపాయికి మూడోనెల రాగానే మంచిరోజు చూచుకుని అమ్మాయిని, పాపాయిని మీ దగ్గర దింపుతామని అల్లునికి చెప్పారు సీతారామయ్య.

అనుకున్న విధంగానే శిరీషకు మూడో నెలరాగానే, ఆరోజులలో ఉన్న మంచిఆచారాన్ని అందరిలాగే పాటిస్తూ సీతారామయ్య, వాసంతిని, మనవరాలిని, ఊరంతాపంచటానికిగాను సారెతోపాటు మంగను, పెయ్యదూడను తీసుకుని వియ్యంకుడింటికి వెళ్ళారు.

ఆడపిల్లకు సారెగా ఆవునో, గేదెనో ఇవ్వటంవల్ల ఆపిల్ల పండుగకు ఓ చీర కొనుక్కోవాలనుకున్నా, గాజులబత్తి దగ్గర గాజులు వేయించుకోవాలనుకున్నా కాణీకు అర్ధణాకు మగవారిని అడగకుండా చిన్నచిన్న కోరికలను తీర్చుకునేటందులకు ఆసరాగా ఉంటుందని ఆ రైతుకుటుంబాల ఉద్దేశ్యం. "పొలంలోని పంట రైతన్నకైతే, ఇంటిలోని పాడి ఇల్లాలికి" అనేవారంతా.

"ఆడపిల్ల పుట్టిందని వాసంతిని ఎంత బాధ పెట్టబోయానో" అని తలచుకున్న వాసంతి అత్తగారు, "మాశిరీష వరాలనిచ్చే మాలక్ష్మినికూడా తీసుకొచ్చింది. మా గొడ్లసావిడి ఇక పాడిపశువులతో నిండిపోతుంది" అనుకుంటూ ఆనందంతో పొంగి పోయింది.

కానీ మంగకు తోబుట్టువులాంటి గంగ లేకపోవటంతో మనసులో దిగులు పెరిగిపోయింది. అస్తమానం గంగతో తన అనుబంధం గుర్తుకువచ్చి గడ్డి మేయటం తగ్గించేసింది. "అక్కడినుండి ఎప్పుడు తిరిగి గంగ దగ్గరకు వెళ్ళిపోవాలా" అని ఆలోచించసాగింది.

మనవరాలు వెళ్ళిపోవటంతో సీతారామయ్య గారిల్లూ చిన్నబోయింది. గొడ్లసావిడిలో గంగ కూడా ఒంటరిదైపోయింది. దానికితోడు వీరయ్య "వట్టిపోయిన గంగకు మేతపెట్టటం దండుగ ఖర్చు. కాబట్టి దానిని కసాయివానికి అమ్మేద్దాం" అని సీతారామయ్య చెవిలో నసపెడుతున్నాడు.

"నా కంఠంలో ప్రాణముండగా గంగను ఇల్లు దాటనివ్వను. ఎందుకంటే నాకు ఎన్నో శుభాలను తెచ్చిన నా ఇంటి మహాలక్ష్మి అది. నాకున్న దాంట్లోనే దాని కడుపునింపి, ఆతల్లి కళ్ళనిండా నిండిన కరుణను, నా గుండెలనిండా నింపుకుంటూ బ్రతికేస్తాను. రేపు శుక్రవారం సంతలో మరో కొత్త గేదెను తెచ్చుకుందాం. మరల మన సావిడి కళకళలాడుతుంది" అని చెప్పారాయన.

మరుసటి రోజు ఉదయానే వీరయ్య గొడ్లసావిడికి వచ్చేసరికి, గంగామంగలు బుజ్జిదూడతో మూగగా ఊసులాడుకుంటూ కనిపించాయి.

"అయ్యగారూ! అమ్మగారూ! ఒకసారి ఇలా రండి. మన మంగ దూడతో సహా ఆఊరినుండి వచ్చేసింది. దీని ప్రేమ సల్లగుండా!" అంటూ ఉత్సాహంగా అరుస్తున్నాడు.

"ఏంట్రా ఆకేకలు? ఎందుకు అంత హుషారు?" అంటూ సీతారామయ్య బయటకు వచ్చాడు.

"ఈ
సిత్రాన్ని చూడండి అయ్యగారూ!" అంటూ నవ్వుతూ వీరయ్య చెప్పిన దిక్కుకు చూసారు ఆయన.

"చూసావట్రా వాటి మూగప్రేమ! భాషరాదుకానీ వాటి మధ్యనున్న బంధం మన మనుషులలో ఉన్న రక్తసంబంధం కన్నా మిన్నరా!" అంటూ గబగబా మంగ దగ్గరకు వచ్చి "మళ్ళా తుంటరి పనిచేసి నీ బిడ్డతోసహా వచ్చేసావా! సరేలే నిన్నెందుకు బాధపెట్టాలి. అమ్మాయికి ఈరోజు సంతలో మరో మంచి పాడిగేదెను కొనిస్తాను. నువ్వు నీ గంగతోపాటు ఇక్కడే ఉందువుగాని" అంటున్న సీతారామయ్య గారి కళ్ళు ఆనందభాష్పాలతో నిండిపోయాయి.

దూరంగా ఘంటసాల గొంతు "వినరా.. వినరా.. నరుడా.. తెలుసుకోర పామరుడా.." అన్న గీతం శ్రావ్యంగా పలుకుతోంది.

★★★

# పజిల్

నేస్తాలు ఊసరవెల్లులై

జీవిత హరివిల్లుల్ని

హరించినప్పుడు,

విత్తమగాధంలో

విలువలు సమాధి ఐనప్పుడు,

అక్షరాల అరణ్యంలో

భావాల కోయిళ్లు తప్పి

పోయినప్పుడు,

"పట్టు", "పసిడి" కి నారి

ప్రాణం పణమయినప్పుడు,

నీతి చంద్రుడు అవినీతి

రాహువు కి చిక్కినప్పుడు

భగ్నవీణల నిక్వణమ్ లో

జీవితం నిర్వేదం చెందినప్పుడు

గద్దె పై గద్దలు ఆడుతున్నప్పుడు,

గాయపడిన గుండె

"గజల్" అవుతుంది !

జీవిత గమనం

"పజిల్" అవుతుంది |

-------------మూలా వీరేస్వరరావు

కథ

# నైతిక విలువలు .....

పి .మంగారత్నం

ఇప్పుడంటే ఆఫీసుల్లో కంప్యూటర్లు సీటుకి ఒకటి వచ్చాయి గాని ..

ఇరవై ఏళ్ల క్రిందట అయితే ..

అన్నిటినీ ఒకే ప్రదేశంలో అమర్చేవాళ్ళు. అవసరాన్ని బట్టి అందరం అక్కడికే వెళ్లి టైపు

చేసుకుని, పక్కనే ఉన్న ప్రింటింగ్ మిషన్లో ప్రింట్ తీసుకుని వచ్చే వాళ్ళం.

మా ఆఫీసు చిన్నదే. ఆఫీసరుగారి గదీ, ఒక పెద్ద హలూ, వెనుక ఒక గదీ అంతే.

ఆ హాలులోనే .. ఓ పక్కగా కంప్యూటర్లు పెట్టి అవి బయటకి కనిపించకుండా చిన్న పార్టిషన్ను

ఏర్పాటు చేసారు. మిగిలిన ప్రదేశంలో నేనూ, మా సూపరింటెండెంటూ, ఓ సీనియర్ అసిస్టెంటూ కూర్చునే వాళ్ళం. మిగిలిన వాళ్ళు వెనుక గదిలో.

ఓసారి ..నేను 'కంప్యూటర్ డెక్' లోకి వెళ్లి ఓ గంట సేపు టైపు చేసుకున్నాను.

నా ప్రక్కనే, ఉన్న టైపిస్టు కబుర్లు చెబుతుంటే, వింటూ డ్రాఫ్ట్ పూర్తి చేసాను. ప్రింట్ తీసుకోవడం

కోసం అన్నట్లు పేపర్ల కోసం అని .. గోడ వారగా ఉన్న నా బీరువా దగ్గరకు వెళ్లాను.

బీరువా తలుపులు ఓ వారగా 'తెరిచే' ఉన్నాయి.

అంత ఎప్పుడూ వదిలేసింది లేదు. గడియ పెట్టక పోయినా .. కనీసం దగ్గరకు అయినా జార వేస్తాను. ఇలా ఎలా? మర్చిపోయానబ్బా! అనుకుంటూ ,,కాగితాలు తీసుకుంటుంటే .. జీతాల డబ్బులు పెట్టిన 'సంచి' కూడా అస్తవ్యస్తంగా కనిపించడంతో,

ఇంత మతిమరుపు ఎలా వచ్చింది నాకు .. దీన్నీ ఇలా వదిలేసానా? అనుకుంటూ, దాన్నీ దగ్గరకు ముడి

వేసి యదాస్థానంలో ఉంచి, కావాల్సిన తెల్ల కాగితాలు తీసుకుని కంప్యూటర్ దగ్గరికి వెళ్లాను.

ఎస్టాబ్లిష్మెంటు క్లార్కుని కూడా కావడంతో .. అందరికీ జీతాలు బ్యాంకు నుంచి తెచ్చి .. పంచే పనికూడా నాదే.

మరో పది నిమిషాల తర్వాత ..

ప్రింట్ తీసుకొని వచ్చేసరికి, నా టేబుల్ ముందు గ్రామనౌకరు 'హనుమాన్లు' నిలబడి ఉన్నాడు.

అతను అప్పుడే జీతానికి వచ్చాడు.

ఆరోజు అంతకుముందే, మరో ఇద్దరు గ్రామనౌకర్లు వస్తే వాళ్లకు జీతం ఇచ్చేసి ..తీరికగ్గా కంప్యూటర్ దగ్గర కూర్చున్నాను .. ఇప్పుడు మళ్లీ ఇతను ..

" ఏమయ్యా! అప్పుడే నాలుగో తారీఖు వచ్చేసింది. మరీ ఇంత ఆలస్యంగానా జీతానికి వచ్చేది"అన్నాను.

" ఇంటి దగ్గర కొన్ని పనులు ఉండిపోయాయి ..అమ్మగారూ!" అనడంతో..డబ్బు సంచిని తీసి, అతని జీతం లెక్కపెట్టసాగాను. ఎందుకనో! అన్నీ చిన్న నోట్లే తగిలాయి.

ఎంత వెతికినా 'పదులు' తప్ప వందలు దొరకలేదు.

అంతకు ముందు ఇద్దరికి ఇచ్చినప్పుడు వందలు ఉన్నాయి. వాటికి ఓ రబ్బరు బేండు వేసి ..చిల్లరను మాత్రం అలాగే వదిలేసాను.

ఉదయం ..ఆఫీసరుగారి రూములో, ఉన్న 'సేఫ్ లాకర్' లోనుంచి 'డబ్బు సంచీ ' తెచ్చుకుంటుంటే ..

మనసులోకి ఓ అనవసరపు ఆలోచన వచ్చింది. నోట్లు ఇలా కవర్లో నుంచి పైకే కనిపిస్తున్నా ఆఫీసు డబ్బు కాబట్టి, అలా ఉండిపోయింది. అదే మరొకటైతేనా! అన్నట్లు.

అది, ఏదో ముందస్తు హెచ్చరికకు సంకేతం అన్న విషయం అని నాకు అప్పుడు తెలియలేదు.

జరగబోయేది ఏదైనా ఉంటే, ఒక్కోసారి అలా .. మనసులోకి అలా వచ్చేస్తాయట.

అలాగే, జరిగింది ఆరోజు.

హనుమాన్లకి, సంచిలో ఉన్న పదులు అన్నీ లెక్కపెట్టి ఇచ్చేసి, అంతకు ముందు ఉండాల్సిన వంద నోట్లు ఏమయ్యాయి? ఆలోచనలో పడ్డాను.

ఇంకా ఇవ్వవలసిన వాళ్ళ జీతం డబ్బులు లెక్క చూసుకుంటే .. నా దగ్గర ఉండాల్సిన డబ్బు కన్నా ఓ ' మూడు వేల రూపాయలు' తక్కువ అయ్యాయని తెలిసింది.

అంటే ..నేను కంప్యూటర్ దగ్గర ఉన్నప్పుడు, నా బీరువా ఎవరో! తెరిచారు. నేను వైట్ పేపర్ల కోసం

వెనక్కి వచ్చినప్పుడు .. బీరువా తలుపులు వెయ్యడం మర్చిపోయానని అనుకున్నానే గాని, మరెవరో తెరిచారని అనుకోలేకపోయాను.

ఆరోజు ఆఫీసులో స్టాఫ్ పెద్దగాలేరు.

ఆఫీస్ సూపరింటెండెంటు మేడం గారికి టెన్త్ క్లాస్ ఎగ్జామినేషన్స్ కి, స్క్వాడ్ డ్యూటీ వేశారు.

అందుకు ఆవిడ లేరు. ఆవిడ సీటు నా సీటు ముందే. ఆవిడే ఉంటే, అలా జరిగి ఉండకపోవచ్చు.

ఆఫీసర్ ' జగన్నాధ స్వామి' గారు ఎక్కడకో టూర్ వెళ్లారు.

ఉన్న స్టాప్ వెనక రూములోకి చేరిపోవడం .. నేను కంప్యూటర్ దగ్గర ఉండిపోవడంతో, చాలాసేపు బయట ప్రపంచాన్ని గమనించలేదు.

ఉన్న అటెండర్ ' శేషాచార్యులు ' మాత్రమే వచ్చే జనాలకి సమాధానాలు చెప్పి పంపిస్తూ ఉన్నాడు. ఏం చేయాలో తోచింది కాదు మూడు వేలు వరకూ డబ్బు తక్కువ అయిపోయింది.

అదే సమయంలో ..ఆఫీస్ చైర్మన్ వేణుగోపాల్, పది రోజులు శెలవు పెట్టి, తిరుపతి వెళ్లడంతో, అతని జీతం మాత్రం ఉండిపోయింది. ఇప్పుడు నేను అతనికి జీతం ఇవ్వాల్సి ఉన్నది.

★★★

నా మనసులో మాట బయటకి వచ్చిందో! లేదో!

" మరి బీరువా తలుపు వేసుకోకుండా, బయటకు వచ్చేస్తే ఎలా?" అన్న ప్రశ్నలు వచ్చాయి.

నేనైనా అంతలా ఎందుకు మర్చిపోయానో! నాకు తెలియలేదు.

'ఆఫీసు సీలు' కోసమో! రబ్బరు స్టాంపుల కోసమో! 'ఆచార్యుల' కు అప్పుడపుడూ నా బీరువా తెరిచే అలవాటు. మిగిలిన వాళ్ళు ఎవ్వరూ అలాంటి చొరవ తీసుకోరు.

స్థానికంగా నివాసం ఉండడంతో .. కొన్ని పనులు మీద వేసుకుని చేసినట్లు చేస్తాడు. నేనూ పని జరుగుతుందిలే అన్నట్లు ఊరుకునేదాన్ని.

ఎస్టాబ్లిష్మెంటు క్లర్కును కావడంతో .. చాలా భాద్యతలు నా మీదే ఉన్నాయి.

ఆప్పటికి ఆఫీసులో ఉన్నది .. అటెండరు ఆచార్యులే కాబట్టి, ఆచార్యుల్ని అడిగాను.

" అయ్యో! నేనెప్పుడు మీ బీరువా తెరిచానమ్మా! ఈ రోజు 'సారు' కూడా లేరు .. సంతకాలు అయిన సర్టిఫికేట్ల మీద 'రౌండ్ సీలు' వేద్దాం అన్నా.. గాని " అంటూ తన నిజాయితీని చాటుకున్నాడు.

మరి అంతకు ముందు ఉన్న వంద నోట్లు .. తరువాత ఎందుకు లేవు? మొత్తం అన్నీ తీస్తే వెంటనే, తెలిసిపోతుందని, చేతికి అందిన వంద నోట్ల కట్టే జేబులో వేసుకున్నారు.

సాయంత్రం నాలుగు గంటలకి ..మా ఆఫీసరుగారు టూర్ నుంచి వచ్చిన తర్వాత విషయాన్ని వివరించి చెప్పాను.

" బీరువా తలుపు గడియ వేయకపోవడం 'తప్పు' మీదే కదా! అయినా సరే, తెలుసుకుందాం లెండి" అన్నారు.

నేను తలుపు దగ్గరికి వేసానో! లేదో! అప్పటికీ గుర్తు రాలేదు.

మౌనం వహించాను.

ఆఫీసు డబ్బు ఎవరు తీసేస్తారు? ఆఫీసులో అందరూ అందరికీ కావలసిన వాళ్లే కదా!అనుకున్నా .. రూపాయి నోటుకి తరతమ భేదాలు ఉండవన్నది అప్పటికి గానీ తెలిసిరాలేదు.

ఆ తరువాత ..

ఆఫీసుకి చేరుకున్న ముగ్గురి అటెండర్లనూ పిలిచి ..

" మీలో ఎవరో .. ఒకరు డబ్బు తీసి ఉంటారు అని అనుకుంటున్నాం. ఎవరు తీసారో నిజాయితీగా .. రేపు ఆవిడ ఆఫీసుకి వచ్చేసరికి .. తీసిన ఆ డబ్బుని .. ఆవిడ 'టేబుల్ డెస్క్' లో పెట్టేసి వెళ్లిపోండి. మీరు ఎవరో బయటకి తెలియాల్సిన అవసరం లేదు. ఇది ఆఫీసు పరువుకి సంబంధించిన విషయం" అంటూ చెప్పారు అఫీసరుగారు.

అందుకు అటెండరు అప్పారావు " నేను మీతోనే ఉన్నాను కదా సార్! నాకు దీని గురించి ఏమీ తెలీదు" చెప్పాడు. నిజమే.

" నేనూ ట్రెజరీకి వెళ్లి, ఈ నాలుగు గంటలకే, మీరు వచ్చే ముందే వచ్చాను సార్! వచ్చీ రాగానే' మేడం గారు ' ఈ విషయం చెప్పారు. అంతకు మించి నాకూ ఏమీ తెలీదు" అంటూ చెప్పాడు ముక్తేశ్వర రావు కూడాను. అదీ

నిజమే.

ఇక మిగిలిది ఆచార్యులు. ఆఫీస్లో ఉన్నది అతను మాత్రమే.

" నాకు మాత్రం ఏం తెలుసు సార్! నేనూ ఇక్కడిక్కడే ఉన్నాను. ఆఫీసుకి జనాలు వచ్చి పోతుంటే, వాళ్ళకి సమాధానాలు చెప్పడం తోనే సరిపోయింది. ఎలా జరిగిందో! నాకూ తెలీదు. ఆఫీసులో ఉన్నందుకు నన్ను అనుమానిస్తే ఎలాగ? నాకేం తెలీదు. దేవుడి మీద ఒట్టు " అంటూ చెయ్యి తల మీద పెట్టుకుని 'ఒట్టు' కూడా వేసాడు ఆవేశంగా.ఆచార్యులు కాస్త చేతివాటం గల మనిషి. లేని అలవాట్లు లేవు. జంధ్యం తీసి పక్కన పెట్టి ..తాగాలంటే తాగుతాడు. తినాలంటే తింటాడు. అతని నైజం అందరికీ తెలిసిందే. అయినా, ప్రస్తుతం దేవుడిని అడ్డం పెట్టుకున్నాడు.

★★★

ఆ సాయంత్రం, ఇంటికి వెళుతూ కూడా అదే ఆలోచన ఉండిపోయాను. అలా వెళుతున్న క్రమంలో ఒక విషయం అవగాహనకు వచ్చింది.వెంటనే, ఇంటికి వెళ్లి, మా ఆఫీసర్ గారికి, మా 'లేండు లైను' నుంచి ఫోను చేసి చెప్పాను.

" సరే రేపు చూద్దాంలేండి. మన 'ఆర్. ఐ' లు ఇద్దరినీ పిలిచి మీటింగ్ పెడదాం. లేకపోతే అప్పుడే పోలీస్ కంప్లైంట్ ఇవ్వచ్చు" అన్నారు భరోసాగా.

ఆ మాటకు నేను ఎంతో సంతోషించాను ఆఫీసరుగారు 'నా పక్షాన' ఉన్నారు అని.

★★★

అయితే ఆ మరునాడు అనుకున్నట్టు ఏమీ జరగలేదు.

నేను ఆఫీసుకి వెళ్ళేటప్పటికే, ఆ ఇద్దరు 'ఆర్. ఐ' లూ కూడా ఆఫీసుకి వచ్చి " మాకు ఇలాంటివి జరుగుతాయని ముందుగా తెలియదు కదా! మేము టూర్ ప్రోగ్రామ్స్ ఫిక్స్ చేసుకున్నాము" అంటూ క్యారేజీలు తీసుకుని మరి బయటకు వెళ్లిపోయారట.

ఆఫీసులో చాలా ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉంటాయి. బయటకు తిరిగే వాళ్ళు ఉంటారు. ఎవరు ఎలా .. తిరిగినా మధ్యాహ్నం లంచ్ కి మాత్రం ఆఫీసుకే వచ్చేస్తారు. కానీ వీళ్ళిద్దరూ మాత్రం ఆ రోజు ఇక 'రాము' అని చెప్పే వెళ్లిపోయారట. ఆఫీసర్ గారు కూడా టూర్ లోనే ఉన్నారు.ఏ మీటింగూ జరగలేదు. నా విషయం కథలేదు.

★★★

ఆ రోజే కాదు..ఏ రోజూ కూడా కదలలేదు. నిమ్మకు నీరెత్తినట్టే ఉంది వ్యవహారం.అయినా, ఆఫీసర్ గారి మీద నమ్మకంతోనే ఉన్నాను.ఆ పని చేసింది అటెండరు ఆచార్యులే అని నా గట్టి నమ్మకం, అదే విషయం .. ఆరోజు ఫోన్లో చెప్పాను.

విషయం ఇలా నలుగుతున్నపుడే, ఆచార్యులు .. మా సీనియర్ అసిస్టెంటు ' వెంకన్నబాబు ' తోఅన్నాడట. " ఇంకా నయం. ఆ రోజు నేను. కాసేపు నేను ఇంటికి వెళ్లాను కాబట్టి సరిపోయింది. లేకపోతే అదేదో నా మీద పడిపోయేది" అని.

అంటే, అవి అప్పుడే ఇంటికి చేరిపోయి ఉంటాయి. అందుకే తను దొరకనన్న ధైర్యంతో బీరాలు పలుకుతున్నాడు. ఎవ్వరూ తియ్యకపోతే, బీరువాలో డబ్బులు ఏమై పోతాయి?.

మరో నాలుగు రోజులు గడిచిపోయినయ్.విషయం ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లు .. అక్కడే ఉంది.

★★★

టెన్త్ క్లాస్ డ్యూటీకి వెళ్ళిన సూపరింటెండెంటు మేడం వస్తూనే " ఏమిటి ఆఫీసులో దొంగతనంజరిగిందంటా" అంటూ అడిగారు.

" అవును, మేడం" అంటూ విషయం వివరించాను.

ఆ తర్వాత శెలవు మీద వెళ్ళిన వేణుగోపాల్ కూడా తిరిగి వచ్చాడు అతనికీ విషయం చేరిపోయింది. కాస్సేపటికి " నా జీతం" అంటూ వచ్చాడు.

" ఇలా జరిగింది వేణుగోపాల్" అంటూ కథ చెప్పాను.

" దానికి నేనేం చేస్తాను మేడం గారూ!" అన్నాడు. ఎలా అయినా నా జీతం నాకు ఇవ్వాలన్నట్లు.

అదీ నిజమే, పోయిన దానికి .. ఊరిలో లేని మనిషి ఏం చెయ్యగలడు?

" ఒక పని చెయ్యి ఇన్ని రోజులైనా విషయం కొలిక్కి రాలేదు. ఆఫీసులో ఏ ఎంక్వయిరీ జరగలేదు.

నువ్వు .. సార్ దగ్గరికి వెళ్లి 'ఆమె' నా జీవితం ఇవ్వడం లేదు, అంటూ నా మీద 'కంప్లైంట్' చెయ్యి అప్పుడైనా విషయం కదులుతుందేమో చూద్దాం" అంటూ ఓ సలహా ఇచ్చాను.

అతను కాస్త తటపటాయించినా గత్యంతరం లేక నేను చెప్పినట్టే చేశాడు.అందుకు మా ఆఫీసరుగారు నన్ను పిలిచి " ఏమిటీ " అన్నారు చాలా కొత్తగా.

" డబ్బు దొరకలేదు. సార్! " అన్నాను మాటలు తడుముకుంటున్నట్లు.

" అంటే, అతనికి జీతం పే చేయరా?" సూటిగా అడిగారు.

ఏం చెప్పాలో తెలీలేదు.

" ఎలాగోలా చేసి అతనికి జీతం పే చేయండి, ఆ కవర్లో అసలు డబ్బులు ఉన్నాయో! లేవో! నాకు తెలియదు. నేను చూడలేదు. మీరు డబ్బులు 'లేకుండా చేసి .. పోయాయని ' అంటున్నారేమో! నాకు

ఏం తెలుసు? ఒకవేళ మీరు అతనికి జీతం పే చేయకపోతే .. నేనే 'మీ మీద' పోలీస్ కంప్లైంట్ ఇవ్వాల్సిఉంటుంది" అంటూ అవడంతో ..నేను ఖంగుతిన్నాను.

అది ఊహించని షాకు.

" సార్! " అన్నాను దెబ్బతిన్నట్లు.వేణుగోపాల్ నా వైపు ఇబ్బందిగా చూసాడు.

ఆఫీసరుగారు ఇలా అంటారని అనుకోలేదు. ఎలాగైనా పోయిన డబ్బు 'తిరిగి రప్పిస్తారానే' గుడ్డి నమ్మకంతో ఉన్నాను. ఆఫీసరుగారు నా పక్షం అన్న .. ఆశ జారిపోయింది.

"మూడు వేలు అంటే, 'నాకు' పదిహేను రోజుల జీతం సార్! " అన్నాను ఎలానో గొంతు పెగల్చుకుని .

" అది ఆఫీసుకి అనవసరం" చాలా నిష్కర్షగా తన నిర్ణయం తెలియచేసారు.

★★★

కొద్ది రోజులుగా ఇంట్లోనూ ఇదే చర్చ.మా శ్రీవారు అన్నారు " ఆఫీసులో అనవసరంగా గొడవలు పెట్టుకోకు, చిన్న విషయం పెద్దది

అయిపోతుంది. ఇంట్లో నుంచి డబ్బు తీసుకువెళ్లి కట్టేసెయ్యి" అంటూ.చివరికి అదే జరిగింది, వేణుగోపాల్ కి జీతం ఇచ్చేసాను.

ఆఫీసర్ గారు చాలా నమ్మకంగా మాట్లాడి, చివరి నిమిషంలో .. ఇలా రివర్స్ అయిపోవడం నన్ను చాలా ఇబ్బంది పెట్టింది. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలీలేదు.

చాలా 'అప్సెట్' అయిపోయాను. మూడు సంవత్సరాల పరిచయంలో నేనేంటో అతనికి తెలీలేదా? అన్నట్లుడబ్బు పోయిన వెంటనే, ఓ సారి .. మా పై ఆఫీసు .. డివిజనల్ ఆఫీసుకి వెళ్ళి జరిగిన విషయం చెప్పాను.

" మీ ఆఫీసులో ఇంతకుముందు కూడా ఒక 'తెఫ్ట్' కేసు జరిగింది. ఇది రెండోది అన్నమాట"అంటూ అవతలి వాళ్ళు ఓదార్చారు తప్ప నా సమస్యకు పరిష్కారం ఏమీ దొరకలేదు.అందుకే ఈసారి, జిల్లా కలెక్టర్ గారికి తెలియజేయాలి అనుకున్నాను.

★★★

" మా ఆఫీసరుగారు, ఒక్కసారి కూడా ఆఫీసులో మీటింగ్ పెట్టి డబ్బు ఎలా పోయింది? అనిఎవ్వరినీ అడగలేదు. నేను అటెండరు ఆచార్యులు పేరు సూచించినా .. ఇద్దరిదీ, ఒకే 'సామాజిక వర్గం'కావడంతో .. కనీస విచారణ జరపలేదు. దగ్గరతనానికి ప్రాధాన్యం ఇచ్చి 'అతన్ని' కాపాడడం కోసం,

నన్ను ఇబ్బంది పెట్టారు. ఇంట్లోంచి డబ్బు తీసుకువెళ్లి కట్టాను. నా డబ్బు నాకు తిరిగి వస్తుందని కాదు,

జరిగిన విషయం తమ దృష్టికి రావాలని తెలియజేస్తున్నాను" అంటూ కలెక్టర్ గారికి ఒక రిపోర్ట్ రాసి,

రిజిస్టర్ పోస్ట్ చేశాను.

★★★

వారం రోజుల తర్వాత విషయం 'సీను' లోకి వచ్చింది.

ఆరోజు .. ఆఫీసర్ల కాన్ఫరెన్సు పూర్తయిన తర్వాత కలెక్టర్ గారు, మా ఆఫీసర్ గారిని పిలిచి " ఏమిటిది?' అంటూ నా కంప్లెంట్ చేతిలో పెట్టారట.అంతా చదివి .. జరిగింది చెప్పారట.

" ఈ విషయం మీ డివిజనల్ ఆఫీసర్, కాకినాడ గారికి ఇస్తున్నాను. ఎంక్వైరీ చేయమని" అంటూ అక్కడే ఉన్న డివిజనల్ ఆఫీసర్ 'ధనుంజయ' గారి చేతిలో పెట్టారట ఆ కాగితాన్ని .

ఆ మర్నాడు ..సూపరింటెండెంటుని ముందు పెట్టుకుని .. కోపంతో ఊగిపోయారు మా ఆఫీసరుగారు.

" చూసారా! ఈమె 'నామీద' కంప్లెంట్ చేసింది కలెక్టర్ గారికి. నేను సరిగ్గా ఎంక్వయిరీ చేయకుండానే, ఆమెతో డబ్బు కట్టించాడట. కంప్లెంట్ చేయగలిగే తెలివితేటలు ఈమెకు మాత్రమే

ఉన్నాయా? మనమూ చేద్దాం, ఈమె మీద కంప్లెంట్. ఈమె చేసిన పనికి .. అందరిలోనూ, నా తల కొట్టేసినట్లు అయ్యింది " అంటూ.

కొన్ని విషయాల్లో నాకు తల పొగరు అన్నట్టుగానే అనుకుంటారు ఆఫీసులో .. రూల్స్మాట్లాడతానని.

" అంతే! మన మీద కంప్లెంట్ చేస్తే, మనం మాత్రం ఊరుకుంటామా ! ఏంటి? అలాగే చేద్దాం" అంది

ఆవిడ తన వంతు సహకారం అందించే దానిలాగా. ఆవిడ నాకు పూర్తిగా వ్యతిరేకం. నేనంటే ఆవిడ నిప్పులు తొక్కినట్లే ఉండేది.

వాళ్ళ మాటల్ని బట్టి, నా అప్లికేషన్ కలెక్టరుగారు 'చూశారన్న' సంతోషం కలిగింది నాకు. నా డబ్బు నాకు తిరిగి వస్తుందని కాదు. జరిగిన అన్యాయం బయట ప్రపంచానికి తెలియచెయ్యాలని. అనుకున్నట్టుగానే ..

వారం తర్వాత డివిజనల్ ఆఫీసరు ధనుంజయగారు మా ఆఫీసుకి వచ్చారు.

ఆఫీస్ అంతా చాలా అలర్ట్ గా ఉంది. 'నన్నేం పిలిచి అడుగుతారో నన్నసంశయం నాలోనూ ఉంది'. కానీ అలా ఏం జరగలేదు.

వచ్చిన కాసేపటికే .. మా మండలం, పక్కనే 'పది కిలోమీటర్ల' దూరంలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతం అయిన 'యానాం' వెళ్ళే ప్రోగ్రాం పెట్టుకున్నారు.

వెంట మా ఆఫీసరుగారూ అనుసరించారు.అది మొదలు ..వారానికి ఓసారి అయినా ధనుంజయగారు ఏదో వంకన మా ఆఫీస్ వైపు వస్తూనే ఉన్నారు.

యానాం ప్రోగ్రాం వేసుకుంటూనే ఉన్నారు.

మొదట్లో మా ఆఫీసర్ గారు వెంట వెళ్లినా తరువాత .. తరువాత ఏదో ఆర్. ఐ కి ఎంగేజ్మెంట్ చేస్తున్నారు. చివరికి తెలిసిందే ఏమంటే, అతను 'మందు ప్రియుడు ' ఆంధ్రాలో కన్నా యానాంలో అయితే చవుక.

ఓ సారి 'ఆర్ ఐ' భీమరాజు ఆవేదన పడితే, తెలిసింది.

" మన డివిజనల్ ఆఫీసరుగారికి .. ఎవరు ఎంత ఖర్చు పెట్టినా అనవసరం. యానాం గవర్నమెంట్ గెస్ట్ హౌస్ లో .. మన గవర్నమెంటు కోసం కోసం ఒక రూమ్ ఉంటుంది. ముందుగా బుక్చే సి, ఉంచడంతో .. కారు దిగి, తలవంచుకొని రూమ్ లోకి వెళ్తారు .. పని పూర్తవగానే తలవంచుకొని బయటకు వచ్చి 'కారు'లో కూర్చుంటారు .. అంతే.

లోపలికి 'మందు బాటిల్' పంపించి, బయట ఉన్న స్టాఫ్, సీ.సీ, డ్రైవరూ, అటెండరుకి స్నాక్సూ,కూల్డింక్సూ సప్లయ్ చెయ్యాలి .. ఆఖరుకి మంచి నీళ్ళ బాటిల్స్ తో సహా. ఆఫీసులో పోయిన డబ్బు కన్నా.. పెట్టుకునే ఖర్చే ఎక్కువ అయిపోయింది" అంటూ .

మా ఆఫీసరు స్వామి గారు 'కనీసం' విచారణ చేయలేదన్న కారణంగా ..

నేను ఆ విధంగా పైకి కంప్లెంట్ చేశానే గాని .. అది మరొకరికి 'ఈ' విధంగా

ఉపయోగపడుతుందని అనుకున్నానా?

అప్పుడు అలా జరిగితే .. ఇప్పుడు ఇలా జరుగుతుంది. ఏదీ మన చేతుల్లో లేదు. అంతా నిమిత్తమాత్రం అన్నట్లు.

★★★

# కాలం

బోడ మాధవి

వేగంగా పరిగెత్తే కాలం బరువెక్కిందేం ఇలా?

నా మనసులోని భారమంతా నింపుకుందా ఏం చిత్రంగా!

బాలల బాల్యాన్ని చిదిమేస్తున్న పుస్తకాల బరువు తనూ మోస్తున్నట్లుగా

ఏం చదువుతున్నామో, ఎందుకు చదువుతున్నామో తెలుసుకోలేక,

తేరుకోలేక మరణించిన బాల్యాన్నే అనుసరించి తమను తామే

కడతేర్చుకుంటున్న యువతలోని కసిని నింపుకున్నట్లుగా

ఆడపిల్ల పుడితే ఆదిలక్ష్మి పుట్టిందని ఆనందించే రోజులు పోయి

అనుక్షణం కామాంధుల బారి నుంచి రక్షించాల్సి వస్తున్న దౌర్భాగ్యపురోజులకు

నిశ్శబ్దంగా నిట్టూరుస్తున్నట్లుగా గద్దె నెక్కేవరకు పేదల కోసమే మా ప్రభుత్వమన్న నాయకులు

పదవి దొరకగానే పెద్దల కోసమే మా పాలనంటుంటే

నాయకుల మాటలింతేలే మూటలు మోసైనా ఆకలి తీర్చుకుందామంటే

పేదలకదీ అందని పండాయె ఈ కంప్యూటర్ యుగంలో

ధరలు ధరణినొదలి ఆకశాన అందలమెక్కితే

అందలమెక్కలేక, నేలపై నిలువలేక అప్పుల ఊబిలో కూరుకుపోయిన

పేదకు కలికాలపు వరం ఆత్మహత్యే అయితే ఆ పాప భారంతో బరువెక్కకేం చేస్తావులే!

విదేశీ మోజుతో మన సంస్కృతికి దూరంగా పిల్లలను పెంచి

విదేశాలకెగిరిపోయిన బిడ్డల్ని చూసితాము చేజేతులా చేసుకున్న

ప్రాయశ్చిత్తం చేసుకోలేని తప్పుకి ఒంటరిగా కుమిలిపోయే వృద్ధ తల్లిదండ్రులకు తోడుగా

నీవూ బరువెక్కావా కాలమా? ఇలా క్షణానికో ఘటనతో ఎంత బరువెక్కినా నీవే మాకు ఆరాధ్యదైవానివి అందుకే పాడుకుంటూనే ఉంటాం "ఉందిలే మంచి కాలం ముందు ముందునా" అంటూ.

కథ

# లక్షింపిన్ని

వి .పూర్ణ కామేశ్వరి

ఎనభైయారు వసంతాలు నిండి ముక్కోటి ఏకాదశికి వారముందనగా దైవ సన్నిధికి చేరుకుంది లక్షింపిన్ని. తన వాళ్ళంతా చుట్టూ ఉన్నారు. ఎవరూ తనవాళ్ళూ??

కన్నవాళ్ళుండే వయసు కాదు. కట్టుకున్న వాడిని పట్టుమని కళ్ళారా చూసి కూడా ఎరుగదు. మొగుణ్ణే ఎరుగని ఆమెకు కన్నబిడ్డల ప్రసక్తేది? మరి ఈ తనవాళ్ళంతా ఎవరూ?

కొందరు ఆ దేహం చుట్టూ నిలబడి ఆమె లోటు తీరేదు కాదని ఆమెను కొనియాడుతున్నారు. ఎంత వింతో కదా!! మనిషి బతికున్నాళ్ళూ పిడికెడు అన్నం పెట్టడానికి ముందుకు రాని వాళ్ళందరూ ఇప్పుడు ఆ దేహాన్ని గురించి బాధ పడడం?

సరే, గుడ్డి కంటే మెల్ల మేలన్నట్టు. మోసే నలుగురినీ అద్దెకు తెచ్చుకునే దుస్థితి పట్టనందుకు ఇంకా అక్కడే తిరుగుతున్న ఆమె ఆత్మసంతోషిస్తోంది.బాధ్యతగానిలబడిఆదేహాన్నిసాగనంపేసారు వచ్చిన తనవాళ్ళు. వారే తన బంధువులు. ఈ బంధువుల గురించి తెలుసుకోవాలంటే మన లక్షింపిన్ని కథ తెలుసుకోవలసిందే!

సుమారు డెబ్భైయేళ్ళనాటి కథ అది.

★★★★★

"మా సుబ్రహ్మణ్యం ఎంత అదృష్టవంతుడో!! పసిమిచాయతో పెళ్ళికూతురు మెరిసిపోతోంది" అంది సుబ్బు ఒదినగారు మురిసిపోతూ.

శ్రావణ మాసంలో ఏటేటా గోదారి ఉళ్ళోకొచ్చి ప్రతి గడపా తడిపి వెళ్ళవలసిందే! వరుణుడు దయదల్చి ఆ ఏడు ఇంకా వర్షాల ఎక్కువగా లేక, గోదారమ్మ తల్లి ఊళ్ళోకి రాలేదు. అంచేత వర్షాకాలంలో జరిగిన పెళ్ళే అయినా బాగా జరిగిపోయింది.

"చూడముచ్చటైన జంట!!" వరలక్ష్మి సుబ్రహ్మణ్యం జంటను చూసిన అందరూ చెప్పుకున్నారు.

కార్యం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

"వరం. అణుకువగా నడుచుకో తల్లీ. ఇంట్లో ఆఖరి దానివని గారం చేసిన మాట నిజమే కానీ, అత్తారింట్లో అవన్నీ చెల్లవు, సరేనా?" జడ వేస్తూ పెద్దక్కయ్య చెపుతున్నది వింటోందే కానీ, వరలక్ష్మి మనసంతా మరెక్కడో ఉంది. ముఖం సిగ్గుతో కెంపురంగు దాల్చింది.

సిగ్గుల మొగ్గై, ముడుచుకుపోతూ గదిలోకి అడుగు పెట్టింది.

"ఇలారా, కూర్చో!" చిరునవ్వుతూ ఆహ్వానిస్తున్న భర్తను అప్పుడే కళ్ళారా చూసింది. 'ఎంత అందంగాడో!!' మనసులోనే అనుకుంది.

మంచం దగ్గరగా వచ్చి మరింత ముడుచుకుపోతూ నిలబడింది. "కూర్చో లక్ష్మీ!" తన చేతిని మృదువు చెతుల్లోకి తీసుకుని తన పక్కగా కూర్చోపెట్టాడు.

మనసులో ఎన్నెన్నో భావాలు. నోట మాటరాలేదు వరలక్ష్మికి. ఏదో గుర్తొచ్చినట్టుగా చటుక్కున లేచి, అతడి పాదాలను తన చేతులతో స్పృశించి నమస్కారం చేసుకుంది.

"నీ స్థానం అక్కడ కాదు! ఇక్కడ!!" అంటూ ఆమెను తన గుండెలకు హత్తుకున్నాడు. ప్రేమానురాగాలను పంచుకుంటూ ఒక్కటైయ్యారు.

తెల్లవారుతోంది.

"ఏవండీ!" మృదు స్వరంతో పిలిచింది లక్ష్మి.

"ఊఁ..." మత్తు గా సమాధానం ఇచ్చాడు.

"తెల్లవారుతోంది, నేను స్నానం చేసి వెళతాను. మీరు నెమ్మదిగా లేవండి, సరేనా?" అతడి రూపాన్ని కళ్ళల్లో నింపుకుంటూ అనేసి చేతిలో బట్టలతో పెరట్లోకి దారి తీసింది.

"ఏమ్మా, ఏమంటున్నాడు మా సుబ్బు!?" అంటూ ఆరా తీసింది ఆడపడుచు.

వంటిట్లోకొచ్చిన లక్ష్మి చేతికి కాఫీ కప్పు ఇచ్చి కనుసైగ చేసింది తోటికోడలు.

"ఆయనింకా లేవలేదు అక్కయ్యా!" "నువ్వు తాగెయ్యి. సుబ్బుకి తరువాత కలుపుతానులే" అంటూ చిరునవ్వుతో అక్కయ్య ఇచ్చిన కాఫీ కప్పు అందుకుంది వరలక్ష్మి.

"నేనూ, నేనీ చిక్కుడు కాయలు ఒలవనా అక్కయ్యా?" చొరవగా పక్కన తరగడానికి పెట్టుకున్న కూరల వంక చూస్తూ అంది లక్ష్మి.

"ఇంకా మూడు నిద్రలైనా అవ్వలేదు, అప్పుడే గోరింటాకు చేతులకి ఈ పనులెందుకు. అలా కూర్చుని కబుర్లు చెప్పు!" ఆప్యాయంగా అంటూనే లక్ష్మి చేసిన మారాం తలచుకుంది శ్యామల.

"మా అక్కయ్య కట్టుకున్న చీర లాంటిదే నేనూ కట్టుకుంటాను" అప్పగింతల తర్వాత అల్లరిపెట్టిన పెళ్ళి కూతుర్ని చూసి నవ్వుకున్నారంతా. అలా మెట్టినింట అడుగు పెట్టకుండానే తోటికోడలితో కలిసిపోతూ వరం వేసిన తొలిమెట్టుని చూసి మురిసిపోయింది శ్యామల.

"ఒక్క అరగంటలో వస్తానన్నారు, ఇంకా తెఁవల్లేదేంటీ. అప్పుడే గంటన్నరైపోయింది" అనుకుంటోంది లక్ష్మి.

"నువ్వెళితేకానీ రాడేమో, ఇదిగో ఈ కాఫీ తీసుకుని వెళ్ళి సుబ్బుని తీసుకుని రా!" ముసిముసి నవ్వుతో అంది శ్యామల.

"ఏవండీ ఇదిగో కాఫీ, అరగంటలో వస్తానని ఇంకా లేవలేదేంటి?" మురిపెంగా అంటూ తల నిమిరింది.

సమాధానం చెప్పలేదు.

"అబ్బా!! చాలా సేపైంది లేవండీ! భోజనాల వేళవుతోంది" గుండెలపై చెయ్యి వేసి నెమ్మదిగా కుదిపింది. చలనం లేదు.

"ఏవండీ...... ఏవండీ.......... ఏవండీ!!" అంటూ పెద్దగా వేసిన కేకలకు అందరూ అక్కడికొచ్చారు.

"కాఫీ తాగడానికి లేపుతుంటే మాట్లాడట్లేదు" కళ్ళనీటితో నిలువెల్లా ఒణికిపోతూ అంది.

ఒక్క రోజులో మెట్టినింటితో బంధం ముగిసిపోయి, మోడుగా పుట్టింటికి చేరింది వరలక్ష్మి.

అప్పగింతలనాటి నుండీ ఆదరించి తోబుట్టువగా ప్రేమను పంచిన శ్యామల కూడా వయసులో ఉన్న తోటికోడలిని ఇంట్లో పెట్టుకునే ధైర్యం చెయ్యలేదు.

★★

నెల ఇట్టే తిరిగిపోయింది.

కావుఁడింట్లో కోడలి పురిటి హడావుడి. కావుఁడు ఎవరంటారా? అందరూ లక్షింపిన్ని అని పిలుచుకునే లక్ష్మికి ఆరో అక్క.

మొత్తం ఎనమండుగురు అక్కచెల్లెళ్ళ మధ్య వారికి ఒక్కడే తోడపుట్టిన వాడు. అందరికీ పెళ్ళిల్లు చేసిన ఆ తల్లిదండ్రులు బాధ్యత తీర్చుకున్నారు అనడం కన్నా బరువుని దింపుకున్నారనే అనాలి. పిసరంత పొలంతో ఈదుకు రావలసిన గంపెడు సంసారం. గోదారి ముంచడమనో, వర్షాలు లేక మెట్టకి నీళ్ళు అందలేదనో ఎప్పటికప్పుడు పొలంలో పండినవి గాదికి చేరడం కష్టమే అయ్యేది. ఇంక ఆ ఊళ్ళో గడవక వెంకటరత్నం గారూ, శ్యామలాంబా కూడా కూతురు కావుఁడింటికే చేరారు కనుక వరలక్ష్మికి అదే పుట్టిల్లైయ్యింది.

కోడలు పురిటి నొప్పులు ప్రారభమైనప్పటి నుంచీ సూర్యనారాయణ నడవ వసారాలో ఆ చివర నుంచీ ఈ చివర వరకూ పచార్లు చేసేస్తూ గాభరా పడుతున్నాడు.

"పురుడు అమ్మాయిక్కానీ నొప్పులు పడుతున్నది మరిదిగారు!" కాఁవుడు అక్కచెల్లెళ్ళు సన్నగా వేళాకోళం చేస్తున్నారు. ఆదివారమవ్వడంతో పిల్లలంతా ఇంట్లోనే ఉన్నారు. పేకాటలనీ, అష్టాచమ్మాలనీ ఆడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఒరేయ్ నాదో చిక్కు ప్రశ్న!" రోజుకో వింతో విడ్డూరంతోనో ఊరిస్తూ ఉంటాడు భాస్కరం.

"ఇప్పుడు మా అన్నయ్యకి పుట్టబోయే బిడ్డకి నేను బాబాయయ్యను, మా చెల్లి, అదే ఈ చిపిరి జుట్టుది అత్తయ్య, మా ఆవిడేమో పిన్నీ, మా నాన్న తాతగారు, మా అమ్మ మామ్మగారు అవుతారు!" వరసలు చెపుతూ చిక్కుముడంటావేంట్రా, జుట్టు సవిరించుకుంటూ అంది పద్మ.

"ఆగవే, నీకన్నీ తొందరే!! కానీ..... ఈ ఇంట్లో ఉన్న ఒకే ఒకరి వరస మాత్రం అస్సలు మారదు! ఆ వరస ఏంటో చెప్పుకోండి, చూద్దాం?" చిక్కుప్రశ్న వేసాడు.

"అదేవిట్రా, అంతా తూచీ, అలా అసలు ఎవ్వరిదీ ఉండదే?!" అంది అమ్ములు.

"ఎందుకు ఉండదు. మన లక్షింపిన్ని మాత్రం పుట్టబోయే బుడతడికి లక్షింపిన్నే అవుతుంది!" పకపకా నవ్వుతూ తేల్చేసాడు భాస్కరం.

ఏకగ్రీవంగా ఆ మాటను అందరూ అంగీకరించారు. పురుడొచ్చి అమ్మాయి పుట్టిందని అంతలోనే శుభవార్త చెప్పింది కావుఁడు. రెండుచేతులు జోడించి దేవుణ్ణి తలచుకున్నాడు సూర్యం.

కావుఁడు అని ముద్దుగా పిలుచుకునే కామేశ్వరినిచ్చింది రెండవ పెళ్ళి సంబంధం. సూర్యనారాయణ చాలా మంచి వ్యక్తి. ధనానికి గొప్పవాడు కాదు కానీ గుణంలో సంపన్నుడు. పిఠాపురంలోనే పుట్టి పెరిగి, స్కూలు మాష్టారుగా అక్కడే ఉద్యోగం చేసుకుంటూ నలుగురిలో మంచి పేరు సంపాదించుకుని గౌరవంగా బ్రతుకుతున్నాడు. తనకున్నదాన్ని నలుగురితో పంచుకోవడంలో ఆనందం పొందేవాడు. పంచి కొద్దీ పెరిగే విద్య సంపదను నలుగురికీ పంచుతూ ఆ సంపదతోనే ధనవంతుడైయ్యాడు.

చిన్నతనంలో భర్తలు పోగొట్టుకుని

నిలువ నీడలేని తన భార్య తోడబుట్టువులకు తన ఇంట్లో ఆశ్రయమిచ్చి చేతనైనంత సహాయం చేస్తూ వచ్చాడు సూర్యం. చిన్నతనంలోనే వితంతువులుగా మారిన ముగ్గురు అక్కచెల్లెళ్ళూ అప్పటికే తల్లిదండ్రులున్న కావుడు ఇంటికే చేరారు.

కావుడికి మనవరాలు పుట్టిన ఆ సమయంలోనే లక్ష్మీ ఆ ఇంటికి వితంతువుగా వచ్చి చేరింది.

★★★★★

పుట్టిల్లంటూ ఏముంది! తల్లిదండ్రులకూ తమకూ నిడనిచ్చిన ఆ ఇంటికి చేరారు. దయగల మహారాజు కనుక ఆ అల్లుడు అత్తమామలకూ, ఒదినా మరదలికీ తన ఇంట నీడనిచ్చాడు.

పిల్లల బాగోగులు చూసుకోవడంలో, వంటలు చేసుకోవడం, కబుర్లు చెప్పుకోవడంలో అక్కలందరూ ఉండిపోయేవారు. లక్ష్మికి చేతినిండా పనీ లేక, మనసు నిండా దిగులుతో రోజురోజుకీ మానసిక ఒత్తిడికి లోనవ్వ సాగింది.

"అమ్మా, లక్ష్మీ. నిన్నోటడిగితే చేస్తావా?" ఆప్యాయంగా అడిగాడు సూర్యం బావ.

"అదేంటి బావా అలా అడుగుతున్నావు? ఏం చేయాలో చెప్పు" దిగాలుగానే బదులిచ్చింది.

"వీళ్ళందరితో చేరి కబుర్లల్లో పడకు, నువ్వు పీయూసీ చదవాలి" అన్నాడు.

"చదువా? నేనా? ఎప్పుడో పదో తరగతి అయ్యిందనిపించి ఏళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు నాకేం అబ్బుతుంది బావా!"

చివరి సంతానం అవ్వడంతో లక్ష్మొక్కత్తే ఆ ఇంట పది వరకూ చదివింది.

"ఆడిపిల్లలు పదివరకూ చదవడమే మన ఇంటావంటా లేదు. నేనేదో చివరిదాన్ని కనుక పది వరకూ వచ్చాను. ఐనా, నాకు చదువేంటీ?" నిర్లిప్తంగా అంది.

"ఏం? ఎందుకు చదవకూడదు? ఇంత చిన్న వైయసులో ఒంటరివైన నీకు నీ కాళ్ళ మీద నిలబడడం చాలా అవసరం" దృఢంగా వచ్చింది సూర్యం మాట.

"అంటే ఇప్పుడు నేను చదువు మొదలు పెట్టడమే కాక ఉద్యోగం కూడా చేయగలననా బావా నీ ఉద్దేశ్యం?" లక్ష్మి మాటలోని అపనమ్మకం, వెక్కిరింపుగా వెలవడింది.

"ఎందుకు చేయలేవు? విద్య ఇచ్చే ధైర్యమే అది. నువ్వు చదివితే చాలు. ఉద్యోగమే నిన్ను వెతుక్కుంటూ వస్తుంది"

మాటవరసకి అన్నాడే కానీ సిద్ధమైయ్యే వచ్చాడు. రాసుకొచ్చిన పీయూసీ అప్లికేషను ఫారమ్ లో సంతకం పెట్టించుకున్నాడు సూర్యనారాయణ.

"ఇదేం విడ్డూరమే? దానికిప్పుడు చదువులెందుకో" మిగతా అక్కలు చెవులు కొరుక్కుంటున్నా, మరిదిని నిలదీసే ధైర్యం మాత్రం చేయలేక పోయారు. నోళ్ళు నొక్కుకున్నారు.

పీయూసీ ఇట్టే పూర్తైయ్యింది. మళ్ళీ షరా మామూలే. ఇల్లూ! అక్కలతో ముచ్చట్లూ!.

"లక్ష్మీ, నీ చదువు నిన్ను సంస్కరించాలి. కబుర్లతో కాలక్షేపం చెయ్యక పిల్లలకు పాఠాలు చెప్పడం మొదలు పెట్టు. ప్రైమరీ స్కూల్ టీచర్ల దరఖాస్తులు పిలిచినపుడు అప్లై చేద్దువుగాని" ఇంచుమించు ఆదేశిస్తున్నట్టుగానే చెప్పాడు సూర్యం.

దరఖాస్తులు పిలవడం, పెట్టుకోవడం, ఉద్యోగం రావడమూ వెంట వెంటనే జరిగిపోయాయి. ఇంక లక్ష్మి జీవితంలో వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితే రాలేదు.

★★★★★★

"మా వరలక్ష్మికి ఒక మంచి సంబంధం చూసి పెట్టవోయ్!" అందరికంటే చిన్న అల్లుడేనైనా సూర్యం మరో సారి ధైర్యం చేసాడు.

"ఈ వయసులో ఇతని పంచన పడ్డందుకు మాకు ఇది కూడానా?" వితంతు వివాహంతో రానున్న మర్యాదా భంగాన్ని మిగిలిన కూతుళ్ళతో చెప్పుకుని

బాధ వెళ్ళగక్కాడు వెంకటరత్నం. ముక్కున వేలేసుకున్నారు. ఆయనన్న మాటలు సూర్యం చెవికి చేర్చారు ఛాందసాన్ని పట్టుకుని వేళాడుతున్న అక్క చెల్లెళ్ళు.

అక్కడితో తన ఆదర్శాన్ని మూట కట్టిపెట్టి ఊరుకున్నాడు సూర్యం.

★★★★★

ఒక్క పూటే భర్తను ఎరిగిన వరలక్ష్మి, అతడు లేడని సూచిస్తూ జీవితాంతం నొసటన బొట్టులేకుండానే బతికేసింది.

పిల్లలందరికీ లక్ష్మింపిన్ని అంటే ప్రత్యేక అభిమానం.

"నాకిది కొని పెట్టవా? అది కొని పెట్టవా?" అంటున్న పిల్లలందరికీ వాళ్ళకి కావలసిన వస్తువులు కొని పెట్టి సంబరపడేదు. తన సంపాదనతో అక్కచెల్లెళ్ళ పిల్లలందరికీ ఏవేవో కొనిపట్టేది. ఆడపిల్లలకూ చీరలనీ, కాళ్ళకు వెండి పట్టీలనీ, మగపిల్లలకు సినిమాలకనీ, షికార్లకనీ లెక్క లేకుండానే ఖర్చు పెట్టేది. వాళ్ళే తనవాళ్ళని తృప్తి పడేది.

ఏళ్ళు గిర్రున తిరిగాయి. అరవై ముగిసింది. పదవీ విరమణ సమయం ఆసన్నమైంది.

"లక్ష్మి, ఇది నీ స్వవిషయమే ననుకో. నీ మంచే నేను ఎప్పుడూ కోరుకున్నాను. నీవాళ్ళంటూ వీళ్ళంతా నన్ను ఎన్నో మాటలన్నారు. ఐనా సరే, నేడు నీకు మళ్ళీ ఒక విషయం చెప్పదలచుకున్నాను" అన్నాడు సూర్యం.

నీడనిచ్చిన బావనే అనేక మాటలతో బాధ పెట్టిన అక్కలే కాదు, అమ్మా నాన్నలను కూడా దృష్టిలో పెట్టుకుని ఆ బాధతో అంటున్నాడు బావ అని తెలిసన లక్ష్మి, "అదేంటి బావా నువ్వు చూపిన దారి లేకపోతే నేను ఏమైపోయేదాన్నో! నాకు చెప్పడానికి సంకోచమెందుకు? చెప్పు బావా" అనింది.

అర్థం కాక చూసింది లక్ష్మి.

"రేపటి రోజున నీకంటూ ఎవ్వరూ ఉండరు. అరవైలో పడుతున్నావు. ఇప్పటి వరకూ గడచిన జీవితం ఒకెత్తైతే, ఇక మీద మరో ఎత్తు. జీవితంలో ఈ అంతిమ చరమం అన్నది చాలా భయానకమైనది. అంచేత డబ్బు నిలవ చేసుకోవడం మంచిది" చదువుకున్న ఆమెకు ఆ మాత్రం చాలు అర్థం చేసుకోవడానిక అనిపించి అక్కడితో ఊరుకున్నాడు.

తన మేలు కోరి, తనని ఈ స్థాయికి తీసుకొచ్చిన ఉంచిన సూర్యం బావపై ఎనలేని గౌరవం కల లక్ష్మికి విషయం అర్థమయ్యింది. అప్పటి నుండి కొంత జాగ్రత్త పడింది.

★★★★★★

వరలక్ష్మి పదవీ విరమణ రోజు అది. ప్రైమరీ పాఠశాల విద్యార్థినులంతా టీచరుగారిపై ఉన్న అభిమానంతో ఎన్నో బహుమతులు తమ చిన్ని చిన్ని చేతులతో చేసి బహూకరించారు.

"టీచరు గారండీ, మీ ఇంటి దగ్గరకొచ్చి పాఠాలు చెప్పుకుంటామండి. చెపుతారు కదూ?" అంటూ బతిమాలారు.

జీవితం సాఫల్యమైన ఒక అనుభూతి ఆవేళ కలిగింది లక్ష్మికి. వారి అనిర్వచనీయమైన ప్రేమలో తడిసిపోయింది. ప్రతిఫలం కోరని నిశ్చలమైన ప్రేమ అది.

కానీ ఆ అనుభూతీ క్షణికమే అయ్యింది. ఆనందంగా ఇల్లు చేరేసరికి అక్క కుతురు సిద్ధంగా ఉంది.

"పిన్నీ, నిన్ను మా ఇంటికి తీసుకెళదామని వచ్చాను. మా అమ్మతో పాటే నువ్వూను. ఇప్పుడు నువ్వూ నాతో వచ్చేద్దూ!" ప్రేమగా అంది.

రెండేళ్ళనాడు ఒంట్లో బాగోలేని తల్లిని తీసుకెళ్ళడానికి ఏడాది పైనే దాటేసిన రోజును జ్ఞాపకం చేసుకుంది. మరో అక్కగారు చెయ్యలేక ఆమెకు సుస్తీ చేస్తే, మళ్ళీ సూర్యం బావ జోక్యం చేసుకుంటే కానీ ఆ సమస్య తీరలేదు.

"ఇప్పుడ నేను ఇక్కడ బాగానే ఉన్నాను అమ్మలూ. సుభద్రమ్మగారింట్లో నాకు ఎలాంటి లోటూ లేదు" అంది ముక్తసరిగా.

కావుడక్క కొడుకూ కోడలు ఊళ్ళోకి వచ్చారు. చిన్న కూతురు పురుడు. వచ్చేపోయే వాళ్ళతు ఇల్లు ఇరుకవ్వడంతో లక్ష్మికి మొహమాటంగా అనిపించేదు. అప్పటికే ఇద్దరక్కలూ వాళ్ళ పిల్లల







వద్దకు వెళ్ళిపోయారు. కొన్నాళ్ళకు బడికి దగ్గరా ఉన్న పేటకు అద్దెకు వెళ్ళింది. అద్దిల్లు పాఠశాలకు దగ్గరవడంతో సదుపాయంగా కూడా ఉండేది. సుభద్రమ్మగారు కూడా ఆమెలాగానే ఒంటరి వారు. ఇద్దరూ కబుర్లతో ఒకరికొకరు సహాయపడుతూ కాలక్షేపం చేసుకునే వారు.

"అబ్బా, పిన్నీ, సరే కానీ, నాకో రెండు లక్షలు కావాలి. ఉమ్మడాస్తిలో మా వాటా ఇంకొ ఏడాదిలో వచ్చేస్తుంది. పాతిక లక్షల పైచిలుకే. తగాదాలో ఉన్న పోలం బాపతు డబ్బూ వచ్చేస్తుంది. అప్పుడు నీకు ఇచ్చేస్తాగానీ, నాకిప్పుడు అర్జంటుగా రెండు ఇవ్వవలసిందే" గారాలు పోతూ స్వతంత్ర్యంగా అంది అమ్మలు.

"ఓహో, ఇప్పుడు ఆమె వలకపోసిన ప్రేమంతా రెండు లక్షల కోసమన్నమాట. ఎంత ప్రేమను నటించిందో?" అనుకుంది.

"నాకిప్పుడు వచ్చిందే మూడు లక్షలు, అందులో నీకు రెండు ఇచ్చేస్తే నాకెలా గడుస్తుంది? అంది.

"వచ్చే ఏడు ఈ పాటికల్లా ఇచ్చెయ్యనూ?" బలవంతం పెట్టినంత పని చేసింది అమ్మలు. కాదు అనలేని లక్ష్మి గుణాన్ని ఎరిగే అంతటికీ తెగించింది.

అయిష్టంగా ఇచ్చింది అనడం కంటే, ఇవ్వక తప్పలేదు అనే అనాలి.

★★★★★★★★

డెబ్బయ్యేదేళ్ళు నిండాయి. ఇంక మనిషితోడు కావలసిన పరిస్థితి వచ్చింది. ఏం చెయ్యాలో పాల్పోలేదు. ఇదివరలో పిలిచింది కదా, పోనీ అమ్మలు ఇంటికి వెళదామనుకుంది. కానీ అంతలోనే మూడేళ్ళనాటి విషయం గుర్తొచ్చింది. అక్క మంచం పట్టిందని చూడడానికి వెళ్ళింది. ఆమె పాట్లు చూసి గుండె బరువెక్కి, ఈ స్థితి పగవాళ్ళకు కూడా కలుగకూడదు, భగవంతుడా, అక్కయ్యను తీసుకెళ్ళిపో అని అనుకున్న మాట మరవలేదు లక్ష్మి. మళ్ళీ అమ్మలు మాటని తలవలేదు.

నాలుగో అక్కయ్య కూతురి ఇంటికి చేరింది. కూతురు పార్వతి చాలా నెమ్మదస్తురాలు. పిన్నిలు దొడ్డమ్మలంటే ఎంతో ప్రీతి. అందరితో ఆప్యాయంగా మసలుకునేది. విధి వ్రాతకు ఎంతటి వారైనా తలఒగ్గక తప్పదు. గుండెపోటుతో అకస్మాత్తుగా భర్తను పోగొట్టుకుంది. కూతురిని ఆ స్థితిలో చూసి కుమిలి పోయేది సత్యం. బాధతో మంచం పట్టింది. ఆమెను చూసుకునేందుకు మనిషి సహాయం కావలసి వచ్చింది.

తన ఇంటికి దగ్గరగా ఒక ఇంల్లు తీసుకుని అమ్మ, అమ్మమ్మలను అక్కడ పెట్టాడు కొడుకు వాసు. వాళ్ళను ఇరవైనాలుగు గంటలూ చూసుకునేందుకు ఒక మనిషిని పెట్టి రోజూ రెండుపూట్లా కనిపెట్టుకుని చూసుకునే వాడు.

వాసు చిన్నతనం జ్ఞాపకాలు మనసులో తాజాగా మెదిలాయి. తనున్న పరిస్థితిలో వాసుని అర్థించడం తప్ప వేరే దారి లేదనుకుంది. వెంటనే ఉత్తరం వ్రాసింది.

"ప్రియమైన వాసుకి,

సత్యం అక్కయ్య పార్వతి కులాసాగా ఉన్నట్టు తలుస్తాను. నాకు డెబ్బయ్యేదేళ్ళు నిండాయి. ఇన్నేళ్ళూ ఎహాగో లాగేసాను. ఊళ్ళో ఉన్న సూర్యం బావ కాలం చేయడంతో కావుఁడు అక్కయ్య కూడా కొడుకుల దగ్గరే పట్నంలో ఉంటోంది. నాకు కంటి చూపు మందగించింది. ఆయాసం కూడా చాలా ఎక్కువగా ఉంటోంది.

మీ అమ్మ, అమ్మమ్మలతో అక్కడికి వచ్చి ఉంటే, నేను కూడా వారితో కాలక్షేపం చేసుకోగలను. నన్ను ఈ వయసులో అక్కడికి తీసుకుని వెళ్ళి వాళ్ళతోపాటు చూసుకో గలవా? ఆర్థికంగా నిన్ను ఇబ్బంది పెట్టను. ఇంత మంది అక్కలు, వారి పిల్లలూ మనవలూ ఉన్న మన బంధు వర్గంలో, ఒక్క నిన్నే అడగాలనిపించింది. పళ్ళున్న చెట్టుకే రాళ్ళు తగుల్తాయంటారు ఇదే కాబోలు. నువ్వు ఆదరిస్తావన్న ఆశతోనే.

నీ సమాధానం కోసం ఎదురు చూస్తూ...... మీ లక్ష్మింపిన్ని"

ఆ ఉత్తరానికి, తిరిగి ఉత్తరంతో

సమాధానం చెప్పలేదు వాసు. వెంటనే ఊరికి బయలుదేరాడు. అక్కడికి వెళ్ళి చెయ్య వలసిన పనులన్నీ లక్షింపిన్నికి వివరంగా చెప్పి, మరో నెలలో వచ్చి తనను తీసుకు వెళతానని మాట ఇచ్చి వచ్చాడు.

నెల ఇట్టే తిరిగిపోయింది. వాసు ఇంటికి చేరిన లక్షింపిన్నిని కంటికి రెప్పలా చూసుకున్నాడు. అనేక సార్లు ఆసుపత్రులలో వైద్యం చేయించవలసి వచ్చింది. గుండె ఆపరేషను జరిపించి పేస్-మేకర్ అనీ, కళ్ళకు చికిత్స అనీ అన్నీ చేసాడు. ఆమెకు కంటిచూపు పూర్తిగా పోవడంతో ఇరవైనాలుగు గంటలూ సేవ చేయడానికి ఒక వ్యక్తిని ఏర్పాడు చేసాడు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా కిమ్మనక ఆమె బాధ్యతను శిరసా వహించాడు.

అలా చివరి శ్వాస వరకూ ఆమెను తల్లితో సమానంగా చూసుకున్నాడు. ప్రశాంతంగా కన్ను మూసింది లక్షింపిన్ని.

★★★★★

అంతిమ ప్రయాణం కోసం లక్షింపిన్ని పార్థివ దేహం సిద్ధంగా ఉంది. బంధువులంతా విచారంగా కూర్చున్నారు. పొరుగూర్నుంచి వచ్చిన అమ్మలు లక్షింపిన్ని శరీరం పక్కనే కూర్చుని భోరుమని ఏడ్చింది. భాస్కరం, బుజ్జి, శివ, చంటి ఇంకా అందరి అక్కయ్యల పిల్లలూ, మనవలూ వచ్చారు.

"వాసు ఇలా వస్తావురా, నీకో మాట చెప్పాలి!" అంటూ గదిలోకి తీసుకెళ్ళింది అమ్మలు. గంటన్నర తరువాత వాసు బయటకి వచ్చాడు. కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. బాధ వల్ల కంటే ఆక్రోషం వల్ల అని అక్కడ చూస్తున్న అందరికీ ఇట్టే అర్థమైపోయింది.

"తల్లి బంగరారం ఆడపిల్లలకి వస్తుంది కదా!" సన్నగా అంటున్నాడు ఒక అక్క అల్లుడు.

ఎంగిలి చేత్తో కాకిని కూడా తోలని మరో అక్క అల్లుడు నారాయణ "ఆవిడ ఖాతాలో లక్షలుంటాయేమో, పింఛన్లు బాగా పెరిగాయి!" అన్నాడు. చావుబతుకుల్లో ఉన్న తల్లిని మాత్రం తమ్ముడి దగ్గర వదిలేసి పిన్నత్తగారి ఖాతాపై కన్ను వేసిన అతని సంస్కారాన్ని చూసి అక్కడ కొందరికి అసహ్యం వేసింది.

"ఎవడినైనా పెంచుకున్నా పోయేది, ఈ దబ్బందా ఒకడికే చెందకుండా!" పక్కనే ఉన్న అతని భార్య ఎగతొయ్యగా, ఇంకో అక్క కొడుకన్న మాటకు రోత కలిగింది అందరికీ.

మరో అక్క కోడలు, "నేను లక్షింపిన్ని గారికి ఎంత చేసానో?" అంటూ ముదలి కన్నీళ్ళు కారుస్తూ పాదాలకు నమస్కరించుకుంది. అత్తగారిని ఒక్కనాడు కూడా తను ఇంటికి తీసుకెళ్ళి ఆదరించని ఆమె పిన్నత్తగారికి సేవలు చేసానని గొప్పలు పోతుంటే, అసందర్భమైనా నవ్వు ఆగలేదు బంధు వర్గానికి.

"ఏడాదిలో ఇస్తానన్న రెండు లక్షలకు సమాధానం లేకపోగా, ఇంకా ఆమె ధనంలో వాటా కోరుతూ పేచీ పెట్టిన అమ్మలు లాంటి వాళ్ళ బతుకులు చిల్లు కుండలే, ఎంత నీరు పోసినా నిండవు!!" ఆమె ఆత్మ అనుకుంది.

"సూర్యం బావ చెప్పిన మంచి మాటలను విని జాగ్రత్త పడడం వల్లనే ఈ రోజు వరకూ నా ముద్ద నేను తిన్నాను. మొత్తానికి జీవితం ముగిసింది!" బాంధవ్యాల వాసనల నుండి వెలగిపోతూ అనుకుంది.

★★★★★★

మా చిన్నమ్మమ్మ దసదిన కర్మ అంటూ వాసు పంపిన కార్డుని చూసి నా కళ్ళు చమర్చాయి.

ఇన్నేళ్ళూ అందరికీ లక్షింపిన్నిగానే చలామణీ అయిన ఆమె మొదటిసారి చిన్నమ్మమ్మగా పిలువ బడడం చూసి నా గుండె బరువెక్కింది. మా ముందు తరం ముప్పై మంది, ఆ తరువాత మాతరం వారు మనుమల వరుసలో ఉన్న మేము మరో అరవై డెబ్బై మంది బంధువర్గంలో ఒకే ఒక వ్యక్తికి బాధ్యత తీసుకోవాలని అపించింది.

అలా తీసుకున్న వాసుని అందరూ విమర్శించిన వారెందరో. ఉచిత సలహాలు పడేసిన వారు ఇంకెందరో.

జీవితం ఒక చక్రవ్యూహం. బంధువులన్న పేరుతో ఒక్కొక్కరూ పన్నిన వ్యూహంలోకి చిక్కుకు పోతూ వెళ్లిన లక్షింపిన్ని అందులో

కూరుకు పోసాగింది. సూర్యం లాంటి మంచి మనసున్న వ్యక్తులు స్వావలంబనతో బ్రతికేట్టు చేస్తే, నేటి తరానికి చెందిన వాసు వంటి మంచి మనసున్న వ్యక్తి ఆమెను అలాంటి చక్రవ్యూహంలోంచి బయట పడేసి పుణ్యం కట్టుకున్నాడు. దైవం మానుష రూపేణా అన మాటకు వీరే తార్కాణాలు.

తనకెవ్వరూ లేరన్న బాధను ఆమెకు కలుగనివ్వకుండా తనవాళ్ళందర చుట్టూ ఉండగా నిజంగా తనవాడై నిలిచిన వాసు లక్షింపిన్నిని గౌరవంగా సాగనంపాడు.

★★★★★★

# తమస్సు

ప్రతీ వత్సరం ఉగాది వస్తుంది
కాని మనిషికే ఆ విషయం కానరాదు
కళ్ళల్లో "youtube"లు ప్రవహిస్తుంటే
చైత్రం చిత్రాలు మృగతృష్ణ లే !
కోయిల గొంతు వీనులకు చేరకుండా
"బ్లూ టూత్ " గొంతు ని నొక్కుతుంది !
మామిడిపూతలు మృగ్యమవుతాయి !
చెరకు గడల తీపి కన్నా
నేతల తీపి వాగ్దానాల పై మక్కువ
ఎక్కువ !
ఇప్పుడు చెట్ల మీద కూడా మోబైల్స్ పూస్తాయి
గాలి లో పుప్పొడి బదులు "డిజే "
అలజడి ఎక్కువవుతుంది
చెట్టుకి తెలుసు వసంతం వచ్చిందని
గతి తప్పిన మనిషికి ఆశల అంతం
ఎప్పుడొచ్చిందనీ ?
జూమ్ లు గా,టీమ్స్ గా చీలిన
కాలానికి చిక్కిన వాళ్ళు
రాశి ఫలాలు చూసుకుంటారు
జీవితం ఏ పంచాంగం చెప్పలేని
శృంగభంగమవుతుందీ!
ఉగాది పచ్చడి జొమాటో లిస్టు లో
చేరుతుంది
విపణి లో ప్రతీ క్షణం
వ్యాపార క్షణికమైన
చోట
కవులందరూ గతంలో తల దూర్చి
వసంత శోభల్ని ఎలుగెత్తి చాటుతారు.
సాంకేతిక సర్ప పరిష్వంగం లో
చిక్కిన నరజాతి కి
ఉగాది ఉషస్సుల న్నీ
తరుముకొచ్చే తమస్సులే

---మూలా వీరేశ్వర రావు

కధ

# అహం బ్రహ్మాస్మి

దుర్గమహాన్తి మోహన రావు

సభలు సమేవేశాలు పెళ్లిళ్లు ఊరేగింపులు చేసుకోవచ్చు కానీ పరిమిత సంఖ్యతో, అందరు విధిగా కోవిడ్ నియమాలు పాటించాలి.ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు చూసి ఎగిరి గెంతేసి బామ్మని ఎత్తిపైకి లేపి బామ్మా నా పెళ్ళైపోయినట్టే చేతులుపట్టుకుని గిరగిరా తిప్పి మాస్కుతోనే ముద్దులు పెట్టేశాడు కామేశం .

"ఒరేయ్ కామేశం అసలు ఏమయిందిరా  ఎందుకంత ఆవేశం నా కసలే   ఆయాసం , దింపరా" అంటూ  దింపేలోపున అతని చేతుల్లోనుండి దూకేసింది బామ్మ.

కామేశ్వర రావు అనబడే కామేశానికి చూస్తూ చూస్తూనే నలభై ఏళ్ళు దగ్గిరపడ్డా పెళ్లి కాలేదు . పెళ్ళికాలేదంటే పిల్ల దొరక్క కాదు , కాటుక కలరున్న కావేరితో మొక్కజోన్న పొత్తులా నవనవలాడే కామేశానికి కలర్ మాచింగ్ అవ్వదని పెద్దల ఉవాచ .

అదే పిల్ల కావాలని తావలచిందే రంభా అంటాడు కామేశం. పెళ్ళికాలేదు కానీ కల్సి అన్ని చిరు తిరుగుళ్ళు, చిరుతిండ్లు రుచులు మరిగారు . ఇంట్లో అందరి కంటే దిగులు ఎక్కువ బామ్మకి పట్టుకుంది . అసలు వీడి పెళ్లి చూస్తానో చూడనో ! అంతలో మహమ్మారి కరోనా వచ్చింది ఈ కరోనాలో కొట్టుకుపోవడం ఖాయం అనుకుంది . చుట్టూ బంధువులు ఎవ్వరు లేకపోవటం ఎవరో ముసుగువీరులు శ్మశానం లో రాత్రికి రాత్రి తగలేయడం ! ఓలమ్మో! ఊహించుకుంటేనే కుక్కచావు! వద్దు రా దేవుడా !! బ్రహ్మ దేవుడా కనీశం వీడి పెళ్లిచూసి పోయేలా వరం ఇవ్వు అంది . ఆ బ్రహ్మ అబ్రక దబ్రా అంటూ కోవిడ్ బారినుండి తప్పించి ఇంటికి పంపేంచేశాడు . బామ్మఇంటికొచ్చిన వెంటనే, పిల్ల నల్లగా ఉంటేనేమి కళ్ళు అలిచిప్పల్లా, ఒళ్ళు అరటిపువ్వులా ఉంది అని సర్దిచెప్పి పెళ్ళికి ఒప్పించింది . కానీ జనతా లొక్డౌన్ తో ప్రజలు ఇంట్లోనే లాక్ అయిపో వలసి వచ్చి జరగవలసిన పెళ్లి ఆగిపోయింది .

ఈ ప్రభుత్వ ఉత్తరువులు వార్త తెలిసేక బామ్మా కూడా ఎగిరి గెంతాలని పించింది , కానీ ఎగిరితే వాక్సినేషన్ కి కూడా నోచుకోలేక పోతానేమోనని మాస్కుతో మూసుకుంది .

“బామ్మా రాత్రి దేవుడు నాకు కల్లో కనిపించి నీ పెళ్లిరోజు ప్రళయం వచ్చే అవకాశం ఉంది అన్నాడు”

“ కొవిడ్ కూడా ప్రళయమే కదా ! అది వచ్చింది పోయింది . నువ్వు ధీమాగా ఉండు ఖర్చుతక్కువ తో నీ పెళ్లి దగ్గ రుండి జరిపిస్తాను, అన్ని కరోనా వంటలే వండిస్తాను ,అంటే కరోనాకి తట్టుకొనే వంటలే వండిపిస్తాను. ఎవడొస్తేనేం రాకపోతేనేం , నీ పెళ్లి జరగటం ఖాయం” బాగా ధైర్యం నూరి పోసింది బామ్మ .

అంతవరకు ఊపిరి బిగబెట్టిన సన్నాయి మేళం తమ మాస్కులు తీసి ఊపిరులని సన్నాయిలో పెట్టి రాగాలాపన చేశారు.’ఎడడుగుల సంబంధం ఇది ఏనాడో వేసిన బంధం ఎన్నో జన్మల అనుబంధం’ పక్కన సాంగ్స్ ప్రోగ్రాం జరు గుతుంటే ‘మాంగల్యం తంతునానేనమే ‘ అంటూ పెళ్లి తంతు ముగించారు వేదపండితుతులు. వధూవరు లకు కావ

లసిన శోభన ఘడియలు రానేవచ్చాయి . మూడుముళ్ళు పడ్డాక ఇన్నాళ్లు వాళ్లిద్దరూ తిరిగిన చిరు తిరుగుళ్లకు

స్వస్తి చెప్పి ఎంచెక్కా చెట్టాపట్టాలేసుకుని ఏడంతస్తుల మేడలో శోభనానికి రెడీ అయ్యారు . కామేశానికి తలచుకుంటేనే

నరాలు వేడెక్కి పోతున్నాయి .కావేరీ ఇన్నాళ్లు మనం తెలిసోతెలియకో పెద్దల కళ్లుకప్పి ఎన్నో ‘చిన్న తప్పులు ‘చేశాం .ఇప్పుడు పెద్దలందరూ కలసి మాఇద్దరం ‘పెద్ద తప్పు’ చేయాలని ఈ గదిలోకి తోశారు . ఇకపై మనిద్దరం ఇలాగే ఉండిపోతాం . ఈ రేయి చల్లనిది ఈ చిరుగాలి చల్లనిది ...కాలమిలా సాగనీ .. కాదు కాలం మనకోసం ఇలాగే ఆగిపోతే , ఒకరి ఒళ్ళో ఒకరు నిదురపోతే ‘ఎంత హాయి ఈ రేయి ఎంత మధురమే ‘..అంటూ ఆమెను మరింత దగ్గరగా తీసుకున్నాడు కామేశం .ఆమె సిగ్గుపడలేదు ఏసీ రూమ్లో ఉన్నా అతని వేడి ఊపిరి ఆమెను వెన్నలా కరిగేసింది . పడుకున్నది ఫోమ్ బెడ్ అయినా నులక తాడులా పెనవేసుకున్న వారిద్దరూ .అంతలోనే బయట పెద్ద శబ్దం వచ్చింది , కరెంటు పోయింది. మెయిన్ డోర్ తెరచి బాల్కనీలోకి వచ్చాడు కామేశం . సిటీ అంతా అంధకారంలో ఉంది . గాలి వాన మెరుపులు , దూరంగా ఇరవై అంతస్తుల భవనం కుప్పగా కూలింది . ఉన్నట్టుండి గాలి హోరు ఎక్కువైంది . భీభత్సంగా భయంకరంగా మారింది వాతారణం . చుట్టూ ఉన్న ఇళ్లు భవనాలు కూలిపోయేయి . కొద్దీ గంటల్లోనే సిటీ అంతటా జలమయం. ప్రజల హాహాకారాలు వాహనాల్లో తిరిగే అలవాటు పడ్డకాళ్ళు కారుచీకట్లో తప్పటడుగులు వేస్తున్నారు . సెల్ఫోన్ టవర్స్ , టివి టవర్స్ విరిగి క్రింద చూపు చూస్తున్నాయి . కొన్ని లక్షల సెల్ఫోన్ నోళ్లు మూతబడ్డాయి . చార్మినార్ నిటారుగా ఉన్న చుట్టు జలమయంతో నిండిపోయింది .గండిపేట గట్లు తెగిపోయాయి . గోల్కొండ చుట్టూ నీరు . హుస్సేన్సాగర్ నీటి ప్రవాహం

'నమో వేంకటేశా ' అంటావు బిర్లామందిర్లో  చొరబడ్డాయి . మరికొద్ది క్షణాల తర్వాత హాహాకారాలు అరుపులు తగ్గాయి అంతటా నిశ్శబ్ద వాతావరణం. కన్ను పొడు చుకున్నా కానరాని చీకటి  చుట్టుముట్టుంది.

నగరమంతా  జలదిగ్బంధం. కామేశం గుండెల్లో దడపుట్టుంది , చుట్టుపక్కల ప్రాణికోటి ఉన్న దాఖలు లేవు .  ఎదో తెలీని శక్తి అతన్ని మీదికి తీసుకుని పోతుంది గాల్లో తేలి పోతున్నాడు. ఎటుచూసినా నిశ్శబ్ద వావరణమే . కాలుష్య శబ్దానికి అలవాటుపడ్డ మానవుడు నిశ్శబ్దం  భరించలేక పోతున్నారు . దూరంగా రామచిలుకుల జంట ఎగిరిపోయాయి . 'పయనించే ఓ! చిలుకా..ఎగిరిపో పాడైపోయెను గూడు ' పాట మనసులో మెదిలింది . కామేశం కూడా ఏటో ఎగిరిపోతున్నాడు . గగనాంతర రోదసిలో గంధర్వ గతులదాటి . అంటే ప్రళయం సంభవించినట్టే ! మరి తానొక్కడు ఎందుకు మిగిలాడు !! ఆకాశం కొన్ని చోట్ల మేఘామృతమై కొన్ని చోట్ల నీలిరంగులో కనిపిస్తోంది .

కామేశం తేలిపోతూ చంద్రమండలం దాటి స్వర్గలోకం పోతున్నట్లనిపిస్తుంది . 'దేవ దేవ పరంధామ నీలి మేఘ శ్యామా' దూరంగా నారదుడు పాడుతూ మేఘాల్లో విహరిస్తూ కనిపించాడు కామేశానికి . 'అయ్యా కాంతారావుగారు ఆగండి మీరు ఇక్కడ కూడా నారదపాత్రలో జీవిస్తున్నారా ?' గట్టిగా అరిచాడు కామేశం . "మానవా !నేను నారదమహర్షిని . సృష్టి

అంతమైనది , మరో సృష్టి జరగబోతున్నది . బ్రహ్మ లోకానికి పయనిస్తున్నాం , నారాయణ నారాయణ ! మళ్ళీ పాటందుకుని మేఘాల్లో కలిసిపోయాడు నారదుడు .

అయ్యో! అంతం అయిపోయింది !అంతా అయిపోయింది . నా కావేరి ఏ కావేరిలోనో కల్సి పోయింటుంది .నదీనాం సాగరో

గతి అంటే ఇదేనేమో ! నా కావేరి నదినుండి సాగర గర్భంలో కలసిపోయి ఉంటుంది . ఏంచేయాలో దిక్కుతోచని పరిస్తితిలో దూరంగా ఎవరో పెద్దగెడ్డంమీసాలతో పద్మాసనం కూర్చొని ఉన్నాడు .అతను పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిలాకనిపించాడు .' అన్నా ! ఎన్టీఆర్ అన్నా !ఇందాక కాంతారావు కనిపించాడు పలకరిస్తే నారదుడిని చెప్పి పారిపోయాడు . అన్నా తమరైనా  యే రాముడిగానో, మహావిష్ణుగానో కనిపిస్తే నా జన్మధన్యమయ్యేది .మళ్ళీకాల  జ్ఞానం రాస్తూ వీరబ్రహ్మేంద్రస్వామిలా దర్శన మిచ్చారా ' పలకరించాడు కామేశం . "మానవా నేను కాలజ్ఞానం రచన  చేస్తున్నాను, నేను సృష్టి కర్త బ్రహ్మను ' కనులు తెరవకుండానే సమాధానమిచ్చి కనుమరుగయ్యారు స్వామి. దూరంగా బాలు లా కనిపించాడు ! అవును బాలుయే !!నమస్తే బాలుగారు ఇక్కడకూడా మీరు పాడుతా తీయగా కార్యక్రమం  పెట్టారా . అంతా ఇక్కడే ఉన్నారే! అప్పుడే వచ్చిన లతమ్మగారు , ఘంటశాల , రామకృష్ణ , బాలమురళీ కృష్ణ , ఏఎన్నార్ , జయలలిత . వేటూరి సుందరాంమూర్తి , బాపురమణ .బాలుగారు అప్పట్లో పాడుతా తీయగా మొదటి అడిషన్లోనే నేను ఫెయిల్ అయ్యాను . ఇప్పుడో ఛాన్స్ ఇవ్వండి సార్ . మా అభిమాని ఏఎన్నార్ పాటపాడుతా 'అయ్యో అయ్యో బ్రహ్మయ్య అన్యాయం చేసేవేమయ్య 'జయలలితను చూస్తూ పాటందుకున్నాడు . సార్ లేటెస్ట్ పాట 'నా పేరే పెప్సీ  ఆంటీ' మరోపాటపాడాడు . సార్ పాట బాగుందా? శృతి శుభ్రంగా ఉందా ? సంగతులన్నీబాగున్నాయా ? గాత్ర దోషం లేదుకదా  ప్రశ్నించాడు కామేశం.'నీ బొందలా  ఉంది. శుచి లేదు శుభ్రం లేదు . గాత్ర శుద్ధిలేదు, మూత్రశుద్ధి కూడా లేనట్టుంది షుగర్ టెస్ట్ , యూరిన్ టెస్ట్ చేయించుకో !. నీ సంగతి నువ్వు చూసుకో  'మొహమాటం లేకుండాతీర్పు చెప్పాడు బాలు . ఆయనసలే కామెడీ కింగ్.

అంతలో  మళ్ళీ ల్యాప్ టాప్ తో బ్రహ్మగారు వచ్చారు  . అయ్యా ! బ్రహ్మగారు  ఇందాక నేను అజ్ఞానముతో మాట్లాడేను . అసలు ఈ ప్రళయం సంగతేంది

?ఈ కరోనా సంగతేంది ! ఇది ఉన్నట్టా లేనట్టా ఇది మళ్ళీ మళ్ళీ వచ్చే రోగమేనా దీనికి పరిష్కారం లేదా ?సృష్టి అంతమైందా ? చాల అమాయకంగా ప్రశ్నించాడు కామేశం .

మానవా ! కలియుగానికి నాలుగు లక్షల ముప్పై రెండువేల మానవ సంవత్సరాలు,వచ్చే ప్రళయాలన్నీ తాత్కాలికలే !! మానవుడి నడవడికను మార్చుకుని సత్యం ధర్మం మార్గాల్లో ముందుకు పోతూ భగవంతుడెవరో తెలుసుకోవాలి . భగవానునికి ఉన్న శక్తులన్నీ మనిషికి ప్రసాదించాడు వాటిని సద్వినియోగం చేసుకుని భగవంతుని చేరుకోవాటమే మనిషి పని . పరమాత్మ అంటే ప్రకృతే ! ప్రకృతిని కాపాడు కొంటే పరమాత్మ మీలోనే ఉంటాడు . ఈ విషయాలన్నీ ఈ మధ్య టిటిడి వారు శ్రీమద్ భగవత్ గీతలో ప్రసంగిస్తున్నారు వినలేదా మానవా ! కనీసం చాగంటి, పద్మశ్రీ గరికపాటి ప్రవచనలైనా విను "హితబోధ చేశాడు చతుర్ముఖ బ్రహ్మ.

స్వామి ! నేను ఇప్పుడు మరణించలేదా ? నా తలరాత సరిగ్గా చూసి చెప్పండి . నా కావేరి ఎక్కడుంది . ఈ సృష్టి అంతా

మునిగినా , బూడిదైనా పరవాలేదు కానీ నా కావేరిని నాకు ప్రసాదించండి " అంటూ తలని బ్రహ్మ పాదాల దగ్గర

ఉంచాడు కామేశం . "మానవా ! కావేరి గత ఏడుజన్మల నుండి నీ ధర్మపత్నే ! . నువ్వు మరీ స్వార్ధంతో అతిగా

ప్రవర్తించకు . ఇప్పుడే ఉపదేశించాను కదా . ఈ సృష్టి అంతం కాలేదు , అందరు జీవించే ఉన్నారు "అంతలోనే అంతర్ధానం మయ్యేడు బ్రహ్మ .

" నా కావేరి జీవించే ఉందా ? కావేరి... కావేరి ' అంటూ గట్టిగా గావు కేక పెట్టేడు కామేశం .

"ఏంటండీ మీరు నాఒడిలోనే నిద్రపోతున్నారు . ఏంటా కేకలు !!" అంటూ కావేరి తన ఒడిలో నిద్ర పోతున్న కామేశాన్ని తట్టిలేపింది. " ఏందీ నేను స్వర్గంలో లేనా ?"మేల్కొని దిక్కులు చూశాడు.

"నా ఒడిలో అంటే స్వర్గమే కదండీ ?"మంగళసూత్రాలు కళ్ళకద్దుకొంది . " కాదు నేను స్వర్గంలో ఉన్నాను . పెద్ద ప్రళయం వచ్చింది అందరు చచ్చిపోయారు నేనొక్కిడినే బతికి బట్టకట్టాను "

"జోకులెయ్యకండి ..బట్టలూడదీసుకుని పడుకున్నారు మీరు " ."ఛీ నోర్muయ్ ! చెప్పింది విను . స్వర్గం పోయాను అక్కడ బ్రహ్మ దర్శనం అయ్యింది . ఇంకా యుగాంతం కాలేదని కాలజ్ఞానం, సృష్టి రహస్యాలు బోధించారు . నువ్వు నేను బతికే ఉన్నాం నాకదే కావాలి " అంటూ కావేరిని మరింత దగ్గరతీసుకొని ముద్దులతో ముంచెత్తేశాడు .

"అవును మరి నీ పతివ్రతని కదా అందుకే బతికున్నారు ,అన్నట్టు రాత్రి మీరు కూడా సృష్టి రహస్యంలోనే పాల్గొన్నారు . కొంతసేపటికి బోరున వర్షం పడింది , కరెంటు పోయింది మీరు కాస్త దమ్ముకొట్టడానికి బాల్కనీలోకెళ్ళి మళ్ళీవచ్చి వాట్సాప్ లో ఇటీవల తుయిఫానులో జరిగిన ఘట్టాలు చూస్తూ నిద్రలోకి జారుకు న్నారు. అనవసరంగా అలోచించి ప్రళయం అనుకున్నారు .

మీరు నాతొ జరిపింది ప్రణయ కలాపాలు , మరెవ్వరితో చర్చించకండి , మరీ ఫస్ట్ నైటే పిచ్చోడైపోయారనుకునేరు " అతని నోరు తన చేత్తో మూసింది కావేరి.

" ఒహో నా పెళ్ళామా .. నా కావేరి నే చెప్పింది నమ్మవే ! నేను బ్రహ్మని చూశాను కలిశాను మాట్లాడాను !! నీ మీదొట్టు !! అహం బ్రహ్మాస్మి, అహం బ్రహ్మాస్మి" అంటూ జుట్టుపీక్కోవటం కామేశం వంతైంది .

★★★★

కథ

# పత్తి నవ్వింది

## మూలా వీరేశ్వర రావు

అర్ధ రాత్రి పన్నెండు గంటలు. మేఘాలు ఒక్క సారి ఘర్జించాయి.

చినుకు చినుకు గా మొదలయిన వాన కుండ పోత గా మారింది. వాన పత్తి పువ్వుల్ని తాకి, గాలి తో కలిసి కొమ్మల్ని ఊపేస్తోంది.

ఎమ్మిగ నూర్ మాలపల్లి లో ఉన్న బక్కి రెడ్డి ఉలిక్కి పడ్డాడు. అతని భార్య పొడిగా ఉండే చోటికి సామానులు సర్దుతోంది.

"ఓరి నాయనో, ఈ సారి కూడా పత్తి పంట నష్టమేనా?" ఆవేదన చెందుతున్నాడు. వర్షం ఉధృతి పెరుగుతోంది. విపరీత మైన గాలికి పెద్ద పెద్ద చెట్లే లేచి పోతున్నాయి.

ఉదయం ఆరు గంటలికి వర్షం తగ్గింది.ఇంకా

ఆకాశం లో అక్కడక్కడ నల్ల మేఘాలు తొంగి చూస్తున్నాయి.

★★★★★★★★★

బక్కి రెడ్డి చేను ని చూసుకున్నాడు. విచ్చిన పత్తి వర్షం లో తడిసిపోయింది. చేను ని చూడగానే బక్కి రెడ్డి కళ్ళ ల్లో నీళ్ళు తిరిగాయి.

నెమ్మది గా కుప్పలా పడిపోయిన పత్తి మొక్కల్ని విడదీయడం మొదలు పెట్టాడు. ఎదురుగా బాల్ రెడ్డి కనిపించాడు.

"ఇలా ఊహించే నేను ఈ సారి పత్తి వెయ్యకుండా మిర్చి వేసాను" అని చెప్పి బండి మీద ఎమ్మిగ నూర్ వెళ్ళి పోయాడు.

★★★★★★

బక్కి రెడ్డి ఇంటికెళ్ళాక భార్య ఇచ్చిన గంజి తాగి ఆలోచిస్తున్నాడు. ఎంత కష్ట పడ్డాను! బ్యాంకులు ఋణం ఇవ్వక పోతే పటేల్ దగ్గర తీసుకున్నాను.మధ్యలో నకిలీ విత్తనాల వల్ల కొంత మోసపోయాను. మళ్ళీ అప్పు చెయ్య వలిసి వచ్చింది.

పటేల్ వడ్డీని, రక్తం లా పిండి వసూలు చేసే మనిషి. పంట పోయిందంటే పటేల్ ఏమంటాడో? బక్కి రెడ్డి మార్కెట్ యార్డ్ కి వెళ్ళి రేటు కనుక్కున్నాడు.

"క్వింటాలు, రెండు వేలు" అని వాళ్ళు చెప్పారు.

ఆ మాట వినగానే బక్కి రెడ్డీ భూమి లోకి కృంగి పోయాడు. ఈ లెక్కన తనకు వచ్చే ది. ముప్పయి క్వింటాళ్ళ కి అరవై వేలేనా!

పటేల్ వడ్డీకే సరిపోదు అసలెప్పుడు ఇవ్వాలా?

★★★★★★★'

బక్కి రెడ్డి మార్కెట్ నుండి రాగానే ఇంటి దగ్గర పటేల్ ఉన్నాడు. బక్కి రెడ్డి భార్య గంగ ఇచ్చిన టీ తాగుతూ, గంగ యవ్వనాన్ని కళ్ళ తోనే కొలుస్తున్నాడు. అతని దృష్టి ఆమె నాభి మీద పడింది.

గంగ చీర కొంగు నిండు గా కప్పుకుంది.

"బక్కీ, ఈ సారి సమయానికి దుడ్డు(డబ్బు) అందక పోతే నీ ఆడదాన్ని నేను ఉంచుకుంటా" అన్నాడు బక్కి రెడ్డి కి వినబడేలా పటేల్ అన్నాడు.

" ఈ తూరి కనికరం సూపండి బాబూ" పటేల్ కాళ్ళ మీద పడ్డాడు బక్కి రెడ్డి.

" మొదటే సెప్పాను, డబ్బు దగ్గర నా అంత సెడ్డోడు ఉండడని"

పటేల్ వార్నింగ్ ఇచ్చి వెళ్ళి పోయాడు.

★★★★★★★★

మార్కెట్ రేటు పెరగలేదు. ప్రభుత్వం కూడా పత్తి నాణ్యత తగ్గిందని చెప్పి రేటు పెంచలేదు. రైతులకు గిట్టు బాటు ధర ఇప్పిస్తాం అనే మాటలు నీటి మూటలుగా మిగిలాయి.

★★★★★★★★★

వర్షం ఎవరికి హర్షం మిగల్చకుండా వచ్చి వెళ్ళి పోయింది.

ఆరోజు ఆదివారం.

ఆలస్యం గా లేచాడు బక్కి రెడ్డి. గంగ కనబడ లేదు. గంగా గంగా అని కేకలు పెట్టాడు.

"నీ ఆడదాన్ని పటేల్ బండి మీద సుశాను" అని మిర్చి రైతు మశేను చెప్పాడు.

"ఎదవ బతుకు, మనువు సేసుకున్న పెళ్ళాన్ని కాపాడు కోలేక పోయాను." బక్కి రెడ్డి మొత్తు కున్నాడు.

బక్కి రెడ్డి కి భవిష్యత్ అగమ్య గోచరం గా కనబడింది.

ఇంట్లో ఉన్న పురుగుల మందు డబ్బా తీసుకుని పొలం లోకి వెళ్ళాడు.

సరిగ్గా మందు నోట్లో వేసుకునే సమయానికి ఒక చెయ్యి ఆపింది.

" నన్ను సావనియ్యి"

" దేవుడు జన్మ నిచ్చింది చావడానికి కాదు" ఆపాడా యువకుడు. అతని పేరు నవీన్. అమెరికా లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పని చేసి తన దేశానికి ఏదైనా చెయ్యాలని

ఇండియా తిరిగి వచ్చాడు.

"బాబూ, మా రైతుల కతలింతే బాబూ"

"మీలాంటి వార్ని ఆదుకోవడానికి మేము పది మంది అమెరికా నుండి వచ్చాం. మీకు సహాయం చెయ్యడానికి. "

" అవునా"

పటేల్ సంగతి నవీన్ కి చెప్పాడు.

అదే సమయం లో బక్కి రెడ్డి కి స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ వచ్చింది.

"నీ భార్య గంగ పటేల్ ని పొడిచేసి స్టేషన్ కి వచ్చి లొంగి పోయింది"

" గంగా, ఎంత పని సేసావు. నాలాంటి బక్క రైతు ని మనువాడి నీ బతుకు బుగ్గి పాలు సేసు కున్నావా?"

అని నెత్తి మీద కొట్టుకుంటున్నాడు.

బక్కి రెడ్డి అప్పులన్నీ నవీన్ తీర్చాడు. తరువాత ప్రభుత్వం తో పోరాడి రైతు భీమా పథకం తీసుకు వచ్చాడు నవీన్. మళ్ళీ పంట కి ధన సహాయం చేసాడు.

★★★★★★★★

గంగ బెయిల్ మీద బయటికి వచ్చింది. బక్కి రెడ్డి కి నవీన్ దేవుడి లా కనిపిస్తున్నాడు.

" బాబూ మీరు ఎవరి అబ్బాయి?"

"వెంకట్రావు గారి అబ్బాయిని"

అబద్దం చెప్పాడు.

నవీన్ వడ్డీ వ్యాపారి పటేల్ కొడుకు!

★★★★★★★★

మరుసటి సంవత్సరం

బక్కి రెడ్డి పొలం లో తెల్లని పత్తి పువ్వులు వయసొచ్చిన అమ్మాయిల్లా విరబూసాయి. బక్కి రెడ్డి మనసు విరిసిన

పత్తి పువ్వయింది! అక్కడ పత్తి నవ్వింది పుడమి కి అహ్లాదం కలిగించేలా!

★★





"సుమతి సాహితి సుమాలు " అనే నూతన ప్రక్రియను ప్రారంభిస్తున్నాము
ఇందులో 4నుండి 6 వరసలు ఉంటాయి
మొత్తం 12 నుండి 24 పదాలు ఉండాలి
,కవితతో ఒక కథ చెప్పాలి అంటే నిగూఢార్థం కలిగి ఉండాలి. ప్రతి కవిత గుండెల్ని కదిలించాలి

ప్రేమ మతిని ఆలరిస్తుంది
ప్రేము గతిని అదిలిస్తుంది
గొప్ప బోర్ల పరుస్తుంది
మొప్పు బార్లా తెరుస్తుంది
బివిడి ప్రసాద రావు

పార్కులో ప్రేయసి ప్రియుడి చేతులు పట్టుకుని
ప్రియా పెళ్ళి అయ్యాక మనిద్దరమే వుండాలి
మీవాళ్ళందరినీ వదిలెయ్యాలి అంది గోముగా
వదిలేస్తా మావాళ్ళను కాదు నిన్నే అంటూ
ప్రేయసి చేతులు వదిలించుకు లేచాడు ప్రియుడు...
పారుపల్లి అజయ్ కుమార్
ఖమ్మం

ఆకాశమంత పందిట్లో పెళ్లవుతున్నాది...
అరవైరకాల వంటకాలతో భోజనాల ఘుమఘుమలు...
గొప్పోళ్ళంతా తినేది తక్కువ వదిలేసేది ఎక్కువ...
గోడవతలికి విసిరేసే ఎంగిలాకుల కోసం...
చుట్టూ మూగిన కుక్కలతో
పోరాటంచేస్తూ...
మూడురోజులుగా పస్తులున్న
పండుముసలి ఆరాటం.
.. పారుపల్లి అజయ్ కుమార్, ఖమ్మం

అప్పుతో పప్పు అరుచి
డబ్బుతో ముప్పు అనీతి
కీడుతో మైత్రి స్వజాతి
మేడుతో రాత్రి అజాతి
బివిడి ప్రసాద రావు



# సావిత్ర్యుపాఖ్యానం



**ఆచార్య ఇరపని మాధవి**

సావిత్రిని చూసి యముడు "నీవు ఎందుకు ఇలా నన్ను వెంబడిస్తున్నావు,ఇంక రావద్దు, ఆగు, ఇకపై దారి నీవు రాలేనిది, వెనుకకు తిరిగి వెళ్ళు,అసాధ్యమైన పనికి పూనుకోకు"అన్నాడు. యమధర్మరాజుతో సావిత్రి

"భర్తలు ఎక్కడికి వెళితే అక్కడికి భార్యలు కూడా వెళ్ళాలి కదా! నీ దయవల్ల, నాకు భర్తపై గల పూజ్య భావం వల్ల నేను చొరలేని చోటు లేదని నా నమ్మకం. ఇది నా మనవి. నేను నీకు చెప్పదగినదానను కాను, అయినా దయచేసి విను. అన్ని దారులలో ముఖ్యమైన దారి ధర్మమే. కాగా, ధర్మాన్ని అనుష్ఠించి చూపేవారు సజ్జనులు మాత్రమే. అందుచేత సజ్జనులే ధర్మానికి ఆధారం అని పెద్దల మాట. సజ్జనులలో నీవు శ్రేష్ఠుడివి, ధర్మరాజువు అని చెబుతారు. సజ్జన సందర్శనం ఎప్పుడూ వ్యర్థం కాదు. నీ దివ్యసందర్శనం నాకు లభించింది కదా! దానివలన నేమైనా గొప్పమేలు పొందకుండా వ్యర్థజనులలాగా ఊరక తిరిగి పోగలనా?" అని విన్నవించింది. తెలివితేటలతో కూడిన ఆమె మాటలకు ఆశ్చర్యపడి యమధర్మరాజు "సావిత్రీ!నీ మాటలు నా మనసును అలరించాయి.

నీ భర్త జీవితం తప్ప ఏదైనా వరంకోరుకో, నీకు ఆ వరాన్ని ఇస్తాను"అన్నాడు. సావిత్రి నమస్కరించి"శత్రువులచేత పరాభవం పొంది,మహానుభావుడైన సాళ్వదేశరాజు ద్యుమత్సేనుడు ఎప్పుడూ నోములునోస్తూ అడవుల్లో కాలం గడుపుతున్నాడు. అతడు కన్నులు తిరిగి పొందేటట్లు దయతో అనుగ్రహించు"అంది. దానికి యముడు "నీవు కోరిన వరం ఇచ్చాను, ద్యుమత్సేనుడికి మరలా దృష్టి ఏర్పడుగాక, ఇక సంతృప్తి చెంది వెళ్ళు, నావెంబడి రావద్దు" అని పోసాగాడు. కాని, సావిత్రి యముడిని వెంబడించి వెళ్ళింది.చాలాదూరం సావిత్రి యమధర్మరాజును విడువక వెంబడించి"దయచేసి ఆర్యధర్మాలను వినవలసింది. ర్యధర్మాలలో ప్రధానమైనది త్రికరణశుద్ధి. వాక్కు, మనస్సు, క్రియ ఈ మూడింటిలో ఎలాంటి భేదం ఉండకూడదు. మనస్సులోని ఆలోచనే మాట్లాడాలి, మాట్లాడిందే చేయాలి.

మనసు ఒకటి, మాట ఒకటి, పని ఇంకొకటి కాకూడదు. త్రికరణాలతో ఎవరికీ ఎలాంటి హింస చేయకూడదు.దీనులపట్ల దయ చూపాలి, దానం చేయాలి. దానం చేసేటప్పుడు ఎలాంటి కొరత లేకుండా కోరినవారు సంతృప్తి చెందేటట్లు సంపూర్ణంగా దానం చేయాలి. ఆశ్రితులను మనసారా ఆదరించాలి. ఇవిర్యులు నెరవేర్చవలసిన కర్తవ్యాలు,ఆచరించవలసిన ధర్మాలు. దేవతలలో

శ్రేష్ఠుడవైన ఓ యమధర్మరాజా! నీవు సర్వజ్ఞుడవు. నీకు అన్ని ధర్మసూక్ష్మాలు తెలిసినట్టివే. అందుచేత నీకు ధర్మదేవత అనే పేరు సిద్ధించింది. ధర్మగతులు నీ సంకల్పానికి అధీనాలే కదా! ఈ ప్రపంచంలోని ప్రాణికోటికి అంతటికీ నీవు ఆయాకర్మలకు తగిన ఫలితాన్నితుల్యమైన బుద్ధితో సమకూర్చేవాడవు కనుక సమవర్తి అనే బిరుదు నామం నీకు లోకంలో ఏర్పడింది. ఓ యమధర్మరాజా!పూజ్యులైన పెద్దలు నిన్ను యముడు అంటారు. అందుచేత నీవు ప్రాణికోటులను అణుస్తావు. పాపాలను శమింప చేస్తావు కనుక నీకు శమనుడు అనే పేరు కూడా ఉంది" అన్నది. దానికి యముడు సావిత్రితో " దప్పిగొన్నవాడిని చల్లని మంచునీళ్ళు సంతోషభరితుడిని చేసేటట్లుగా పాపాలను పారద్రోలే నీ మాటలు చక్కగా సందర్భశుద్ధి కలిగి నన్ను సంతృప్తిపరిచాయి. కాబట్టి సత్యవంతుడి ప్రాణం తప్ప మరో కోరిక కోరుకో, ఇస్తాను" అన్నాడు. సావిత్రి" దేవా! ద్యుమత్సేనుడికి శత్రువు అపహరించిన రాజ్యం ఎప్పటివలె లభించేటట్లు అనుగ్రహించు " అని వేడింది. యముడు అలాగే అవుతుందన్నాడు. ఇంకా " సావిత్రీ! నీవు ఇంక ఇక్కడ ఆగు, వదలని నీ పతిభక్తి అతడికి చెందింది. నీవు కోరిన కోరికలన్నీ నెరవేరాయి, ఇది ప్రవేశించలేని దారి, ఇక్కడికి రావటానికి నీకు అనుమతి లేదు" అన్నాడు. అప్పుడు సావిత్రి యముడితో " ధర్మపీఠం అధిరోహించే వారిలో మొట్టమొదట ఎన్నదగిన యమధర్మరాజా! ఎలాంటి దురవస్థలలోనైనా ధర్మాత్ములు ధర్మంతో కూడిన తమ కర్తవ్యాలను వదలలేరు. ధార్మికుల హృదయంలో పరితాపం, భ్రాంతి తరంగాలు జనించవు. కాబట్టి, భర్తను అనుసరించి వెళ్ళటం ఏవిధంగా వదిలిపెట్టేది? వదలటం న్యాయమా? ఏవిధంగానైనా సరే భ్రాంతి మూలమైన ఉద్వేగాన్ని వదలి అచంచలమైన నిష్ఠతో ధర్మాన్ని నిలపాలి కదా! " అని సావిత్రి పలుకగా యమధర్మరాజు " ఓ సావిత్రీ! ప్రసిద్ధమైన ధర్మంపట్ల మిగుల ఆసక్తి కలదానవు. సంతోషం. నీ భర్త ప్రాణాలను మాత్రం అడగవద్దు. మరి ఇంకేవరాన్నైనా అర్థించు, నీకు ఇస్తాను" అన్నాడు. సావిత్రి అతడికి నమస్కరించి " మా తండ్రి అశ్వపతికి కొడుకులు లేరు. అతడికి వందమంది కొడుకులు కలిగేటట్లు అనుగ్రహించు " అని ప్రార్థించింది. " సరే నీ కోరిక తీరుతుంది, నీ తండ్రికి నూరుగురు కొడుకులు కలిగెదరు. నీవు చాలాదూరం వచ్చావు, మిక్కిలి అలసిపోయావు, ఇంక వెనుకకు వెళ్ళు" అని యముడు చెప్పగా " ఓ యమధర్మరాజా! నాకు శ్రమ ఎక్కడిది? నా మనస్సు నా భర్త పాద పద్మాలందే లగ్నమై ఉంది, పతివ్రతలకు భర్తను ఆశ్రయించి ఉండటం తప్ప మరో ధర్మం లేదు కదా! ఇంకా ఒక విన్నపం చేస్తాను. తమ ధర్మాన్ని నిర్వహించడంలో నిష్ఠగల మహానుభావులు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటివారి సంపర్కం వలన సమస్త పాపాలు పోతాయి. బుద్ధి విశేషం చేత వారు పవిత్ర తీర్థాలతో సమానులు. వారు జంగమ పుణ్య తీర్థాలు. ఆత్మధర్మనిరతులైన మహానుభావుల గొప్పతనం వల్లనే కదా ఈ సృష్టి ప్రశాంతంగా కొనసాగుతుంది. అలాంటివారి మహిమ వల్లే సూర్య చంద్రులు గతులు తప్పకుండా తిరుగుతున్నారు. సర్వసముద్రాలు మేరదప్పక శోభిల్లుతున్నాయి. కుల పర్వతాలు కదలికలేని ఠీవితో విలసిల్లుతున్నాయి. సకల ప్రాణులతో కూడిన భూమి సమస్తాన్ని భరిస్తున్న గౌరవాన్ని పొందుతున్నది అని చెప్పి ఇంకా ఇలా అంది. ఏడు మాటలు మాట్లాడితే ఎటువంటివారైనా బంధువులు అవుతారు అని పెద్దల మాట. మనం చాలా సంభాషణ కొనసాగించాం. కాబట్టి నేను నీకు ఈ విధంగా చుట్టాన్ని అయ్యాను కదా! కనుక మిత్రుల కోరిక తీర్చటం తప్పనిసరిగా నెరవేర్చవలసిన ధర్మం, అనుగ్రహించు "ని సావిత్రి యముడికి విన్నవించింది.

యముడు సావిత్రిని చూసి "నీకు నేను ప్రసన్నుడనయ్యాను. నీవు ఇష్టం వచ్చిన వరాన్ని కోరుకో" అని అన్నాడు.

అంత సావిత్రి యమధర్మరాజుతో " ఇంతవరకు నీవు సత్యవంతుడి ప్రాణాలు తప్పించి మిగిలిన వరాలను మాత్రమే కోరుకోమన్నావు, ఇప్పుడు అలా


అనకుండా కోరుకోమన్నావు, మహాప్రసాదం. ఇక యథేచ్ఛగా నేను వరాన్ని కోరుకొంటాను. ధర్మస్థితిని చక్కగా కాపాడేవాడా! పవిత్రమైన దృష్టిగలవాడా! ఓ యమధర్మరాజా! మగడి యెడబాటు మగువకు భరించరాని ఆవేదన కలిగిస్తుంది. భర్త మరణించిన మగువ సమస్తమైన శుభకార్యాల నుండి పరిహరించిబడుతుంది. కనుక సాటిలేని యశస్సును ఆర్జించిన నా భర్త సత్యవంతుడు తిరిగి బ్రతికేటట్లు దయచేసి వరాన్ని ప్రసాదించు" అని విన్నవించింది. యముడు సరే,అలాగే చేస్తాను అని చెప్పి ఆ క్షణంలోనే సత్యవంతుడిని బంధించిన పాశాలను తొలగించి ఆమెతో "ఓ సావిత్రీ! ఇదుగో నీ మనస్సుకు సంప్రీతిని కలిగించే నీ భర్త ప్రాణాలు తీసుకో. నీ భర్త సత్యవంతుడు ఇక మీద నాలుగువందల సంవత్సరాలు జీవిస్తాడు. నూరుమంది కొడుకులను కనగలడు, పేరుప్రతిష్టలను ఆర్జించగలడు, అనేక యజ్ఞాలు చేసి దేవతలను సంతృప్తి పరుస్తాడు, తన వంశంలోనే శ్రేష్ఠుడు కాగలడు" అని అనుగ్రహించి అదృశ్యమయ్యాడు.

సావిత్రి తిరిగి వచ్చి భర్త శిరస్సును తన తొడపై ఉంచుకొని కూర్చున్నది. కొంతసేపటికి సత్యవంతుడు చైతన్యవంతుడయ్యాడు.చాలాసేపు నిద్రపోయినట్లు, కలలో ఒక బలవంతుడు తనను బలవంతంగా లాగినట్లు, అది కలగా కాక నిజమైనట్లు, భయం పుడుతున్నట్లు, పేర్కొంటూ ఆ బలవంతుడు ఎవడో చెప్పమని సత్యవంతుడు సావిత్రిని అడిగాడు. ఆమె ఆ సంగతంతా రేపు చెబుతానని, చీకటి పడుతున్నది కాబట్టి త్వరగా ఆశ్రమానికి వెళ్ళాలని హెచ్చరించింది. అతడు చాలా నీరసించి ఉన్నాడు. అంత ప్రొద్దు పోయే దాక తల్లిదండ్రులకు దూరంగా ఉన్నందుకు వారెంత విచారిస్తున్నారో అని ఆవేదనపడ్డాడు. సావిత్రి అతడిని ఓదారుస్తూ, బరువుగా ఉన్న పండ్ల బుట్టను చెట్టుకి తగిలించి, గొడ్డలి నిపుణంగా చేత పట్టుకొని, భర్తను తన చేతులతో పొదవిపట్టి, అడుగులలో అడుగులు వేయించుకుంటూ మెల్లగా, మాటలతో మనసును ఉల్లాస పరుస్తూ సత్యవంతుడిని ఆశ్రమానికి తీసుకొని వచ్చింది.

యముడిచ్చిన వరం వల్ల ద్యుమత్సేనుడికి చూపు వచ్చింది. కన్నులు వచ్చినా ఆత్మకు కన్నుల వంటి కొడుకును కాంచలేక కన్నులు లేనివాడిలా ఆ రాజు సతీ సమేతంగా దుఃఖించాడు.

ఆశ్రమవాసులు ఆ రాజుకి దృష్టి వచ్చినందుకు ఆశ్చర్యపడ్డారు. కొడుకు త్వరలో తిరిగి వస్తాడని రాజదంపతులకు ధైర్యం చెప్పసాగారు. అంతలో సావిత్రీ సమేతుడై సత్యవంతుడు వచ్చాడు. తల్లిదండ్రులా కొడుకుని కౌగిలించుకొని, వారి రాకలోని ఆలస్యానికి కారణాన్ని అడిగారు. సావిత్రి జరిగిన కథంతా చెప్పింది. ద్యుమత్సేన వంశాన్ని ఆపత్సముద్రం నుండి రక్షించిన నావగా ఆమెను అందరూ కీర్తించారు. ఆ తర్వాత ద్యుమత్సేనుడి శత్రువులందరూ అంతః కలహంతో మరణించగా, ద్యుమత్సేనుడికి రాజ్యం దక్కింది. సత్యవంతుడు యువరాజు అయ్యాడు. ఆ విధంగా సావిత్రి తన భర్తను, అత్తమామలను, తల్లిదండ్రులను, వంశాన్ని ఉద్ధరించింది.

★★★★







# గతం లో స్మృతులు

పి .సత్యన్నారాయణ

శిరోజాలు కూడా,యవ్వనానికి  శిరస్సు వంచి  సహకరిస్తాయి .

గడ్డాలు పెంచినా,చంద్రబింబములా  ముఖము ,అలంకరించిన

యవ్వనము సింహముతో పోటీ పడుతుంది అనేది సత్యము

. కంటి చూపుతో ,కనుగీటితే ,ధరణిలో కరగిపోని భామలు ఉండునా .

ఉదరము మధురాలతో నింపినా,లంఖణముతో  భాధ పెట్టినా,

ఆటలలో మునిగిన ,ఆనందముతో పరుగిడిన ,పాటలతో

మైమరపించిన ,ఉదరము యవ్వనానికి దాసోహమే .

సునాయాసముగా సమస్యలను తట్టుకొని ,మనోనిబ్బరముగా

జీవన ప్రయాణములో విజయాలను   ఆలింగనము

చేసుకొనేదే  మరపురాని  మధురమైన   యవ్వనము

అపజయాలలో కుంగి పోనివ్వదు  ఆటుపోటులు తట్టుకొని

అయినవారికి అండగా ,భాగస్వామికి తోడుగా ,వారసులకు

మార్గదర్శకుడిగా జీవనౌకను దరికి చేర్చేదే యవ్వనము

.      మలి దశలో శిరోజాలు కరువయి ,అద్దము .దువ్వెన ,

తైలము  కూడా కించిత్ అనవసరమని  గుర్తు చేస్తాయి .

గడ్డముతో జీవిస్తే చిక్కిపోయిన ముసలి తాత అని ,

రోజు గడ్డము గీస్తే షోకులు అవసరమా అనే వారు కరువా?

యవ్వనము పారిపోయినా మలిదశలో అనుభవాలు ,

క్రమశిక్షణ ,ఓర్పు ,సహనము అనే అస్త్రాలతో ,

గడచిన స్మృతులతో మలిదశను జయించే ,

గుండె నిబ్బరము భగవంతుడి ప్రసాదము



# సప్తపదులు










తంత్రం
పరతంత్రం
తెల్లవారి కుతంత్రం.మహనీయుల మంత్రం
స్వతంత్రం.
అ.వెం.కో.రామాచార్యులు
కాకినాడ౨

అర్పణం
ఆత్మార్పణం
వీరుల త్యాగఫలం.. అనుభవిస్తున్న భారతావని
వందనసమర్పణం!
జీ యస్ వీ సత్యనారాయణ
హైదరాబాద్

మంత్రం
రణతంత్రం
రక్తతర్పణల సత్యాహింసల
పరిణామమే స్వతంత్రం
డా: చిట్యాల రవీందర్
హైదరాబాద్

వీరత్వం
ధీరత్వం
ఐకమత్యమే భరతజాతి అభివృద్ధికి
భిన్నత్వంలో ఏకత్వం
యు.వి.రత్నం
ఒంగోలు

ఆడుదాం
పాడుదాం
స్వాతంత్ర్యపు కీర్తి -బావుటా గౌరవం కాపాడుదాం

శేష శైలజ(శైలి),
విశాఖపట్నం

సుఖదాయిని
శుభదాయిని
సకల జనులను దీవించే శ్రీమహాలక్ష్మి వరదాయిని

శాంతమూర్తి
హైదరాబాద్


అర్థం
పరమార్థం
వరలక్ష్మి వ్రతం చేసేవారికి పుణ్యం పురుషార్థం

మాధవీసనారా,
అనకాపల్లి

కట్టు
బొట్టు
మహాలక్ష్మిలా ముస్తాబై వరలక్ష్మీ వ్రతం చేబట్టు

నెల్లుట్ల శ్రీనివాసులు
చెన్నై





# సప్తపదులు

## జీవితసత్యాల ఆవిష్కరణం -సామాజిక బ్రతుకు ఘటనల వ్యాఖ్యానం: సప్తపదులు

బంధం
అనుబంధం
కలకాలం రక్షగా నిలవాలి తోడబుట్టిన సంబంధం!

ఆచంటి శ్రీనివాసరావు
తెనాలి.

పేగుబంధం
ప్రేమబంధం
ఆత్మీయత, అనుబంధాలను ప్రతిబింబించే తోబుట్టువుల
రక్షాబంధం
కాయల నాగేంద్ర,
హైదరాబాద్

చందనం
అభినందనం
తోబుట్టువుల బాల్యానుబంధాల స్మృతుల జ్ఞాపిక
రక్షాబంధనం
కోటమహంతి వెంకటరావు(కోవెరా),
విశాఖపట్నం

బంధం!
అనుబంధం!!
అన్నాచెల్లెళ్ల మధ్య ఉండేది తెగని రుణానుబంధం!!!

మన్నవ నాగ లలిత శ్రీదేవి
విజయవాడ

జన్మాష్టమి,
కృష్ణాష్టమి,
పిల్లలను కన్నయ్యగా చూసి మురిసిపోయే
గోకులాష్టమి..
పంతుల లలిత-నీలాంజన
విశాఖపట్నం

ధనం
ఇంధనం
బలమైన -రక్తగత సంబంధాలను తెలిపేదే రక్షాబంధనం

ఆలేటి పరంజ్యోతి
ఖమ్మం

అల్లన
మెల్లన
కృష్ణుని సవ్వడికే రాధమ్మ గుండె
ఝల్లన
డాక్టర్ వరలక్ష్మి హరవే,
బెంగుళూరు

అందాలు
చందాలు
కృష్ణాష్టమినాడు ఉట్టికొట్టే కేరింతల సంబరాల
ఆనందాలు.
సదాశివుని లక్ష్మణరావు
విశాఖపట్నం



కవి/కవయిత్రి మిత్రులారా!
మీరూ సప్తపదులు రాయవచ్చు
అందుకోసం
సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో
చేరేందుకు గ్రూప్ అడ్మిన్
శ్రీ జి.వి.నరసింహమూర్తి(శాంతమూర్తి)
97048 67867
నెంబర్ ను సంప్రదించండి





సీరియల్

# పన్నీటి జల్లు

యశోదా కైలాష్

చూడండి మురారిగారూ, మనకు ఇష్టమైన వస్తువు పట్ల ప్రేమను పెంచుకుంటూ దానిని సొంతం చేసుకోవడానికి అహర్నిశలూ ప్రయత్నిస్తూ మొత్తానికి దానిని చేజిక్కించుకుంటాం. ప్రేమ కూడా అంతే".

"అసలు మీరు ప్రేమించిన అమ్మాయి ఎలా ఉందో ఎక్కడ ఉందో ఎప్పుడైనా తెలుసుకున్నారా"?

"ఎందుకు తెలుసుకోవడం అంటారా? ఏమో ఎవరికి తెలుసు? ఆ అమ్మాయికి పెళ్లి అయిపోయింది కదా అని మీరనుకోవచ్చు. కానీ ఆ పెళ్లి కాస్తా పెటాకులు అయిపోయి ఉంటే? అమెరికా సంబంధాలైతే ఇంక చెప్పనవసరమే లేదు. ఎన్ని అనుకోని సంఘటనలు జరుగుతున్నాయండీ ఇవాళా రేపూ? ఒకవేళ ఆ అమ్మాయి తన భర్త పిల్లలతో హాయిగా సంసారం చేసుకుంటుంటే మీరెందుకు తన గురించి దేవదాసు అయిపోవాలండీ"?

"తొందరలో మీరూ పెళ్లి చేసుకోండి మురారిగారూ. సారీ, మీమీద జాలితోనో,,సానుభూతితోనో నేను ఈ మాటలు చెప్పడం లేదు. మీరంటే ఒకలాంటి గౌరవం అంతే".

# కొత్త సీరియల్

"మా పెళ్లికి తప్పక రావాలంటూ వెళ్లిపోతున్న నందిని వైపు అలా చూస్తూ ఉండిపోయాడు".

ఈ అమ్మాయి ప్రేమలో గెలిచింది. ప్రేమించిన బావను తన వాడిని చేసుకోడానికి చాలా ధైర్యం చేసింది. చైత్రను అంతగా ప్రేమించిన తాను ఆ విషయం చైత్రకు చెప్పడానికి మొహమాట పడ్డాడు. మనసులోని ప్రేమను కప్పేసుకున్నాడు. చైత్ర ఎలా ఉందో తెలియదు. పెళ్లి అయిపోగానే అమెరికా వెళ్లిపోతానంది గానీ అమెరికాలో ఎక్కడ ఉందో తెలియదు.

తన క్లాస్ మేట్ అభిరామ్ బెంగుళూర్ లో పని చేస్తున్నాడు. సంవత్సరం క్రితం తను ఆఫీసు పనిమీద బెంగుళూర్ వెళ్లినపుడు షాపింగ్ మాల్ లో భార్యా, మూడేళ్ల పాపతో కనిపించాడు. తనే గుర్తుపట్టి మరీ పలకరించాడు. కాలేజ్ లో అతను అందరితో సన్నిహితంగా ఉండేవాడు. అభిరామ్ కి ఫోన్ చేసి చైత్ర ఎక్కడుందో ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు.

నెలరోజులు ఆఫీస్ పనితో బిజీ అయిపోయాడు.

ప్రాజక్ట్ షెడ్యూల్ ప్రకారం పూర్తి అయింది. సాఫ్ట్ వేర్ టెస్టింగ్ పూర్తి చేయించాలి. ఏవైనా బగ్స్ లాంటివి వస్తే వాటిని సరిచేసి మరోసారి రాకుండా అరికట్టాలి. లేకపోతే అన్నాళ్లూ కష్టపడి డెవలప్ చేసిందంతా వృధా అయిపోతుంది. క్లైంట్ కి సంతృప్తికరంగా ఉండాలి.

మురారి పని విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటాడు కనుకనే ముఖ్యమైన ప్రాజక్ట్స్ అన్నీ అతనికే ఎసైన్ చేస్తారు.

ఆ రోజు మురారి అసిస్టెంట్ చరణ్ వస్తూనే "సర్ టెస్టింగ్ టీమ్ లీడ్ 'శ్వేతా రాఘవన్' ఒక వారం రోజులు లీవ్ పెట్టిందిట".

ఈ మాట వినగానే మురారి ముఖం అప్రసన్నంగా అయిపోయింది.

"మై గాడ్! ఎలా చరణ్"?

"నో టెన్షన్ సర్. ఆమె అసిస్టెంట్ కి ఫోన్ చేసాను. ఆవిడ ఈ మధ్యనే ఒక నెలరోజులైందిట ఆ విభాగంలో చేరి. అంతక మునుపు ముంబై లో వేరే కంపెనీలో పనిచేసిందిట. 'చైత్రా పసుమర్తిట' పేరు. ఆమె టెస్టింగ్ టేకప్ చేస్తానంది.

ఏవో ఆలోచనలలో ఉన్న మురారి చరణ్ చెప్పిన పేరుని సరిగా వినలేదు. టెస్టింగ్ చేస్తానని చెప్పిందన్న మాటమాత్రం విన్నాడు.

"థాంక్ గాడ్, ఆ పని ఏమిటో చూడు చరణ్ అంటూ ఆదేశించాడు".

ప్రాజక్ట్ డెలివర్ అవగానే ఒక వారం రోజులు శెలవు పెట్టేసి రెడీగా ఫిక్స్ చేసి పెట్టుకున్న పెళ్లి చూపులకు వెళ్లాలని అనుకుంటున్నాడు అక్కా బావగారు కూడా వస్తామన్నారు తనతో.

మురారి మనసు ఎందుకో గత కొద్ది రోజులుగా ఏదో తెలియని ఉత్సాహంతో ఉరకలేస్తోంది. ప్రాజక్ట్ పూర్తి అయిందన్న ఆనందమా లేక అతని జీవితంలో ఏదైనా మహాద్భుతం జరగబోతోందన్న శుభ సంకేతమా?

మధ్య మధ్యలో చరణ్ వచ్చి టెస్టింగ్ ఫైనల్ స్టేజ్ లో ఉందని, కొత్తగా వచ్చినావిడ చాలా ఏక్టివ్ గా ఇన్ వాల్వ్ అవుతున్నట్లు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నాడు.

ఆరోజు పదకొండు గంటలకు టెస్టింగ్ పూర్తిచేసిన ప్రాజక్ట్ ను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడానికి చైత్రా పసుమర్తి వస్తున్నట్లు చరణ్ కి ఫోన్ చేసి చెప్పింది.

ఆమె వచ్చేసరికి మురారి, చరణ్, గాక మరొక టీమ్ మెంబర్ రెడీగా ఉన్నారు కాన్ఫరెన్స్ హాల్ లో.

లేప్ టాప్ లో సీరియస్ గా ఏదో బ్రౌజ్ చేసుకుంటున్న మురారికి "సర్ ఈవిడే 'చైత్రా పసుమర్తి' అంటూ చరణ్ పరిచయం చేస్తుంటే ఒక్క క్షణం తెప్పరిల్లి తలెత్తి ఆమెవైపు చూసాడు".

ఆకాశం భూమి ఏకమైనట్లు కళ్లెదురుగా మెరుపులు.

"తను భ్రమ పడడం లేదుకదా"?

"తను చైత్ర కదూ"?

"అనుమానం ఏమిటి? నిస్సందేహంగా చైత్రే"!

అలాగే ఉంది, కాస్తంత ఒళ్లు చేసింది అంతే.

ఎదురుగా నవ్వుతూ నిలబడిన చైత్ర ముఖంలో ఏ భావమూ లేదు.

"సర్ అన్న చరణ్ పిలుపుకు వాస్తంలోకి వచ్చిన మురారి సర్దుకుంటూ 'ప్లీజ్ కేరీ ఆన్' అన్నాడు".

మానిటర్ లో స్లైడ్ షో వేసి ప్రతీ పాయింట్ ని చక్కగా వివరిస్తోంది. ఆమె ఉపయోగించిన టెస్టింగ్ టూల్స్ ని, ప్రాసెస్ నంతటినీ స్టెప్ బై స్టెప్ వివరిస్తోంది. ఎటువంటి బగ్స్ రాలేదని, సాఫ్ట్ వేర్ పర్ ఫెక్ట్ గా పని చేస్తోందన్న క్వాలిటీ ఎష్యూరెన్స్ సర్టిఫికెట్ ను కూడా స్లైడ్ షోలో చూపించింది.

అక్కడ ఉన్న ముగ్గురూ ఆమెను అభినందిస్తూ టెస్టింగ్ పర్ఫెక్ట్ గా చేసినందుకు థాంక్స్ చెప్పారు.

చైత్ర అది తన బాధ్యతని చెబుతూ ధన్యవాదాలు చెప్పి అక్కడనుండి నిష్క్రమించింది.

మురారి ఇదంతా కలా భ్రమా అనే పరిస్తితిలో ఉండిపోయాడు.

చైత్ర ముంబై నుండి ఒక నెలరోజుల క్రితమే ఈ ఆఫీస్ లో జాయిన్ అయిందని టెస్టింగ్ మెథడాలజీస్ లో ఆరేడు సంవత్సరాల అనుభవంతో చేరిందని ఆ తరువాత మురారి తెలుసుకున్న సమాచారం.

ఆరోజు ఆదివారం, సమయం సాయంత్రం ఆరుగంటలు. శీతాకాలం. మలిసంధ్యకాంతులతో పుడమి కెంజాయిరంగు లీనుతోంది.

జూబ్లీహిల్స్ లోని "లిటిల్ ఇటలీ" రెస్టారెంట్ లో మురారి, చైత్రా ఇద్దరూ టేబుల్ కి ఎదురెదురుగా కూర్చున్నారు.

"అబ్బ, పది సంవత్సరాల తరువాత నిన్ను చూస్తున్నాను మురారీ ? నీలో పెద్దగా మార్పు లేదు కానీ మరింత రంగుదేలి స్మార్ట్ గా

కనిపిస్తున్నావు". బట్ నైస్ టూ సీయూ, ఎలా ఉన్నావు, ఎందుకు నన్ను కలవాలని ఇక్కడకు పిలిచావు"?

"నేను బాగానే ఉన్నాను చైత్రగారూ".

"చైత్రా అను చాలు".

"థాంక్యూ, ఆ మధ్య మన క్లాస్ మేట్ అభిరామ్ కి ఫోన్ చేసాను. అభీ గుర్తున్నాడు కదూ చైత్రా"?

"ఓ, అభీ గుర్తులేకపోవడం ఏమిటి మురారీ? 'ఎర్ర తేలంటూ' నిక్ నేమ్ తో పిలిచేవాళ్లం కదా". గుర్తొచ్చిందో ఏమో ఫక్కుమంటూ నవ్వేసింది. నవ్వుతుంటే ఆమె బుగ్గలమీద ఏర్పడిన డింపుల్స్ చూడడానికి ఎంతో ముచ్చటగా అనిపించాయి.

"కాలేజ్ విడిచి వెళ్లిపోయాకా మన క్లాస్ మేట్స్ ఎవ్వరితో నాకు కాంటాక్ట్స్ లేవు చైత్రా. చాలా మంది యూ.ఎస్, మరో దేశాలకు వెళ్లి పోయారని తెలిసింది. నీ గురించి సడన్ గా గుర్తొచ్చి అడిగాను. నీవు ఇండియాలోనే ఉన్నావన్నట్లు మిగతా వివరాలేమీ తెలియవన్నాడు. యూ.ఎస్ నుండి ఇండియా వచ్చేసారేమో అనుకున్నాను".

"నేను నీకు గుర్తు రావడం, నా గురించి మన అభీని వాకబు చేయడం నిజంగా వింతే సుమా అంటూ చైత్ర జోక్ చేసింది".

"అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం, నిన్ను సడన్ గా మా ఆఫీస్ లోనే చూడడం. నీవేమిటిక్కడ అనుకుంటూ ఆశ్చర్యపోయాను చైత్రా".

"ఒకొక్కపుడు అనుకోనివే ఎదురౌతూ అద్భుతాలు జరిగిపోతాయి మురారీ. పాత స్నేహితులను కలిసినప్పుడు కలిగే ఆనందం వర్ణనాతీతం. నాకు కూడా నీలాగే ఎవరితో కాంటాక్ట్స్ లేవు. అందరికీ దూరంగా ఉంటూ నా ప్రపంచంలోకి ఎవరినీ రానీయకుండా కట్టడి చేసుకున్నాను".

'మీ అందరి లాగ నాకు వెంటనే జాబ్ రాలేదు. ఎమ్ టెక్ చదువుదామా అనుకున్నాను. కానీ ఏకాగ్రత పెట్టలేనేమో అనిపించి ఒక సంవత్సరం పాటు ఏవో ఆ కోర్సులూ ఈ కోర్సులూ అనుకుంటూ చేసాను. లక్కీ గా బాంబే లో 'డాటామేటిక్స్' లో జాబ్ వచ్చింది. ఆరు సంవత్సరాలుగా అక్కడే చేస్తూ ఉండిపోయాను.

# కొత్త సీరియల్

ఎందుకో ఛేంజ్ కావాలనిపించి మీ కంపెనీకి అప్లై చేసాను. నేను ఎక్స్ పెక్ట్ చేయని ఆఫర్ వచ్చిందని ఇక్కడ చేరిపోయాను'.

"ఒంటరిదాన్ని, ఎక్కడ వస్తే ఏముందని వచ్చేసాను. అదే ఫేమిలీ ఉంటే కదలడం కష్టం కదా"?

"ఒంటరిదానివేమిటి చైత్రా? నీ భర్త పిల్లలూ యూ.ఎస్ లో ఉన్నారా?"

"అసలు ఉంటేగా నీవు చెప్పిన వాళ్లు"?

"అంటే? అతని భృకుటి ముడిపడింది".

చైత్ర మాట్లాడలేక తలదించుకుంది.

"నీకు అభ్యంతరం లేకపోతే, నీ వ్యక్తిగత విషయాలు అడుగుతున్నానని అనుకోపోతే ఏమైందో చెపుతావా చైత్రా అర్ధంగా అడిగాడు".

"నాకు వినోద్ తో పెళ్లియిన మాట వాస్తవం మురారీ. కానీ పేరుకి మాత్రమే ఆ పెళ్లి. ఏమిటో అమ్మా నాన్నగారికి అప్పుడు అమెరికా సంబంధం అంటే మోజు. నేనేదో అక్కడ మహారాణీలా సుఖపడిపోతానని. కాళ్లదగ్గరకు వచ్చిన సంబంధం అంటూ ఆనందపడుతూ పెళ్లిచేసారు. పెళ్లైన మొదటి రోజునే నాకు అతను తన గురించి వివరంగా చెప్పేసాడు. అతని తండ్రి బలవంతం మీద నన్ను చేసుకున్నానని. అతను అక్కడ తన కొలిగ్ అయిన పంజాబీ అమ్మాయిని ప్రేమించానని సహజీవనంలో ఉన్నానని చెప్పాడు. ఆమెను విడిచి నీతో కాపురం చేయలేనని చెప్పాడు. పొరపాటు జరిగిపోయిందని దానికి పరిహారంగా నన్ను యూ.ఎస్. లో ఎమ్.ఎస్ చదవడానికి స్పాన్సర్ చేస్తానని, అలాగే కావలసినంత డబ్బు ఇస్తానన్నాడు. నాకు ఇష్టమైనట్లుగా బ్రతికే ఏర్పాటు చేస్తానన్నాడు. నేను అక్కడకు రానన్నాను. డివోర్స్ ఇచ్చేయమన్నాను".

'ఏ హడావుడీ, గొడవ లేకుండా ఆ బంధం నుండి విముక్తి అయిపోయాను మురారీ. కానీ దురదృష్టవశాత్తూ వినోద్ ఇప్పుడు లేడు'.

"అంటే"?

"నాకు డివోర్స్ వచ్చి ఆరునెలలు అయింది అప్పటికి. ఒక రోజు మా నాన్న కంగారు పడుతూ నాతో చెప్పారు. వినోద్, అతను ప్రేమించిన అమ్మాయి తో వీకెండ్ కి ఏదో ఫ్రెండ్స్ పార్టీకి వెళ్లి ఉదయం ఏడున్నరకు తిరిగి వస్తుండగా ఆ సమయంలో భారీగా మంచు కురుస్తుండటంతో ఎదురుగా వస్తున్న టిప్పర్ వాళ్లు ఉన్న కారుని వేగంగా ఢీ కొట్టడంతో వాళ్లిద్దరూ అక్కడికక్కడే చనిపోయారుట అని. ఈ వార్త న్యూస్ పేపర్ లోనూ, టీవి ఛానళ్లలోనూ వచ్చింది కూడా. పాపం వాళ్ల పేరెంట్స్ బాధ వర్ణానాతీతం. మా నాన్న అయితే ఒకటే కళ్లనీళ్లు పెట్టుకున్నారు. అన్నీ సక్రమంగా జరిగి ఉంటే ఆ అమ్మాయి స్థానంలో నీవే ఉంటే? అందుకనే ఏమో భగవంతుడు నిన్ను ఆ బంధం నుండి దూరం చేసాడు, నీవు మాకు దక్కావంటూ పదే పదే అంటూ ఉండేవారు. ఏమిటో భగవంతుని లీలలనుకున్నాను.

"ఓ, సో సారీ, పూర్ ఫెలో వినోద్"

"అవును మురారీ. అమ్మా నాన్నా బాధపడ్తూ ఉండేవారు. నేను కూడా ఎన్నాళ్లని బ్రేక్ అయిపోయిన నా వివాహం గూర్చి ఆలోచిస్తూ కూర్చుంటాను? మనసు ఒక్కటే డైవర్ట్ చేసుకోవడం కాదు, ఉద్యోగం చేసుకుంటూ స్వతంత్రంగా జీవించాలనుకున్నాను. ఏవో కొన్ని కోర్సులు చేసి లక్కీగా ముంబైలో జాబ్ సంపాదించాను. నాన్న మరో పెళ్లి చేసుకోమన్నారు. చేసుకోనన్నాను. నాకు ఈ స్వేఛ్ఛా జీవితం బాగానే ఉంది. మళ్లీ పెళ్లి అంటే భయంగా ఉంటుంది. వచ్చే వ్యక్తి యొక్క అభిప్రాయాలూ నావీ కలవాలి. ఇరువురికీ పరస్పర అవగాహన లేకపోతే మళ్లా జరగరానిది ఏదైనా జరిగితే? నాకు ఒకసారి అనుభవం అయినందుకు ప్రతీ చిన్న విషయమూ సందేహంగానే ఉంటుంది మురారీ".

" నా కథ తో వాతావరణాన్ని బరువెక్కించానేమో కదూ"?

"అదేమీ లేదులే చైత్రా"!

"ఇంకా ఏమిటి సంగతులు

మురారీ? కంపెనీలో నీకు మంచి పేరుందని తెలిసింది. నీవు ఎలాగైనా జీనియస్ వి. అప్పుడు చదువే లోకంలా ఉండేవాడివి. ఇప్పుడు ఆఫీస్ లో 'పని రాక్షసుడివని' బిరుదు కొట్టేసావు. ప్రాజక్ట్ మేనేజర్ వి. "అమ్మో రాక్షసుడి ఎదురుగా నేను అంటూ గుండెల మీద చేతులు వేసుకుంటూ భయం నటిస్తున్న చైత్రనే చూస్తూ నవ్వేసాడు మురారి".

"హమ్మయ్య నిన్ను నవ్వించ గలిగాను. నీ గురించి చెప్పు మురారీ? నీ భార్యా, పిల్లలు హేపీ లైఫ్ కదూ"?

మురారి మౌనం వహించాడు. అతని అంతరాత్మ "ఇంక జాప్యం చేయకు మురారీ, మంచి అవకాశం, చైత్ర పట్ల నీ #అంతరంగం లోని అభిప్రాయాన్ని చెప్పేయమంటూ హెచ్చరిస్తోంది".

"ఏం మాట్లాడవే మురారీ"?

పోనీ నేనే మాట్లాడతాను లే. కాలేజ్ లో చదువుకునేటప్పుడు నీవంటే నాకు ఎంత అడ్మైరో తెలుసా మురారీ? ఎంత బ్రిలియంట్ గా మేన్లీ గా ఉండేవాడివి? నీతో చనువుగా ఉండాలనిపించేది. కానీ నీవు దూర దూరంగా ఉంటూ నాకా అవకాశాన్ని ఇచ్చేవాడివి కాదు. నేను ఎంత మందిలో ఉన్నా నీవు నా వైపే ప్రత్యేకంగా చూసేవాడివి. నాతో ఏదో చెప్పాలనుకుంటున్నట్లుగా ఉండేవి నీ చూపులు.

"ఆ రోజులు ఎంత బాగుండేవో కదూ మురారీ? ఏ బాధ్యతలూ బాధలూ లేని రోజులు. ఎంతో జాలీగా గడచిపోయేవి".

"పెళ్లైనా అలాగే ఉన్నావా? నీ శ్రీమతి నీకు మాట్లాడే అవకాశ మివ్వకుండా తనే అంతా మాట్లాడేస్తోందా ఏమిటీ అంటూ ఫక్కున నవ్వింది", 'జలతారు వెన్నెల జాలువారినట్లుగా'.

చైత్ర నవ్వుకి మురారి పరవశించిపోతున్నాడు.

"మరోసారి అతని #అంతరంగం ఎందుకు సందేహిస్తావు మురారీ? అంటూ గుర్తుచేసింది".

"ఏమీ లేదులే చైత్రా? అసలు నా జీవితంలోకి ఇంతవరకూ ఏ అమ్మాయికీ చోటివ్వలేదు". పెళ్లి చేసుకోలేదు.

"వ్వాట్?"

మురారికి ధైర్యం వచ్చేసింది.

"అవును చైత్రా అప్పట్లో నిన్ను నేను గాఢంగా ప్రేమించాను. ఇప్పటికీ నిన్ను అలాగే ఆరాధిస్తున్నాను. నమ్ముతావా"?

"అప్పట్లో ఈ విషయం నీకు చెప్పాలంటే ఏదో బెరుకు, నీవు తిరస్కరిస్తావేమోనన్న సంశయం. అప్పుడే ఇంజనీరింగ్ పూర్తి అయింది. ఇంకా పరిపక్వత రాని వయస్సు. నీ పెళ్లి శుభలేఖ ఇస్తూ రమ్మనమని ఆహ్వానించావు. నీ కోసం ఒక చక్కని రాధాకృష్ణుల విగ్రహం #బహుమానము గా కొన్నాను. నిన్ను ఇంక జీవితంలో చూడలేనన్న బాధ, నా తొలిప్రేమ విఫలమైందేనన్న ఒకలాంటి వైరాగ్యం నన్ను నీ పెళ్లి చూడకుండా అడ్డుకున్నాయి. నీ పెళ్లి #బహుమానము అలాగే నా షోకేస్ లో అలంకరణగా ఉండిపోయింది. ఆ విగ్రహాన్ని చూస్తూ నీవెలా ఉన్నావో, అసలు నేను నీకు గుర్తు ఉన్నానా అనుకుంటూ తలపోస్తూ ఉంటాను. ఆ తరువాత ఏ అమ్మాయి నీలా అనిపించలేదు. పెళ్లిమీద విముఖతతో ఉండిపోయాను".

"నిజమా మురారీ, నమ్మలేకపోతున్నాను".

'ఆమె కళ్లు దుఖమో, ఆనందమో తెలియని ఉద్విగ్నతతో వర్షిస్తున్నాయి'.

"నిజం చైత్రా, నీకు ఇష్టమైతే మనం పెళ్లి చేసుకుందాం. మనకంటూ ఒక అందమైన ప్రపంచాన్ని నిర్మించుకుందాం".

"అప్పుడు కలలా నా జీవితంలోకి వచ్చావు, కలగంటున్నపుడు వెళ్లిపోయావు, మళ్లీ ఇలా మెరిసావ్. కలో నిజమో ఇంకా

అర్థంకావడంలేదు. దీన్ని నిజం చేయవూ చైత్రా"?

"నేను జీవితంలో మోసపోయాను మురారీ. ప్రేమ, పెళ్లి అనేవి నా జీవితంలో ఎండమావులే అనుకుంటూ బ్రతుకుతున్నాను. కానీ ఇలా నన్నే ఆరాధిస్తూ, నా మీద సముద్రమంత ప్రేమను తన మనసులోనే దాచేసుకుంటూ బ్రతుకుతున్న నా మురారి 'వాసంత సమీరంలా' వచ్చి తన ప్రేమతో

## కొత్త సీరియల్

నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తాడని ఊహించలేదు. నేను ఎంతటి అదృష్టవంతురాలిని మురారీ అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంటున్న చైత్రను అక్కడ నుండి లేపి ఆసరాగా ఆమె భుజాలచుట్టూ చేతులు వేసాడు".

''మా నాన్నకీ విషయం చెపితే ఎంత సంతోష పడ్తాడో మురారీ. మా చెల్లెలి పెళ్లి కుదిరినప్పటి నుండీ మా నాన్నకి నామీద దిగులు మరీ ఎక్కువైంది. నేను ఒంటరిగా ఉండిపోతానేమోనని. మా తమ్ముడు తను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుని బెంగుళూర్ లో సెటిల్ అయ్యాడు. మా చెల్లెలికి హైద్రాబాద్ లో జాబ్ వచ్చిందని మా అమ్మా నాన్నా రెండు సంవత్సరాల క్రితం వైజాగ్ నుండి వచ్చేసి మా చెల్లెలితో ఇక్కడే ఉంటున్నారు. నాన్న రిటైర్ అయిపోయారు. మా నందిని పెళ్లి మా మమయ్య కొడుకుతో జరగబోతోంది".

'నందిని' పేరు విన్న మురారి ఒక్క క్షణం గతుక్కుమన్నాడు. "ఏ నందినీ అంటూ అనుమానంగా అడిగాడు"?

"ఏ నందిని గురించి నీకు తెలిసేమిటంటూ చిలిపిగా అడిగింది".

"శ్రీరామ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లో పనిచేసే నందిని తో నాకు పరిచయం ఉంది. అందుకని కాస్త డౌట్ వచ్చింది".

''తను మా చెల్లెలే. మా మామయ్య కొడుకూ, నందూ ప్రేమించుకున్నారు. మామయ్యకి మా నాన్న అంటే ఇష్టంలేదు మొదటినుండీ. దానికి తోడు నాకు డివోర్స్ అయిందని, మా తమ్ముడిది ప్రేమ వివాహమన్న వ్యతిరేక భావం మా కుటుంబం మీద. అదీగాక మా నాన్న తన పిల్లలకు పూర్తి స్వేఛ్ఛని ఇచ్చేసాడన్న ఒకలాంటి అసహనం. నందూని కోడలుగా చేసుకోడానికి అభ్యంతరం పెట్టాడు. నందూ చాలా మొండిది. బావను తప్పించితే ఎవరినీ చేసుకోనని హఠం వేసి మొత్తానికి సాధించింది. ఎలాగైతేనేమీ వారిరువురి పెళ్లికి మామయ్య అంగీకరించాడు''.

'మురారి నందిని తో తన పరిచయం ఎలా జరిగిందో అంతా పూసగుచ్చినట్లుగా చెపితే చైత్ర కు నవ్వాగలేదు'. "మా నందూ మహా మొండిది. అది అనుకుంటే ఎంతకైనా తెగిస్తుంది. మొత్తానికి నిన్ను ట్రాప్ చేసి మరీ తన పని సాధించుకుందన్నమాట. అది నీతో అలా ప్రవర్తించినందుకు తన తరపున నేను సారీ చెపుతున్నాను . నీవు మంచివాడివి కాబట్టి సరిపోయింది. ఎవరైనా అయితే దీన్నొక అవకాశంగా తీసుకుని దాన్ని బ్లాక్ మెయిల్ చేసి ఉంటే? రోజులన్నీ మనకు అనుకూలంగా ఉండవు కదా మురారీ".

"ఇట్స్ ఓకే చైత్రా, నాకు సుతిమెత్తగా బ్రైన్ వాష్ చేసిందిలే. ప్రేమను దక్కించుకోడానికి ఎంతైనా తెగించాలని చెప్పింది. చిన్న పిల్లైనా తను చెప్పిన మాటల్లో ఎన్నో నిజాలున్నాయి. ఒక విధంగా నందిని మాటలే నాకు ధైర్యాన్ని స్ఫూర్తిని ఇచ్చాయి. అందుకనే నా మనసులోని ప్రేమను నీకు చెప్పగలిగాను".

"ఇప్పుడు మనిద్దరిని ఇలా చూస్తే మీ నందిని ఏమంటుందో తెలుసా చైత్రా"?

''ఏమంటుందీ ఉత్సుక నిండిన గొంతుకతో అడిగింది చైత్ర".

"నేను అప్పుడే అనుకున్నాను మురారి గారూ, మీరూ మీరు ప్రేమించిన అమ్మాయీ మళ్లీ కలుసుకుంటారని".

మురారి మాటలకు చైత్ర నవ్వింది.

"నీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలి మురారీ? నీ మనస్సులో నా కింత స్థానం ఉందని తెలిసి ఉంటే ఎప్పుడో పరుగెత్తుకుని వచ్చి నీ చేతుల్లో వాలిపోయేదాన్నంటూ అర్ధంగా మాట్లాడుతున్న చైత్ర అరచేతిని పట్టుకుంటూ మృదువుగా తన పెదవులతో స్పృశించాడు".

మరో వారం తరువాత ఒక మంచి రోజున మురారి, అతని అక్కా, బావా, చెల్లెలు ఆమె భర్తతో కలసి చైత్రా వాళ్లింటికి వెళ్లాడు. చైత్ర నాన్నగారు రాజశేఖర్ వాళ్లను సాదరంగా ఆహ్వానించారు.





అంతకముందే చైత్ర వాళ్ల నాన్నతో మురారి గురించి అంతా చెప్పి ఉంచింది. ఆయన ఆనందానికి అంతులేదు. చైత్ర గురించే ఆయన దిగులంతా. ఇప్పటికైనా చైత్రను చేసుకోడానికి ఒక మనసున్న వ్యక్తి వస్తున్నాడన్న ఆయన సంబరం అంతా ఇంతా కాదు. నందినికి మురారి వివరాలు ఏమీ చెప్పవద్దని దాన్ని సర్ప్రైజ్ చేద్దామని చెప్పింది తండ్రితో.

మురారీ వాళ్లకూ చైత్ర పేరెంట్స్ చూపించే ఆప్యాయతా అభిమానం, వారి సంస్కారం అవీ చాలా నచ్చాయి. చైత్ర విషయంలో ఏదీ దాచకుండా అన్నీ చెప్పారు. 'పెళ్లై ఇరవైనాలుగు గంటలు గడవకుండానే దాని వైవాహిక జీవితం అల్లకల్లోలం అయిందని బాధ పడుతూ చెపుతూంటే మురారి అక్కా బావ జరిగిపోయిన దానికి బాధపడొద్దని, అన్నీ మన మంచికే అనుకోండంటూ సర్ది చెప్పారు'.

ఇన్నాళ్లకు మురారి ఒక ఇంటివాడు అవుతున్నందుకు, అదీ తను ప్రేమించిన అమ్మాయితో అనుకునేసరికి వాళ్ల ముఖాలలో అంతులేని ఆనందం తొణికిసలాడుతోంది. ''అమ్మ ఉంటే మురారి పెళ్లి విషయం విని ఎంత సంతోషపడేదో'' అనుకుంటున్న మురారి అక్క కళ్లల్లో నుండి రెండు కన్నీటి బిందువులు రాలిపడ్డాయి.

దిలో చైత్ర రెడీ అవుతోంది. నందిని హడావుడిగా పట్టుచీర కట్టేసుకుంటూ ''అక్కా పట్టుచీర కట్టుకోకుండా సింపుల్ గా ఈ చూడీదార్ డ్రెస్ ఏమిటే అంటూ కోప్పడింది''.

"నా బదులు నీవు కట్టుకున్నావు కదా నందూ, నాకు ఈ డ్రెస్ చాల్లే అంటోంది".

"పెళ్లి చూపులు నీకా నాకా? నిన్ను చూసుకోడానికి వచ్చిన వాళ్లు ఏమనుకుంటారు? పెద్దమ్మాయి కంటే చిన్నమ్మాయే పట్టుచీరలో లక్ష్మీదేవిలా మెరిసిపోతోంది. చిన్నమ్మాయినే చేసుకుంటాం అంటే"? అక్కని క్రీగంట కొంటెగా చూస్తూ అనేసరికి చైత్ర నందిని తలమీద సుతారంగా మొట్టింది.

"చేసుకుంటానంటే మాత్రం నీవు చేసేసుకుంటావా? పాపం ఫణీంద్ర ఏమైపోతాడే"?

"అబ్బా అక్కా, నా ముందు నీవు చిన్నదానిలా నాకు చెల్లెలులా అనిపిస్తున్నావు. పోనీ ఈ ఫాన్సీ చీర కట్టుకోవే అని బ్రతిమాలేసరికి నాకు నచ్చింది కట్టుకుని వస్తాలే గానీ, ఈలోపుల నీవెళ్లి అమ్మకు సాయం చేయవే నందూ. గంటనుండి ముస్తాబు అవుతున్నావు. ఇంక చాల్లే వెళ్లుమంటూ చెల్లెలిని గదిలోనుండి తోసేసి తలుపులు వేసుకుంది".

ఒక అయిదు నిమిషాలు తరువాత నందిని చైత్ర ఉన్న తలుపులు దబ దబా బాదేస్తూ "అక్కా తలుపుతీయవే, నీకొక సర్ప్రైజ్" అంటూ చైత్ర తలుపులు తీసేదాకా ఊరుకోలేదు.

చైత్రను తోసుకుంటూ లోపలికొచ్చిన నందూ "వచ్చిన పెళ్లికొడుకు మురారిగారక్కా అంటూ ఆనందంతో చైత్రను పట్టుకుని ఊపేసింది".


"మురారిగారా? అతనెవరో నాకే తెలియదు, నీకెలా తెలుసే"?

" అబ్బా అక్కా వివరాలు తరువాత చెపుతాను. ముందు నీవు రా అక్కా అంటూ అక్క చేయిపట్టుకుని హాల్లోకి తీసుకొచ్చింది".

చైత్ర అందరినీ చిరునవ్వుతో పలకరించింది. మురారి చైత్రను ఎందుకు అంతగా ఇష్టపడ్డాడో వాళ్లకు చైత్రను చూడగానే అర్థం అయింది. 'ఎంత బాగుందీ అమ్మాయి అని అనుకోకుండా ఉండలేకపోయారు'.

"ఏం నందినీ మీ ఫణీంద్ర ఏమంటున్నాడు?

ఇక్కడ ఉంటాడేమోనని ఎక్స్ పెక్ట్ చేసాను" అనగానే, '' అక్కకి పెళ్లిచూపులని ఫణిని రమ్మనమన్నాను మురారిగారూ. కానీ వాళ్ల నాన్న అంటే మా మామయ్య ఫణిని వెళ్లొద్దని, పెళ్లికి ముందే అస్తమానూ అత్తవారింటికి రాకపోకలు సాగిస్తే అల్లుడిగా నీ హోదా తగ్గిపోతుందని చెప్పాడుట. మా మామయ్యకు ఛాదస్తం ఎక్కువలెండి. అందుకనే రాలేదంటూ'' సమాధానమిస్తున్న నందిని మాటలకు అందరూ ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. మా నందూ వట్టి అల్లరి పిల్ల, ఏది మాట్లాడాలో మాట్లాడకూడదో కూడా తెలియదంటూ రాజశేఖర్ అనేసరికి ''నాన్నా మన నందూ







గురించి మురారి కి తెలిసినంతంగా మరి ఎవరికీ తెలియదు" అన్న చైత్ర మాటలకు అక్కడ మరోసారి నవ్వులు విరిసాయి.

మురారి, చైత్రా ఇద్దరూ ఇంజనీరింగ్ లో క్లాస్ మేట్సనీ, మురారి తన అక్కను ప్రేమించాడనీ అందుకనే వివాహం చేసుకోలేదన్న విషయం విన్న నందినికి మురారి పట్ల గౌరవాభిమానాలు మరింత పెరిగాయి.

"మురారిగారూ, మిమ్మలని ఒక మాట అడగొచ్చా? అన్న నందిని వైపు ప్రశ్నార్ధకంగా అడగమన్నట్లు చూసాడు మురారి".

"మిమ్మలని చూసినపుడే నేను ఊహించాను. మీకు ఏదో ప్రేమ వ్యవహారం ఉందని, మీ ప్రేయసి మీ మనస్సులో బలంగా తిష్టవేసుకుందని. ఏదో నాటికి మీరు మీరు ప్రేమించిన అమ్మాయి నే పెళ్లి చేసుకుంటారని".

మురారి చైత్రవైపు చూసాడో క్షణం. నేను చెప్పలేదూ అన్నట్లుగా. ఆ కళ్లల్లో చైత్ర పట్ల అంతులేని అనురాగం. ఆ అనురాగానికి చైత్ర మనసు పన్నీటి జల్లు కురిసింది.

#సమాప్తం#

వచ్చే నెల నుంచి

మరో కొత్త సీరియల్

# 'నయన'

శ్రీ విజయ దుర్గ గారి

కలం నుండి





వాస్తవ కధలు

కథ

# “అరతి “

ఈదర శ్రీనివాస రెడ్డి

“పగలంతా ఖాళీగా ఉంటావు కదా “ రోజుకు ఒక్కసారైనా శ్రీవారి నోట్లో నుంచి ఈ మాటలు రాకుండా ఉండవు.

శ్రీ వారు ఆఫీసుకు వెళ్లి పోయిన తరువాత నేను ఖాళీగా ఉంటానని అనుకుంటు ఉంటారు . మా వారే కాదు అందరి మగాళ్ళ ఆలోచన ఇదే .ఇంటి దగ్గర భార్యలు ఖాళీగా కుర్చుని టి వి సీరియల్స్ చూస్తూ ఆనందిస్తుంటారని భ్రమ పడుతుంటారు .

పైపెచ్చు అప్పుడప్పుడు శ్రీవారు , ప్రైవేటుగా పిజి చేయ్యచ్చుగా ఏదైనా ఉద్యోగం వస్తుంది అనేవాళ్ళు . అదీ చూద్దామని ఇగ్నోలో ఎం బి ఏ కి కట్టాను , కాని ఎక్కడ తీరింది పుస్తకం తెరవటానికి .

సూర్యుడు ఉదయించక ముందే తెల్లవారుజ్హామునే లేచి రాత్రి తిన్న ప్లేట్లు , గిన్నెలు కడిగి బ్రేక్ ఫాస్ట్ లోకి టిఫిన్ , లంచ్ కి రెండుకూరలు వండితే కాని పనిఅవ్వదు . అప్పటికి ఉరుకులు పరుగులతోనే ప్రతి ఉదయం గడిచి పోతుంది . శ్రీవారు ఆఫీసుకు ,పిల్లలు స్కూల్ కి వెళ్ళే దాక క్షణం తీరిక ఉండదు .

ఒక్కోసారి  ఉదయం పూటా కాసేపు నిద్ర పోదాం అనిపిస్తుంది , కాని కళ్ళ ముందు కర్తవ్యం కనపడుతూ ఉంటుంది , దానితో నిద్ర పోదామన్నా నిద్ర పట్టదు .

చదువుకునే రోజుల్లో ఆలస్యంగా నిద్ర లేస్తే అమ్మ ఊరుకునేది



కాదు . “ ఏమిటా మొద్దు నిద్ర రేపు పెళ్ళైతే ఇబ్బంది పడతావు అని ఆరు దాటాక  ముందే లేపేది .

“పోనిలేవే చిన్న పిల్ల, కాసేపు నిద్ర పోనీ , రేపు పెళ్ళైతే ఎటు కుదరదు ..” నాన్న నామీద జాలి చూపించే వాడు

“ సరే , అయితే నేను కుడా కాసేపు నిద్ర పోతాను ఆ ఇంటి పనులేవో మీరే చుడండి “ అని అమ్మ మంచం ఎక్కగానే , నాన్న నోటికి తాళం వేసుకుని నావంక జాలిగా చూసేవాడు .

మా నాన్న కుడా అందరి తండ్రుల లాంటివాడే కాదా ? ఏ తండ్రైనా భార్య కష్టపడితే పట్టించుకోడు కాని , కూతురు కష్టపడితే మాత్రం విల విల లాడి పోతాడు .

ఏ మగాడు భార్యకు పనుల్లో సాయం చెయ్యటానికి ముందుకు రాడు .అందుకు మా నాన్నకు  , మా శ్రీవారికి మినహాయింపు ఏమి లేదు . లేవటమే ఏ  ఎడు గంటలకో లేస్తారు . ఒకవేళ ముందే లేగిచినా మార్నింగ్ వాక్ అంటూ రోడ్లన్నీ తిరిగొస్తారు .అలా తిరిగే బదులు భార్యకు కాస్త సాయం చేద్దామని వీళ్ళకు ఎందుకు అనిపించదో నాకు అర్ధం కాదు .

శ్రీవారు,పిల్లలు వెళ్లి పోయిన తరువాత ఇల్లంతా శుభ్రం చేసి , బట్టలు వాషింగ్ మిషన్ లో వేసి , వాటిని ఆర వేసే టప్పటికి ఒళ్ళు అలిసిపోతుంది . భోజనం చేసి కాస్త నడుం వలచే లోపు మళ్ళి పిల్లలు స్కూల్ నుంచి వస్తారు , ఇంకెక్కడ తీరిక ఉంటుంది  . శ్రీవారు ఖాళీగా ఉన్నావు అన్నప్పుడల్లా నవ్వువస్తుంది తలుచుకుంటే .

★★★★

ఈ మధ్య పిల్లల నోట్లో నుండి కూడా ఈవే మాటలు రావటం గమనించాను

"ఖాళీ గానే ఉన్నావు కదమ్మా మాకు అది చేసిపెట్టచ్చుగా... ఇది చేసి పెట్టొచ్చుగా " ఇలా తనతో పిల్లలు అనడం సహజం అయిపోయింది...

శ్రీవారి మాటలను విని విని పిల్లలుకుడా అలాగే తయారయ్యారు. ఆవు చేలో మేస్తే , దూడ గట్టున మేస్తుందా అని ఉరికే అన్నారా ?

ఒక అబద్ధం రోజూ వింటూ ఉంటా అదే నిజమనుకునే ప్రమాదం లేక పోలేదు .

ఖాళీగా ఉంటున్నాను అని వీళ్లంతా అనుకుంటున్నారు కదా! నేనెందుకు ఒకరోజు ఖాళీగా కూర్చోకూడదు అన్న ఆలోచనవచ్చింది నాకు... ఆలోచన రావడమే తరువాయి పిల్లలు, మావారు వెళ్ళాక ఏ పని చేయకుండా ఖాళీగా కూర్చున్నాను...

ఏమి తోచక టివి పెట్టాను ,అందులో "అమ్మ రాజీనామా "సినిమా వస్తోంది .ఆ సినిమా ఎన్ని సార్లు చూసి ఉంటానో నాకే తెలియదు .నేనే కాదు ప్రతి ఆడది చూడాల్సిన సినిమా , సారీ ..ప్రతి మగాడు చూడాల్సిన సినిమా. నిజంగా ఆ సినిమా తీసిన డైరెక్టర్ దాసరిగారికి హాట్స్ ఆఫ్ చెప్పాలి .అప్పుడప్పుడన్నా ఇలాంటి సినిమాలు వస్తు ఉంటె ఆడవాళ్ళ విలువ తెలుస్తుంది సమాజానికి .

ఆ సినిమా చూస్తున్నంత సేపు , నేను కుడా తల్లి పోస్టుకి రాజీనామా చేస్తే.. అనే అలొచన వచ్చింది . కాని పిల్లలు కళ్ళముందు కదిలాడారు . అమ్మ రాజినామాలో శారద పిల్లల పెళ్ళిళ్ళు అయిన తరువాత రాజీనామా చేస్తుంది , కాబట్టి నేను కుడా అప్పటిదాకా ఆగాల్సిందేనా? .. ఏమో పిల్లల వాలకం చూస్తుంటే ముందే రాజీనామా చేస్తే పోతుందని పిస్తుంది . ఎలాగైనా వీళ్ళకు తల్లి విలువ తెలియ చెప్పాలి అని ఆ నిమిషాన మనసులో గట్టిగా అనుకున్నా ..

★★★

సాయంత్రం అయింది.పిల్లలు ఇంటికి వచ్చారు... వస్తూనే...

ఇంటిముందు పిల్లలు వేసుకున్న షూ పాలిష్ మూత తెరిచివుంది. చెప్పుల స్టాండు చిందరవందరగా ఉంది.."అమ్మ కు ఏమైంది ఇవన్నీ ఎందుకు సర్దలేదు..............అను కుంటూ..."అమ్మా!ఎక్కడున్నా వు? ఆకలవుతుందే ఏమైనా పెట్టు" అంటూ లోపలి అడుగు పెట్టారు

నానుంచి ఏ జవాబు లేదు..."తొందరగా కాస్త పాలైనా ఇవ్వమ్మా! అన్నారు.

నానుంచి ఏ జవాబు లేక పోవటం తో "...అమ్మ పలకడం లేదేంటి అని నన్ను వెతకసాగారు"

...ఇంతలో శ్రీవారు కుడా రానే వచ్చారు.. రాగానే "అరతి !తల పగిలిపోతోంది వేడిగా ఓ కప్పు కాఫీ " అంటూ సోఫాలో కూలబడుతూ అరిచారు అందరి మగాళ్ళలా

ప్రతి మగాడు ఆఫీసులో ఎదో పెద్ద ఇరగదిసుకుని పనిచేసినట్టు , బాగా అలిసిపోయినట్టు నటిస్తూ ,ఇంటికి రాగానే టీ , కాఫీ అంటూ అరుస్తుంటాడు

ఆడవాళ్ళు కుడా నటిస్తే ఎలా ఉంటుందో ఈరోజు తెలుస్తుంది శ్రీవారికి

..నానుంచి .జవాబులేక పోవటం తో , నేను వంటింట్లో ఉన్నానేమో అని వెళ్లి చూసారు...అక్కడ ...ఎక్కడ ఉన్న పాత్రలు అన్నీ అక్కడే వాసనకొడుతూ కనపడ్డాయి

..బెడ్రూం లో ఉన్నానేమో అని వెళ్ళారు. అక్కడ శ్రీవారు తుడుచుకుని పడేసిన తడి టవలు అక్కడే ఉంది.. బనియన్,లుంగీ మంచం మీదే ఉన్నాయి... బెడ్ పై ఉన్న దుప్పట్లు అస్తవ్యస్తంగా అలాగే పడి ఉన్నాయి...

నేను కనపడక పోయేసరికి పిల్లలు,భర్త తనని వెతుక్కుంటూ మేడ పైకి వచ్చారు. మెడ మీద అతిధులకని ఒక గది వేసాము .అక్కడ నన్ను చూడగానే ..

ఏమైంది అరతి ఇక్కడ పడుకున్నావు .. అంటూ దగ్గరకొచ్చి నా పక్కన కూర్చున్నారు .పిల్లలు కుడా ఏమైందమ్మా అంటూ దగ్గరకొచ్చారు

"మీరు ఉదయం వెళ్ళిన దగ్గరనుంచి ఒకటే జ్వరం ,ఇంట్లో కన్నా ఇక్కడ కాస్త హాయిగా ఉంటుందని ఇక్కడ పడుకున్నా ...

"జ్వరమా ...ఏది చూడని " అంటూ నా చెయ్యి పట్టుకున్నారు

" వళ్ళు కాలిపోతోంది గా , డాక్టర్ దగ్గరికి వెళ్దామా .." అంటూ కంగారుగా లేచారు

"పర్లేదండి ,పనివత్తిడి వల్ల వచ్చింది , ఒక్కరోజు రెస్ట్ తీసుకుంటే తగ్గిపోతుంది .." అన్నాను నీరసం నటిస్తూ

"పగలంతా ఖాళీ నేగా, అంత పని ఏమి చేసావు ..కొంపదీసి ఇల్లంతా బూజులు దులిపావా ఏమిటి "అంటూ అడిగారు

ఈయన మారరు అని మనసులో అనుకంటూ ," అదేమీ లేదు ...ఈ ఒక్క రోజు మీరు పిల్లలు కాస్త ఇంటి పనులు అందుకుంటే ..రేపటికి తగ్గి పోతుంది " అన్నాను

" ఓస్ అదెంత పని , చిటికలో చేస్తాము , పదండి పిల్లలు .." అంటూ కిందకి వెళ్లారు

ఏమి జరుగుతుందో చూద్దామని వాళ్ళ వెనుకే వెళ్లి హాలో సోఫాలో పడుకున్నాను నీరసం నటిస్తూ .

పిల్లలు ఇల్లంతా ఉడ్చి ఎక్కడి సామాన్లు అక్కడ సర్దారు , శ్రీవారు అంట్లు కడిగి , పిల్లలకు అన్నం పెట్టి ," నీ సంగతేంటి .."అంటూ నాదగ్గరకు వచ్చారు .

"ఓ గ్లాసు మజ్జిగ ఇవ్వండి చాలు .." అన్నాను లోలోపల నవ్వుకుంటూ

నా చేతికి మజ్జిగ అందిస్తూ " అసలు నీకు జ్వరం ఎందుకు వచ్చింది .."అంటూ మళ్ళీ అడిగారు

"చెప్పాను కదా అలసిపోయానాని .."అన్నాను .ఇదంతా ఉల్లిపాయ మహిమ అని ఆయనకి ఏమి తెలుసు

"అవునవును ఒక్కపుటకే నాకు అలాగే అనిపిస్తోంది..వాళ్ళు అలిసిపోయింది ..ఇంక నేను పడుకుంటా ..ఏదన్నా అవసరం అయితే పిలువు "అంటూ బెడ్ రూమ్ లోకి వెళ్లి పడుకున్నారు

★★★

మర్నాడు కావాలనే నేను శ్రీవారు లేచే దాక నిద్ర లెగవలేదు .

శ్రీవారే కాఫీ పెట్టుకొచ్చి నన్ను నిద్ర లేపారు.

కాఫీ కప్పు అందిస్తూ .."ఎలా ఉంది " అని అడిగారు

" జ్వరం తగ్గింది , కాని బాగా నీరసం గా ఉంది ' అన్నాను

"ఒకే రెస్టు తీసుకో , నే హోటల్ కి వెళ్ళి టిఫిన్ తెస్తాను " అన్నారు

" మరి పిల్లలకు, మీకు లంచ్ .." అన్నాను

"చూస్తాను .. "అంటూ వంట గది వైపు నడిచారు

నేను కుడా ఆయన వెనకాలే వెళ్ళా ఏమి చేస్తారో చూద్దాం అని

నన్ను చూసి "నువ్వెందుకొచ్చావ్ ,ఏమంత పని ఇది ..నువ్వు అలా కూర్చో " అంటు బియ్యం కడగటం మొదలు పెట్టారు .

నేను అక్కడే కుర్చుని ఆయనకు తెలియనివి చెపుతూ ఉంటె మొత్తానికి వంట పూర్తి చేసారు

ఈ లోపు పిల్లలు లెగిస్తే వాళ్ళను ఇల్లాంతా ఉడవమని పురమాయించారు

వాళ్ళు బిక్క మొహాలేసుకుని నావంక చూస్తూ, " ఏంటమ్మా! ఇక్కడ ఇలా కూర్చోని ఉన్నావు.." అన్నారు

"నీరసంగా ఉందమ్మ" అన్నాను ఇక తప్పదు అన్నట్టు ఇల్లు ఉడవటం మొదలు పెట్టారు

ఇలోపు శ్రీవారుహోటల్ కి వెళ్ళి టిఫిన్ తీసుకొచ్చి పిల్లలకు , నాకు టిఫిన్ పెట్టారు "

మొత్తానికి పిల్లల్ని తయారు చేసి స్కూల్ కి పంపి , శ్రీవారు సోఫాలో కూలబడ్డారు

" అదేమిటి తీరిగ్గా కూర్చున్నారు , ఆఫీసు టైం అవుతుంది వెళ్ళరా ?"

"కాస్త బడలిక గా ఉంది , ఈ రోజు సెలవు పెడదాము అనుకుంటున్నా " అన్నారు

విషయం అర్థమైన నేను లోలోపలే నవ్వుకుంటూ

" మంచిదే లెండి ,మధ్యాన్నం వాషింగ్ మెషిన్ లో బట్టలు కుడా వేసి ఉతకొచ్చు మీరుంటే, అలాగే స్కూల్ నుంచి వచ్చే పిల్లలకు ఏమన్నా స్నాక్స్ చెయ్యొచ్చు " అన్నాను

నా మాటలకు ఆయనకు ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక నా

వంక జాలిగా చూసారు .

మొత్తానికి బట్టలు ఉతికి అలసిపోయి మంచానికి అడ్డం పడ్డారు శ్రీవారు .శ్రీవారిని చూస్తే నాకు జాలి వేసింది .ఇక ఆ నాటకానికి స్వస్తి పలికి పిల్లలకి స్నాక్స్ చెయ్యటం మొదలు పెట్టాను .

ఈ లోపు శ్రీవారు మేల్కొనటం తో , టీ కప్పు, స్నాక్స్ తో ఆయన ముందు నిలబడ్డ .

" నిన్ను ఏ పని చెయ్యొద్దన్నా గా ,ఇవన్ని ఎందుకు మళ్ళీ జ్వరం తిరగ బెడితే రేపుకుడా నేను సెలవు పెట్టాలి " అన్నారు దీనంగా

నాకు ఆయన పరిస్థితి చూసి నవ్వు ఆగలేదు

"ఎందుకు నవ్వుతున్నావ్ .."అయోమయంగా చూస్తూ అడిగారు

" మీరేగా నేను ఖాళీ గా కూర్చుంటున్నాను అంటూ ఉంటారు ,అందుకనే నేను ఒక్కరోజు ఖాళీగా కూర్చుంటే ఎలా ఉంటుందో చూద్దామని ఇలా నాటకం ఆడాను "

నాటకమా ?..మరి జ్వరం .."

"ఉల్లిపాయ మహిమ .. చంకలో ఉల్లిపాయ పెట్టుకుంటే జ్వరం అదే వస్తుంది ..మీకు తెలియదా "

నేను ఖాళీగా కూర్చుంటే ఇల్లు ఇంత దరిద్రంగా ఉంటుందో , ఎక్కడి పనులు అక్కడే ఆగిపోతాయో ఇప్పటికైనా గమనించారా " అన్నాను

శ్రీవారు ఏమి మాట్లాడకుండా టీ చప్పరించటం మొదలు పెట్టారు

ఈ లోపు పిల్లలు కుడా వచ్చారు , వాళ్లకు అర్ధమైనట్టుంది నా నాటకం

ఏమనుకున్నారో ఏమో "ఏమోయ్ !తప్పయింది.. సరే నీకుకూడా నేనే కాపీ కలుపుకుని వస్తాను ఇక్కడే ఉండు.సరేనా? అన్నారూ శ్రీవారు

"మేము నీకు స్నాక్స్ తెస్తాం ఉండమ్మా! అన్నారు పిల్లలు..

"ఖాళీగా ఉండటం అంటూ ఇల్లాలికి ఉండదు...అది మీరు తెలుసుకుంటే చాలు...మీరు అనడం చూసి పిల్లలు అనడంతో కాస్త బాధనిపించింది అంతే! ఇంటి ఇల్లాలికి ఎంతో పని ఉంటుంది... ఖాళీగా ఉన్నావని, ఉద్యోగం చేయడం లేదని చులకన చేయడం తప్పుకదా!...అందుకనే ఈ నాటకం ఆడాను "


శ్రీవారికి ఏమి మాట్లాడాలో తెలియక ముద్దాయిలా నా ముందు మౌనంగా నిలబడ్డారు

పిల్లలు మాత్రం ,"సారీ మమ్మీ .."అంటూ నన్ను పెనవేసుకున్నారు

శ్రీవారు కుడా ముందు కొచ్చి నా బుగ్గ మీద ఓ ముద్దు ఇచ్చి చెవిలో సారి బంగారం అన్నారు "

ఇదేగదా ఏ ఆడదానికైనా కావాల్సింది .

★★★★



ఆధ్యాత్మికం

# ధర్మ సందేహాలు

సహస్ర వ్యాస కవి



## దైవాన్ని కోరిక ఎలా కోరాలి?

1.నువ్వు బతికి ఉన్నంత కాలం ధార్మిక కార్యాలు నీ సంపదతో చేయాలి అని కోరుకోవాలి, అంటే ఎప్పుడూ నువ్వు ఇచ్చే స్థితిలో ఉండాలి అని అర్థం అంటే ఎప్పటికీ నీకు సంపాదన ఉంటుంది.

2. నా ఇంట్లో దైవానికి నిత్య నైవేద్యం ఉండాలి అని కోరుకోవాలి అంటే నీ ఇంట్లో ధాన్యం ఎప్పుడూ నిలువ ఉంటుంది.

3. నా ఇంట్లో నేను నిత్య పూజ రోజు చేయాలి అని కోరుకోవాలి, అంటే నీ ఆరోగ్యం బాగుంటే నువ్వు ఎప్పుడూ ఆనందంగా ఉంటే నీ ఇంట్లో నిత్య పూజ చేస్తావు...

4. నా ఇంటికి ఎవ్వరు వచ్చినా కడుపునిండా భోజనం చేసి వెళ్ళాలి అని కోరుకోవాలి. అంటే నీకు అనుకూలవతి అయిన ధర్మపత్నీ (పతి ) భాగస్వామి అవుతుంది.


5.నేను నా చివరి దశ వరకు నీ క్షేత్రానికి దర్శనానికి రావాలి, అంటే నీకు సంపూర్ణ మైన ఆరోగ్యాన్ని ఇవ్వమని అడగటం...

6. భాగవతులతో నీ గడప నిండుగా ఉండాలి అని కోరుకోవాలి, అంటే నీకు సమాజంలో తగిన గౌరవం మంచి పేరు రావాలి అని కోరుకోవడం...

7. కుటుంబం అంతా సంతోషం గా క్షేత్ర దర్శనానికి రావాలి అని కోరాలి అంటే నువ్వు ఆరోగ్యంగా, ఆర్థికంగా, కుటుంబంలో అన్యోన్యంగా ఉంటేనే జరుగుతుంది ఇంక ఏమీ కావాలి జీవితానికి...

8. చివరిగా నేను పండు ముత్తైదువుగా సంతోషంగా కాలం చేయాలి అని కోరుకోవాలి, అంటే భర్తకు సంపూర్ణ ఆయుష్షు ఆరోగ్యం కోరుకోవడం..మనకు తల్లిదండ్రులు ఆ దైవమే వారిని కాక ఎవరిని అడుగుతాము? కానీ ఆ అడిగే కోరిక ఇలా ఉంటే ఆ దైవం కూడా అనుగ్రహిస్తాడు.


# బొమ్మలు చేద్దాం రండి








**దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి**



**బొమ్మకు రంగులు వెయ్యండి**




## తేడాలు కనిపెట్టండి





రాశి ఫలాలు

# ఈ నెల మీ అదృష్టం....



కొలుకుల చంద్ర శేఖర్




సహోద్యోగులతో వైరం ఏర్పడవచ్చు. సంయమనంతో వ్యవహరించండి. అధికారుల ఒత్తిడి వల్ల మనశ్శాంతి కరువవుతుంది. బదిలీ అవకాశం ఉంది. ఖర్చుల నియంత్రణ అవసరం.




శ్రావణం: వివాదాలకు దూరంగా ఉండండి. కళాకారులకు మంచి అవకాశాలు వస్తాయి. వ్యాపారం లాభసాటిగా కొనసాగుతుంది. సమాజంలో ఉన్నతస్థాయి వ్యక్తు లతో పనులు నెరవేరుతాయి.




విద్యార్థులు శ్రమించ వలసిన సమయం. ఉద్యోగులకు పనిచేసే చోట పర పతి పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. అనవసరమైన ఆలోచనలను పక్కన పెట్టి, పనులపై మనసు నిలపడం మంచిది.




విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయి. విదేశీ విద్యకు అవకాశం ఉంది. కొత్త ఉద్యోగంలో చేరుతారు. పనులు అనుకున్న సమయంలో పూర్తి కావడంతో ఆనం దంగా ఉంటారు. సహోద్యోగులతో స్నేహం పెరుగుతుంది. వ్యాపారులు కొత్త ఒప్పం దాలపై దృష్టి నిలుపుతారు.




రోజువారీ పనులు నిరాటంకంగా కొనసాగుతాయి. శ్రద్ధ అవసరం. చిన్నచిన్న అనారోగ్య సమస్యలు, చికాకులు ఉంటాయి. పొదుపుపై మనసు నిలు పుతారు. ఈ నెల ద్వితీయార్థంలో మానసిక ఇబ్బందులు ఎదురుకావచ్చు.





వివాహాది శుభకార్య ప్రయత్నాల్లో అందరి సహకారం లభిస్తుంది. వ్యాపారులు ఒప్పందాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వ్యాపార విస్తరణ పనులు వాయిదా వేసుకోవడం మంచిది.



# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....






ప్రయాణాల మూలంగా ఖర్చులు ఉంటాయి. ఉద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది. అధికారులతో స్నేహంగా ఉంటారు. వ్యాపార విస్తరణ పనులు వాయిదా వేసుకోవడం మంచిది.




ఈ నెలలోనూ అనుకూల ఫలితాలు పొందుతారు. వ్యాపారం లాభ దాయకంగా సాగుతుంది. సమయానుకూల నిర్ణయాలు తీసుకోవడం వల్ల సత్ఫలి తాలు సాధిస్తారు. పలుకుబడి పెరుగుతుంది.




సమాజంలో గుర్తింపు లభిస్తుంది. అయితే వివాదాల జోలికి వెళ్లకండి. ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుంది. విద్యార్థులు శ్రమించాల్సిన సమయం.




ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు. బంధుమిత్రులతో పనులు నెరవేరు తాయి. శుభకార్యాలకు హాజరవుతారు. వృత్తిలో పనిభారం పెరిగిననూ, ఆదాయం సంతృ ప్తికరంగా ఉంటుంది. సంయమనంతో ఆలోచించండి.




శ్రావణం: కోర్టు పనులలో అనుకూల ఫలితాలు ఉంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరగడంతో మనశ్శాంతి ఉండదు. ఆర్థిక పరిస్థితి నిలకడగా ఉంటుంది. కళాకారులకు ఈ నెల అనుకూలిస్తుంది. కొత్త అవకాశాలు వస్తాయి. ఆదాయం పెరుగుతుంది.




శ్రావణం: ఆదాయం పెరుగుతుంది. వ్యాపారం లాభదాయకంగా కొనసాగు తుంది. అనవసర చర్చల వల్ల మనశ్శాంతి కొరవడుతుంది. ఖర్చులు పెరుగు తాయి. రాబడి పెంచుకునే మార్గాలను అన్వేషిస్తారు.

# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com


**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల.


**రూ. 25 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక
రూ.200 విలువచేసే పుస్తకాలను
ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది
నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే
చెయ్యండి
7 8 9 3 1 1 1 9 8 5
చందా కట్టిన వారికి ప్రతి నెల
flip బుక్ పాస్ వర్డ్ తో
పంపబడును

సుమతి
అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమతి 'సాహితీ సామ్రాట్ ' పోటీలు
# ఆగష్టు - 2024 ఫలితాలు

## ఈ నెల ఉత్తమ కథలు :

### మొదటి బహుమతి రూ1000 /-

1.ఎటర్నల్ — ఎం .కారుణ్య కుమార్
2.ఒక్క అడుగు — కృష్ణమాచార్యులు
(బహుమతి ఇద్దరికీ సమానంగా పంచబడును

### రెండవ బహుమతి రూ500/-

1. గరగ — ఎం .సుగుణారావు
2.అమ్మ మరణం — శ్రీపతి లలిత
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### కన్సొలేషన్ బహుమతి పొందిన కథలు :

1. నేను ఒంటరిని కాను — యశోదా కైలాష్
2.ఎద లోపల — వి .అనసూయ
3. లక్షిం పిన్ని — వి .పూర్ణ కామేశ్వరి
(బహుమతి లేకపోయినా పోటీకి పరిగణించబడును )

### సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథలు :

1.మూగ ప్రేమ — యు .మధుపాత్ర శైలజ
2. నైతిక విలువలు — పి .మంగా రత్నం

## ఈ నెల ఉత్తమ కవితలు:

### మొదటి బహుమతి రూ500 /-

1. గీతోపదేశం — కె .విజయ్ కుమార్
2. తామరాకు పై నీటి బొట్టు — ఎన్ .లహరి
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### రెండవ బహుమతి రూ250/-

1.షో బిజినెస్ — విజయకుమార్ గడియా
2. అపర కుబేరుడు — ఎస్ శ్రీనివాసరావు
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును)

### కన్సొలేషన్ బహుమతి

1. పజిల్ — మూలా వీరేశ్వర రావు
2. కాలం — బోడె మాధవి
(బహుమతి లేకపోయినా పోటీకి పరిగణించబడును)

### సాధారణ ప్రచురణకు ఎన్నికైనవి :

1. గతం లో స్మృతులు -పి సత్యన్నారాయణ

# సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

సుమతి" సాహితి సామ్రాట్ " పోటీలు

## సుమతి సాహితి సామ్రాట్ పోటీలు

జనవరి 2024 నుండి డిసెంబర్ 2024 వరకు
ప్రతి నెల కథలు కవితల పోటి నిర్వహించబడుతుంది .
ఉత్తమ కథకు మొదటి బహుమతి రూ1000/-,
రెండవ బహుమతి రూ500 /-
ఉత్తమ కవితకు మొదటి బహుమతి రూ250/- ,
రెండవ బహుమతి రూ116 /-

ఇవ్వబడుతుంది
ఎక్కువ బహుమతులు పొందిన కథా/కవితా రచయతలకు

### "సుమతి సాహితి సామ్రాట్ "

బిరుదుతో సత్కరించబడతారు
ప్రతి నెల 25 వ తారీఖు లోపల వచ్చిన వాటిని అ నెలలో పోటికి తీసుకోవటం జరుగుతుంది
మీ రచనలను పంపవలసిన చిరునామా
sumathi.potilu@gmail.com

